# కల్లోల గ్రామ చిత్రాలు

బాలగోపాల్



# కల్లోల కథా చిత్రాలు

## బాలగోపాల్

ఎడిటర్

చలసాని ప్రసాద్




పర్‌స్పెక్టివ్స్
1997

ప్రచురణ నెం : 20

# కల్లోల కథా చిత్రాలు


| | | |
|---|---|---|
| రచన | : | కె.బాలగోపాల్<br>304-కిరణ్ అపార్ట్‌మెంట్స్<br>రెడ్‌హిల్స్-హైదరాబాద్-500004<br>ఫోన్-3327925 |
| ఎడిటర్ | : | చలసాని ప్రసాద్<br>15-ఎల్.ఐ.జి. హెచ్.బి.కాలని<br>విశాఖపట్నం-530022<br>ఫోన్-543141 |
| కవర్ డిజైన్ | : | మోహన్<br>మాయా కార్టూన్ ఫిలిం సెంటర్<br>కేరాఫ్ డాక్టర్ నీరజ్ రాజ్ మల్టీ మీడియా స్టూడియోస్<br>రెడ్‌హిల్స్-హైదరాబాద్-500004<br>ఫోన్-3316243 |
| కంపోజింగ్ | : | ఫాంట్ లైన్ గ్రాఫిక్స్ బాగ్‌లింగంపల్లి<br>హైదరాబాద్-500044 ఫోన్-7660000 |
| ప్రింటింగ్ | : | చరితగ్రాఫిక్స్<br>చిక్కడపల్లి హైదరాబాద్-500020<br>ఫోన్-7607361 |
| పబ్లిషర్స్ | : | ప ర్ స్పె క్టి వ్స్<br>సామాజిక శాస్త్రం / సాహిత్యం<br>హైదరాబాద్ |
| సోల్ డిస్ట్రిబ్యూటర్స్ | : | నవోదయ బుక్ హౌస్<br>3-3-865<br>ఆర్యసమాజ్ ఎదురు వీధి<br>కాచిగూడ, హైదరాబాద్-500027<br>ఫోన్-4652387 |

రూ : 25

నూరుపూలు వికసించనీ
వేయి ఆలోచనలు సంఘర్షించనీ

# కల్లోల కాలచిత్రాలు....


| | | |
|---|---|---|
| | మనవి | 5 |
| | నేపథ్యం | 7 |
| 1. | రామరాజ్యంలో రాంపూర్ | 11 |
| 2. | పోలీస్ రాజ్యంలో సామాజిక విలువలు | 16 |
| 3. | అధికార హత్యాకాండ | 24 |
| 4. | రోమ్‌లో టైబీరియస్ లా | 29 |
| 5. | ఏజెన్సీలో పోలీస్ క్యాంపులు | 35 |
| 6. | సారా సంవత్సరానికి సలాకుల స్వాగతం | 41 |
| 7. | నేర పరిశోధన | 45 |
| 8. | ఎదురు కాల్పులు | 52 |
| 9. | ఊళ్ళోకొచ్చిన 'ఎన్‌కౌంటర్'లు | 57 |
| 10. | సత్యం సహించరానిదయ్యే వేళ | 66 |
| 11. | భారతదేశంలో పోలీస్ పాలన | 72 |
| 12. | తిరిగి తిరిగొచ్చింది | 81 |
| 13. | తుపాకీ రాజ్యం | 88 |
| 14. | పీపుల్స్ ఎన్‌కౌంటర్ | 92 |
| 15. | మిస్సింగ్ | 102 |
| | చివరి మాట | 106 |
| | చివరి మాట గురించి | 123 |

స్మృతిలో



17.08.1997న పర్‌స్పెక్టివ్స్ ఒక మిత్రుణ్ణి కోల్పోయింది. ఫాంట్ లైన్ గ్రాఫిక్స్‌లో ఎంతో ఓర్పుతో చాలా నేర్పుతో అక్షరాలని కంపోజ్ చేసే 23 ఏళ్ళ దిలీప్ తాత్కాలిక నిరుత్సాహంలో తుది శ్వాస విడిచాడు. కల్లోల కథాచిత్రాలు లోని ఆఖరి వ్యాసం కూడా అనుకొన్న సమయానికే కంపోజ్ చేసిచ్చి ఆ మరునాటి ఉదయానికే దిలీప్ కన్నుమూశాడు. బాధాతప్త హృదయంతో ఆ మిత్రునికి మేం నివాళి సర్పిస్తున్నాం.



ప ర్ స్పె క్టి వ్స్

కృతజ్ఞతలు.....

లోగడ యీ వ్యాసాలు ప్రచురించిన సృజన అరుణతార జనంగొంతుక నలుపు పత్రికలకు....మానవి ప్రచురణలకు... సలహా సహకారాలందించిన వేమన వసంత లక్ష్మి, ఫాంట్‌లైన్ నిర్మల. శివలక్ష్మి, ఆర్టిస్ట్ మోహన్ లకు

ప ర్ స్పె క్టి వ్స్

# మనవి

బాలగోపాల్ వ్యాసాలన్నిటిని ప్రచురించాలని పర్‌స్పెక్టివ్స్ ఆలోచన. ఈ విషయాన్ని బాలగోపాల్‌తో ప్రస్తావించినప్పుడు ఆయన దీనికి సుముఖంగా లేడు. వీటిని ప్రచురించడం అనవసరమని కూడా వాదించాడు. వీటిని ప్రచురించవలసిన అవసరాన్ని రెండు మాటల్లో చెప్పడం అవసరం అని మేం భావిస్తున్నాం.

బాలగోపాల్ గత రెండు మూడు సంవత్సరాలుగా వ్రాస్తున్న ప్రతి అంశమూ వివాదాస్పదంగా మారుతున్నది. దీనికి కారణం ఆయన వ్రాస్తున్న అంశాలమీద అభిప్రాయబేధమేకాక ఆయన అంతకుముందు వ్రాసిన రచనలకు చాలా భిన్నంగా వ్రాయడంకూడా. ఈ మార్పుకు కారణాలు బాలగోపాలే తన చివరిమాటలో వివరించాడు. అయితే బాలగోపాల్ ఆలోచనా సరళిలో, ప్రాపంచిక దృక్పథంలో వచ్చిన మార్పు ఒక వ్యక్తిలో వచ్చిన మార్పైతే అంతగా పట్టించుకోవలసిన అవసరం లేదు. చాలామంది వ్యక్తులు మారుతుంటారు. మార్పు సహజంకూడా. బాలగోపాల్ విషయంలో తాను నమ్మిన విలువలను ఆలోచనలోనే కాకుండా తన సామాజిక ఆచరణలో పాటించాడు. సాహసంగా ఆలోచించాడు. అంత సాహసంగానే ఆచరించాడు. ఆలోచనకు ఆచరణకు ఎక్కువ తేడాలేని వ్యక్తుల్లో మార్పును సామాజిక అనుభవంలో వచ్చిన మార్పుగా గుర్తించాలి. ఈ కోణంనుండే ఈ రచనలను ప్రచురించడం అవసరం అని మేం భావిస్తున్నాం.

ఈ రచనలను ప్రచురించడంలో మాకు ఇంకొక ఉద్దేశం కూడా ఉంది. బాలగోపాల్ ఈ మధ్య వ్రాసిన రచనల మీద జరిగిన చర్చ ఎంత ఆరోగ్యకరంగా జరగాలో అంత బాగా జరగలేదు. మొత్తం మీద చర్చలని వాస్తవాలని అర్థంచేసుకోవడానికి, అభిప్రాయాలను గౌరవిస్తూనే అవగాహనను పెంచుకొనడానికి ఉపయోగించవచ్చు. నిజాయితీతో కూడిన అభిప్రాయభేదాలు, లేదా ప్రాపంచిక దృక్పథంలో తేడాలు, వాటి మధ్యన ఆరోగ్యకరమైన సంఘర్షణ 'నూరుపూవులు వికసించనీ, వేయి ఆలోచనలు సంఘర్షించనీ' అనే నిర్వచనంలో భాగం అని మేం భావిస్తున్నాం. బాలగోపాల్ ఇతర దృక్పథాలతో సంఘర్షించడమేకాక, తనలో తాను సంఘర్షించుకోవడం ఈ రచనల్లో అగుపిస్తుంది. ఈ మొత్తం సంఘర్షణ ప్రజాస్వామ్య సంస్కృతి పెంపొందించడానికి, నూతన ప్రజాస్వామిక సమాజం నిర్మించడానికి ఉపయోగపడుతుందని ఆశిద్దాం.

జి. హరగోపాల్
ప ర్ స్పె క్టి వ్స్

హైదరాబాద్
22.11.97

# నేపథ్యం

హైస్కూలు రోజుల్లో 'కథలు-గాథలు' నాలుగు సంపుటాలు చాలా ఆసక్తితో చదివా. దిగవల్లి వెంకటశివరావుగారు పరాయిపాలనలోని ప్రజల అగచాట్లు కళ్ళక్కట్టారు. అది తెల్లోళ్ళ బావుటా ఎగురుతున్న కాలం. ఇక్కడి పాతకాలపు ప్రభువులతో కుమ్మక్కై, తమ ఏలుబడి సజావుగా సాగిస్తున్నారు. కాల చక్రం గిర్రున తిరిగింది. 'పంద్రా ఆగస్ట్'న అధికార మార్పిడి జరిగింది. తెల్ల షావుకార్ల బదులు నల్ల షావుకార్లు గద్దెక్కారు. దేశంలోని యావన్మంది ఆలనా పాలనా ఇక మాదేనని చెప్పిన వారి మాటలు వమ్మైపోయాయి. అధికార బలంతో అర్థబలం పుంజుకున్నారు. దేశంలో సంక్లిష్టత పెచ్చు పెరిగింది. అప్పుడప్పుడూ వారి చేయి దాటిపోయి అదుపు తప్పడం కూడా కద్దు. దేశంలోని ఏ ఒక్క సమస్యకీ సవ్యమైన పరిష్కారం దొరకలా. నెహ్రూ యంత్రదండం గాని, సోషలిస్ట్ మంత్ర జపంగాని అర్థం లేని వ్యర్థ పదాలని తేలిపోయాయి. అప్పుడు ఇందిరాగాంధి సరికొత్త అవతారం ఎత్తి పాత కాంగ్రెసు 'బూచి'ని చూపించి దేశాన్ని కొంతకాలం మోసగించ గలిగింది. ఆమె రెండోసారి గద్దెనెక్కిన (జనవరి 1980) తర్వాత తన అసలు రంగు బయటపెట్టింది. ఒకప్పటి ప్రజాస్వామ్య ప్రజాతంత్ర లౌకిక సామ్యవాద విలువలకి తిలోదకా లిచ్చింది. చాప కింద నీరులాగా దేశమంతా విస్తరించి అధికారాన్నంతా తన చెప్పుచేతల్లో పెట్టుకుంది. సామాజిక రాజకీయ సాంస్కృతిక రంగాల్లోని కల్మషమంతా అప్పటినుంచే వ్యవస్థీకృతమయింది.

ఈ నేపథ్యంలోనే మన రాష్ట్రంలో గద్దెక్కింది 'తెలుగుదేశం'. నిజానికి ఈ తెలుగుదేశం సరికొత్త పార్టీకాదు. పాత జస్టిస్ పార్టీ (1930-45) జై ఆంధ్ర (1972-73) ఊపులో విచ్చలవిడిగా విన్యాసాలు చేసిన యువత కలగలుపు. వీళ్ళు తమ ఆదాయాలకి రెక్కలు తొడగాలని వువ్విళ్ళూరి 'రామపట్టాభిషేకం' చేశారు: పాత పాలకుల్లాగానే నందమూరి తారక రామారావుగారు కూడా తెలుగు ప్రజలందరి తరపునే వలవరించారు, కలవరించారు. అతి త్వరలోనే ఆయన అసలు రంగు తెలిసిపోయింది. పోలీసుస్టేషన్లు దేవాలయాలు అనేటంతవరకూ వెళ్ళాడు. తెలుగునాట సంపన్నులు తమ ఆస్తుల్ని వ్యవస్థీకృతం చేయడానికి గట్టిగా పూనుకున్నారు. దీనితో పాటు విలువల పతనం కూడా మొదలయింది. 'ధనస్వామ్యం' తన వికృత స్వరూపాన్ని బాహాటంగా బయటపెట్టింది. ఈ దశలోనే, కులదీప్ నాయర్ అన్నట్టు, మేధావులు చాలా మంది నక్సలైట్ల వైపు మొగ్గారు. వారిలో మొదటి కోవకి చెందినవాడు బాలగోపాల్.

తెలుగునాట తెలుగుదేశం అధికారంలోకి రావడం, సామాజిక శాస్త్రవేత్తగా బాలగోపాల్ పేరులోకి రావడం ఇంచుమించు ఒకేసారి జరిగాయి. చరిత్ర తెలిసినవాడు, ఆర్థికశాస్త్రం

బాగా ఒంటపట్టించుకున్నవాడు. వీటికి రాజకీయ అవగాహన తోడయింది. అన్నింటినీ మించి తన కార్యరంగం కూడా ఎంచుకున్నాడు. ఇటు ప్రజలూ అటు ప్రభుత్వం; ఇటు ఉద్యమాలూ అటు పోలీసులు-వీటన్నింటి వల్లా బాలగోపాల్ బాగా వెలుగులోకి వచ్చాడు. ఉద్యమాల ఉనికిని, వాటి అంతర్యాన్ని బాగా ఆకళింపు చేసుకున్నాడు. పాలకుల తంత్రాల్ని విశితంగా పసిగట్టగలిగాడు. అందుకని ఎక్కడ ఏ సంఘటన జరిగినా సామాజిక శాస్త్రవేత్తగా బాలగోపాల్ విశ్లేషణ వేపు ఎందరో ఆశగా, ఆసక్తిగా చూశారు. కార్యరంగంలో నిండామునిగి వుండి కూడా వాళ్ళ ఆకాంక్షల్ని పట్టించుకున్నాడు. అందుకే తన ఆలోచనలకి ఎప్పటికప్పుడు అక్షరరూపం ఇచ్చాడు. 'Every thought is a dialogue with circumstance' అన్నాడొక వేదాంతి. ఇది అక్షరాలా నిజం. ఎందుకంటే ఇవి కల్పనా కథలు కావు, కల్పితగాథలు కావు. నిజ జీవితంలో జరిగినవి, కల్లోల కాల చిత్రాలు. వీటిని మన మనసుకి హత్తుకునేలా చెప్పాడు బాలగోపాల్. అయితే వీటిలో చోటు చేసుకోనివి కూడా ఎన్నో వున్నాయి. అన్నిటినీ ఇక్కడ ఏకరువు పెట్టనక్కర్లా. మచ్చుకి కొన్ని చూద్దాం....

తెలుగుదేశం హయాంలో పోలీసాఫీసర్ వ్యాస్ ఆధ్వర్యంలో మూడు ఘోరాలు సునాయాసంగా జరిగిపోయాయి. 'ఎన్‌కౌంటర్' ఎడిటర్ పింగళి దశరథరామ్ హత్య (21.10.1985), నౌకాశాఖలో పనిచేస్తున్న మురళీధరన్ లాకప్ హత్య (17.9.1986), సంబరాల రమణ అనే పడుపుకత్తె చావు (16.4.1984). పింగళి దశరథరామ్‌ది 'ఎల్లో జర్నలిజం' అని ఈసడించిన ఒక పెద్దింటి ఆసామి ఎల్లో రాజకీయాల నుంచే ఎల్లో జర్నలిజం వచ్చిందనే చిన్నమాట మర్చిపోయాడు. అలాగే "ఈ బడుద్ధాయిలు ఏం బియ్యం తింటున్నారండీ? లాకప్పులో పెట్టి లాఠీలతో నాలుక్కొట్టగానే నీలిగి చస్తున్నారు" అన్నాట్ట ఒక పోలీసాఫీసరు! నిజానికి మురళీధరన్ ఒంటివూపిరి మనిషికాదు. 'బలిష్టమైన సుందర యువకుడు'. ఎంత కర్కశంగా కొట్టకపోతే అతను చనిపోతాడు! సంబరాల రమణ బతకటం కోసం ఒళ్ళమ్ముకునేది. ఆమెని విపరీతంగా కొట్టి చంపారు. ఇంకో చిత్రముంది. ఇప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి చుట్టం ఏదో కాలేజి సీటు కోసం బెజవాడ వచ్చి ఒక హోటల్‌లో బస చేశాడు. సీటు మాట దేవుడెరుగు, పోలీసుల లాఠీలు మాత్రం ఒంటి మీద నాట్యం చేశాయి. కుళ్ళబొడిచి చంపేశారు. ఆత్మహత్యగా చిత్రించడానికి అతని నోట్లో పొటాసియం సైనేడ్ పోయమని వ్యాస్‌గారి సలహా! చివరికి తేలిందేమిటంటే మిస్టేకెన్ ఐడెంటిటీతో (మరొకరిగా పొరబడి) ఇతన్ని చంపేశారని. వీటన్నిటి పరాకాష్ట కాంగ్రెస్ ఎం.ఎల్.ఏ. వంగవీటి మోహన రంగారావు హత్య. ఇది ప్రభుత్వం గొడుగు నీడ కింద జరిగిందని పసి పిల్లల క్కూడా తెలుసు.

ఇవేవీ కల్లోల ఉత్తర తెలంగాణాలో జరిగినవి కావు. ప్రశాంతమైన సర్కారు జిల్లాలో, దాని సంపదలకి కేంద్ర బిందువైన బెజవాడలో జరిగినవి. ఇక్కడ మనం పదిరికుప్పం,

కారంచేడు, నీరుకొండ, తిమ్మసముద్రం, చుండూరు సంఘటనల్ని మననం చేసుకోవాలి. ఇవన్నీ ఆనాడు అధికారంలో వున్న ప్రభుత్వం పడగ నీడలో జరిగిన మారణహోమాలే. నిజానికి బాలగోపాల్ కేంద్రీకరణ ఎక్కువగా ఉత్తర తెలంగాణా మీదే వుంది. అయినా ఉత్తరాంధ్రని సొంతం విస్మరించలేదు. 1987 మే 2, 3 తేదీల్లో విశాఖ ఏజన్సీ ప్రాంతంలో పోలీసు శాఖ స్వయంగా ఆదివాసుల గుడిసెలు తగల పెట్టించింది. 500 పై చిలుకు గుడిసెలు బూడిద పాలయ్యాయి. వందలాది ఆదివాసులు నిరాశ్రయులయ్యారు. అప్పుడు పౌరహక్కుల సంఘం (APCLC) కార్యదర్శిగా బాలగోపాల్ ఆ వూళ్ళు వెళ్ళి ఇంటింటికీ తిరిగి వాళ్ళని ఓదార్చి ధైర్యం చెప్పాడు. అక్కడితో ఆగిపోలేదు. దేశంలోని న్యాయశాస్త్ర నిపుణులని పిలిపించి ఆ దహనకాండ మీద విచారణ జరిపించడానికి పూనుకున్నాడు. దీన్ని విశాఖపట్నంలో మఫ్టీ పోలీసులు భగ్నం చేశారు. (11-12-87). అయినా పట్టువదలని విక్రమార్కుడిలాగా బాలగోపాల్ కొన్ని నెలల తర్వాత మరో విచారణ (1988) జరిపించాడు. జర్నలిస్ట్ అవార్డ్ కింద తనకొచ్చిన 20,000 రూ॥లు ఈ విచారణ కోసమే వెచ్చించాడు. ఇది చిన్న విషయం కాదు. పీడితుల పట్ల ఎంతో ప్రేమ, పీడకుల పట్ల కోపం లేకపోతే ఇలాంటి వాటికి ఎవరూ పూనుకోరు. ఇవన్నీ కూడా 'విలువలు' అనే వ్యాసంలో వివరించాడు బాలగోపాల్. అయితే ఈ పోరాటంలో బాలగోపాల్ ఒంటరివాడు కాదు. కె.వి.ఆర్. (విరసం) ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా 23 మందితో గిరిజన రిలీఫ్ కమిటీ ఏర్పడింది. విరాళాలు సేకరించింది. బాలగోపాల్ , పౌరహక్కుల సంఘం- విశాఖ యూనిట్, తదితర ప్రజాసంఘాలు, విప్లవ రచయిత రావిశాస్త్రి, కె.వి.ఆర్ ఆ వూళ్ళకి వెళ్ళి ఇళ్ళు కోల్పోయిన ఆదివాసులకి ఉడతా భక్తిగా డబ్బు పంచిపెట్టారు (అక్టోబరు 1988).

ఇటు ఉత్తరాంధ్ర, అటు తెలంగాణాలో జరిగిన దమనకాండలో ప్రభుత్వమూ, పోలీసులూ ప్రత్యక్ష ముద్దాయిలు. నేరం రుజువు కానిదే చట్టరీత్యా నేరస్థులన గూడదు. కంచే చేను మేసినట్టుగా నేరం చేసినవారి చేతుల్లో చట్టాలు కూడా ఉన్నాయి. అందుకని ఇక్కడా అక్కడా కూడా కేసులూ, విచారణలూ, శిక్షలూ లేవు. కాని కారంచేడు, చుండూరు పరిస్థితి వేరు. ప్రభుత్వం అండదండలతో అక్కడి కమ్మ, రెడ్డి మోతుబరులు భూమిలేని నిరుపేద మాల మాదిగల్ని పరమ కిరాతకంగా చంపారు. ఇక్కడ భూస్వాములు కులాన్ని పదునైన ఆయుధంగా వాడుకోగల్గారు. అయినా ప్రభుత్వమూ, పోలీసులూ ప్రత్యక్ష ముద్దాయిలు కాదు గనక కేసుల తంతు కొనసాగుతోంది. కారంచేడు, చుండూరుల్లో కమ్మ, రెడ్డి కులాల వాళ్ళు చనిపోతే ప్రభుత్వం ఇలాగే ఊరుకునేదా? ఆ రెండూ హిరోషిమా, నాగసాకి అయ్యేవి.

ఉత్తరాంధ్ర, ఉత్తర తెలంగాణాలో సాగిన మారణకాండ రాజ్యహింసని భూతద్దంలో చూపెడుతుంది. కారంచేడు, చుండూరుల్లో కొనసాగిన ఊచకోత రాజ్యం స్వభావాన్నీ, రాజ్యం మొగ్గనీ, పక్షపాతాన్ని తేటతెల్లం చేస్తుంది. అందుకనే బాలగోపాల్ అటు రాజ్యహింస మీదా, రాజ్యం మీద సవ్యసాచిలా బాణాలు వేశాడు. అతను ఉత్త విలుకాడే

కాదు, తను వేసే బాణాలకి తన మేధస్సుతో పదును పెట్టాడు. మేధావి గురించి కొడవటిగంటి కుటుంబరావు అన్న మాటలు బాలగోపాల్‌కి అక్షరాలా వర్తిస్తాయి. *'తల్లికీ, తండ్రికీ, గురువుకీ, దేశానికీ ప్రతి మనిషి రుణపడి వుంటాడు. మేధావికి మరో రుణం కూడా ఉన్నది. తన తలను పొలంగా మార్చి, దున్ని, ఎరువువేసి, పంటలు ప్రజలకు పంచటం. ఇది తీర్చవలసిన బాకీ-తలబీడు పడిపోయేదాకా.ఆ తర్వాత ప్రపంచం శాశ్వతంగా ఆ మేధావికి బాకీ పడి ఉంటుంది.'*

అయితే బాలగోపాల్‌ది పూలబాటకాదు. అతను ఎంచుకుంది ముళ్ళబాట. అందుకు చాలా మూల్యం కూడా చెల్లించవలసి వచ్చింది. పేదలపక్షం వహించినందుకు ప్రభువులు కన్నెర్ర జేసి నిజంగానే కిడ్నాప్ చేశారు (ఆగస్ట్ 1989). అటు తరవాత అతనిమీద 'హత్యాచారం' చేశారు (ఫిబ్రవరి 1992). అందుకనే రావిశాస్త్రి గారన్నారు ....

*"ప్రజల పక్షాన పిట్ట నిల్చున్నా సరే*
*పెద్దలు దాని రెక్కలు*
*విరిచి రక్తం తాక్కమానరు."*

చివరగా చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి గారి 'కథలు-గాథలు' (అయిదు సంపుటాలు) గురించి చిన్న ముచ్చట. నిజానికి ఇవి కూడా కథలు-గాథలు కావు. పాత తెలుగు కవిత్వం గురించిన వ్యాప పరంపర. అరటి పండు వలిచి చేతిలో పెట్టినట్టు మనకందించారు. అలాగే బాలగోపాల్ వ్యాసాలు కూడా. అవి మనసులో వెలిగే విద్యుద్దీపాలు...మెదడుకి బోలెడు మేత. బాలగోపాల్ యీ కల్లోల కథాచిత్రాలతో మనకి కాలజ్ఞానం కలిగించాడు.

విశాఖపట్నం
19-11-97

చలసాని ప్రసాద్

# 1. రామరాజ్యంలో రాంపూర్

విప్లవోద్యమాన్ని అణచడానికి శత్రువులు రోజురోజుకూ కొత్త ఎత్తుగడలనూ పద్ధతులనూ అన్వేషిస్తున్నారు. పట్టిక రాసుకుంటే అది అమానుషత్వానికి రోల్ - కాల్ అవుతుంది. మార్క్సిజం అర్థంకాని వాళ్ళకు అది అర్థం కాదు. కూలి అడిగితే రోకలి బండలు ఎందుకు ఎక్కించాలి? పాటలు పాడుకుంటే స్టేజీని ఎందుకు విరగొట్టాలి? సమ్మె చేస్తే దొమ్మీకేసెందుకు పెట్టాలి? ప్రజలను కదిలిస్తే 'ఎన్‌కౌంటర్' ఎందుకు చేయాలి? సభలు పెట్టుకుంటే సెక్షన్ 144 ఎందుకు ప్రకటించాలి? ఈ ప్రశ్నలకు వ్యవస్థతో సంబంధంలేని సమాధానం దొరకదు. అటువంటి సమాధానంకోసం వెతికితే దారీ తెన్నూ తెలియక ఎవరో ఏదో రాస్తున్నారనిపిస్తుంది. ఇవన్నీ జరుగుతున్నాయని ఆరోపించేవాళ్లు పాక్షికంగా మాట్లాడుతున్నారని అనుమానం వస్తుంది. ఈ అనుమానం కారణంగా పోలీసులూ ప్రభుత్వమూ సృష్టించే పుక్కిటి పురాణాలకు విశ్వసనీయత (credibility) కలుగుతుంది. సమాజంలో ఆస్తిపరులవర్గం పాలకవర్గమనీ, ప్రభుత్వం దాన్ని కాపాడే రక్షకదళమనీ, పోలీసులూ కోర్టులూ చట్టమూ ఆ రక్షణకు సాధనాలనీ అర్థం కాకపోతే ఈ సంశయాలకు సమాధానం దొరకదు. "మీరు ఏమీ చేయకపోతే పోలీసులు దౌర్జన్యాలు ఎందుకు చేస్తారు? వాళ్ళకు అందులో ఇంటరెస్ట్ ఏముంది?" అనే ప్రశ్నార్థకం ఆలోచనా శూన్యంలో వేళ్ళాడుతూ ఉండిపోతుంది. ఈ ప్రశ్న వెనక వున్నది అమాయకత్వమే. అయితే దానికి ఆ అమాయకత్వం పరిధిలో సమాధానం లేదు.

ఉత్తర భారతదేశంలో సగటు గ్రామాన్ని రాంపూర్ అంటారు. అది సగటు పేరు మాత్రమే. ఇవ్వాళ వరంగల్‌లో రాంపురం వేరే అర్థంలో సగటు గ్రామం. వర్గసమాజాల అసమాన చట్టాలను సహితం అతిక్రమించని పేదప్రజానీకంపైన భూస్వాములు పోలీసుల దన్నుతో సాగిస్తున్న దౌర్జన్యాలకు రాంపురం మారు పేరయింది. చుట్టపక్కల గ్రామాలలో ఇస్తున్న కూలి తమకు గూడా ఇవ్వాలని కోరినందుకు అరెస్టులతోనూ అక్రమ నిర్బంధంతోనూ మడికొండ లాకప్‌లో చిత్రహింసలతోనూ సాయుధంగా దౌర్జన్యం చేసారన్న అబద్ధపు కేసుతోనూ ప్రారంభమయి మూడునెలల కాలంలో ఒక రాడికల్ యువకుడి హత్యకు దారి తీసింది రాంపురం కథ.

వరంగల్ - హైదరాబాద్ రహదారిపక్కన కాజీపేటకు 10 కిలోమీటర్ల దూరంలో వుంది రాంపురం. గ్రామంలో వెలమ భూస్వాములది పెత్తనం. వాళ్లవి ముప్పై కుటుంబాలవరకు ఉన్నాయి. కొందరికి 20 ఎకరాలవరకు తరిపొలం 70 ఎకరాల వరకు కుష్కి వున్నాయి. గ్రామసర్పంచ్ ఈ వెలమపెత్తందార్లకు నాయకుడు. భూమినుంచి సంపాదించే ఆదాయం చాలక ఇతను గూడ్సుబళ్ళను దోచుకునే 'వ్యాపారం' చాలాకాలం నడిపాడు. కాజీపేటనుండి హైదరాబాద్ వెళ్ళే రైలుమార్గం రాంపురం పక్క నుండి వెళ్తుంది. పెండ్యాల రైల్వేస్టేషన్ రాంపురం శివార్లలోనేవుంది. ఆ ప్రాంతంలో ఒకచోట మెరకుండడంవల్ల రైలుబళ్ళు

నెమ్మదిగాపోతాయి. సర్పంచ్ జీతగాళ్లు కాజీపేటలో మాల్‌గాడీ (గూడ్సుబండి) ఎక్కి ధాన్యంబస్తాలో సిమెంటు బస్తాలో రాంపురం దగ్గర కిందపడేసి తామూదూకి దొంగమాల్‌ను దొరవారి ఇంటికి తెస్తారు. సరుకులోనూ పద్ధతిలోనూ కొత్తదనమేగాని, దొరలు దొంగతనాలు చేయించి తమ ఆదాయాన్ని బలిపించుకోవడం తెలంగాణకు కొత్తకాదు. తెలంగాణ ఫ్యూడల్ వ్యవస్థలో ఇదొక ముఖ్యమయిన అంశం. ఒకప్పుడు వెండిబంగారాలూ ధాన్యమూ గొడ్లూ దొంగిలించేవాళ్లు. 'గ్రీన్‌రెవల్యూషన్' వల్ల పెట్టుబడిదారీ సంబంధాలు రాకున్నా సాంకేతిక పరికరాలు వచ్చినతరువాత మోటార్లూ ఆయిల్ ఇంజన్లూ స్టార్టర్లూ దొంగలించడం మొదలుపెట్టారు. వరంగల్ దగ్గరేవున్న అన్నాసాగరం భూస్వామి ఇందుకు సుప్రసిద్ధుడు. ఇంతకంటె సుఖమయిన వ్యాపారం మరొకటి ఉండదు. దొంగతనాలు చేసేది తమ జీతగాళ్లే కాబట్టి పెట్టుబడి అక్కరలేదు. పట్టుబడితే జీతగాడికే శిక్ష కాబట్టి రిస్కులేదు. (ఒక్కటే రిస్కు, దొరవారి కోసం దొంగతనాలుచేసి జెయిలుకువెళ్ళే జీతగాడికి అసలు బండారమంతా తెలిసి వుంటుంది కాబట్టి, ఎవరయినా బయటినుండి కొంచెం నిప్పందిస్తే వాడు రాడికల్‌గా మారే ప్రమాదంవుంది. అన్నాసాగరంలో సరిగ్గా ఇదే జరిగి దొరవారికి పీకలమీది కొచ్చింది. అది వేరేకథ)

ఈ రాంపురానికి రాడికల్ రాజకీయాలు దొరల కొడుకులే తీసుకొచ్చారు - ఏదో పంచాయితీ తెంపడానికి. అయితే పిలిచిన పేరంటంతో ఆగిపోక ఆ రాజకీయం కూలి వాళ్ళలోకి పాకి వాళ్ళను చైతన్యవంతులను చేయడం మొదలుపెడితే వ్యతిరేకించారు. దీన్ని ఎట్లాగయినా అణచాలని ఘనపురంతాలూకా పెత్తందార్లందరితోబాటు తామూ ఆశించారు. ఈ ఆశ తాత్కాలికంగా ఫలించింది. రమణను పీసరు భూస్వాములు చంపిన తరువాత ఇక బెడద వదిలిండని వరంగల్ జిల్లా ఎస్పీ రామావతార్ యాదవ్‌గారు పత్రికా ప్రకటన ఇవ్వడం, అదే నిజమని ఘనపురం తాలూకా భూస్వాములు గుండెలనిండా గాలిపీల్చుకోవడం జరిగింది. అయితే ఆ విజయం తాత్కాలికమే. ఊరూరా రమణతో తిరిగిన యువకులు, రమణచేత చైతన్యవంతులయిన యువకులు ఉన్నారు. వాళ్లు రైతాంగ ఉద్యమాన్ని మళ్ళీ ముందుకు తీసుకుపోవడానికి ఆయత్తమయ్యారు.

రాంపురంలో వెంకటమల్లు అటువంటి ఒక యువకుడు. అతనిది గొల్లకులం. తండ్రి మల్లయ్యకు 5 ఎకరాల భూమి వుంది. కాని ఎకరానికొకడన్నట్టు అయిదుగురు కొడుకులున్నారు. నాలుగవ కొడుకు వెంకన్న చురుకయిన కుర్రవాడు. స్ఫురద్రూపి. స్పష్టమయినమాట. అతని అనుభవం పరిమితులలో అసామాన్యమయిన అవగాహన. 'రమణతో తిరిగాడు' అని ఊరిలో పేరు.

ఈ సంవత్సరం వానాకాలం వచ్చీరావడంతో రాంపురంలో కూలిపోరాటం మొదలయింది. ఎంతో దౌర్జన్యానికి దారితీసిన ఆ పోరాటంలో విషయం చాలా చిన్నదే. చుట్టుపక్కలనున్న మడికొండ, టేకులగూడెం, ధర్మసాగరం గ్రామాలలో స్త్రీలకు ఇచ్చేకూలి రాంపురంలో గూడ ఇవ్వాలన్నారు. నాట్లకయినా కోతలకయినా ఆ గ్రామాలలో ఇచ్చేది 5 రూపాయలయితే రాంపురంలో ఇస్తున్నది 3 రూపాయలే. జీతగాళ్ల జీతాలుగూడ 1000 నుండి 1200

రూపాయలకు పెరగాలని డిమాండుచేసారు. సమ్మె చేయాలని నిర్ణయించుకున్నారు. డప్పు కొట్టుకుంటూ సమ్మెకు పిలుపిచ్చిన యాదగిరి మీద భూస్వాములు కన్నువేసారు. చర్చలకని రైతుకూలీ సంఘాన్ని పిలిపించి, అదే సమయంలో పోలీసులనూ పిలిపించి, యాదగిరినీ సామ్యుయెల్‌నూ అప్పజెప్పారు. తరువాతిరోజు భూస్వాముల కులస్థులు 50 మంది కలిసి మరొక 13 మంది రైతుకూలీ యువకులను తాళ్ళతోకట్టి మడికొండ పోలీసుస్టేషన్‌కు మార్చ్ చేయించారు. కత్తులతోనూ తదితర అపాయకర సాధనాలతోనూ స్త్రీలను నాట్లపనికి పోనీయకుండ దౌర్జన్యంగా ఆపారని ఫిర్యాదు చేసారు. అంతటి సాయుధదుండగులు (తమ అక్క చెల్లెళ్లనూ తల్లులనూ కత్తులతో బెదిరించగల వాళ్లు) నిరాయుధులయిన సర్పంచ్‌వంటి పెద్దమనుషుల చేతికి ఎట్లాచిక్కారో, వాళ్లు నడవమంటే కిమ్మనకుండ మడికొండ దాకా ఎందుకు నడిచారో అన్న సందేహం మడికొంద రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గారికి రాలేదు. వారి ప్రపంచంలో ఆలోచనలకు తావులేదు కాబట్టి సందేహాలకూ తావులేదు. 'మేముండగా మీకెందుకింతశ్రమ' అని అలసిన భూస్వాముల లేతపాదాలను చూసి నొచ్చుకొని 'నిందితుల'లో 4 గురిని విడిచిపెట్టి 9 మందిని లాకప్‌లో వేసుకున్నాడు. వాళ్లలో వెంకన్న ఒకడు. వెంకన్న అన్న రాములు మరొకడు. ఇది జరిగింది జూలై 8న. (1983లో)

ఈ 9 మందిని 13 రోజులు మడికొండ లాకప్‌లో ఉంచారు. అయిదురోజుల పాటు ఒళ్లువాచిపోయేలాగ కొట్టారు. బోర్లాపడుకోబెట్టి మోకాలికీళ్ళకు అడ్డంగా దళసరి లాఠీని పెట్టి దానిమీద నిలబడి అరికాళ్ళ మీద గంటలతరబడి కొట్టారు. (దీన్ని 'రోకలిబండలు ఎక్కియ్యడం' అంటారు). మడికొండ లాకప్ చిత్రహింసలకు ప్రసిద్ధమయినది. ఇది ఒక అమీన్ మీదో ఒక సర్కిల్ మీదో ఆధారపడ్డసత్యం కాదు. రైతాంగ ఉద్యమం బలంగావున్న ప్రాంతంలో రూరల్ సర్కిల్ కేంద్రం చిత్రహింసల కేంద్రం కాకతప్పదు.

అయిదురోజులయినా వాళ్ళను కోర్టుకు తేకపోయేసరికి వరంగల్ రూరల్ డిఎస్‌పిని అడగడానికి ఒక సాయంకాలం పౌరహక్కుల సంఘం వాళ్లు వెళ్లారు. డిఎస్‌పి ఇంటి ఆవరణలో పదిమంది మోతుబరుల లాగవున్నవాళ్లు కనబడ్డారు. నున్నని గడ్డం, తెల్లటధోవతి, లాల్చి - పెద్దమనుషుల ప్రతిరూపాలలాగున్నారు. డిఎస్‌పితో మాట్లాడుతుంటే ఆయనగారు 'మీరేమో ఆ కూలివాళ్ళను కోర్టుకు తెమ్మంటారు. కాని బయట రాంపురం ఆసాములున్నారు చూడండి.... వాళ్లు ఆ కూలివాళ్ళను పొరబాటున గూడ రిమాండ్ చేయొద్దనీ, జెయిల్ మీదతిరిగొస్తే తమ ప్రాణాలకు ముప్పనీ సాయంత్రం నుండీ నా ప్రాణాలు తోడేస్తున్నారు' అన్నాడు. ఆ ఆసాముల పైరవీయే వెగ్గింది. మరొక ఎనిమిదిరోజులు చట్టవిరుద్ధమయిన నిర్బంధం, చిత్రహింసలు అనుభవించాకగాని రాంపురం రైతుకూలీలు కోర్టుకు, అక్కడినుండి జెయిలుకు, అటుపిదప బెయిలుమీద ఇంటికి వెళ్ళలేదు.

ఆగస్ట్ 15 వచ్చింది. గత సంవత్సరం ఆగస్ట్ 15న గ్రామపంచాయితీ కార్యాలయంలో త్రివర్ణ పతాకం ఎగరలేదు. వెంకటమల్లు నాయకత్వాన రాడికల్స్ దాన్ని ఎగరనివ్వలేదు. ఈ సంవత్సరం నలుగురు ఖాకీ జవాన్ల సంరక్షణలో మువ్వన్నెల జెండాపైకి ఎగబాకింది. ఈ నాలుగవ వన్నె లేకుండా ఆమూడు వన్నెలకు భద్రత లేదు. ఆ రోజే పౌరహక్కుల సంఘం

నిజనిర్ధారణ కమిటీ రాంపురం వెళ్లి కూలి జనంతో మాట్లాడి వాళ్ళపై జరిగిన అత్యాచారాల గురించి తెలుసుకుంది. పౌరహక్కుల సంఘాన్ని అటకాయించడం, ఘొరావ్‌చేయడం వరంగల్ భూస్వాములకు కొత్త కాదుగాని, ఆరోజు వచ్చిన నిజనిర్ధారణ కమిటీ సభ్యులలో తమను కాలేజీలో కాపీ కొడుతూండగా పట్టుకున్న పంతుళ్లుండడం చూసి రాంపురం భూస్వాముల వీరకిశోరాలు కించిత్ సిగ్గుచెంది వెనక్కితగ్గారు.

ఆరోజు వెనక్కితగ్గారుగాని తరువాతి రోజు విజృంభించారు. వెంకటమల్లు అన్న రాములును పట్టుకొని గ్రామరాజ్యానికీ రామరాజ్యానికీ చిహ్నమయిన పంచాయితీ ఆఫీసులో కట్టేసి నిజనిర్ధారణ కమిటీతో మాట్లాడినందుకు కొట్టబోయారు.

ఆగస్టుపోయి అక్టోబర్ వచ్చింది. అక్టోబర్ అంటే సారా పంచాంగంలో చైత్రమాసం. పెద్దపెద్ద గుత్తేదార్ల మధ్య 25 శాతం పోటీ 75 శాతం సర్దుబాటు ప్రాతిపదికమీద సారా వేలంపాట ముగిసింది. మూడేళ్లలో మూదవసారి సారాధర పెరిగింది. నిన్నగాక మొన్న 'సాగ్రాం' రూపాయిన్నర ఉన్నది నాలుగున్నర అయింది. ఊళ్ళనూ జిల్లాలనూ మింగే గుత్తేదార్ల పెత్తనమేతప్ప దీనికి వేరేకారణం లేదు. ధర తగ్గేవరకు సారాతాగొద్దని విప్లవపార్టీలన్నీ పిలుపిచ్చాయి. రాంపురంలో గూడ రాడికల్స్ సారాదుకాణాన్ని మూయించారు. సారా వ్యాపారంవల్ల ప్రత్యక్షంగానో పరోక్షంగానో లాభపడే పెత్తందార్లందరికీ ఒళ్ళు భగ్గునమండింది.

దసరా (విజయదశమి)కి ముందురోజు రాములుకూ ఒకదొరకూ ఘర్షణ జరిగింది. ఆ దొర తనకంచెలో గొడ్లూ గొర్రెలూ మేపుకుంటున్న వారిమీద విరుచుకుపడ్డాడు. ఒకరినికొట్టాడు. ఎందుకు కొడుతున్నావని రాములు ప్రశ్నిస్తే రాములును కొట్టడానికి చెప్పుతీశాడు. రాములు తిరగబడి గొడ్డలి తిరిగేసి దొరనుకొట్టాడు. వెంకటమల్లు అడ్డమొచ్చి అన్నను గదిమాడు. దొరగాయాన్ని కడిగికట్టుకట్టాడు. అంతలో భూస్వాములంతా పోగయ్యేసరికి అన్నదమ్ములు పారిపోయారు. పోలీసులు వచ్చి గ్రామరాజ్యానికీ రామరాజ్యానికీ (పునశ్చరణ అనుకోకుంటే) ప్రతీక అయిన గ్రామ పంచాయితీ కార్యాలయంలో మకాం వేసారు. ఆ రాత్రి మరొక దొరబిడ్డ రాములు గుడిసెకు కిరోసిన్ పోసి నిప్పంటించాడు. రాములు అన్న కొమురయ్య అతికష్టం మీద నిప్పార్పుకొని గుడిసెలోవున్న గొడ్లనూ కోళ్ళనూ కాపాడుకున్నాడు. పోలీసులు కదిలి రాలేదు.

తరువాతిరోజు భూస్వాములు స్వయంగా సారాదుకాణాన్ని నడిపారు. పారిపోయిన అన్నదమ్ములు మూయించడానికి తిరిగొస్తారని కాబోలు. ఆరోజు రాలేదుగాని, పొలం బీడుపడుతుందన్న భయంతో అక్టోబర్ 20 సాయంత్రం వెంకటమల్లు తిరిగి వచ్చాడు. దొరల కొడుకులు నిన్ను చంపుతామని బెదిరిస్తున్నారు వెళ్ళిపొమ్మని తల్లి చెప్పినా వినలేదు. కొట్టింది తానుకాదు. పైగా గాయాలుకడిగి దెబ్బలకు కట్టుకట్టింది తాను. ఎవరయినా తననెందుకు చంపాలి అని వెంకన్న అమాయకంగా అడిగాడు. అక్టోబరు 21 తెల్లవారి దొరకొడుకులు వెంకన్నకోసం ఇల్లిల్లూ వెతికారు. తల్లినీ అక్కనూ వదినెనూ బూతులుతిట్టారు. ఇంటితలుపులు విరగగొట్టారు. పక్కింట్లో దాక్కొనివున్న వెంకన్న పారిపోయి చింతచెట్టు ఎక్కితే పసిగట్టి దగ్గరికివచ్చారు. అతను కిందికి దూకి మళ్ళీ ఊరి బయటికి పారిపోతుంటే

ఊరిచుట్టూ మాటేసిన వారిలో ఒకడు అటకాయించి మెడమీదకొట్టి కిందపడేసాడు. అందరూ వెంకన్న మీదపడ్డారు. అప్పుడుసమయం ఉదయం ఎనిమిదిన్నర. రెండుగంటలసేపు వెంకన్నను కట్టెలతో చితక కొట్టారు, కత్తులతో పొడిచారు. 'కూలి పెంచమంటావా?' 'రాడికల్‌నని చెప్పుకుంటావా?' 'చుట్టుపక్కల గ్రామాలలో మేడే జెండా ఎగరేసింది నువ్వుకాదా?' 'సర్పంచ్ పెట్టించిన సారాదుకాణం మూయిస్తావా?' అని అడుగుతూ 'రమణను చంపినట్టే నిన్ను చంపుతాము' అని చావగొట్టారు. అడ్డువచ్చినవాళ్ళను 'నువ్వూ రాడికల్‌వే' అని తిట్టారు. చివరికి ఊరిబయట చింతచెట్లకింద శవాన్ని పడేసి ఇంకా కసితీరక కణత మీద గొంతుమీద కత్తితో గాట్లు పెట్టి, ఏడుస్తూ దగ్గరికొచ్చిన ఎనిమిది సంవత్సరాల వెంకన్న మరదలి మీద రాయివిసిరి తరిమికొట్టి వెళ్ళిపోయారు. చేసింది దొరలకొడుకులే అయినా దొరలందరి ఆమోదంతోనూ జరిగింది హత్య. అందరూ ఆరోజు వూళ్లోనే ఉన్నారు. వెంకన్నను ఒకొక్కక్కరి ఇంటికీ తీసుకుపోయి కొట్టారు.

పోలీసులొచ్చారు, కాని హంతకులయిన దొరల కొడుకులను అరెస్టుచేయడానికి కాదు, హత్య చేసినట్టు సర్పంచ్ వరంగల్ జిల్లా పోలీసు అధికార్లకు చెప్పడానికి పోతే 'మీరేకాల బెట్టేయక మాదగ్గరికెందుకొచ్చారు?' అని ప్రశ్నించారట. వెంకన్నను చంపిన వాళ్ళందరిపేర్లూ అతని తల్లి పోలీసులకు చెప్పింది. కాని వాళ్ళ దృష్టిదాని మీద లేదు. తమ్ముడి శవాన్ని చూడడానికి రాములు రాకపోతాడా అని వాళ్ళ ఎదురుచూపు. శవాన్ని పూడ్చిపెట్టేవరకూ 'రాములు ఎప్పుడు వస్తాడు?' అని హతుడి తోబుట్టువులను వేధిస్తూ మాటువేసారు పోలీసులు. అప్పటినుండి ఇప్పటివరకు గ్రామంలో ఎనిమిదిమంది జవాన్లతో పోలీసు క్యాంపుంది. వాళ్ళకోసం కంట్రోల్ బియ్యం గ్రామం ఖర్చుమీద సప్లైచేస్తున్నారు. హంతకుడయిన సర్పంచ్, హంతకులందరూ గ్రామంలోనే వున్నారు. విందులు చేసుకుంటున్నారు. పోలీసులకు విందులు చేస్తున్నారు. రాములువస్తే వాడినిగూడ చంపుతామని బాహాటంగా బెదిరిస్తూ తిరుగుతున్నారు. వచ్చేసంవత్సరం జెండా వందనానికి ఎవ్వరూ అడ్డురాకూడదన్న దేశభక్తే తప్ప వాళ్ళలో వేరే స్వార్థం లేదు.

*సృజన - నవంబర్/డిశెంబర్ 1983*

# 2. పోలీసు రాజ్యంలో సామాజిక విలువలు

మానవ సమాజం కాలక్రమంలో సంకీర్ణమవుతుంది. శ్రమలోనూ ఉత్పత్తిలోనూ వైవిధ్యం పెరిగే కొద్దీ కొత్త కొత్త విలువలూ, ఆదర్శాలూ, సంప్రదాయాలూ, ఆచారాలూ పుట్టుకొస్తాయి. కొత్త సామాజిక సంప్రదాయం ఏదయినా అప్పటి ఒక వర్గం అవసరాలను సాధించడానికే పుడుతుంది. కాని ఈ పంకుచితమైన ప్రయోజనంతో బాటు ఒక విలువనూ ఆదర్శాన్నీ గూడ అది చరిత్రలోకి తీసుకొస్తుంది. పశువులను చంపితినడంకోసం పోషించిన దశను దాటి, పశువులను పాడికోసం వ్యవసాయం కోసం పోషించిన దశ వచ్చేసరికి "గొడ్లను చంపడం పాపం" అనే ఆచారం పుట్టుకొచ్చింది. ఇది వ్యవసాయదారుల అవసరాలను కాపాడే ఆచారమే. కాని దీనితోబాటు చరిత్ర లోనికి "జీవహింస తప్పు" అనే అస్పష్టమైన విలువ పుట్టుకొచ్చింది. రాజుల నిరంకుశత్వం యూరప్‌లో వ్యాపార వర్గాల విస్తరణకు అవరోధమయి వాళ్ళ అవసరాలను తీర్చడం కోపం ఎన్నికలూ పార్లమెంటులూ పుట్టుకొచ్చాయి. అయితే వాటితోబాటు ప్రాతినిధ్యపాలన అనే విలువ చరిత్రలోకి వచ్చింది. పరిపాలన అనేది వున్నంతకాలం పరిపాలించే వాళ్ళను ఎన్నుకునే హక్కు ప్రజలకు ఉండాలనే భావన వచ్చింది. కాలక్రమంలో సంకుచిత వర్గ ప్రయోజనం కాలం చెల్లిపోతుంది. ఆ సంప్రదాయం ప్రగతికి ప్రతిబంధక మవుతుంది. కాని ఆ విలువలు మాత్రం పరిణత రూపంలో నిలిచిపోయి కొత్త వ్యవస్థలో కొత్త అవసరాలను తీర్చగల సంప్రదాయాలను సృష్టిస్తాయి. వ్యవస్థలు నశిస్తాయి. పంప్రదాయాలు నశిస్తాయి. కాని వాటితో పుట్టిన మానవ విలువలు నిత్యపరిణామంలో వ్యాపిస్తూ నిత్యం కొత్త సంప్రదాయాల రూపం తీసుకుంటూ వుంటాయిగాని ఒకంతట నాశనంకావు. ఉపరితలం మేరకు ఇదే నాగరికత ప్రగతిగా మనకు కనిపిస్తుంది. ఉత్పత్తి పద్ధతులు ఏ విధంగానయితే పాతను కొత్తలో నిక్షిప్తం చేసుకుంటూ శాఖోపశాఖలుగా చీలుతూ విస్తరిస్తుందో, దాని ప్రతిబింబమయిన విలువలు గూడ అంతే. ఐదు వేల సంవత్సరాల నాగరికతా చరిత్ర క్రమంలో పోగయిన విలువలు, వాటిని నిక్షిప్తం చేసుకున్న సంప్రదాయాలు - వీటి సంకీర్ణమయిన కలయిక ఆధునిక సంస్కృతి. ఆధునిక సంస్కృతిలోని ఈ విలువలూ, సంప్రదాయాలూ మూలంలో ఎంత ప్రాచీనమయినా వాటికి ఆధునిక వర్గ స్వభావం ఉంటుంది. అయితే ఈ సంకీర్ణతలోని ఒక అంశం ఏమిటంటే ఆ వర్గ స్వభావం అంతిమ విశ్లేషణలోని స్వభావం మాత్రమే. అంటే, అంతా బాగున్నప్పుడు ఆవర్గ స్వభావం ఎంతో విశ్లేషిస్తే తప్ప పైకి కనిపించదు. విలువలకూ సంప్రదాయాలకూ స్వయం ప్రతిపత్తి ఉన్నట్టు తోస్తుంది. శ్రమలోనూ ఉత్పత్తిలోనూ వినిమయంలోనూ వైవిధ్యం పెరిగేకొద్దీ ప్రతివిషయానికీ సాపేక్షిక స్వయం ప్రతిపత్తి పెరుగుతుంది. కాని సంక్షోభం తీవ్రమయి వర్గపోరాటం ప్రత్యక్షమయినప్పుడు ఆ స్వయం ప్రతిపత్తి నాశనమయి ఆ విలువలూ సంప్రదాయాలూ తమ ఆధునిక వర్గ స్వభావాన్ని కనబరుస్తాయి. పాలకవర్గాల అవసరాలను తీర్చగల రూపాన్ని తీసుకుంటాయి. అది సాధ్యం కానప్పుడు తాము నాశనమయిపోతాయి.

సంక్షోభంలో అన్నీ గూడా ప్రజలవైపో ఫాసిజంవైపో నిలవాలి. లేకపోతే తమ్ముతాము అభావం చేసుకోవాలి. సంక్షోభాలు అనివార్యం అని మార్క్సిజం సైద్ధాంతికంగా రుజువుచేసినట్టే సంక్షోభాలు అనుభవాత్మకంగా మార్క్సిజాన్ని రుజువు చేస్తాయి. "నావర్గ స్వభావం ఏమిటో చెప్ప"మని పవాలు చేసినవన్నీ గూడ సంక్షోభ సమయంలో తమ వర్గ స్వభావాన్ని తామే చూపుతాయి. అవసరమయితే అందుకోసం తమ మానవీయ అంశను అభావం చేసుకొని మరీ చూవుతాయి.

"గురుసాక్షాత్ పరబ్రహ్మ" అని చిన్నప్పుడు అందరం వల్లెవేసాము. విద్య పవిత్రమయినది, విద్యాలయాలు పవిత్ర స్థలాలు అనే విలువలు ఫ్యూడల్ సంస్కృతిలో భాగం. చారిత్రకంగా అవి బ్రాహ్మణాధిక్యతను, ఫ్యూడల్ వ్యవస్థకు అవశ్యమయిన అజ్ఞానాన్ని నిలబెట్టడానికి పనికివచ్చాయి. కాని ఆ వ్యవస్థ చాలా వరకు నాశనమయిపోయిన తరువాత గూడ విజ్ఞానం ఆదరణీయమవే విలువ మిగిలిపోయింది. ఈ విలువ మహోన్నతంగాను తటస్థంగాను కనిపిస్తుంది. విజ్ఞానం కోసమే జీవించే వాళ్ళు తమకు ఏ వర్గ స్వభావంలేదనీ, తాము సామాజిక సంక్షోభాలకు అతీతులమనీ, తమ జీవితం మార్క్సిజానికి అపవాదమనీ మిడిసిపదతారు. అవునేమోనని మనకు గూడ అనిపిస్తుంది. సామాజిక పంక్షోభం తీవ్రమయ్యే వరకు సంక్షోభం తీవ్రమయి వ్యవస్థను పమూలంగా నాశనం చేయగల రాజకీయం కళాశాలలలోకి ప్రవేశించి వ్యాపించడం మొదలు పెడితే, ఉన్నదున్నట్టుగా "విద్య పవిత్రం" అనే భావానికి అర్థమే మారిపోతుంది. విద్యాలయాలు పాఠ్యపుస్తకాల విజ్ఞానానికి మాత్రమే పరిమితం కావాలి తప్ప అక్కడికి రాజకీయాలు ప్రవేశించగూడదు అనే అర్థం పుట్టుకొస్తుంది. ఒక్కసారిగా ఆ మహోన్నతమయిన విలువ ఫాసిస్టుకంపు కొట్టటం మొదలు పెడుతుంది. పాఠ్యపుస్తకాలు మాత్రమే ఎందుకు పవిత్రం, రాజకీయాలు ఎందుకు అపవిత్రం అని ప్రశ్నించకండి. ఫాసిజానికి విశ్వాసమే తప్ప తర్కంతో పనిలేదు. విజ్ఞానావ్ని గౌరవించడం అనే సార్వత్రికమయిన విలువ నిర్దిష్ట సమాజంలో నిర్దిష్ట పరిస్థితులలో నిర్దిష్ట రూపం తీసుకోక తప్పదు. ఆ రూపాన్ని తర్కంతో ఎదుర్కోగలమని భావించడం హేతువాదుల భ్రమ.

అప్పుడిక పోలీసులు విద్యాలయాలలోకి ప్రవేశించి విద్యార్థులను చితకబాది పట్టుకుపోతుంటే "సాక్షాత్ పరబ్రహ్మ"లయిన గురువులు నోరు మెదపరు. ఎందుకని అడగకండి. మీరు అంతవరకు విద్వత్సంపన్నులుగా ఎంతగానో గౌరవించిన వారి నోటి నుంచి వింతవాదనలు బయటికొస్తాయి. "ఈ తీవ్రవాద రాజకీయాలతో విద్యాలయాలను కలుషితం చేసిన తరువాత పోలీసులు రావడం అనివార్యం" అంటారు. తీవ్రవాదమో మితవాదమో, రాజకీయ విజ్ఞానంలో భాగమే గాని లాఠీలు కావని వాదించి ప్రయోజనం లేదు. మీరిప్పుడు తటస్థమయిన జిజ్ఞాసతో మాట్లాడడంలేదు. సంక్షోభం మందకొడిగా వున్నప్పుడు ఆకాశమార్గంలో అన్నిటికీ అతీతంగా వున్నట్టు కనబడుతూ విహరించిన జిజ్ఞాస ఇప్పుడు సంక్షోభం తాకిడికి నేలరాలింది. ఇప్పుడది రాజకీయాన్ని గూడ విద్యలో భాగంగా గుర్తించదు. ఇది దాని నిర్దిష్ట రూపం.

కళాశాల ఆవరణలో పోలీసులు దౌర్జన్యాన్ని ఉపేక్షించడం మాత్రమే కాదు, విద్య పవిత్రం అనే భావన తన్నుతాను అభావం చేసుకోవడం అంతకు ముందే ప్రారంభమవుతుంది. వరంగల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ తన విద్యార్థులు కళాశాల మేగజైన్ కోసం ఎంపిక చేసిన 20 వ్యాసాలూ కవితలూ వగైరా అంశాలలో అయిదింటిని మాత్రమే ఆమోదించాడు. అవి మాత్రమే సాంకేతిక విజ్ఞానానికీ ఇతర ఆమోదనీయమయిన విషయాలకూ సంబంధించిన వనీ, తక్కినవన్నీ "రాజకీయ" విషయాలనీ ఆయన అభ్యంతరం తెలిపాడు. విజ్ఞాన కాంక్షకు ఇంతకు మించిన అభావ రూపం మరొకటి ఉండదు. ఇంత పని చేసిన తరువాత ఆయన తన కాలేజీకి పోలీసులను పిలిపించి పిల్లలను పట్టించినా, క్యాంపు పెట్టించి కొట్టించినా, పోలీసులు తెల్లబట్టలతో రూము రూముకూ తిరిగి పిల్లలను బెదిరించినా, రాత్రిపూట మట్వాడ యస్.ఐ. హాస్టల్ బోర్డర్లందరినీ ఒక గదిలో కూర్చోబెట్టి వాళ్ళకు రాజకీయ పాఠాలు చెప్పినా ఆశ్చర్యం ఏముంది? గురువులు పోలీసుల పనిచేస్తే పోలీసులు గురువులు కాకుండా ఏమవుతారు?

తానే పోలీసు భారం మీదవేసుకొని వ్యాసాలనూ కవితలనూ సెన్సార్ చేయడం మొదటిమెట్టు. ఆపని పోలీసులకే అప్పజెప్పడం రెండవ మెట్టు. కవితలూ వ్యాసాలూ మాత్రమేకాదు, ఉపన్యాసాలను గూడ పోలీసులు సెన్సార్ చేస్తారు. ఒక సంవత్సరంగా వరంగల్‌లో ఏ కళాశాలలోనయినా ఎవరు ఉపన్యాసం ఇవ్వాలన్నా దానికి పోలీసుల అనుమతి ఉండాలి. అనుమతి లేకుండా సమావేశం జరుపుకోదల్చుకుంటే సెక్షన్ 144 ప్రకటించిన సందర్భాలు ఉన్నాయి. కాలేజీ మేగజైన్‌లో "అభ్యంతకరమయిన" విషయాలున్నాయని టవున్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ప్రకటిస్తే యూనివర్సిటీ ప్రిన్సిపాల్ ఆ మేగజైన్ ముద్రణ ఆపిస్తాడు. సమావేశాలకు మీ అనుమతి ఎందుకనిగాని, "అభ్యంతరకరమయిన" విషయాలంటే అర్థమేమిటనిగాని ఆయన ప్రశ్నించడు. విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తిని ఠాణాలలో తాకట్టుపెట్టి జమేదార్ పని చేస్తున్నారు. ప్రిన్స్‌పాల్, వి.సి.లు ఇప్పుడు ఆ జమేదార్ హోదానుండి ప్రమోషన్ కోరుతూ తమకే మేజిస్టీరియల్ అధికారాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని అడుగుతున్నారట. విద్యాలయాలను పోలీసులకయినా అప్పజెప్పాలి లేదా తామే పోలీసులయిన కావాలి - "విద్యాలయాలు పవిత్ర స్థలాలు" అనే విలువను వదిలి మనం ఇవ్వాళ చాలాదూరం వచ్చాము.

అయితే మనం తీసుకువే ఏ చర్యకయినా దాని తర్కం గతితర్కం దానికుంటాయి. ఒక పని చేసేంత వరకే మన ఇష్టం. తరువాత పర్యవసానాలు మన ఇష్టాయిష్టాలమీద ఎంత ఆధారపడి ఉంటాయో వాటి స్వాభావిక (సామాజిక) క్రమం మీద అంత ఆధారపడి ఉంటాయి. పంతుళ్లు పోలీసులపనీ పోలీసులు పంతుళ్లపనీ చేయడం మొదలు పెట్టిన తరువాత ఈ పరకాయప్రవేశానికి (లేక పరస్పరకాయ ప్రవేశానికి) స్వాభావిక మయిన గతితర్కం పనిచేయడం మొదలు పెడుతుంది. మామూలుగా మేధావులకు పోలీసు యంత్రాంగం అంటే ఎంత హీనభావం ఉంటుందో ఇప్పుడు ఈ తలక్రిందులు పరిస్థితిలో పోలీసులకు మేధావులంటే అంత హీనభావం పుడుతుంది. పోలీసు యంత్రాంగం మీద

సెమినార్ నిర్వహించమని మేధావులను పురమాయించి మాజీ ఐజిపి రాంచంద్రారెడ్డి మేధావుల సమీక్షకు ముగింపు మాటలు పలుకుతాడు. హేయంగా మాట్లాడుతాడు. మనసులో గింజుకోవడం భుజాలు తడుముకోవడం తప్ప ఆ మేధావులు చేయగలిగిందిలేదు. హనుమకొండ ఎస్.ఐ. తన ఠాణా ప్రక్కనే వున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలోకి నిత్యం నిరాటంకంగా జొరబడి ప్రిన్స్‌పాల్ గదిలోకి లాఠీ ఊపుకుంటూ పోయి, అటెండర్‌ను పంపి విద్యార్థి నాయకులను పిలిపించి ప్రిన్స్‌పాల్ సమక్షంలో వాళ్ళను బూతులు తిడతాడు. "శాంతి భద్రతలను" ఈ విధంగా గూడ కాపాడవచ్చునని ఆయన గారి నమ్మిక. చెవులు మూసుకోవడం, తల చేతులలో పట్టుకోవడం వినా ఆ ప్రిన్సిపాల్ దౌర్భాగ్యుడు చేయగలిగిందిలేదు. కాకతీయ యూనివర్సిటీ ఆవరణలో ఎన్నికల ప్రచారం నిమిత్తం తిరుగుతున్న ఒక అమ్మాయిని పోలీసులు పట్టుకుపోతారు. అవుట్ పోస్టులో ఆమెను కొడతారు. బూటుకాలుతో పాదాలను తొక్కుతారు. ప్రిన్సిపాల్ ఫోన్ చేసి ఆ అమ్మాయి చేసిన నేరం ఏమిటవి ప్రశ్నిస్తే "ఆమె సాయం కళాశాల విద్యార్థిని కాబట్టి నీకు అనవసరం పొమ్మం"టారు. అధికారానికి "జూరిస్డిక్షన్" ఉంటుంది. కాని మానవత్వానికీ ప్రజాస్వామ్యానికీ "జూరిస్డిక్షన్"" ఉండదు. అవి సార్వత్రికం, సార్వకాలికం, సార్వజనీనం. ఇది మామూలు పరిస్థితి. మానవత్వమూ ప్రజాస్వామ్యమూ వర్గ పోరాటానికి అతీతంగా కనబడే పరిస్థితి. కాని ఈ సంక్షోభ సమయంలో పోలీసులకూ అధికార్లకూ"జూరిస్డిక్షన్" పోతుంది. జిల్లా కలెక్టర్ జిల్లాపాలనా వ్యవహారాల నిర్వహణ వదిలిపెట్టి నక్సలైట్లను అణిచేస్తానని పబ్లిక్‌గా ఉపన్యసిస్తాడు. ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ ఇంటరాగేషన్ చేస్తాడు. రూరల్‌కీ డి.ఎస్.పి. టౌన్‌లో లాఠీచార్జి చేయిస్తాడు. పోలీసులు నీతిని గురించి బోధిస్తారు. 'వాళ్లకు ఆ హక్కు ఉన్నదట' అని పి.హెచ్.డి పట్టభద్రులయిన మేధావులు విస్మయం పోతారు. కాని మానవత్వానికీ ప్రజాస్వామ్యానికీ "జూరిస్డిక్షన్" ఏర్పడుతుంది. నన్ను నలుగురిలో చావబాదుతుంటే ప్రశ్నించడానికి నీకు సాటి మానవుడివన్న అర్హత చాలదు. నువ్వు నా అన్నవా? తల్లివా? తండ్రివా? నేను చదువుకునే కాలేజీ ప్రిన్సిపాల్‌వా? ఏదీ కాకపోతే "నీది నువ్వు కడుక్కోమ్మ"ని అమర్యాదగా సమాధానం వస్తుంది. మవ్నించకుంటే "విధి నిర్వహణలో ఆటంకపరిచావు" అని కేసవుతుంది.

మరి నీతిని బోధించే వాళ్ళు పోలీసులయితే నీతిని బోధించవలసిన గురువులు ఏమవుతారు? పోలీసులకు ఇన్‌ఫార్మర్స్ అవుతారు. వరంగల్‌లో కాలేజీ ప్రిన్సిపాల్‌గానో యూనివర్శిటీ వి.సి.గానో హాస్టల్ వార్డెన్‌గానో వుండి పోలీసులకు ఇన్‌ఫార్మర్స్ కాని వాళ్ళు చాలా కొద్ది మంది. వాళ్ళలో కొందరు బలవంతం మీద ఆ పాత్ర స్వీకరించే వాళ్ళుండవచ్చునుగాని, అత్యధికులు నిరభ్యంతరంగా గూఢచారులయ్యేవాళ్ళే. అధికార నిచ్చెన మీద పైకి పోవాలంటే 'పోలీస్ రిపోర్టు' ప్రతికూలంగా వుండకూడదు. ఇది సార్వత్రిక సత్యం. దీన్ని తల మీద నిలబెడితే, పోలీస్‌రిపోర్టు ఎంత అనుకూలంగా వుంటే నిచ్చెన మీద అంత త్వరగా పైకిపోతారు. ఇది ఫాసిస్టు సత్యం. వరంగల్‌లో ఇవ్వాళ కళాశాలల అధికార్లు, యూనివర్శిటీ అధికార్లు, జిల్లా కలెక్టరూ, కోర్టులలో న్యాయమూర్తులూ, అన్ని రంగాల

ప్రభుత్వ అధికార్లు, మినహాయింపు లేకుండ అత్యధిక భాగం పోలీసు ఎజెంట్లే. ఇవన్నీ గూడ ఆధునిక ప్రజాస్వామ్యాలలో స్వయం ప్రతిపత్తిగల హోదాలే. అయిదువేల సంవత్సరాల మానవ నాగరికత క్రమంలో సంతరించుకున్న మాననీయ విలువల నిక్షేపాలే. కాని ఈ విప్లవాల యుగంలో అన్నీ గూడ ఫాసిస్టు బూట్లకు నాడాలు కాకతప్పలేదు. పది పదిహేను రోజులు లాకప్‌లో చిత్రహింసలు పెట్టి కోర్టుకు తీసుకొస్తే నిందితుడిని న్యాయమూర్తులు కళ్ళెత్తి కూడ చూడరు. చూస్తే ఏం కనబడుతుందోనని తలదించుకొని రిమాండ్ చేస్తారు. వ్యవసాయ కూలీలను పోలీసులు తప్పుడు కేసులలో ఇరికించి ప్రమాదకరమయిన నక్సలైట్లుగా చిత్రిస్తారు. వాళ్లను దీర్ఘకాలంజెయిల్లో పడేస్తే వాళ్ళ కుటుంబాల గతిఏమిటన్న ఆలోచన లేకుండ వాళ్ళకు బెయిల్ ఇవ్వడానికి ముప్పుతిప్పలు పెడతారు. ఒకవేళ బెయిలు మంజూరయినా ష్యూరిటీలను కోర్టు ఆవరణలోనే పోలీసులు అరెస్టుచేస్తారు. లేకపోతే బెయిలు మీద బయటకు రాగానే జెయిలు బయట అరెస్టు చేసి ఇంకొక కేసులో కోర్టుకు తెస్తారు. నిన్ననే బెయిలిచ్చిన వాడిని మళ్ళీ ఇంకొక కేసులో తెచ్చారేమిటని జడ్జిగారు ఆలోచించరు. తలవంచుకొని మళ్ళీ రిమాండ్ చేయడం వారిపని. భగవద్గీతలో చెప్పినట్టు మంచి చెడ్డల భారం నారాయణుడిది. మూర్తీభవించిన న్యాయం న్యాయమూర్తి. అతను అప్పటి చట్టాలనయినా కనీసం నిష్పక్షపాతంగా అమలుచేసి వీలయినంత ప్రజాస్వామికంగా వాటిని వ్యాఖ్యానించాలి. ఈ విధి, ఈ స్వయం ప్రతిపత్తి, ఇన్నివేల సంవత్సరాల నాగరికత సాధించిన ఆదర్శం, సంక్షోభంలో ఇవన్నీ పోతాయి. న్యాయమూర్తులలో న్యాయం మూర్తీ భవించదు, ఘనీభవిస్తుంది. వారి పంచేంద్రియాలలో ఏదీ పని చేయదు. యండమూరి వీరేంద్ర నాథ్ కల్పనలలో లాగ వారి మెదళ్ళు "స్పెషల్ బ్రాంచి"కి "ట్యూన్" అయి వుంటాయి.

అన్నిటినీ ప్రశ్నించడం ఒక ఉన్నతమయిన నాగరికతా విలువ. ఇప్పుడు దానికిక స్థానంలేదు. ప్రశ్నించడం మానేసి పోలీసుల సమాధానాన్ని తమకు తామే చెప్పుకొని సంతృప్తి చెందడం ఫాసిస్టునీతి. అర్ధరాత్రి వార్డెన్‌ను అడగకుండ ప్రిన్సిపాల్‌కు చెప్పకుండ హాస్టళ్ళ మీద దాడి చేసి విద్యార్థులను నిద్రలేపి బూతులు తిడుతూ రూములు సోదాచేసి పుస్తకాలూ కాగితాలూ తీసుకుపోతారు. గంటల తరబడి హాస్టల్ రూములోనే ఇంటరాగేట్ చేస్తారు. ఎందుకని ప్రశ్నించకండి. "ఎవరో వాంటెడ్ పర్సన్స్ హాస్టల్‌లో దాక్కున్నారట" అన్న సమాధానం వస్తుంది. వాంటెడ్ పర్సన్స్ అన్నమాటలు ఎట్లా పలుకుతారంటే హంతకులో బందిపోట్లో మాదర్‌చోద్‌లో అనుకోవాలి. ఒక వ్యక్తి మీద అరెస్టు వారంట్లు ఉండాలంటే అతను భయంకరమయిన నేరస్తుడు కానవసరం లేదని, పోలీసులు ఎవరిమీదనయినా ఏ క్షణమయినా వారంట్లు సంపాదించగలరనీ చెప్పండి. ఒక్కసారిగా విచక్షణాద్వారాలు మూసుకుపోతాయి. ఆలోచన కుంచించుకుపోతుంది. "ఏమో నాకవన్నీ తెలీవు. నేనేదో నా ఉద్యోగమేదో..." విజ్ఞానతృష్ణ ఇప్పుడిక అఖండం కాదు. మెదడుచుట్టూ ఇప్పుడొక పరిధి ఏర్పడుతుంది. దాని వెలుపల చీకటి, శూన్యం. అందులోకి ఆలోచనా కిరణాలు ప్రసరించవు. ఆలోచనకు జూరిస్డిక్షన్ ఏర్పడుతుంది. ఆలోచనకూ కుతూహలానికీ ప్రజాస్వామ్యానికీ

మానవత్వానికీ అన్నిటికీ జూరిస్డిక్షన్ ఏర్పడుతుంది - ఒక్క అధికారం మాత్రమే పట్టపగ్గాలు లేకుండా పోతుంది. నాగరికతా విలువలన్నీ తలక్రిందులయినాయి. అపరిమితం కావలసిన వాటికి శృంఖలాలు తగులుకున్నాయి. పరిమితం కావలసిన అధికారం మాత్రం విజృంభించింది.

ఈ సంకెళ్ళు చాలా వరకు తమకు తాము తగిలించుకున్నవే. తగిలించే భారం కూడ పోలీసుల మీద లేదు. పోలీసు అత్యాచారాల గురించి స్థానిక పత్రికా విలేకరులు ఎందుకు రాయడం లేదని ఎవరో అమాయకంగా ప్రశ్నిస్తే, అది పోలీసుల ''మొరేల్''ను దెబ్బతీస్తుందని 'హిందూ' పత్రిక విలేఖరి సమాధానం చెప్పాడట. దెబ్బతీస్తే ఏమవుతుంది? వాళ్ళు తీవ్రవాదులను అణచలేకపోతారు. అణచలేకపోతే ఏమవుతుంది? తమ పునాదులు కదిలి పోతాయి. కదిలిపోతున్న పునాదుల ముందర పత్రికా స్వాతంత్ర్యం అతి చిన్న విషయం. విమర్శా స్వాతంత్ర్యం, అభిప్రాయస్వేచ్ఛ, ఉన్నతమయిన బూర్జువా విలువలు. నిరంకుశ రాచరికానికి వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలొడ్డి సాధించుకున్న విలువలు. మామూలు సందర్భాలలో కూడ అవి తటస్థం కావు. కాని వర్గ పోరాటం ప్రత్యక్షమయినప్పుడు వాటికి మనుగడే లేదు.

ప్రభుత్వం ఇవ్వాళ ప్రజల మీద యుద్ధం ప్రకటించింది. యుద్ధ శిబిరాలుగా గ్రామాలలో పోలీసు క్యాంపులను నెలకొల్పింది. వరంగల్ జిల్లాలో ప్రస్తుతం కనీసం పది పదిహేను గ్రామాలలో పోలీసు క్యాంపులున్నాయి. క్యాంపులలో మగవాళ్ళను వారాల తరబడి కూర్చోబెట్టి నిత్యం చావగొడుతున్నారు. వాళ్ళను కూలిపనికి పోనివ్వరు. పంటలు కోసుకోనివ్వరు. వాళ్ళ చేత వెట్టిచాకిరి చేయించుకుంటారు. ఇళ్ళమీద దాడిచేసి ఆడవాళ్ళను కొడుతున్నారు. భట్టుపల్లిలో లచ్చమ్మ అనే యాభై సంవత్సరాల స్త్రీని స్పృహ తప్పేదాక కొట్టి ఇంటి ముందర పడేస్తే, ఆమె కొడుకు ఆమెను ఆస్పత్రికి తీసుకుపోవలసి వచ్చింది. ఆ తరువాతే, అంతవరకు (45రోజులుగా) గ్రామంలోని పోలీసు క్యాంపులో నిర్బంధించబడి ఉండిన ఆమె భర్త కుడయ్యను వదిలిపెట్టారు - భార్యను చూసుకొమ్మని. ఆసుపత్రి నుండి పూర్తిగా కోలుకోకముందే విడుదలయి లచ్చమ్మ కూతురి ఇంటిలో ఉంటోంది. కుడయ్య తిరిగి భట్టుపల్లికి పోతే మళ్ళీ క్యాంపులో పెడతారేమోనని భయపడి తాను పనిచేసే కాజీపేట రైల్వే ప్లాట్‌ఫారం మీదనే బ్రతుకుతున్నాడు. బయటినుండి పత్రికా విలేఖరులుగాని పౌరహక్కుల సంఘాలవాళ్ళుగాని గ్రామానికిపోతే వాళ్ళతో మాట్లాడినందుకు మళ్ళీ కొడుతున్నారు. మల్లారెడ్డిపల్లె, వెంకటాపురం, కృష్ణాజీగూడెం, దేవరుప్పల... అన్ని వూళ్ళలోనూ ఇదేకథ. వెంకటావురంలోనూ మల్లారెడ్డి పల్లెలోనూ ఇళ్ళలోని దూలాలనూ పందిళ్ళనూ విరగ్గొట్టి ఆ కట్టెతో పోలీసులు క్యాంపులో చలికాచుకుంటున్నారు. మల్లారెడ్డి పల్లెలో 36 భూమిలేని కుటుంబాలు కలిసి దున్నుకున్న 20 ఎకరాల భూమిని పశువులకు మేపారు. క్యాంపులో నిర్బంధించిన వాళ్ళచేలను కోసుకోనివ్వరు. ఒక్కొక్క గ్రామంలోనూ 40-50 ఎకరాలలో వరిపంటను కోయకుండ ఆపారు. క్యాంపులో కొట్టే దెబ్బలనయితే వర్ణించడానికి వీలుకాదు. అన్ని వూళ్ళలోనూ జనం గతంలో దెబ్బలు తిన్నవారే. కాని ''ఇట్లాంటి దెబ్బలు ఎన్నడూ తినలేద''నిఇవ్వాళ అందరూ అంటున్నారు. బోర్లాపడుకోబెట్టి కాళ్ళు రెండూ వెనక్కి కట్టేసి

వీపుమీద కూర్చొని అరగంట సేపు నిర్విరామంగా కొడతారు. ఒకరోజుకాదు, రెండురోజులుకాదు, వారాల తరబడి నిత్యం ఇలా కొడతారు. లేకపోతే అందరినీ గుండ్రంగా కూర్చోబెట్టి ఒకరినొకరు చెప్పులతో కొట్టుకొమ్మని బలవంతం చేస్తారు. చెప్పులలోని మేకులవల్ల వీపుమీద గాయాలయిన వాళ్ళున్నారు.

ఈ క్యాంపులన్నీఒక ఎత్తయితే మడికొండ లాకప్ అనే చిత్రహింసల కేంద్రం మరొక ఎత్తు. ఎన్నడయినా ఏ సమయంలో నయినా మడికొండ లాకప్‌లో కనీసం 15 మంది అక్రమ నిర్బంధంలో ఉంటారు. వాళ్ళను ఎంత చలిలోనయినా నగ్నంగా వుంచుతారు. బోర్లాపడుకోబెట్టి రోకలిబందలు ఎక్కించి అరగంట, ముప్పావుగంట చితక గొదతారు. ఒకరి మూత్రం ఒకరిచేత త్రాగిస్తారు. అసభ్యకరమయిన లైంగిక చర్యలు చేయిస్తారు.

ఇవన్నీ "శాంతి, భద్రతల" సంరక్షణకోసం జరుగుతున్నాయని ఎవరయివా అనుకుంటే పొరబాటే. రైతాంగ ఉద్యమ కార్యకర్తలను ఏరి వేయడంకోసం ఇవన్నీ జరుగుతున్నాయి. ఏదో ఒక పంఘటన జరిగిందని పెట్టిన క్యాంపులు కావు ఇవి. గ్రామీణ ప్రాంతాలలో చైతన్య వంతమవుతున్న పేద ప్రజానీకాన్ని శాశ్వతంగా అణిచి వేయాలని నాలుగయిదు జిల్లాలలో విస్తృతంగా అమలు చేస్తున్న నిర్బంధంలో భాగం యిది. ఏదో ఒక సాకుచెప్పి (ఏదీ దొరక్క పోతే అల్లరి సృష్టించి) గ్రామాలలోకి ప్రవేశించి క్యాంవులు పెట్టి స్థానిక కార్యకర్తలందరినీ పట్టుకోవడం కోసం వేటాడుతున్నారు. భూస్వాముల చేత హత్యలు చేయించి దానికి "ఆత్మరక్షణ" ముసుగుతొడిగి హత్య చేయబడ్డ వాళ్ళ బంధుమిత్రులవే హింసిస్తున్నారు. భట్టుపల్లిలో క్యాంపు ఈ విధంగా వచ్చినదే. అక్టోబర్ 30 నాడు గ్రామంలో ఒక ప్రజాపంచాయితీ దగ్గర రవీందర్‌అనే రాడికల్ యువకుడిని కొందరు రెడ్లు చంపారు. అతన్ని చంపడం కాక మరికొందరివి గాయపరిచారు. గాయపడ్డవాళ్ళు ఆస్పత్రికి, అక్కడినుండి జెయిలుకు వెళ్ళారు. హంతకులు మాత్రం పోలీసుల సంరక్షణలో సురక్షితంగా వున్నారు. వాళ్ళ దగ్గర అసలు ఆయుధాలే లేవనీ రాడికల్స్ వాళ్ళమీద దాడిచేస్తే ఆత్మ రక్షణార్థం ఆ ఆయుధాలను లాక్కొని రవీందర్‌ను చంపవలసి వచ్చిందనీ పోలీసులు కథ సృష్టించారు. సృష్టించి గ్రామంలోని చర్చిలో పోలీసుక్యాంపుపెట్టి అప్పటినుండీ ఇప్పటిదాకా గ్రామంలోని పేదలను విపరీతమయిన హింసకు గురిచేస్తున్నారు. దొరికిన యువకులందరినీ మడికొండకు తీసుకుపోయి తమ సంరక్షణలోవున్న రవీందర్ హంతకులకు చూపించి వాళ్లు "రాడికల్స్" అని గుర్తించిన వాళ్ళను విపరీతమయిన చిత్ర హింపలకు గురిచేసి హత్యా ప్రయత్నం కేసులో జెయిలుకు పంపుతున్నారు. యువకులు దొరకకపోతే తండ్రులను క్యాంపులో కూర్చోబెట్టి చిత్రహింసలకు గురిచేస్తున్నారు. తమ చేతికి చిక్కకుండ యువకులెవరయినా నేరుగా కోర్టుకు సరండర్ అవుతారేమోనని కోర్టు దగ్గర మాటేసి అక్కడికి వచ్చిన వాళ్ళను గేటు దగ్గర నుండే తన్నుకు పోతున్నారు.

మల్లారెడ్డి పల్లెలో సీలింగ్ భూములను భూస్వాములు అమ్ముకువే ప్రయత్నం చేస్తే ప్రజలు నిరోధించారు. ఆ భూస్వాములు పోలీసులకు ఫిర్యాదు కూడ చేయలేదు. పోలీసులే

కేసునమోదు చేసుకొని ఊళ్ళో క్యాంపుపెట్టారు. వెంకటాపురంలో చెరువుశికం, పోరంబోకులు దున్నుకున్నారు. చట్టరీత్యా ఎవరికి ఆ భూములు చెందాలో వాళ్ళే దున్నుకున్నారు. కాని వాళ్ళకు దక్కింది పట్టాకాదు, ఊరిబడిలో నెలకొల్పిన పోలీసు క్యాంపు.

ఇట్లా ఒక్కొక్క ఊళ్ళోను సందర్భం కల్పించుకొని క్యాంపులు పెట్టి పేదరైతు కుటుంబాలను చెట్టుకూ పుట్టకూ చేస్తున్నారు. యువకులు దొరికితే ఆత్మకూరులోనో, హసన్‌పర్తిలోనో, మడికొండలోనో పది పదిహేను రోజులు తోమి తోచిన కేసులు పెట్టి జెయిలుకు పంపుతున్నారు. వరంగల్ సెంట్రల్ జెయిలు నిండిపోయి గత రెండు నెలలుగా రాజమండ్రికి, విశాఖపట్నంకు పంపుతున్నారు. యువకులు దొరక్కపోతే తండ్రులను క్యాంపులో నిర్బంధించి కూలికి పోనీక పంట కోసుకోనీయక హింసిస్తున్నారు. ఇట్లా ఎన్ని కుటుంబాలను నాశనం చేసారో ఎవరికీ తెలీదు. పేద రైతు కుటుంబాలలో కాళ్ళూ రెక్కలూ బాగున్న వాళ్ళు ఒక్కరూ గ్రామాలలో ఉండడం లేదు. క్యాంపులున్న గ్రామాలు పదయితే ఈ హింసను అనుభవిస్తున్న గ్రామాలు పదివాలుగుల నలభై ఉంటాయి. మగవాళ్ళు జెయిలుకో గుట్టలలోకో పోగా ఆడవాళ్ళు ఈ చలిరాత్రులలో ఒంటరిగా పోలీసు జీపుకోసం నిరీక్షిస్తూ కాలం గడుపుతున్నారు. నిరుడు ఇవే చలిదినాల్లో ఎన్టీఆర్ కోసం ఎదురు చూసారట. అప్పుడు వాడు ఖాకీ బట్టలలో వచ్చి "అమ్మా! అక్కా! చెల్లె!" అని వోట్లడిగాడు. ఇప్పుడు వాడు ఖాకీ వదిలి కాషాయం ధరించాడు గాని వాడి ప్రేతం అవే ఖాకీ బట్టలలో వూళ్ళు తిరుగుతూ ఇంటి తలుపులు విరగ్గొట్టి "నీ కొడుకెక్కడే లంజా?" అని మీద పడుతోంది.

ఇవన్నీ వాస్తవాలే. కాని ఈ వాస్తవాల కోసం వరంగల్ పత్రికా విలేఖరులను అడగకండి. మేధావులను ఖండించమనకండి. పోలీసుల "మోరేల్" దెబ్బతినగలదు. పత్రికలూ మేధావులూ సత్యాన్ని వెలికి తీయాలన్నది చాలా ఉన్నతమయిన విలువే. కాని పునాదులు కదులుతున్నప్పుడు ఈ విలువ లేవీ పోలీసుల మోరేల్‌కు సాటిరావు. తుపాకులతో తూటాలతో పునాదులను పునస్థాపించిన తరువాత అంతా చక్కబడ్డాక మళ్ళీ సత్యాన్వేషణ చేసుకుందాం. అప్పుడు మళ్ళీ అన్ని విలువలకూ స్వయంప్రతిపత్తి వస్తుంది. వర్గ పోరాటానికి అతీత మయిన సార్వ జనీనత వస్తుంది. అంత వరకు - హెయిల్ హిట్లర్.

*సృజన - జనవరి 1984*

# 3. అధికార హత్యాకాండ

గోదావరి అడవులలో ఇంతవరకు పూర్తిగా కలప వ్యాపారానికీ కాగితం పరిశ్రమకూ పెట్టుబడిగా మారిపోని ప్రాంతాలలో కరీంనగర్‌జిల్లా మహదేవ్‌పూర్ ఒకటి. ఒకప్పటి విశాలమయిన మంథని తాలూకా తూర్పు భాగానవున్న విశాలమయిన అడవి ప్రాంతం మహదేవ్‌పూర్ బ్లాకు టేకు, మద్ది, విప్ప, బొంగు, తుమ్మ... ఇంకా మనకు పేర్లుతెలీని ఎన్నో చెట్ల జాతులకు నిలయం.

దట్టమయిన ఈ అడవిలో తారురోడ్డుకు 35 కిలోమీటర్లు దూరానవుంది బోర్లగూడెం అనే గ్రామం. కరీంనగర్‌ను వరంగల్ నుండి, మహదేవ్‌పూర్ అడవిని చిట్యాల అడవినుండి వేరుచేసే వంకరటింకర విభజనరేఖకు ఇటువైపుందా అటు వైపుందా అక్కడికి వెళ్లే దాకా తెలియనంత సమీపంలో వుంది. ఎటువైపుందో ఆ గ్రామ ప్రజలకు గూడ అప్పుడప్పుడు తెలియనంత సమీపంలోవుంది. ఎటువైపుందో ఆగ్రామ ప్రజలకు గూడ అప్పుడప్పుడు అనుమానం వస్తుందేమో. ఎందుకంటే ఆ సరిహద్దుకు చిట్యాల సమితి కేంద్రం అడవులూ ఏర్లుదాటి తూర్పుకు 70 కిలోమీటర్లు దూరం ఉంటే, మహదేవ్ పూర్ సమితి కేంద్రం పడమటికి అటువంటివే మరొక 70 కిలోమీటర్ల దూరం వుంది. అది బ్లాకులతోను బ్లాక్ డెవెలప్‌మెంట్‌తోనూ సంబంధంలేని అధివాస్తవిక ప్రపంచం. లేక, బహుశా, బ్లాకులు, బ్లాక్ డెవెలప్‌మెంట్లు అనే అధివాస్తవిక ప్రపంచంతో సంబంధంలేని చాలా వాస్తవిక ప్రపంచం.

బోర్లగూడెంను ఆనుకొని దేవునితండ అనే లంబాడ తండ వుంది. 350 కుటుంబాలకు నివాసమయిన ఈ గ్రామాన్ని కేంద్ర రిజర్వుపోలీసులు (సిఆర్‌పి) చరిత్ర కెక్కించారు. హింసాకాండకు ప్రత్యేకమయిన పేరు సంపాదించుకున్న సిఆర్‌పి దళాలను తెలుగుదేశం ప్రభుత్వం ఉత్తర తెలంగాణలోని అయిదు జిల్లాలలో సాయుధ పోలీసు క్యాంపులలో నియమించడానికి కేంద్రంనుండి అరువు అడిగినప్పుడు, భారత సామాజిక నీతి గురించీ, మనపాలక వర్గాల రాజనీతి గురించీ తెలిసిన వారికి రెండు విషయాలు నిస్సందేహ మనిపించాయి. ఒకటి, ఇందిరమ్మ ఆ మొర ఆలకిస్తుందని; రెండు, సిఆర్‌పి జవాన్లు మన తెలుగుజాతి జవాన్లకంటే తాము సుశిక్షితులమనీ (చట్టం నుండి సురక్షితులమనీ) త్వరలోనే ఆచరణాత్మకంగా రుజువు చేసుకుంటారని. ఇందిరమ్మ ఇవ్వనే ఇచ్చింది. వచ్చినవాళ్ళు నెలతిరక్కముందే బోర్ల గూడెంలో ఒక హత్య చేయనే చేసారు. హత్య జరిగింది 1984 జనవరి 10 నాడు. హతుడు దేవునితండకు చెందిన జర్పుల అమ్రు అనే 45 సంవత్సరాల లంబాడా రైతు.

అంతకు ముందు (గత సంవత్సరం, అక్టోబర్ నెలనుండి) ఆ ప్రాంతంలోని కొన్ని గ్రామాల ప్రజలు 'సారా పోరాటం' చేస్తారు. ప్రభుత్వపు రెవెన్యూ ఆశవల్ల, బడా కాంట్రాక్టర్ల గుత్తాధిపత్యం వల్ల, అమితంగా పెరిగిపోయిన సారాధర తగ్గాలని పట్టుబట్టి వందగ్రాములు రెండు రూపాయల పావలా నుండి రూపాయి ముప్పావలాకు తగ్గించుకున్నారు. పోరాటంలో

భాగంగా సారా దుకాణాలను బంద్ పెట్టించి సారా కాంట్రాక్టర్లను లొంగదీసారు. మరొక వైపు అదే సమయంలో ఉత్తర తెలంగాణా గ్రామాలలోని పోలీసు క్యాంపుల సంఖ్య పెరుగుతూ పోతోంది. సెప్టెంబర్‌లో 80 ఉన్నవి జనవరికి 100 అయి ఇవ్వాళ 120 దాటినవి. ఈ క్రమంలో డిసెంబర్ 13 నాడు, ఒరిస్సానుండి కొత్తగా తరలివచ్చిన సిఆర్‌పి దళాలతో బోర్లగూడెం, నిమ్మగూడెం, కనుకునూరు, ములుగుపల్లి గ్రామాలలో క్యాంపులు వచ్చాయి. ఈ క్యాంపు జవాన్లు యథా ప్రకారం ఆగ్రామాల ప్రజలను 'కోళ్లు, కల్లు' ఇమ్మని పీడించడం మొదలు పెట్టారు. సింగారంలో కోడి ఇవ్వనన్నందుకు బొబ్బిలి రామయ్యను బజారుకు ఈడ్చి కొట్టారు. కొత్త రేగులగూడెంలో సారా ఇవ్వనన్నందుకు గుంజ బుచ్చమ్మను కడుపులోతన్నారు. కిష్టాపురంలో సారా కాంట్రాక్టరును వెంటబెట్టుకుపోయి, గతంలో 'సారాపోరాటం' వలన కాంట్రాక్టరుకు నష్టం కలిగించినందుకు ఆ పోరాటంలో చురుగ్గాపాల్గొన్న వాళ్లు ఒక్కొక్కరి నుండి 50 రూపాయలు కాంట్రాక్టరుకు ఇప్పించారు. బోర్లగూడెంలో అమ్రుము చంపారు.

దిక్కులేని వాళ్లంతా నక్సలైట్లేనన్న పోలీసు తర్కంలో తప్ప అమ్రు 'నక్సలైటు' కాడు. రెండో అయిదో ఎకరాలరైతు. కొంతకాలం క్రితం అతనొక ఎద్దునుకొన్నాడు. 1200 రూపాయలు పెట్టికొన్నాడు. జనవరి 10 ఉదయం అతని కొడుకు దేవు, దేవు మిత్రులు భీక్యబాలు, భీక్యవాలు గ్రామందగ్గరి అడవిలో ఆ ఎద్దును మేపుతున్నారు. ఇద్దరు క్యాంపు జవాన్లు ఒక బరువైన కలప మొద్దును మోసుకొని అడవినుండి వస్తున్నారు. అడవినుండి గిరిజనులు కట్టెతెచ్చుకుంటే అదినేరంగాని, గిరిజనులనుండి అడవిని కాపాడడానికి నియమించబడ్డ ఫారెస్టు అధికారులయినా, గిరిజనులనుండి ఈ సమాజాన్ని కాపాడడానికి నియమించబడ్డ పోలీసులయినా తెచ్చుకుంటే అదినేరం కాదు. ఆ జవాన్లు ఎద్దుకు మరీ సమీపంగా పోవడం చూసి దేవు గాభరాగా 'దగ్గరకు పోవద్దు, అది కొత్త ఎద్దు. పొడుస్తుంది' అని వారించాడు. అస్సాంలో యుపిలో బీహార్‌లో ఎన్నో వందలమందిని రాక్షసంగా పొట్టనబెట్టుకున్న మేము ఒక ఎద్దుకు భయపడతామా... సిగ్గుసిగ్గనుకొని, కలపదుంగను కిందదించి వాళ్ళలో ఒకడు ఎద్దుకొమ్ములు రెండూ పట్టుకున్నాడు. అయితే మనిషికి తప్పవేరే ఏ జంతువుకూ 'రాజ్యం' అనే వ్యవస్థగాని దానికి సంబంధించిన స్పృహగాని వుండదు. రాజ్యం అనే స్పృహలేకపోతే సివిల్ మనిషికీ పోలీసుకూ తేడా తెలీదు. తెలీక ఆ ఎద్దు అతన్ని ఎత్తి కిందపడేసింది. అతను లేచి నిక్కరు దులుపుకొని మిత్రుడి దగ్గర తుపాకి తీసుకొని ఎద్దును 'ఎన్‌కౌంటర్' చేయడానికి గురిపెట్టాడు. 'రాజ్యం' అనేది కొందరికి స్పృహ అయితే కొందరికి మత్తుమందు. ఆ స్పృహలేని వాడికీ సివిల్ మనిషికీ పోలీసుకూ తేడా తెలీనట్టే ఆ మత్తులోపడ్డ వాడికి అసలు మనిషికీ ఎద్దుకూ తేడా తెలీదు. అంతలో అమ్రు పరుగెత్తుకొచ్చి కానిస్టేబుల్ కాళ్ల మీదపడ్డాడు. నా ఎద్దును చంపొద్దన్నాడు. పోలీసులు అమ్రును తుపాకులతో డొక్కలోపొడిచి కలపదుంగను అతని నెత్తికి ఎత్తించి క్యాంపుదాకా మోయించుకెళ్ళారు. అక్కడ అతను దుంగను కిందపడేయగానే ఒళ్లు హూనమయ్యేదాకా కొట్టారు. కాళ్లావేళ్లాపడ్డా వదిలిపెట్టలేదు. క్యాంపు పక్కనే ఇల్లున్న కల్లి అనే 25 సంవత్సరాల

స్త్రీ అడ్డుపోతే ఆమెను బెదిరించారు. ఆమె ఇంకొందరిని తీసుకురావడానికి పారిపోతూ వెనక్కితిరిగి చూసింది. వాళ్లు అమ్రమును మళ్లీకిందపడేసి తుపాకులతో పొడుస్తున్నారు. కడుపులోపేగులు తెగినట్టున్నాయి. ఆమె తిరిగి వచ్చేసరికి స్పృహ తప్పి పడివున్నాడు. దగ్గరిలో వున్న ఆజంనగర్‌కు తీసుకుపోతే అక్కడి ఆర్ఎంపి డాక్టరు వైద్యం చేయడానికి నిరాకరించాడు. రోగికి వైద్యం నిరాకరించడం వైద్య వృత్తికే అపచారం. కావి ఆ నీతులన్నీ పోలీసు క్యాంపులు లేని జమానాలో. పోలీసు రాజ్యంలో అలాంటి నీతులు మాట్లాడితే నిన్ను 'నక్సలైట్' అంటారు. బ్రిటిష్ వాళ్లు ఒక్క భగత్‌సింగ్‌ను మాత్రమే భగత్‌సింగ్ అన్నారు. మనవాళ్ళయితే అతని తల్లినీ చెల్లెనూ పొరుగింటి మిత్రుడినీ వెనకింటి అల్లుడినీ అందరినీ అని వుండేవాళ్లు. ఆ రాత్రికి అమ్రము చనిపోయాడు. ఊరిజనం అమ్రము శవాన్ని తీసుకొచ్చి క్యాంపు దగ్గర పెట్టి పోలీసులను నిలేసారు. పోలీసులు వాళ్ళమీదికి గూడ తుపాకులు తీసారు.

తరువాత రోజు కరీంనగర్‌జిల్లా ఎస్.పితో సహా చాలా మంది పెద్ద పోలీసు ఆఫీసర్లు ఎంతో ప్రయాసపడి బోర్లగూడెం వచ్చారు. తమ ఇలాఖాలో ఇంత మారుమూల గ్రామం ఒకటి ఉందని అంతవరకు వాళ్లకు తెలీదేమో. ఎస్.పి. లంబాడ వాళ్లందరినీ కూర్చోబెట్టి హితోపదేశం చేసాడు. 'జరిగిందేదో జరిగింది. గొడవ చేయొద్దు' అన్నాడు. అమ్రము కొడుకు దేవును చూపించి, 'ఇతనికి కానిస్టేబుల్ ఉద్యోగం ఇప్పిస్తాను' అన్నాడు. ఇంకా నయం. ఆ ఎద్దును గూడ రిక్రూట్ చేసుకుంటాననలేదు. ఆయనగారి దృష్టిలో కానిస్టేబుల్ నౌకరీని మించిన సన్మానం ప్రపంచంలో లేదు. కావి అడవిలో చెట్లు నరుక్కొని వ్యవసాయం చేసుకునే వాళ్లకు పోలీసు బ్రతుకు కంటె ప్రకృతి విరుద్ధమయినది మరొకటి వుండదు పైగా, మనిషి ప్రాణాన్ని సర్కార్ నౌకరీతో చెల్లబెడదామనే నాగరికతత్వం వాళ్లకు ఏహ్యంగా కనిపించింది. 'మమ్మల్నందరినీ చంపేసి మా కొడుకులను పోలీసులను చేస్తావా? ఇంక అప్పుడు నీకు వేరే పోలీసు క్యాంపు గూడ అక్కరలేదు గదా' అని ఒక ముసలి రైతు కోపం చేసుకున్నాడట. అయినా ఈ అమానుషమయిన వాగ్దానం గూడ శుష్కమయినదే. ఇంత వరకు దేవుగాని అతని ఎద్దుగాని ఖాకీ తొడుక్కోలేదు. అదే పది వేలు.

సరిగ్గా మూడువెలల తరువాత, ఏప్రిల్ 12 నాడు, నిజామాబాద్ జిల్లాలో రెండవ 'క్యాంపు హత్య' జరిగింది. కామారెడ్డితాలూకాలో గిద్ద ఒక పెద్ద గ్రామం. సిరిసిల్ల తాలూకాను కామారెడ్డి తాలూకా నుండి వేరు చేసే అడవికి సమీపంలో వుంది.

నిజామాబాద్ కరీంనగర్ జిల్లాల నుండి అరబ్ దేశాలకు కూలి పని కోసం చాలా మంది వెళుతూంటారు. దీన్ని 'మస్కట్ దుబాయి' వెళ్లడం అంటారు. ఇట్లా వెళ్లేవాళ్లకు ఉద్యోగాలనుండి పాస్‌పోర్టులదాకా అన్నీ సమకూర్చిపెట్టే వ్యాపారం ఇవ్వాళ ఆ జిల్లాలలో అతి ముఖ్యమయిన పరిశ్రమ. ఈ బ్రోకర్లు ఎక్కువగా పట్టణాల నుండి వచ్చినవాళ్ళుకారు. స్థానిక భూస్వాములే చాలామంది తమ సంప్రదాయిక దొరతనాన్ని ఉపయోగించుకొని ఈ బ్రోకర్ పని మీద గుత్తాధిపత్యం సంపాదించుకున్నారు. సంపాదించుకుని, వెట్టిచాకిరీ దండుగలు వగైరా పాతదోపిడీ పద్ధతులు ఆగిపోవడం వలన తాము కోల్పోయిన పెత్తనాన్ని ఈ రూపంలో

కొనసాగిస్తున్నారు. అటువంటి ఒక బ్రోకర్ - భూస్వామి భూపాల్ రెడ్డి. గిద్దకు చెందిన యువకులనుండి 'మస్కట్ - దుబాయి' కి పంపిస్తానని 40 వేల రూపాయలు వసూలు చేసి ఎగవేసాడు. రాడికల్స్ అతన్ని పట్టుకొని అందులో సగం వాపస్ ఇప్పించారు. ఇటువంటివే మరి కొన్ని 'అత్యాచారాల' ఫలితంగా గత సంవత్సరం జూలై నెలలో గిద్దలో ఏ.పి.ఎస్.పి క్యాంపు పెట్టారు. అటు తరువాత గ్రామంలో క్యాంపు వస్తూ పోతూ వుంది.

ఆ కాలంలోనే గిద్దలో పోలీసులు చేసిన మరొక ఘనకార్యం గురించి గూడ చెప్పుకోవాలి. ఆ ప్రాంతంలో ప్రజలలో పనిచేసి ప్రమాదవశాన చనిపోయిన రాంచందర్ తదితరులకోసం గిద్దలో 30 అడుగుల ఎత్తు స్థూపం నిర్మాణమవుతుండగా, జూలైనెలలో ఒకనాటి ఉదయం పోలీసులు ట్రక్కులలో వచ్చి స్థూపాన్ని కూల గొట్టించి వెళ్లారు. ఇది కాకతాళీయమయిన సంఘటనకాదు. ఈ వ్యవస్థను కూలివాళ్ల నుండి కాపాడే క్రమంలో పోలీసులు పుస్తకాల దొంగలయినట్టే స్థూపాల దొంగలు గూడ అయ్యారు. ప్రజలు తమ పోరాటానికి జ్ఞాపకంగా వుంచుకునే ఏ చిహ్నాన్నీ పోలీసులు ఉండనివ్వరు. మేడే జెండాలు చింపేస్తారు. అమరవీరుల జీవితాలకు బురద పూస్తారు. స్థూపాలు తవ్వేస్తారు. స్థూపం నిర్మాణానికి తమ శ్రమను వెచ్చించిన కూలీలెవ్వరో కనుక్కొని, అతిక్రూరంగా వాళ్ళచేతనే గునపాలతో స్థూపాన్ని తవ్వించేస్తారు. పోలీసుల హింసాకాండ నిర్హేతుకమయిన రాక్షస ప్రవృత్తినుండి పుడుతుందనే అభిప్రాయాన్ని పత్రికలూ సినిమాలూ ప్రచారం చేస్తున్నాయి. ఆ రాక్షస ప్రవృత్తి అధికారానికి 'సహజం' అని కొందరు భావిస్తే, దానికి వైయక్తికమయిన మానసిక కారణాలను 'అర్ధసత్య' వంటి సినిమాలు చూపుతాయి. అసలు విషయమేమిటంటే పోలీసు హింస అనేది ఎవ్వరి మానసిక రాక్షసత్వంతోనూ ఇష్టాయిష్టాలతోను ప్రమేయంలేని అనివార్య వాస్తవమయినట్టే, అది ఏమాత్రం నిర్హేతుకంకాదు. అది చాల తెలివిగా, అర్ధవంతంగా, హేతుబద్ధంగా పనిచేస్తుంది. ప్రజా ఉద్యమానికి చిహ్నాల అవసరం ఎంతవుందో వాళ్ళకు తెలుసు. ఒక అమరవీరుడిని వ్యభిచారిగా చిత్రించినా, అతని స్థూపాన్ని కూలగొట్టించినా అది ఎంతటి దెబ్బో వాళ్ళకు తెలుసు. స్థూపాన్ని నిర్మించిన వాళ్ళచేతే దాన్ని తవ్వించేస్తే ఒక్కొక్క గునపంవేటూ ఈ ప్రజల మనస్సులమీద ఒక్కొక్క సమ్మెట పోటని గూడ వాళ్ళకు తెలుసు. అందుకే స్థూపాలు తవ్వించేయడం ఒక కార్యక్రమంగా పెట్టుకున్నారు. గిద్దలో రాంచందర్ అతని సహచర మృతవీరుల స్థూపం, బెల్లంపల్లిలో పెద్దిశంకర్ గంగారామ్ మొదలయిన ఆదిలాబాద్‌జిల్లా మృతవీరుల స్థూపం, భట్టుపల్లిలో జన్ను చిన్నాలు స్థూపం, కుక్కల గూడూరులో భూమయ్య కిష్టగౌడ్ తదితర కరీంనగర్ మృతవీరుల స్థూపం తవ్వించేసారు.

క్యాంపు వచ్చినతరువాత అక్రమ అరెస్టులూ చిత్రహింసలతోబాటు పోలీసులు యథాశక్తి ప్రజలను దోచుకోవడం మొదలు పెట్టారు. అడవి ప్రాంతం కావడంవల్ల వాళ్ళ దృష్టి కట్టెమీదపడింది. గ్రామంలో స్కూలు కట్టియ్యాలని రాడికల్స్ సేకరించిన కట్టెను జప్తు చేసుకొని క్యాంపులో వేసుకున్నారు. ఫారెస్టు డిపార్ట్‌మెంట్‌కు అప్ప జెప్పి కేసు పెట్టించడానికి కాదు. వడ్రంగివాళ్ళచేత తమ కోసం మంచాలు చేయించుకోవడానికి. (ఆ వడ్రంగులకు అది వెట్టిచాకిరేనని వేరే చెప్పనవసరం లేదు).

ఏప్రిల్ 12న హత్య చేయబడ్డ పోతయ్య గిద్దకు సమీపంలో వున్న రాధాయిపల్లి నివాసి. ఒక పూరిగుడిసె, ముగ్గురు పిల్లలు అతని ఆస్తి. ఆనాటి రాత్రి పోతయ్య తన ముసలితల్లితో వివాదం పెట్టుకొని కోపంతో ఒక కుండను ఎత్తిక్రింద పడేసాడు. విరిగిన కుండపెంకులు ఎగిరి పక్కింటి నర్సయ్యకు తగిలాయి. నర్సయ్యకూ పోతయ్యకూ తగువు జరిగింది. నర్సయ్య పోలీసుక్యాంపులో ఫిర్యాదు చేసాడు. గ్రామంలో పోలీసుక్యాంపువుంటే వాళ్లకు 'చెంచా'లగానూ, ఇన్‌ఫార్మర్స్‌గాను పనిచేస్తూ తమ అవసరాలు సాధించుకునే పంచమాంగదళం త్వరలోనే తయారవుతుంది. పోలీసులకు అవసరమయిన వెట్టిచాకిరీ సమకూర్చిపెట్టడం, వాళ్ళ చీకటి అవసరాలకు డాఫర్లగా పనిచేయడం, వాళ్ళకు గ్రామాన్ని గురించి సమాచారాన్ని (అవసరమయితే కల్పించి) అందజేయడం వీళ్ళపని. సమాజం పాలకులుగా ప్రజలుగా చీలితే రాజ్యం పుట్టింది. ఆ ప్రజల్ని మరింత చీల్చకుండ రాజ్యం పరిపాలించలేదు. రాజ్యం ఎక్కడ ప్రవేశిస్తే అక్కడ ప్రజల్ని చీలుస్తుంది.

నర్సయ్యకూ క్యాంపు పోలీసులకూ ఇటువంటి సంబంధం ఏమయినా ఉందేమో తెలీదు. పోలీసులు మాత్రం వెంటనే వచ్చి పోతయ్యను పట్టుకొని మాటామంతీ లేకుండా డొక్కలోపొడుస్తూ కొడుతూ గిద్దవైపు నడిపించారు. అతని తల్లి కొట్టొద్దని బ్రతిమాలింది. ఆమె ఆక్రందన పోలీసుల కంటె ముందు యముడికి వినబడింది. దారిలోనే పోతయ్య రక్తం కక్కుకుని చనిపోయాడు.

తెల్లవారి గ్రామస్తులంతా క్యాంపు దగ్గర గొడవచేసారు. అంతకాలం పోలీసులు అడవినుండి తెచ్చుకొని దాచుకున్న కలపను బయటికి లాగారు. ప్రజల ఒత్తిడిమీద స్థానిక ఎం. ఎల్.ఏ. గూడ తన అమూల్యమయిన నిరసన తెలిపాడు. అసెంబ్లీలో తన పార్టీవాళ్లు ఏమంటున్నారో కాసేపు మరిచిపోయి, అసలు గిద్దలో పోలీసుక్యాంపు అవసరమేలేదన్నాడు. 'ఒక అవినీతి పరుడయిన ఫారెస్ట్ అధికారిని చంపితే పోలీసు క్యాంపులు పెట్టి మమ్మల్ని ఇంతగా హింసిస్తున్నారు. పోతయ్యను చంపినందుకు మిమ్మల్ని ఏం చేయాలీ?' అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

ఆ మాటే అందరూ అడుగుతున్నారు. ప్రజలలో ఎవరయినా మంచికయినా చెడుకయినా 'అశాంతి'కి పాల్పడితే అధికార యంత్రాంగానికి బూట్లూ బుల్లెట్లూ తొడిగి వాళ్లమీదికి దించుతున్నారు. మరి ఆ అధికారయంత్రాంగమే హత్యలూ మానభంగాలూ చిత్రహింసలూ చేస్తే, అప్పుడు ప్రజలు ఆ తుపాకులను తిరిగేయొచ్చా?

*సృజన - మే 1984*

# 4. రోమ్‌లో టైబీరియస్ లా

ప్రాచీన గ్రీకు నాగరికతలో పాలకవర్గాలు అప్పటి అర్ధబానిసలు. బానిసల శ్రమను పిండుకుని సంపదలు మూటకట్టుకొంటూండేవారు. అయినా ఆ కాలాల్లో కూడ శ్రామికులు అప్పుడప్పుడూ సమ్మెలు కడుతూండేవారు. ఇప్పటిలా ప్రజాస్వామిక రాజ్యాంగాలు అప్పట్లోలేవు. కనుక సమ్మెకట్టే శ్రామికులు పాలకవర్గాల దండనీతిని తప్పించుకొనడానికి ఒక యుక్తి పన్నేవారు. ఆ రోజుల్లో దేవాలయాలను ఎంతో పుణ్య స్థలాలుగా, ప్రభుత్వ సైనికులు చొరరాని చోట్లుగా భావించేవారు. కనుక శ్రామికులంతా మూకుమ్మడిగా పని నిలుపుదలచేసి, దేవాలయాల్లోకి పారిపోయి చట్టానికి అందకుండా తమను కాపాడుకొనే వారు. ఈ విధంగా వారు కులీవ పాలకవర్గాలను, వారి బాకా మేధావులను వేధించి స్వల్ప విజయాలైనా పొందగల్గేవారు. ఈ క్రమం ఇలాగే ఎన్నో శతాబ్దాలు గడిచిన తర్వాత టైబీరియస్ అనే నియంత ఒకడు తలయెత్తాడు. పాలకవర్గాలకు ఎదురైన ఈ చిక్కు సమస్యా పరిష్కారానికి అతడొక సాహస చర్య తీసుకున్నాడు. దేవాలయాలు పవిత్రమైనవి కావొచ్చుగాని ప్రభుత్వసైనికులు చొరరానంత పవిత్రమైనవేమీ కావంటూ ఒక శాపనంచేసి, అవి ఇక ముందెన్నడూ పమ్మెకట్టే శ్రామికులకు ఆశ్రయాలుగా ఉయోగసడకుండా చేసి వేశాడు. ఆ విధంగా శ్రామికుల సమ్మె హక్కుని రద్దు చేయగలిగాడు. తద్వారా శాంతిభద్రతలు, బాకా మేధావులు సురక్షితంగా, పరమానందంగా వర్ధిల్లారనడం నిస్సందేహమే కాని ఆ తర్వాత అట్టేకాలం కాక మునుపే ఆ ప్రాచీన గ్రీకు నాగరికతే కూలిపోయిండంటే అది వేరు విషయమనుకోండి.

మరి ఈ లోకంలో వివేక సంపదకు కొరత విపరీతంగా వుండడంవల్ల వెనుకటి తెలివితేటలే మళ్ళీ మళ్ళీ పుట్టుకురావడమూ అనివార్యమే గదా. కనుక ఇవ్వాళ మన విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లంతా కలిసి యూనివర్సిటీలు అంత పవిత్రమైనవేమీ కావని (ఎందుకు కావో వారికే తెలియాలి) ప్రకటిస్తూ ఒకటి తర్వాత ఒకటిగా వాటిని పోలీసులకు అప్పగిస్తూ పోతున్నారంటే వెనుకటిరోజుల టైబీరియస్ వ్యవహారం తెలిసే చేస్తున్నారని మన మనలేము. (అంత విజ్ఞానం వారిలో అత్యధికులకు లేక పోవచ్చు కూడ). అయినా అప్పట్లో టోలెమీ వంటి పాలకవర్గ బాకా మేధావులు ఎలాగైతే బానిసల చెమటతో కలుషితం అయిన దేవాలయాలు పూర్వ పవిత్రతను కోల్పోయాయని ప్రకటించారో, అలాగే వీరూ అనుకోకుండా పాలకవర్గాల భావాలను ప్రతిబింబిస్తూ విద్యార్థుల "మురికి రాజకీయా"లతో కలుషితం అయిన ఈ యూనివర్సిటీలు కూడ పూర్వపవిత్రతను కోల్పోయాయని ప్రకటిస్తున్నారు.

ఈ వివేకబుద్ధికి పరాకాష్టగా ఇవ్వాళ రేపు మవ వైస్ ఛాన్సలర్లు విశ్వవిద్యాలయ భద్రతా డళాల ఏర్పాటు గురించి సందిగ్ధ చర్చలు జరుపుతూవున్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లలో పోలీసు విధులు విర్వహించడానికి ఈ ప్రత్యేక భద్రతాదళాలను ఉపయోగించుకొంటూ అదే సమయంలో వైప్ ఛాన్సలర్లకు (బహుశా ప్రొఫెసర్లకు కూడ) మెజిస్ట్రేట్ అధికారాలు యిస్తే

బాగుంటుందనే సూచనలు చేస్తున్నారు. ఈ సూచనలే వాస్తవంలో రూపుదాలిస్తే ఇక అప్పుడు పరిస్థితులెలా వుంటాయో కాస్త భవిష్యత్తులోకి తొంగి చూచి చెబుదాం. బహుశా విద్యార్థులు మెస్‌చార్జీల పెరుగుదలకు వ్యతిరేకంగానో, లేక యూనివర్సిటీ పరిపాలక అధికారుల్లో అవినీతికి వ్యతిరేకంగానో లేక (పూర్తి స్వార్థపరులుగా వుండకుండా, "మురికి రాజకీయాల"కు దూరంగా ఉండ నిశ్చయించుకున్నటు వంటి విద్యార్థులైతే) ఏ పల్లెజనాలపై పోలీసు అత్యాచారాలకు నిరసనగానో ఆందోళన చేస్తుంటారు. విశ్వవిద్యాలయ ఆవరణలో ఊరేగింపు తీసి నినాదాలు యిస్తుంటారు. అంతలో మొగ్గలోనే ఉద్యమాన్ని తుంచివేయదలచిన వైస్‌ఛాన్సలర్‌గారు విద్యార్థి సంఘనాయకులపై అరెస్టువారంట్లు జారీచేస్తాడు. అవి పట్టుకుని వచ్చిన భద్రతాదళాలు లాఠీఛార్జీ. భాష్పవాయు ప్రయోగాలతో ఊరేగింపును చెదరగొట్టి కావల్సిన వారిని, అడ్డువచ్చిన వారిని అరెస్టుచేసి విశ్వవిద్యాలయ లాకప్పుల్లో కుక్కి వేస్తారు. అవసరమైతే బహుశా కాల్పులు కూడ జరుపుతారేమో. ఆ౯ ఇదంతా లేనిపోని ఊహలు. అతిశయోక్తులు. భయపిశాచం ఆవహించిన అసందర్భ ప్రేలాపనలు అని ఎవరైనా అంటారనీ మాకు తెలుసు. మరి అలాంటి వాళ్లు ముందు గత రెండేళ్లుగా (ఏ విశ్వవిద్యాలయ భద్రతదళాలు లేకుండానే) వరంగల్లు కాకతీయ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఘోరకలి ఏమిటో గమనించిన తర్వాత మరీ మాట్లాడితే బాగుంటుందేమో?

కాకతీయ విశ్వవిద్యాలయ ప్రాంతమంతా నేడు పోలీసు దళాలతో నిండి పౌర ప్రభుత్వాలకు ఇక్కడ కాలం చెల్లిందా అన్నట్లుగా వుంది. ఇంతెందుకు అసలు వరంగల్ పట్టణమే నేడు శత్రు ఆక్రమణలో వున్న పట్టణంలాగా, ఇంకా మిగిలివున్న ప్రతిఘటనా దళాలను చుట్టుముట్టి నాశనం చేయడానికి శత్రు సైనిక ప్రధాన స్థావరం నుండి ముమ్మరంగా సైనిక చర్యలు జరుగుతున్న ప్రాంతంలాగా వున్నది.

కాకతీయ విశ్వవిద్యాలయం రాష్ట్రంలోని వెనుకబడ్డ తెలంగాణా ప్రాంతంలో విద్యాభివృద్ధికై స్థాపించబడింది. అసలు వెనుకబడిన ప్రాంతాల్లో విశ్వవిద్యాలయాలు స్థాపించడంలోనే ప్రభుత్వానికి రెండు విధాల ఉద్దేశ్యం వున్నది. భావజాల వ్యాప్తి విషయంలో ఒక ఉద్దేశ్యం, భౌతిక ప్రయోజనాల స్థాయిలో మరో ఉద్దేశ్యం. సైద్ధాంతికంగా వచ్చేసరికి, అదేనగర యువతతో సమానంగా వెనుకబడిన ప్రాంతాల యువతకు కూడ "ఉన్నత విద్య" పొందే అవకాశం వుండాలనేది ప్రభుత్వ వాదం. అయితే అసలు పరిస్థితుల్ని చూస్తే, వెనుకబడిన ప్రాంతాల యువకులంతా కూడ ఏకఖండంగా లేరు. వారిలో సంపన్న భూస్వామ్య కుటుంబాల నుండీ, కంట్రాక్టర్ల కుటుంబాల నుండి వచ్చిన యువజనులు ఒక వైపు వున్నారు. ఉన్నత విద్య తమకూ సమానమైన అందుబాటులో వుండాలనే వారి డిమాండును ప్రభుత్వం ఆమోదించక తప్పదు కూడ. మరోవైపు నిజంగా వెనుకబడిన వర్గాలకు చెందిన యువజనులు ఉన్నారు. ప్రభుత్వ సబ్సిడీలతో స్కూలు, కళాశాల విద్యలు ఇలాంటివారి విషయంలో మున్ముందు ఎదురయ్యే భయంకర నిరుద్యోగ పరిస్థితిని వాయిదా వేయడానికి ఉపయోగపడతాయి. మరో మాటలో చెబితే, ప్రభుత్వ భావజాలం ఒక్క దెబ్బతో రెండు పిట్టల్ని కొడుతూంది. కాని ఈ ప్రభుత్వ భావజాలం ఉద్దేశించిన విధంగా పని చేయాలంటే

అనువైన పరిస్థితులు, సందర్భాలు ఉండాలి. అయితే గ్రామీణ తెలంగాణాలోని అనువుకాని, ప్రతికూల సందర్భంలో మట్టుకు సత్ఫలితాలు తేగల బహుమానమని భావించిన కాకతీయ విశ్వవిద్యాలయం (కా.వి.) చివరికి దాతకే తలనొప్పిగా తయారైంది.

తెలంగాణాలో ప్రస్తుతం అల్లకల్లోలంగా వున్న వరంగల్, కరీంనగర్, ఆదిలాబాదు, ఖమ్మం, నల్గొండ జిల్లాలనుండే కా.వి.కి విద్యార్థులు వస్తుంటారు. రాష్ట్రంలో "కల్లోలిత ప్రాంతాలు"గా ప్రకటించబడ్డ 20 తాలూకాలలో 18 తాలూకాలు వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లోవే వుండడం గమనార్హం 1946-51 సాయుధ తిరుగుబాటు పిదప మళ్లీ మొన్న 1978 వరకు ఎన్నడైనా గాని ఈ ప్రాంతాలు పేద, భూమిలేని రైతుల హింసాయుత పోరాటాలకు కేంద్రాలుగా వుండలేదు. 1978 నుండి రగులుతున్న పేద, భూమిలేని రైతాంగ పోరాటాల ప్రభావం వరంగల్ పట్టణంలోని కాలేజీ క్యాంపస్‌ల స్థితిగతుల్లో కూడ కనిపిస్తుంది. మధ్యతరగతి రైతుల కుటుంబాలనుండి గణనీయమైన సంఖ్యలో యువజనులు వచ్చి పట్టణంలోని పాఠశాలలు, కళాశాలల్లో చేరుతుంటారు. వాళ్లంతా మార్క్సిస్టు-లెనినిస్టు అనుకూల సంస్థలపట్ల ప్రత్యేకించి రాడికల్ విద్యార్థి సంఘం (RSU) పట్ల ఆకర్షితులౌతారు. గత రెండేళ్లలో RSU వరంగల్ పట్టణ విద్యార్థులపై అబేధ్యమైన పట్టు సంపాదించుకొన్నది. ఈ సంవత్సరం RSU ఒంటరిగా పోటీ చేసినా అన్ని అనుబంధ కళాశాలల్లోనూ ఘనవిజయం సాధించింది. అలాగే సోదర ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (PDSU) తో చేతులు కలిపి - ప్రధానంగా పోలీసులు, వారితో చేయి కలిపిన కలగాపులగం విద్యార్థి వర్గాల బలమైన కూటమిని ఎదిరించి యూనివర్సిటీ కాలేజీ విద్యార్థి సంఘంలో అన్ని స్థానాలు గెలుచుకున్నది.

పర్యవసానంగా గత విద్యా సంవత్సరమంతా యూనివర్సిటీ కాలేజీలో ఒక్క ఫంక్షనైనా జరగలేదు. ఈ సంవత్సరం కూడ కిశోర్ భారతికి చెందిన అనిల్ సద్గోపాల్ అధ్యక్షోపన్యాసం వినే భాగ్యం కలగలేదు. అనుబంధ కళాశాల ప్రిన్సిపాళ్ళు కొందరైతే కాస్త సాహసం చేసి కలెక్టరు ఆజ్ఞలను పక్కకు తోయడానికి ప్రయత్నించారు కాని, కలెక్టరు తక్షణమే వారికి క్రమశిక్షణ పాఠాలు బోధించి అదుపాజ్ఞల్లో పెట్టగలిగాడు.

పోలీసులతో, కలెక్టరుతో చేతులు కలప నిరాకరించిన వారిని కూడ తీవ్ర వాదులని ముద్రవేయటం అన్ని బెదిరింపుల్లోకి అతి చురుగ్గా ఫలితాలనిస్తుంది. నిజానికి ఈ బెదిరింపు గారడీలాగా పని చేస్తుంది. ఉదాహరణకు ఒకానొక కళాశాల ప్రిన్సిపాలు చాలా కాలం దాకా లాలూచీ వ్యతిరేకిగా వున్నాడు. అతడ్ని లైనులోకి తేవడానికి ఆర్.ఎస్.ఎస్. వర్గాలు క్రమబద్ధంగా అతడు కూడ 'తీవ్రవాది' అంటూ దుష్ప్రచారం చేశాయి. డిసెంబర్ 14వ తేదీన భూస్వాములు వ్యాపారస్తుల సబ్సిడీల సహాయంతో ఎబివిపి హైదరాబాద్ నగరంలో ఒక పెద్ద నక్సలైట్ వ్యతిరేక ప్రదర్శన జరిపింది. వారు ముఖ్యమంత్రికి సమర్పించిన మెమొరాండంలో ఈ ప్రిన్సిపాల్ పేరును కూడ తీవ్రవాద విద్యావేత్తల జాబితాలో చేర్చారు. ఆపై ఒక వారం తిరక్కముందే పోలీసులు ఆయన కాలేజీలో ప్రవేశించి, విద్యార్థులపై లారీచార్జీ జరిపి, హాస్టల్ వార్డెన్‌ను బెదిరించారనే నెల రోజుల క్రితం ఆరోపణపై ఐదుగుర్ని

అరెస్టు చేశారు. మరి ఈ ప్రిన్సిపాలు కూడ తన వంతుకు ఆ విద్యార్థులపై సస్పెన్షన్లు/ రస్టికేషన్లు పాసు చేయడంతో కాలేజీనే కొంత కాలం మూసేశారు.

సంక్షోభం మానవుల్లో అత్యుత్తమ లక్షణాల్ని వెలికి తెస్తుందనే నానుడి ఒకటి వుంది. అయితే అది వారిలో అత్యంత అధ్వాన్నమైన లక్షణాల్ని కూడ వెలికి తెస్తుందని గమనించాలి. తీవ్రవాదుల్ని నిర్దాక్షిణ్యంగా "పెకలించి వేయాలని" ప్రభుత్వం సంకల్పించినట్లయితే, దానికే ఆశ్చర్యకరమైనంత మోతాదులో అంతవరకు అలా లొంగి వస్తారని భావించని వాళ్ళతో సహా అనేకులు దానితో, (ప్రభుత్వంలో) లాలూచీపడడానికి సంతోషంగానో, మరో విధంగానో ముందుకు వస్తుంటారు. ఒకసారి ఈ లాలూచీ క్రమం ప్రారంభమైందంటే, ఇక ఆ తర్వాత నుండి ఎంత ఉన్నత స్థానాల్లోని విద్యావేత్తలు, పరిపాలనా వేత్తలయినా సరే వారిని క్రమశిక్షణలోకి తేవటానికి ఏ జిల్లా కలెక్టరో, ఏ ఎస్.పి.యో లేక మరే జిల్లా స్థాయి ఆఫీసరో జోక్యం చేసుకోవాల్సిన అవసరం కూడ వుండదు. గత సంవత్సరం, యూనివర్శిటీ కాలేజీ విద్యార్థి సంఘం ప్రచురించబోయే కాలేజీ మాగజైన్‌లో ఏదో "ఆక్షేపణీయమైన రచనలు" ఉన్నాయవి హనుమకొండ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఫోన్ చేసి హెచ్చరించినంత మాత్రంలో యూనివర్శిటీ కాలేజీ ప్రిన్సిపాలుగారు గడగడా వణికి పోయి ఆ మాగజైన్ ప్రచురణను నిలుపుదల చేశాడు.

సరే, అసలు కథకు వస్తే, ఈ విద్యా సంవత్సరంలో తామే ముందుగా దాడి చేయాలని పోలీసులు నిర్ణయించుకొన్నారు. రాడికల్స్‌ను ఓడించే ప్రయత్నంలో విఫలమైనాక, ఇక డిసెంబర్ చివరి వారంలో వివిధ కాలేజీల్లో ఆవిష్కరణ సభలు జరగనున్న తరుణంలో ఒక కొత్త సంక్షోభం సృష్టిద్దామనుకున్నారు. డిసెంబర్ 21వ తేదీన కా.వి. కాన్స్టిట్యుయెంట్ కళాశాలల్లో ఒకటయిన ఆర్ట్స్ మరియు సైన్సు కాలేజీ విద్యార్థులు స్పెషల్ బస్సుల కోసం ఆందోళన చేశారు. తమ కాలేజీ ముందుగా వెళ్ళే బస్సులు ఆపి, టైర్లలో గాలి తీసేయసాగారు. ఇంతలో పోలీసులు వచ్చి వాళ్ళను తరుముకుంటూ క్యాంపస్‌లోకి ప్రవేశించారు. అయితే కళాశాల ప్రిన్సిపాలు, అధ్యాపకులు పోలీసుల్ని అడ్డుకుని, వెనక్కు పంపించేసి, గేటు తాళం వేసి, గొడవ చేయకుండా ప్రశాంతంగా వుండాల్సిందిగా విద్యార్థులకు నచ్చ చెప్పసాగారు. విద్యార్థుల్ని చల్లబర్చడంలో వాళ్ళు కృతకృత్యులు అవుతున్నంతలోగా పోలీసులు మళ్ళీ ఇద్దరు సబ్ - ఇన్స్పెక్టర్ల నాయకత్వంలో వచ్చి గోడలు దూకి క్యాంపస్‌లోకి ప్రవేశించారు. అడ్డువచ్చిన అయ్యవార్లను పక్కకు తోసి, (అక్కడక్కడా వాళ్ళకూ నాలుగు తగిలించి) ఒక అర్థ గంటసేపు యధేచ్ఛగా హింసా దౌర్జన్యాలు జరిపారు. కారిడార్ల మీద, క్లాస్‌రూంల లోపల, స్టాఫ్‌రూంల లోపల, ఆఖరికి ప్రిన్సిపాల్ గదిలో కూడ ఎక్కడ దొరికితే అక్కడ విద్యార్థులను పట్టుకొని చితక బాదారు. కొందరు విద్యార్థులనైతే డాబాపైన కూడ తరిమి కొట్ట బోవడంతో వాళ్ళు భయానికి క్రిందకు దూకి మోకాళ్ళు పగలగొట్టుకున్నారు. విద్యార్థినులు ప్రాణభీతితో వెనక గోడలు దూకి పరారు కావాల్సి వచ్చింది. తల పగిలి ఒకరు, కాలువిరిగి మరొకరు ఇద్దరు విద్యార్థులు ప్రమాదకర స్థితిలో ఆస్పత్రిపాలు కావల్సి వచ్చింది. హాస్పటల్‌లో చేరితే అరెస్టులు తప్పవనే భయంతో ఇంకెందరో తీవ్రగాయాలు కలిగిన

విద్యార్థులు ప్రైవేటుగా చికిత్స చేయించుకోవడానికి వెళ్ళివుండొచ్చు కూడ. క్యాంపస్ అంతటా ఒక పెద్ద భీభత్సం సృష్టిస్తూ దాదాపు అర్ధ గంట సేపు స్వైరవిహారం చేసిన తర్వాత భయభీతులైవున్న అధ్యాపకులకు కూడ "తిరిగి ఈ విషయంపై మళ్లీ ఏదన్నా రచ్చ చేస్తే జాగ్రత్త. ఈ సారి మీకూ తప్పదు" అంటూ వార్నింగులు యిస్తూ నిష్క్రమించారు ఈ రక్షక భటులు.

అయితే దురదృష్టవశాత్తు వాళ్ళ అంచనాలు విఫలమయ్యాయి. అధ్యాపకులు లొంగిపోకుండా "రచ్చ" చేశారు. ఈ భీభత్సానికి బాధ్యులైన ఇద్దరు ఎస్.ఐ లను సస్పెండ్ చేయాలని, ఈ అత్యాచారాలపై న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ కా.వి. అంతటా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది నిర్వధిక సమ్మె ప్రారంభించారు. కాని వైస్‌ఛాన్స్‌లరు గారు మాత్రం తన అధ్యాపకులు, విద్యార్థుల పట్ల సానుభూతి చూపడం పోయి సమ్మెకు ప్రతిగా విశ్వవిద్యాలయాన్నే మూసివేశాడు. పోలీసులాఠీఛార్జిని నిరసించడానికి కూడ అతడు మొండిగా నిరాకరించాడు. ఆగ్రహావేశపూరితులైన విద్యార్థి నాయకులు మరునాడే అతడ్ని కలిసి మొహం వాచేలా బూతులు తిట్టారు. అయితే విద్యార్థి నాయకులు, వైస్‌ఛాన్సలర్ మధ్య జరిగిన ఈ వివాదం టేపురికార్డుల్లో నమోదయి, పోలీసులచేతికి వెంటనే వెళ్ళిందంటే మరి క్యాంపస్‌లో వున్న లాలూచీ సంస్కృతి ఎంత ప్రగాఢమైందో ఎవరైనా అర్థం చేసుకోవచ్చు. ఈ టేపు ఆధారంగా విద్యార్థులపై 'క్రిమినల్ ఇంటిమిడేషన్' క్రింద కేసులు పెట్టారు. అదే రోజు రాత్రి (23వ తేదీ తెల్లవారుజామున) యూనివర్శిటీ కెమిస్ట్రీ లాబొరేటరీని ఎవరో తగలబెట్టారు. జర్మన్ రీచ్‌స్టాగ్ దహనకాండను తలపించే ఈ దుర్ఘటనలో పదిలక్షల విలువగల ఆస్తులు బుగ్గిపాలయ్యాయి. తక్షణమే యూనివర్శిటీ అధికారులు, పోలీసు అధికారులు ఒక్కుమ్మడిగా యిది 'విధ్వంసకాండ' అని ప్రకటించేశారు. బాల్యావ్యవస్థలోని కా.వి.కి ఇది 'వెన్నుపోటు' వంటిదని స్థానిక పత్రికలు వ్యాఖ్యానించాయి. ఒకవేళ పోలీసులకు ఏ దురుద్దేశ్యాలు లేకున్నా వారు ఎవరిని కేసులో ఇరికించాలో చెప్పకనే చెప్పినట్లయింది. తదనుగుణంగానే పోలీసులు తమ ప్రథమ సమాచార నివేధిక (FIR) లో కొందరు విద్యార్థులు, అధ్యాపకులను నిందితులుగా పేర్కొన్నారు.

మరునాటి ఉదయం యూనివర్శిటీ కాలేజీ యూనియన్ అధ్యక్షుడు, కార్యదర్శులు ఇంకా ఇతర విద్యార్థులతో బాటు ఫైర్‌బ్రిగేడ్‌కు తోడ్పడుతూ పాడైన లేబొరేటరీ సరంజమాలో పనికి వచ్చేదంతా వెలికి తీయడానికి ప్రయత్నిస్తూ వుండగా, అంతకు రెండు రోజుల క్రితం 21వ తేదీన యూనివర్శిటీ ఆర్ట్సు అండ్ సైన్సు కాలేజీలో విద్యార్థులపై లాఠీచార్జీ జరిపిన సబ్‌ఇన్‌స్పెక్టర్ తన బలగాలతో హుటాహుటిన తరలివచ్చి వైస్‌ఛాన్స్‌లర్ సమ్ముఖంలోనే వారిని అరెస్టు చేశాడు. దహనకాండ గురించి వాళ్ళను ప్రశ్నించాలనే కారణం చెప్పి తీసుకెళ్ళిన ఆ ఎస్.ఐ. వారిని రాత్రంతా లాకప్పులో వుంచి నిర్దాక్షిణ్యంగా దెబ్బలు కొట్టి, ఆ మరుసటి ఉదయం కోర్టుకు తీసుకెళ్ళి, వైస్‌ఛాన్సలర్‌పై 'క్రిమినల్ ఇంటిమిడేషన్' జరిపారన్న అభియోగం మోపి కోర్టులో హాజరు పరిచాడు! ఆ తర్వాత మూడు రోజులకు వాళ్ళు బెయిలుమీద విడుదలయితే జైలు గేట్ల వద్దనే వారిని పట్టుకుని (ఇలా విడుదలైన

వారిని జైలు గేట్ల వద్దనే పట్టుకోవడం వరంగల్ పట్టణంలో పోలీసులకు మామూలు అలవాటయి పోయిందని ఇక్కడ చెప్పాల్సి వుంటుంది) ఎబివిపి విద్యార్థుల్ని చూపించి, వారిపై మళ్ళీ దాడి చేశారనే ఏదో పాత అభియోగంపై మళ్ళీ అరెస్టుచేసి కేసులు పెట్టాడు యిదే ఎస్.ఐ. ఈ వికృత చర్యలతో ఇంకా తృప్తి కలగని వైస్‌ఛాన్సలర్ అయితే తనను బూతులు తిట్టారనే సాకుతో 15 మంది విద్యార్థుల్ని సస్పెండు చేసి కలెక్టరు ఆజ్ఞలమేరకు రెండు విడతలుగా మొత్తం ఒక నెల రోజుల పాటు విశ్వవిద్యాలయాన్నే మూసి వేశాడు.

ఈ వికృత గాథకు చివరగా చేర్చి చెప్పాల్సిన రెండు చిన్న సంఘటనలున్నాయి. ఒకటి డిసెంబర్ 21 వ తేదీ జరిగిన లాఠీఛార్జీ వెనుక గల అసలు ఉద్దేశ్యాలను వచ్చేటట్లు కలెక్టరు ప్రిన్సిపాళ్ళ సమావేశం ఒకటి ఏర్పాటు చేసి, ఏ కాలేజీలో ఏ ఫంక్షన్లు నిర్వహించడానికి వీల్లేదని ఆజ్ఞలు జారీ చేయడం; శాంతి భద్రతలకు భంగం కల్గుతుందనే భయంవల్ల అతడు ఆఖరకు హైకోర్టు జడ్జీ వచ్చి విద్యార్థుల్ని ఉద్దేశించి ప్రసంగించడానికి కూడ అనుమతించడట! మరొకటేమంటే, కా. వి. లోని పోలీసు ఔట్‌పోస్టును త్వరలో ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలోవి పోలీసు స్టేషన్‌గా పెంపొందిస్తారట. ఈ అత్యాచారాలన్నింటికీ ముఖ్య బాధ్యుడైన సబ్‌ఇన్‌స్పెక్టర్‌ని సర్కిల్ ఇన్స్‌పెక్టరుగా ప్రమోట్ చేసి, ఈ యూనివర్శిటి పోలీస్ స్టేషన్‌కు బాధ్యుడుగా నియమిస్తారట!

ఈ విధంగా ఒక విశ్వవిద్యాలయ ఆవరణ పోలీసుల ఆక్రమణలో వున్నది. చట్టాలు, ఆస్తిపాస్తుల రక్షణకు సంబంధించిన నియమాలని నిబంధనావళీ నంతటినీ ఉల్లంఘించడానికి సుముఖంగా ఉండే జిల్లా పరిపాలనా వ్యవస్థ, ఏ మాత్రం కనికరంలేని అణచివేత, పోలీసు బలగాలు, వారితో ఆనందంగా చేతులు కలిపే యూనివర్శిటీ అధికారులు ఉండగా - ఇక విశ్వవిద్యాలయ భద్రత దళాలు, యూనివర్శిటీ అధికారులకు మెజిస్టీరియల్ అధికారాలు మాత్రం ఎవరికి కావాలి? నిర్బంధాన్ని సంస్థాగతం చేయాలంటే తలనొప్పి నియమనిబంధనలు అనేకం వచ్చిపడతాయి. అంతకంటే టైబీరియస్ భూతాన్ని ఆవాహన చేసి, విద్యార్థులపై పోలీసులను ఉసికొల్పడమే ఉత్తమం కాదా?

*జనం గొంతుక - ఫిబ్రవరి 1984*

# 5. ఏజెన్సీలో పోలీస్ క్యాంపులు

అడవిబాట మీద ఎదురెదురయిన ఒక గిరిజనుడికీ కొందరు తెల్లబట్టల వాళ్ళకూ సంభాషణ:

'నీ పేరేందన్నా?'

'ఆ?'

'నీ పేరేంది?'

'ఎందుకులే...'

'ఫరవాలేదు, చెప్పు'

'నాకు పేరు లేదులే...'

అంటూ కావడినుండి వేళ్లాడుతున్న అరటిగెలలలాగా తల ఊపుతూ చకచక బాటమలుపు తిరిగి మాయమవుతాడు. అది తెల్లబట్టల భయమో లేక తెల్లబట్టల పోలీసుల భయమో చెప్పడం కష్టం. ఆ అడవికి ముందు తెల్లబట్టలొచ్చాయి. వాటి వెనక పోలీసు లొచ్చారు. ముందొచ్చిన తెల్లబట్టలు వ్యాపారానికీ అడవి నరుక్కుపోవడానికీ అడవి భూములు ఆక్రమించుకోవడానికీ వస్తే, వెనకవచ్చిన పోలీసులు వాళ్లను గిరిజనుల నుండి కాపాడడానికి వచ్చారు.

తూర్పుగోదావరీ విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతం చాలా దట్టమయిన అడవి. ఎగువ భాగాన వున్న తెలంగాణ మహారాష్ట్ర జిల్లాలకంటె సంపన్నమయిన పచ్చటి అడవి. పెట్టుబడిదార్ల కోసం టేకు మద్ది వెదురు ఉంటే అడవిజనం కడుపు నింపడంకోసం చింత అరటి ఉసిరి పనస మామిడి తోపులున్నాయి. ఈ సంపదే ఇక్కడి గిరిజనులను వెనుకబాటుతనంలో ఉంచిందన్నా లేక నాగరిక సమాజపు దాడిని ఎదుర్కోవడానికి కొంత వెసులుబాటు కలిగించిందన్నా అది ఒకే వాస్తవాన్ని రెండు కోణాలనుండి చూడడం అవుతుంది. ఆదిలాబాద్ కరీంనగర్ సిరొంచ అడవుల గిరిజనులు మైదానప్రాంతాల దాడికి తట్టుకోలేక క్రమక్రమంగా ఆ జీవన విధానానికి లొంగిపోతున్నారు. స్థిరవ్యవసాయానికీ వ్యాపారదోపిడీకీ వేతనకూలీకీ అలవాటు పడుతున్నారు. కోస్తాప్రాంతపు గిరిజనులను ఈ రకమయిన 'ప్రగతి' నుండి అడవి సంపద కొంతమేరకు కాపాడుతున్నట్టుంది. వీళ్ళ జీవితం మీద 'ఆటవిక' ముద్ర ఇంకా చాలా బలంగావుంది. ఆదిలాబాద్ అడవులలో వ్యవసాయానికి భూమీ వ్యాపారానికి ఆకూ కర్రా తప్పవేరే ఏమీ మిగలలేదు. విశాఖ అడవులలో కడుపునింపే ఫలసంపద, పోడును పోషించే భూసారం ఇంకా చాల మిగిలి ఉన్నాయి.

అయినా వాళ్ళకూ వీళ్ళకూ సమస్యలు ఒకటే, భూస్వామ్యం, వ్యాపారదాహం, ప్రభుత్వపు రెవెన్యూదాహం. అటవీ అధికారుల 'మామూళ్ల' దాహం, తమ అడవిని కబళించేస్తూవుంటే ఆ అడవులతో తమ అస్తిత్వాన్ని ఎట్లా కాపాడుకోవాలా అన్న సమస్య ఇది. కోస్తాప్రాంతపు ఏజెన్సీ

ఏరియాలో ఈ సమస్య కొత్తదికాదు. బ్రిటిష్ రెవెన్యూ విధానం ఫలితంగా పుట్టుకొచ్చిన కొత్త ఆర్థిక సంబంధాలు అడవులలో ఈ సమస్యను సృష్టించాయి. 1860ల నుండి ఇక్కడి గిరిజనులు తిరుగబడుతూనేవున్నారు. 1920లలో అల్లూరి సీతారామరాజు నాయకత్వంలో భారతదేశ చరిత్రలోనే చెప్పుకోదగ్గ తిరుగుబాట్లలో ఒకటయిన 'మన్య పోరాటం' నడిచింది. ఇట్లా తిరగబడ్డప్పుడల్లా ఈ ప్రాంతాలకు రోడ్లు వచ్చాయి. ఇవ్వాళ ఈ ఏజెన్సీ ప్రాంతమంతా ఎండలో నిగనిగలాడే తారురోడ్లున్నాయి. ఎందుకోసమంటే అటవీ అభివృద్ధికోసం అని ప్రభుత్వం అంటుంది. పోలీసుల రాకపోకలకోసం అని ప్రజలంటారు. ఈ రెండు అవసరాలకూ వైరుధ్యం లేదు కాబట్టి ఇద్దరిమాటా వాస్తవమే. అల్లూరి సీతారామరాజు తిరిగిన ప్రాంతం, పట్టు బడ్డప్రాంతం, చంపబడ్డప్రాంతం - రంపచోడవరం, అడ్డతీగల, జెడ్డంగి, రాజవుమ్మంగి, కొయ్యూరు. మంప, కృష్ణదేవిపేట, కాకరపాడు - అంతటా మళ్లీ పోలీసు లాకప్‌లలో చిత్రహింసలు, ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ కవాతులూ, ఒక పది గ్రామాలలో సాయుధ పోలీసుక్యాంపులూ ఉన్నాయంటే అది 'అటవీ అభివృద్ధి' చేసుకున్న పుణ్యమేగదా?

విశాఖ జిల్లాకు చెందిన కొన్ని మారుమూల గ్రామాల కథలు చెప్పుకుందాం.

నేరెళ్లబంద ఎత్తయిన కొండమీద వున్న గ్రామం. 'చింతపల్లి ఘాటీ' ఎక్కి పెద్దవలస సంతచేరుకోవాలి. అక్కడినుండి పచ్చటి అడవిబాట. బాటకు ఒకవైపు లోయలు, లోయలో వాగులు, మరొకవైపు కొండచరియలు. కొండచరియలు కొన్ని చోట్ల దట్టంగా చెట్లతోనూ తీగలతోనూ నిండివుంటాయి. అక్కడక్కడ మాత్రం ఎవరో అత్యాధునికమయిన 'షేడింగ్ మెషిన్'తో గడ్డి సహితం మిగలకుండ సాపు చేసినట్టు ఉంటాయి. అది పోడు వ్యవసాయం చేసిన గుర్తు. అక్కడి మాటల్లో చెప్పాలంటే, 'నున్నగా గెడ్డం గీసినట్టు గీసీప్తరండీ....'

నేరెళ్లబండలోని జనమంతా మూడేళ్ల క్రితం అక్కడికి పాడేరు ప్రాంతం నుండి వలస వచ్చారు. ఎందుకు వచ్చారంటే సమాధావం చెప్పలేరు. వాళ్లకు జీవితం తెలుసుగాని జీవితానికి కారణాలు తెలీవు. తెలియకుండా ఉంచాలనే ఈ ప్రయత్నమంతా.

వలస వచ్చి కొంత ఖాళీ ప్రదేశం చూసుకొని ఇళ్లు వేసుకున్నారు. వ్యవసాయం కోసం అయిదెకరాల జాగా చూసుకున్నారు. ఆ ప్రాంతవు ఫారెస్టుగార్డుతో బేరమాడి వెయ్యి రూపాయల డిమాండును ఎనిమిది వందలకు తగ్గించి ఆ ముడుపు చెల్లించుకొని ఆ ఐదెకరాలలో పోడు వ్యవసాయం మొదలు పెట్టారు. రొక్కం మాత్రమే కాకుండ అడిగినప్పుడల్లా కోళ్లు సరఫరా చేసారు. చిన్న కోళ్లిస్తే ఒప్పుకోడట, పెద్దపెద్ద పెట్టలే కావాలట. ( ఆ గార్డు పేరు లోవరాజు, అంటే లోయలకు రాజు. ఈ అదృష్టజాతకులు లోయలకే కాదు, అడవులకూ కొండచరియలకూ గూడ రాజులే. వీళ్లకు లంచాలు పెట్టనిదే గిరిజనులు ఇళ్లు వేసుకోలేరు, వ్యవసాయం చేసుకోలేరు, మేకలను మేవుకోలేరు) మూడేళ్ల తరువాత లోవరాజు బదిలీ అయి మరొకడు వచ్చాడు. లంచం ముట్టింది పోయిన వాడికేగాని వచ్చిన వాడికి కాదు కాబట్టి వీడు పై వాళ్లకు ఫిర్యాదు చేసినట్టున్నాడు, వాళ్లు హుటాహుటిన గ్రామానికొచ్చి గిరిజనులు సావు చేసిన ఆ అయిదు ఎకరాలలో 'అటవీ అభివృద్ధి' ప్రారంభించారు. అంటే టేకు మొక్కలు నాటారు.

గిరిజనులకు కోపం వచ్చింది. రాజుగారికో జమీందారుకో నజరానాలు చెల్లించుకొని భూమి దున్నుకునే రాచరిక నాగరికతతో వాళ్లకు పరిచయముందిగాని, సిబ్బంది బదిలీ అయినప్పుడల్లా కొత్తగా లంచాలు ఇచ్చుకోవాలనే పెట్టుబడిదారీ బ్యురోక్రాటిక్ నాగరికత వాళ్లకు కొత్త. వాళ్ళు ఆ టేకు మొక్కలను పీకేసి తగలబెట్టారు. ఈ 'దౌర్జన్యం' ఫలితంగా నేరెళ్ల బందకూ ఆ పరిసర గ్రామాలకూ పోలీసు క్యాంపులు వచ్చాయి. గిరిజనులకు స్వంత తెలివి ఉందదనీ, ఇంత పని వాళ్లు చేసారంటే నక్సలైట్ల ప్రోద్బలం ఉండి ఉండాలనీ పోలీసుల అనుమానం. నక్సలైట్ల జాడ చెప్పమని జనాన్ని వేధించడం మొదలు పెట్టారు. బియ్యం, పప్పు, కోళ్లు బలవంతంగా తీసుకోవడం మొదలు పెట్టారు. గూడెంకు చెందిన ఒక స్త్రీని చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో రెండు రోజులుంచి విపరీతంగా కొట్టారు. ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ వాళ్లు గూడ అంతవరకు తిన్న లంచాల సంగతి మరచిపోయి 'అడవిలో కట్టెకొడుతున్నారు' అని కేసు పెట్టడం మొదలు పెట్టారు. నేరెళ్లబందలో రెండుసార్లు పోలీస్ క్యాంపు పెట్టారు. గ్రామానికి తలలో నాలుకగా వున్న బంధు ఇంట్లో పెట్టారు. అందరిలాగే బంధుకు గూడ గోచిపాత తప్పవేరే లేదు. అతన్ని గ్రామస్తులు తమ 'మునసబు'గా పిలుచుకున్నంత మాత్రాన పోలీసులు లెక్కించలేదు. అతన్ని విపరీతంగా చితగ్గొట్టి లేవలేకుండ చేసారు. ఈ శిక్ష అంతా అయిన తరువాత తాసీల్దారు వచ్చి, ఆ అయిదెకరాలు గిరిజనులవేననీ, అటవీ శాఖవి కావని తీర్పు ఇచ్చాడు. ఈ పని ఆయనగారు మొదట్లోనే చేయలేక కాదు-శిక్షపాటికి శిక్షే, న్యాయంపాటికి న్యాయమే. ప్రజలు అన్యాయాన్ని సహించకుండ తిరగబడడమే నేరం. న్యాయాన్యాయాలు తరువాత సంగతి.

తాళ్లపాలెం మరొక మారుమూల గిరిజన గ్రామం. అడవి నుండి తెచ్చుకున్న కట్టెతో కట్టుకున్న ఇళ్లు నలభయ్యో, యాభయ్యో ఉంటాయి. ఎండాకాలంలో అడవీ ఊరూ కలిసిపోతాయి. ఊరి మధ్యలో ఒక పెద్దపాక. ఆ పాకలో కూర్చుని ఆడవాళ్లూ మగవాళ్ళు పెద్ద పెద్ద ఆకులను ఎండబెట్టి వంద చొప్పున కట్టలు కడతారు. ఈ ఆకును అడ్డాకు అంటారు. వాటితో విస్తర్లు తయారు చేస్తారు. రూలు ప్రకారం గిరిజనులు ఈ ఆకును గిరిజన కార్పొరేషన్‌కు అమ్మాలి. కాని వాళ్లు ప్రైవేట్ వ్యాపారస్తులకే అమ్ముతారు. ఎందుకని అడిగితే, 'మాకు ప్రైవేట్ వ్యాపారస్తులే ప్రభుత్వ కార్పొరేషన్ కన్న ఎక్కువ ఇస్తారు' అని సమాధానం ఇస్తారు. ఇది చాలా మందికి చాలా ఆశ్చర్యం కలిగించే విషయం. వ్యాపారస్తులు గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని అడవి సంపదను కారుచవకగా కొనేస్తున్నారని గదా గిరిజన కార్పొరేషన్‌లు పెట్టింది. మరి అటువంటప్పుడు ఆ కార్పొరేషన్‌లు వ్యాపారస్తుల కంటె తక్కువ రేటుకు గిరిజనుల దగ్గర సరుకు కొనుక్కుంటాయంటే అది 'గిరిజనులను రెచ్చగొట్టడం కోసం చెప్పే అతిశయోక్తిగా' చాలా మంది లోకజ్ఞులు సహితం భావిస్తారు. కాని అది వాస్తవమే. అడ్డాకు ఒక కట్టకు (100 ఆకులు) వ్యాపారస్తులు రూ॥3-50 నుండి 5.00 వరకు ఇవాళ ఇస్తున్నారు. (గిరిజనుల పోరాటం ఫలితంగా), కార్పొరేషన్ ఇచ్చేది రూ॥0-75 లేక రూ॥1.00 ఇస్తుంది. వ్యాపారస్తులు రూ॥1-50 ఇస్తారు. (అదే చింతపండు విశాఖపట్నం కిరాణా మార్కెట్‌లో ఒక కిలో రూ॥12 నుండి 15 దాకా ఉంటుంది - అది వేరే సంగతి)

ఈ విడ్డూరానికి ఒక కారణం వుంది. వ్యాపారస్తులు గిరిజనుల నుండి చింతపండయినా అడ్డాకయినా కొనుక్కునేటప్పుడు దాన్ని గిరిజనుల ఆస్తిగా పరిగణిస్తారు. అంటే వాళ్లు వస్తువుకు వెలకట్టి ఇస్తారు. (చాలా తక్కువ వెలకడతారనుకొండి, అది వేరే మాట) ప్రభుత్వం అట్లాకాదు. ప్రభుత్వం దృష్టిలో దేశంలోని అడవి అంతా తన ఆస్తి. చింతపండయినా అడ్డాకయినా ఈతకల్లయినా ఎండుగడ్డయినా అడవి సంపదంతా తనది. అయితే తాను స్వయంగా చింతపండు ఏరలేదు కాబట్టి గిరిజనులు ఏరిపెడతారు. ఏరినందుకు ప్రభుత్వం వాళ్లకు కూలి ఇస్తుంది. అంటే కార్పొరేషన్ గిరిజనులకు ఇచ్చేది వాళ్లు సేకరించిన వస్తువు వెలకాదు, దాన్ని సేకరించినందుకు కూలి. అందుకే వ్యాపారస్తులు ఇచ్చే ముష్టి పైసలకంటే గూడ అది తక్కువ ఉంటుంది. ఇదంతా విడ్డూరంగా కనబడడానికి కారణం ఏమిటంటే, ప్రభుత్వం ప్రచారం చేసే మార్మికతలో పడిపోయి చాలా మంది గిరిజన కార్పొరేషన్‌లు పెట్టింది గిరిజనుల సంక్షేమం కోసమని భావిస్తారు. అసలు ఉద్దేశ్యం అదికాదు. అపారమయిన ఈ దేశపు అడవిసంపద చిన్న చిన్న వ్యాపారస్తుల చేతిలోనికి పోకుండ, బడాబూర్జువా వర్గానికి ప్రత్యక్ష ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వం గుత్తాధిపత్యంలో ఉండడం కోసం. గిరిజన కార్పొరేషన్లకు గిరిజనుల సంక్షేమంతో ఎలాంటి సంబంధం లేదు.

తాళ్లపాలేనికి తిరిగివద్దాం. ఈ వూళ్లో మగవాళ్ళ కంటే ఆడవాళ్లే ఎక్కువ ఉన్నట్టు కనబడతారు. జనాభాలెక్కలు ఎలాగున్నా చొరవ మాత్రం ఆడవాళ్లదే. దొడ్డారం పంచాయితీకి తాళ్ళపాలెం నుండి 'నెంబరు' పార్వతి అనే యువతి. ఈమెను గత ఏడాదిలో నాలుగుసార్లు అరెస్టు చేసారు. ఆమె కుండబద్దలు కొట్టినట్టు మాట్లాడడం, నిర్భయంగా ఎదిరించడం, హక్కులు అడగడం - ఇవన్నీ చూస్తే పోలీసులకు ఆమెకు నక్సలైట్లతో సంబంధం వుందని అనుమానం. నాలుగుసార్లు అరెస్టు చేయనయితే చేసారుగాని ఆమెను చూస్తే పోలీసులకు జంకే. అందుకే ఆమె మీద చేయి చేసుకోలేదు. కాని అదే గ్రామానికి చెందిన జరమూరు వెంకన్న అనే కుర్రవాడిని మాత్రం మూడు వారాలు లేవకుండ చితగ్గొట్టారు.

ఇంతకీ ఈ వూళ్లో గొడవేమిటి? ఆ వూరి పక్కనే వున్న అడవినుండి కర్ర స్మగుల్ అవుతూందట, లారీలతో వచ్చి తీసుకుపోతూంటారట. ఫారెస్ట్ అధికార్లూ కాంట్రాక్టర్లూ చేతులు కలిపి, ఒక లారీకి పర్మిట్ రాసుకొని అదే పర్మిట్ మీద నాలుగు లారీలు తోలుకుపోవడం అన్ని అడవి ప్రాంతాలలోనూ చాలా మామూలు విషయం. ఆదిలాబాద్ నుండి హైదరాబాద్‌కు నేషనల్ హైవే నెంబర్ 7 మీద నిత్యం రొద చేసుకుంటూ తిరిగే టింబర్ లారీలో నూటికి 20 శాతం ఈ బాపతువే. అయితే తాళ్లపాలెం ప్రజలు మాత్రం దీన్ని వ్యతిరేకించారట. ఈసారి కర్రగాని స్మగుల్ చేస్తే లారీని కాలబెడతామని బెదిరించారట. దానితో వాళ్లకు నక్సలైట్ సంబంధం వుందని పోలీసులకు అనుమానం పట్టుకుంది. ఆ గ్రామాన్ని దాడి చేయడం, 'నక్సలైట్లకు తిండి పెడుతున్నార'ని కొట్టడం మొదలు పెట్టారు. జనాన్ని బాగా భయకంపితులను చేసారు. పార్వతిని నర్సీపట్నం, కృష్ణదేవి పేట పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పారు. పోలీస్ ఆఫీసర్లను వేధించిన సందేహం ఒక్కటే 'అడవిలో కర్ర స్మగుల్

అయితే అది ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ చూసుకుంటుంది. మధ్యలో ఈవిడ కెందుకు?' ఈ ధర్మభూమిలో ఎవరి ధర్మం వాళ్లు చూసుకోవాలి, పరధర్మం జోలికిపోవద్దని శ్రీ కృష్ణపరమాత్ముడు చెప్పలేదా? గీతాసారం పోలీసు ఆఫీసర్లకు పట్టినట్టు వేరే ఎవ్వరికీ పట్టలేదు మనదేశంలో.

కాకరపాడు పెద్దవూరే, అక్కడ ప్రస్తుతం ఆ ప్రాంతాన్నంతా 'కవర్' చేసే పోలీసు క్యాంపు వుంది. ఈ పోలీసు క్యాంపు వెనక వున్న కథ ప్రభుత్వం వైపు నుండి బాగా ప్రచారం పొందింది. అదేమిటంటే నక్సలైట్లు ఆంధ్రా పేపర్ మిల్స్ వాళ్ల వెదురు డిపోలనూ లారీలనూ తగలబెడుతున్నారనేది.

రాజమండ్రిలో వున్న ఆంధ్రా పేపర్ మిల్స్ బంగూర్ అనే గుత్తపెట్టుబడిదారీ కుటుంబం యాజమాన్యంలో వుంది. తూర్పు గోదావరి, విశాఖ అడవుల నుండి ఈ కాగితపు మిల్లుకు వెదురు (బొంగు) సరఫరా అవుతుంది. ఆ వెదురును పెంచవలసిన అవసరం గూడ బంగూర్లకు లేదు. అడవిలో పెరిగే వెదురే సరిపోతుంది. ప్రభుత్వానికి రాయల్టీ మాత్రం చెల్లిస్తారు. ఒక ప్రాంతంలో వెదురు ఒకసారి నరికితే మళ్ళీ మూడేళ్లకు పెరుగుతుంది. విత్తనాలు నాటవలసిన అవసరంగాని లేదు. ఇట్లా ఫ్రీగా దొరికే ప్రకృతి సంపదను గిరిజనులు నరికి, టన్నుల లెక్కలో కట్టలుకట్టి సరఫరా చేస్తారు. అడవిలో ఎక్కడ వెదురు దొరికితే అక్కడికి వలసపోతారు. ఉత్తరం దిక్కుగా పాడేరు, అరకు దాకాపోతే పడమటికి ఖమ్మం అడవి దాకా పోతారు. ఒకప్పుడు పోడు కోసం వలస వెళ్ళిన గిరిజనులు ఇప్పుడు సీజన్ వస్తే వెదురును వెతుక్కుంటూ వలస పోతారు. ఉత్పత్తి అయ్యే వస్తువులోనూ చేసే పద్ధతిలోనూ కొన్ని మార్పులు వచ్చాయి గాని ఉత్పత్తి జరిగే పరిస్థితులలో పెద్ద మార్పేమీ లేదు.

ఒక టన్ను వెదురు నరికి కుప్పబెట్టడానికి ఇద్దరు మనుషులకు (సాధారణంగా భార్యాభర్తలు) మూడు రోజులు పడుతుంది. దీనికి ఇచ్చే వేతనం ఒకప్పుడు 5 రూపాయలు రోజు కూలి (ఇద్దరికీ కలిపి), అదనంగా టన్నుకు 20 లేక 25 రూపాయలు (పీస్-రేట్) ఉండేది. అంటే ఇద్దరు వ్యక్తులకు మూడు రోజులకు 40 రూపాయలు మించకుండ వుండేది. అంటే తలసరి దిన వేతనం 6 రూపాయల చిల్లర. ప్రస్తుతం గిరిజనులు దీని గురించి తీవ్రంగా పోరాటం చేస్తున్నారు. తమ డిమాండు ఒప్పుకోకపోతే పనిమానేయడం, వెదురు డిపోలనూ లారీలనూ కాలబెట్టడం చేస్తున్నారు. ప్రభుత్వం వైపు నుండి గూడ దీని గురించి చాలా ప్రచారం, గిరిజనుల మీద తీవ్ర నిర్బంధం వుంది. అయినా ఈ పోరాటం వల్ల వాళ్ల వేతనం 40 రూపాయల నుండి ఇప్పుడు కొన్ని చోట్ల 70 రూపాయల దాకా పెరిగింది కాబట్టి గిరిజనులు భయపడడం గాని వెనకాడడంగాని కనబడదు.

ఈ విధంగా వెదురు డిపోలు కాలబెట్టిన వూళ్లలో కాకరపాడు ఒకటి. అయితే నక్సలైట్లు ఈ 'అత్యాచారం' చేయబట్టే ఈ గ్రామంలో పోలీసులు గూడ సరిసమానంగా అత్యాచారాలు చేయవలసి వస్తోందని అనుకోవడానికి వీలులేదు. ఎందుకంటే కాకరపాడులో రాడికల్స్ సానుభూతిపరుల పైన దాడులు ఇంతకు ముందే మొదలయ్యాయి. 1983 మార్చిలో ఒకసారి, 1984 ఫిబ్రవరిలో ఒకసారి ఈ గ్రామంలో రెండుసార్లు బహిరంగ సభలు జరిగాయి. వాటిని

జరపడానికి సహాయం చేసారనే నెపం మీద నర్సీపట్నం పోలీసులు కొందరు గ్రామస్తుల మీద దాడులు చేసారు. మంచి నీళ్లు సప్లయి చేసాడని ఒక చిన్న హోటల్ యజమానిని నర్సీపట్నం లాకప్‌లో బట్టలు విప్పించి చితగ్గొట్టారు. అతని హోటల్‌లో గ్లాసులూ గిన్నెలూ కడిగే కుర్రవాడిని తరిమేసారు. గ్రామంలోని మరొక ఇద్దరు యువకులు పోలీసుల వేధింపుకు తట్టుకోలేక భార్యాబిడ్డలను వదిలి పెట్టి విజయవాడకు పారిపోయారు.

ఇట్లా ఊరూరికీ ఒక కథ. 'నాగరికత' ఇంతకాలం గిరిజనులను కేవలం దోపిడీ రూపంలో పరామర్శించింది. ఇప్పుడు పోలీసు డ్రెస్‌లో గూడా వెళ్తోంది. ఈ 'నాగరికతను' వాళ్లు అసహ్యించుకుంటే అసెంబ్లీలో గొడవ చేయడం ఎందుకు !

*సృజన - జూన్ /జులై 1984*

# 6. సారా సంవత్సరానికి 'సలాకుల' స్వాగతం

మళ్ళీ సారా సీజన్ వచ్చింది. కొత్త సారా సంవత్సరానికి రెవెన్యూ శాస్త్ర పండితులయిన 22 జిల్లాల కలెక్టర్లు వారం వర్జ్యం చూసి స్వాగతం పలికారు. ప్రజల బలహీనతను సొమ్ము చేసుకునే హక్కు మీద గుత్తాధిపత్యం రాబోయే సారా సంవత్సరంలో ఏ నగరంలో ఏ తాలూకాలో ఎవరెవరికి చెందుతుందో, దాని మంది ప్రభుత్వానికి ఎక్సైజ్ రెవెన్యూ ఎంత వస్తుందో, ప్రభుత్వ సారాయి దుకాణాలలో సారా ఎంతకు అమ్ముతుందో, వేలం పాటలలో శాస్త్రోక్తంగా నిర్ణయించారు. అథవా, శాస్త్రోక్తంగా నిర్ణయించామని అనుకున్నా, వాళ్ళ చాదస్తంగాని, ఆ నిర్ణయం వాళ్ళకెవరు వదిలారు? పెట్టుబడుల పోటీ ధరల్ని నిర్ణయిస్తుందనే సిద్ధాంతాన్ని అనుసరించి సారా పెట్టుబడుల పోటీ సారా ధరని నిర్ణయిస్తుందని ఎకనామిక్స్ ప్రొఫెసర్లు నమ్ముతారు. అది వాళ్ళ వృత్తి విశ్వాసం. వాళ్ల తప్ప వేరే ఎవ్వరూ నమ్మరు. సారా గుత్తేదార్లు అసలు నమ్మరు.

సారా గుత్తేదార్లలో నానా రకాల వాళ్ళున్నారు. కాంగ్రెస్ వాళ్ళున్నారు. కమ్యూనిస్టులున్నారు. వాళ్ళకూ వీళ్ళకూ అయిన వాళ్లున్నారు. ఇద్దరికీ కాని వాళ్ళున్నారు. సినిమా వాళ్ళున్నారు, సమితి ప్రెసిడెంట్లున్నారు. సిసలయిన గూండాలున్నారు. ఎన్ని రకాలున్నా అందరూ ఒక విషయం మాత్రం ఉమ్మడిగా ఒప్పుకుంటారు. తమలో తాము పోటీపడి వేలం పాట పెంచడం కన్నా మూర్ఖత్వం మరొకటి ఉండదు. ఒక వీధి కుక్కలన్నీ సిండికేట్ కట్టి పక్కవీధి కుక్కను తరిమికొట్టినట్టు కాగలవాళ్ళంతా ఒకటయి, కానివాడిని బయట నిలబెట్టి వేలం పాట రెండవ మాట లేకుండ ముగించాలన్నది వాళ్ళ దృష్టి. అది వాళ్ళ దృష్టి అని ప్రభుత్వానికి గూడ తెలుసు. అందుకే తన జాగ్రత్త తాను తీసుకుంటుంది. ఎందుకంటే (ఒక ప్రభుత్వ అధికారి నోరుజారి చెప్పినట్లు) ప్రభుత్వం బీదసాదల మీద ఈ పథకమనీ ఆ పథకమనీ పెట్టే ఖర్చంతా 60-70 కోట్లు వుంటే ఆ బీదల జేబులు కొట్టి సారా రెవెన్యూ రూపంలో తిరిగి పొందేది అంతకంటే ఎక్కువ ఉంటుంది. కాబట్టి ఆ రెవెన్యూ పోగొట్టుకుంటే బీద సాదల మీద నిజంగావే ఖర్చయినా చేయాలి. లేక ఆ పథకాలకు తిలోదకాలిచ్చి వోట్లయినా పోగొట్టుకోవాలి. ఇంత కీలకమయిన రాబడిని ఎకనామిక్స్ ప్రొఫెసర్లు చెప్పే సిద్ధాంతాలకు వదిలేయడం ప్రభుత్వానికి ఇష్టం లేదు. అందుకని కిందటి సంవత్సరం రెంటల్ మీద ఈ సంవత్సరం రెంటల్ కనీసం 30 శాతం ఎక్కువ వుండాలవి అన్ని జిల్లాల కలెక్టర్లకూ ఆదేశాలు జారీ చేసింది.

పోటీ వల్ల కాక ఎక్సైజ్ ఒత్తిడివల్ల రెంటల్ పెరిగితే సారా కాంట్రాక్టర్లకూ మౌలికంగా అభ్యంతరం ఉండదు. ఎందుకంటే అప్పుడు తాము అమ్మేసారాధర పెంచితే అభ్యంతరం తెలిపే అర్హత ప్రభుత్వానికి ఉండదు. పైగా ఈ పెరిగిన ధరే తాము అమ్మే దొంగసారాకు గూడా వర్తిస్తుంది. కాబట్టి దీనివల్ల లాభంగూడ ఉండవచ్చు. అయితే రెండుచిక్కులు మాత్రం ఉన్నాయి. గత మూడునాలుగేళ్ళుగా తెలంగాణా జిల్లా అంతటా పెరుగుతున్న

సారాధరలకు వ్యతిరేకంగా జనం తిరగబడుతున్నారు. వాళ్ళకు విప్లవపార్టీలు మద్దతు నిస్తున్నాయి. ఈ సారిగూడ తిరగబడతామని హెచ్చరించారు. కరపత్రాలూ పోస్టర్లూ పడ్డాయి. ఇది సారా కాంట్రాక్టర్లకు పెద్దతలనొప్పి. జనం తిరగబడితే దుకాణాలు బంద్ అవుతాయి. అమ్మకం వుండదు. ఒక్కొక్క సారి మరీ తెగిస్తే వాళ్ళు సారాపీపాలు బద్దలు కొట్టి ఆ పవిత్రజలాన్ని బయట పారబోయడం గూడకద్దు. అంతకంటే పవిత్రమైన సారా కాంట్రాక్టర్ల ప్రాణాలమీద చేయిచేసుకున్న ఘటనలు గూడ లేకపోలేదు. వాళ్లను అణచడానికి పోలీసుల అండకావాలి. దాన్ని సాధించాలంటే ఇచ్చుకోవలసినచోట అడిగినంత ఇచ్చుకోకతప్పదు. ఇదంతా పెద్ద చిక్కే. రెండవచిక్కు లంబాడీ, కోయ తదితర గిరిజనులతో వస్తుంది. అబ్కారీ చలవవల్ల ఇంట్లో వండుకుంటే అయ్యేఖర్చుకంటె అయిదారు రెట్లు ఎక్కువ ఖర్చుపెట్టి బజార్లో సారా ఎందుకు కొనుక్కొని తాగాలన్నది వీళ్ల ప్రశ్న. సారామీద ఎక్సైజు గుత్తాధిపత్యం వచ్చిననాటినుండి ఆ పగటిదోపిడీని, ఆ దోపిడీచేత నల్లవ్యాపారంగా పరిగణించబడే గుడుంబా తయారీతో వాళ్ళు ఎదుర్కొంటూనే వున్నారు. అది బెల్లంసారా కావచ్చు. విప్పసారాకావచ్చు - ఏదయినా ప్రభుత్వ సారాకంటే చాలా రెట్లు చవకే. ధర పెరిగే కొద్దీ గుడుంబా వండకం వాడకం పెరగక తప్పదు. దీన్ని ఎదుర్కోవడానికి సారాగుత్తేదార్లు గుండాల మందను పోషించాలి. వాళ్ళకు కడుపు కింతపడేస్తే చాలదు. కండలు పెంచేంత తిండి పెట్టాలి. జీపులు వ్యాన్లూ కొనుక్కోవాలి. లంబాడా తండలమీద, కోయగూడేలమీద, జీపులతో వ్యాన్లతో దాడులుచేయాలి. జనాన్ని చావచితగ్గొట్టాలి. కేసులుకాకుండా పోలీసులకూ ఎక్సైజు వాళ్లకూ లంచాలు ఇచ్చుకోవాలి. ప్రజాందోళన ఫలితంగా ఎన్నడయినా కేసయితే వకీళ్ళ ఖర్చులు పెట్టుకోవాలి. ఇది గూడ పెద్దచిక్కే.

ఇన్ని సామాజిక శక్తుల సంఘర్షణ నేపథ్యంలో నూతన సారా సంవత్సరం ఉదయించింది. ఈ సంఘర్షణ పరిష్కారాన్ని బట్టి ఆయా ప్రాంతాలలో ఎక్సైజ్ రాబడి, గుత్తేదార్ల లాభం. ప్రభుత్వ సారా దుకాణంలో వంద గ్రాముల ధర నిర్ణయమయ్యాయి. కొన్ని చోట్ల ప్రభుత్వం కోరుకున్న 30 శాతం పెరుగుడల లభించింది గాని వరంగల్‌లో అది కుదరలేదు. వరంగల్ తాలూకా రెంటల్ 39 లక్షల రూపాయల నుండి 42 లక్షలకు మాత్రం పెరిగింది - అంటే 8 శాతం లోపే. ఇంత తక్కువ పెరిగి నందుకు జిల్లా కలెక్టరు తప్ప వేరే ఎవ్వరూ బాధపడలేదు. జనానికి పెరగకుంటేవే మంచిది. సారా కాంట్రాక్టర్లంటారా, వాళ్ళకి పెరిగినా పెంచినంతా మిగులుతుంది. తగ్గితే అమ్మినంత మిగులుతుంది. కలెక్టరు బహుశా ఇంకొంచెం పెంచమని బలవంతం పెట్టేవాడేమో, కాని సారా కాంట్రాక్టర్లంతా కలిసి ఒక చక్కటి నాటకం ఆడారు. వేలం పాట జరుగుతున్న చోట ఒక బాంబు లాంటి పదార్థాన్ని పడేసి అదిగో తీవ్రవాదులు దాడి చేస్తున్నారు అని బెదిరించి వేలం పాట ముగించారు. డి.ఐ.జి దొర పోలీసులకు గూడ 'కళాహృదయం' ఉందని రుజువు చేసాక సారా కాంట్రాక్టర్లు మేం అంత తీసిపోయామా అనుకున్నా రేమో.

అక్కడితో సారా గుత్తేదార్లు సంతృప్తి చెందలేదు తమకు చిక్కులు తేగల ఇద్దరి మీద - విప్లవకారులమీద, లంబాడాల మీద - ముందు బెదిరింపు చర్యగా దాడి చేయాలని

నిర్ణయించుకున్నారు ఇంకా వేలం పాట ఒకవైపు పూర్తికాకముందే గుడుంబా కోసం దాడులు మొదలు పెట్టారు. సాయంత్ర మయితే పట్టణం నుండి వాడ వాడలకు పరిసర గ్రామాలకూ వాహనాల పయనం మొదలవుతుంది. చూడ ముచ్చటగా మూడంటే మూడు బండ్లుంటాయి. సారా కాంట్రాక్టరుగారూ వారి అంగరక్షక బృందం కూర్చునే ఒక జీపు, వెనుక ఎక్సైజ్ పోలీసుల జీవు, ఆ వెనుక ఒక వ్యాను నిండా ముప్పై నలభై మంది కండలు తిరిగిన మెరికెలలాటి గుండాలు, వాళ్ల చేతులలో రకరకాల ఆయుధాలుంటాయి. కర్రలు గొడ్డళ్ళు, బరిసెలు, గొలుసులు, పలాకులు, కత్తులు, చాకులు ఉంటాయి. వీటన్నిటిలోకి ప్రసిద్ధ మయినవి సలాకులు. ఇవి గుండ్రంగా కాకుండ నలుచదరంగా వుండే ఇనపరాడ్లు. ఒక మొన తగిలేటట్టు తల మీద కొడితే తలపగలడం ఖాయం. ఈ ఆయుధాలు కాక కాంట్రాక్టరుగారి డగ్గర లైసెన్స్‌డ్ రివాల్వర్ ఉంటుంది. దాన్ని వారు సినిమాలలో విలన్‌లాగ అప్పుడప్పుడుగాలిలోకి కాలుస్తుంటారు. అసలు పని మాత్రం లైసెన్స్ అక్కరలేని ఆయుధాలతో జరిగిపోతుంది. ఊళ్ళ మీద పడి జనాన్ని చితకబాదుతారు. తలలూ కాళ్లూ విరగ్గొడతారు. ఇంట్లోని కుండలూ బిందెలూ పగలగొడతారు. (వీటిలో గుడుంబా కాచుకుంటారని వాళ్ల అనుమానం) స్త్రీలను ఎత్తుకుపోయి అత్యాచారం చేస్తారు. ఎక్సైజ్ పోలీసులు కురుక్షేత్రంలో శ్రీ కృష్ణపరమాత్మలాగ దీన్నంతా ప్రశాంతంగా తిలకించి, అంతా అయిపోయాక దెబ్బలు తిన్నవాళ్ల మీదే గుడుంబా దొరికిందని కేసు రాసుకుని పోతారు.

ఈ విధంగా ఆగష్టు 30 సాయంత్రం రుద్రమ్మ ఏలిన వరంగల్‌కోట ప్రాంతం మీద దాడిచేశారు. ఒక యింటిలోనికి దూరి కళ్ళు సరిగ్గా కనిపించని ముసలాయనను పట్టుకొని బయటికి వచ్చారు. ఆయన కొడుకు బుర్రా రాములు (కాకతీయ విశ్వవిద్యాలయంలో ఎంఫిల్ విద్యార్థి, పార్టు-టైం లెక్చరర్) తన తండ్రిని ఎందుకు తీసుకుపోతున్నారని అడ్డం వచ్చాడు. అదే వరంగల్‌కోటలో మూడేళ్ళక్రితం అదే సారా కాంట్రాక్టరు యాదగిరి అనే యువకుడిని చంపించాడు. వరంగల్‌కోట ప్రాంతపు విద్యార్థి యువజనుల అలజడి ఫలితంగా అతని మీద పోలీసులు కేసు పెట్టక తప్పలేదు. ఆ కసి ఇంకా తగ్గని కాంట్రాక్టరు రాములును ఇనపరాడ్లతో కొట్టి ఎత్తి జీపులో వేసుకున్నాడు. అడ్డం వచ్చిన వాళ్ళమీదికి కత్తులూ పలాకులూ తీసారు. జీపులో పోతూండగా రాములును పిడికిళ్ళతో విపరీతంగా గుద్దారు. కాంట్రాక్టరు స్వయంగా ఒకచేత్తో స్టీరింగ్ నడుపుతూ రెండవ చేత్తో రాములు గొంతు నులిమాడు. "మీరు కరపత్రాలు వేస్తే మా వ్యాపారం ఆగిపోతుందనుకున్నారా" అనీ "యాడగిరిని చంపిన కేసు నా మీద పెట్టించింది నువ్వేకదరా" అనీ కసిగా అతన్ని కొట్టించాడు. పక్క ఎముక ఒకటి విరిగింది. ఆ స్థితిలో అతన్ని పోలీసుస్టేషన్‌కు తీసుకుపోయి కాంట్రాక్టరే అప్ప జెప్పాడు. జనం మీద దాడిచేసి చావగొట్టి దెబ్బలు తిన్నవాళ్లను తామే స్వయంగా పోలీస్‌స్టేషన్‌కు అప్ప జెప్పి వాళ్లమీదే కేసుపెట్టించే ఘనత ఒక్క సారా కాంట్రాక్టర్లకే దక్కుతుంది. వాళ్లకు పోలీసులతో ఎంతటి లాలూచీ వుందో దీన్ని బట్టి అర్థమవుతుంది. పోలీసులు రాములును ఆస్పత్రికి తీసుకుపోయారు. అడ్మిట్‌కాకుండ చూడాలనీ దెబ్బలు నయంకాకముందే అరెస్టుచేసి తీసుకుపోవాలనీ పోలీసులు ప్రయత్నించారు.

అతని మిత్రుల జాగ్రత్తవల్ల ఆ ప్రమాదం తప్పింది. సారా కాంట్రాక్టర్లూ ఎక్సైజ్ సిబ్బంది ఎంతో శాంతియుతంగా గుడుంబాకోసం వెతకడానికి పోతే "తీవ్రవాది" అయిన రాములు తన ముఠాతో వాళ్ళ మీద దాడిచేశాడని, వాళ్ళు ఆత్మరక్షణార్థం రెండు దెబ్బలు (చేతులతో మాత్రమే) వేసి, పోలీసులకు తమ డ్యూటీ చేయడంలో మవమందరం సహకారం ఇవ్వాల్సిన అవసరం ఉందనే సదవగాహన గల పౌరులు కావదంచేత అతన్ని జీపులో వేసుకొని తమ సొంత డీసెల్ ఖర్చుతో పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారనీ అడిషనల్ ఎస్.పి ఒక ముచ్చటయిన కథ అల్లాడు. పైగా రాములే అరెస్టు తప్పించుకోవడం కోసం డాక్టర్లను బెదిరించి ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడని ఒకకొపమెరుపు చేర్చాడు. విరిగిన పక్క ఎముక గూడ అతనే విరగ్గొట్టుకున్నాడేమో తెలియదు - "తీవ్రవాది" గదా. ఎంతకయినా తగ్గవాడే.

వారం తిరిగి తిరక్కముందే ఇంత కంటే ఘోరమయిన చర్య జరిగింది. వరంగల్ పట్టణానికి 25 కిలో మీటర్ల దూరంలో వున్న పల్లార్ గూడెం అనే గ్రామాన్ని అనుకొని వున్న పోచంపల్లి తండ మీద సెప్టెంబర్ 7 ఉదయం 9 గంటలప్పుడు సారా కాంట్రాక్టర్లు, ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టరు, కొందరు సాయుధ పోలీసులూ దాడి చేసారు. ఇంట్లో భోజనం చేస్తున్న గుగులోతు హనుమంతు మీద పడి చితగ్గొట్టారు. అతని వీపు వాతలు తేలింది. నెయ్యికుండను గుడుంబా కుండ అనుకొని పగలగొట్టారు. అతని పెద్దన్న మంక్యా అడ్డం పోతే అతన్ని గూడ ఇనుప సలాకులతో కొట్టారు. అతనికి ఒక వేలు విరిగింది. అడ్డం వచ్చిన స్త్రీలను 15 మందిని తలల మీద, వీపులమీద, సలాకులతో కొట్టారు. గుగులోతు గుజిరి తల చిట్లింది. ఇట్లా జనాన్ని కొడుతూ తరుముకుంటూ వస్తుంటే పొలాలనుండి హనుమంతు చిన్నవ్న గుగులోతు సమ్మూలు ఎదురొచ్చాడు. అతన్ని కాంట్రాక్టరు స్వయంగా సలాకుతో రెండు బలమయిన దెబ్బలు వేసి కింద పడేసాడు. అతని ముసలి తల్లి అతని మీద పడితే ఆమెను గూడ వీపు మీద బాది లాగి విసిరేశాడు. తలనుండి రక్తం కారుతున్న సమ్మూలును జీపులో వేసుకొని బయలు దేరాడు. దారిలో ఎదురయిన గుగులోతు పంతులును గూడ జీపులో వేసుకున్నారు. మచ్చాపురం క్రాస్ రోడ్స్ దగ్గర ఇద్దరినీ జీపు నుండి కిందపడేసి కాంట్రాక్టర్ గుండాలు బూటు కాళ్లతో తొక్కారు. అక్కడి నుండి తీసుకుపోయి తామే గీజుకొండ పోలీసుస్టేషన్‌లో అప్పజెప్పి లంబాడా లంజకొడుకులు గుడుంబా తాగితమలో తాము కొట్టుకుని చంపుకున్నారు అని ఎస్.ఐ.కి చెప్పారు. అపస్మారక స్థితిలో మహాత్మాగాంధి స్మారక ఆస్పత్రికి తరలించిన సమ్మూలు కొద్ది గంటలలో ప్రాణం కోల్పోయాడు.

పోచం పల్లి తండా శాసనసభ్యుడు ఓంకార్‌గారి మార్క్సిస్టు కమ్యూనిస్టుపార్టీ ప్రభావంలో ఉన్నట్లు లెక్క. తండాలోని పార్టీ కార్యకర్తలు పోలీసులమీద ఒత్తిడి తీసుకొచ్చి ఎస్.ఐ చేత స్వయంగా పంచనామా చేయించి సారా కాంట్రాక్టరుమీద హత్య కేసు పెట్టించగలిగారు. పెద్దనాయకుడు మాత్రం ఆరోజులలో రాష్ట్ర వ్యాప్తంగా సాగుతున్న ప్రజాస్వామ్య యజ్ఞంలో మెడదాకా నిమగ్నమయిన కారణాన తన అనుచరుడి మరణానికి సంతాపం సహితం పత్రికా ముఖంగా ప్రకటించినట్లు లేదు. ప్రజాస్వామ్యాన్ని హైదరాబాదులో కాపాడుకుంటే చాలు, గుగులోతు పమ్మూలు లాంటి అనామక జనం ఒకడు పోతే ఇంకెందరు లేరు?

*సృజన - అక్టోబరు 1984*

# 7. నేర పరిశోధన

ఒక్క సంవత్సరంలో 24.

ఒక్క 1984 సంవత్సరంలో మన రాష్ట్రంలో 24 మంది పోలీసు కస్టడీలో మరణించారు. కొందరు లాకప్‌లో వుండగా మరణించారు. కొందరు లాకప్‌లో కొట్టిన దెబ్బల ఫలితంగా ఆ తరువాత మరణించారు. కొందరు ఇంకా లాకప్ చేరక ముందే తోవలోనే మరణించారు.

ఈ 24 అవే సంఖ్య ఎక్కువా తక్కువా ఫరవాలేదా అని తేల్చడానికి మన దగ్గర ప్రమాణాలు లేవు. అంతకుముందు సంవత్సరం, అంతకన్నా ముందు సంవత్సరం ఎంతమంది చనిపోయారో మనకు తెలీదు. 1983లో 24 కంటె ఎక్కువ మందే చనిపోయారనీ వాస్తవానికి 1984లో పరిస్థితి మెరుగయిందని డిజిపి ఆచార్యుల వారు గణాంకాలు బోధిస్తే కాదనడం మనకు కష్టమే. ఈ మధ్యనే గతించిన ఇందిరాగాంధీకి ఇటువంటి అలవాట్లుండేవి. ద్రవ్యోల్బణం ఎక్కువగా వుందంటే నిజానికి కిందటి సంవత్సరం కన్నా రెండూ పాయింట్ మూడు శాతం తక్కువయిందనీ, కాబట్టి మీరు సుఖంగా వున్నట్టే లెక్క అనీ సమాధానం ఇచ్చేది. కిందటి సంవత్సరం కాకపోతే వెనక్కి వెతుక్కుంటూ వెళ్ళి ఫలానా అయిదేళ్ళనాటి పరిస్థితికంటే మెరుగేనని భావించేది. ఫ్రెంచి రాణి మేరీ ఆంటోనెట్ లాగ తిండి లేకపోతే గణాంకాలు భుజించి సంతోషించమనేది. అలా వాదించే వాళ్ళకు సమాధానం చెప్పడం అనవసరం.

పోలీసులు ఎవరినయినా చిత్రహింసలకు గురి చేసారని గాని చంపారనిగాని ఆరోపిస్తే - "వాడు ఏదో చేసే వుంటాడు. లేకపోతే పోలీసులు చిత్రహింసలు ఎందుకు పెడతారు? ఏదో ఒక కారణం లేకపోతే నిన్నూ నన్నూ చంపనిది ఫలానా వాడినే ఎందుకు చంపుతారు?" అని ప్రశ్నించే విద్యావంతులు కొందరున్నారు. (చదువుకోని వాళ్ళు ఈ ప్రశ్న వేయగా నేను ఎప్పుడూ వినలేదు. ఈ రకమయిన మీమాంస విద్యాగంధం ఫలితమే). గత సంవత్సరం జరిగిన 24 కస్టడీ హత్యలలో ఒకటి మాత్రం నిజంగానే 'ఏదో ఒక కారణం' గూడ లేకుండ వట్టి కావరంతో చేసిన హత్య. 1984 జనవరి 10వ తేదీన కరీంనగర్ జిల్లా మహదేవ్‌పూర్ అడవులలోని బోర్లగూడెం గ్రామంలో జర్పుల అమ్రు అనే లంబాడా రైతు తాలూకు ఎద్దు ఒకటి సిఆర్‌పిజవాన్లను పొడవబోయిందని ఉక్రోశంతో వాళ్ళు అమ్రును కొట్టి కొట్టి ఆ రాత్రికి చంపారు. అయితే ఇటువంటివి ఒకటి రెండు కేసులు మినహాయిస్తే అత్యధిక భాగం కేసులలో నిజంగానే చంపడానికి 'ఏదో ఒక కారణం' ఉంటుంది. చదువుకున్నవాళ్ళు ఆ ప్రశ్న వేస్తున్నారంటే వాళ్ళు మరీ చవటలు కాదు గదా- సకారణంగానే వేస్తున్నారు.

ఈ 'ఏదో ఒక కారణం' అనేది మన వ్యవస్థలో పోలీసు యంత్రాంగం పాత్రతోనూ స్థానంతోనూ ముడిపడి వుంటుంది. ఆ పాత్ర ఏమిటో తెలుసుకోవాలంటే క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌నూ పోలీస్ మాన్యువల్‌నూ చదివితే చాలదు. అయినా వాటితోనే ప్రారంభిద్దాం.

శాంతి భద్రతల నిర్వహణ, నేరాల పరిశోధన అనేవి రెండు పోలీసు యంత్రాంగం

విధులు. మనదేశంలో పోలీసులు పనిచేసే తీరుతో పరిచయంవున్న వాళ్ళకు ఈ మాటలు వింటేనే ఒళ్లు జలదరిస్తుంది. చిన్నప్పుడు అందరం దొంగ చాటుగానో బాహాటంగానో (తెలుగులోనో ఇంగ్లీష్‌లోనో) డిటెక్టివ్ పుస్తకాలు చదివాము. నేరపరిశోధన గురించి ఆ పుస్తకాల నుండి కొన్ని ఊహలు ఏర్పరచుకున్నాము. వేలిముద్రలు, అడుగుజాడలు, రక్తపు మరకలు, వెంట్రుకముక్కలు వీటిని ఉపయోగించి డిటెక్టివ్‌గారు వేరస్తుడి ఆచూకి తెలుసుకుంటారని ఒక చిత్రం రూపొందించుకున్నాము. నిజంగానే ఇటువంటి పరిశోధన చేయడానికి కావలసిన నేర పరిశోధనా పద్ధతులు చాలా అభివృద్ధి చెందివున్నాయి. అభివృద్ధి చెందిన దేశాలలో వీటిని విరివిగా ఉపయోగిస్తారని ప్రతీతి. ఇంగ్లండులోనయితే పోలీసులు నేరపరిశోధనలో ఎవ్వరినీ కొట్టనే కొట్టరని పేరుంది. ('కొట్టకపోతే దొంగ వెధవ ఒప్పుకుంటాడండీ' అని చదువుకున్న పోలీస్ ఆఫీసర్లో పోలీసు ఆత్మలున్న చదువుకున్నవాళ్ళో చాలా తెలివిగా అంటుంటారు). ఇంగ్లండు సంగతి మనం చూడలేదుగాని, మనదేశంలో మాత్రం ఇటువంటి సున్నితమయిన పరిశోధనా పద్ధతులు ఉపయోగించే అలవాటు పోలీసులలో దాదాపుగా మృగ్యం.

కొట్లో పడేసి రోకలి బండలు ఎక్కించడమో లేక ముడ్డిలో కర్ర దూర్చడమో చేస్తే వాడే ఒప్పుకుంటాడు. దానికి వేలిముద్రలూ నేపకాయలూ ఎందుకు? ఇందులో ఒక ప్రాంతానికి మరొక ప్రాంతానికి సంప్రదాయాలలో తేడాయే తప్ప సాధనాలలో లేదు. కొట్లో ఒప్పుకుంటే అది కోర్టులో నడవదు కదా అని మీకు చట్టబద్ధమయిన అమాయకపు సంశయం కలిగిందా? మరేం ఫరవాలేదు. ఒప్పుకోవడం అంటూ జరిగితే సాక్ష్యాలకేం కొదవలేదు.

ఒక చిన్న (సజీవమైన) ఉదాహరణ. ఫిబ్రవరి 5వ తేదీ ఉదయం వరంగల్‌లోని మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌కు ఒక 18 సంవత్సరాల కుర్రవాడిని తీసుకొచ్చారు. అతని దగ్గర ఒక చేతి గడియారం దొరికింది. ఆ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగిలించబడ్డ ఆరు గడియారాలలో అది ఒకటి అని ఎస్.ఐ గారికి అనుమానం. ఆ కుర్రవాడిని అడిగితే తనకు తెలియదన్నాడు. ఎవరో అమ్ముతూంటే కొన్నానన్నాడు. అతను నిజం చెబుతున్నాడో లేదో తెలియడానికి అడ్డు ప్రశ్నలు వేయవచ్చు. అతని ఇంటివాళ్ళనూ పక్కింటివాళ్ళనూ ప్రశ్నించవచ్చు. అది దొంగిలించబడ్డ గడియారమనీ, దాన్ని తాను ఎవరి దగ్గర కొన్నదీ చెప్పకపోతే తనమీదే కేసవుతుందనీ చెప్పి అతని నుండి నిజం రాబట్టవచ్చు. ఇంకా చాలా పద్ధతులలో పరిశోధన చేయవచ్చు. కాని ఎస్.ఐ గారికి అవేవీ రుచించలేదు. స్టేషన్‌లోకి వచ్చిన అయిదో నిముషంలో ఆ కుర్రవాడికి ముడ్డిలో కర్ర ఎక్కించాడు. పావుగంటసేపు అతను విలవిలలాడుతూ 'నాకు తెలీదు సార్' అని ఏడుస్తున్నాడు. ఆ తరువాత అతన్ని మూడు రోజులు ఇదే విధంగా హింసించారు. అతను ఏమీ చెప్పలేదు. నాలుగవరోజు అతన్ని రిమాండ్ చేయించి వరంగల్ కేంద్ర బందిఖానాకు తోలారు. ఏం కేసు కింద? వాచీలు దొంగతనం చేసాడనా? కాదు. దొంగతనం చేసిన వాచీలు బట్వాడా చేస్తున్నాడనా? అది గూడ కాదు - సి.ఆర్.పి సెక్షన్ 109 కింద. దీనిని పామరులు ఆవారా కేసనీ పెట్టీ కేసనీ అంటారు. ఫలాన వ్యక్తి ప్రవర్తన అనుమానాస్పదంగా వుంది అతను నేరం చేయబోయేలాగ

వున్నాడని పోలీసులు అంటే, అతని నుండి ఈ సమాజాన్ని కాపాడడం కోసం కోర్టు వారు అతన్ని 15 రోజులు రిమాండ్ చేస్తారు. ఆ 15 రోజుల తరువాత పోలీసులకు అనుమానం తీరకపోతే, అతన్ని జామీను మీద వదిలిపెట్టడం కోర్టువారికి ఇష్టం లేకపోతే, మరొక 15 రోజులు, ఇంకొక 15 రోజులు... అట్లా మూడు నెలలపాటు ఏ నేరం చేయకుండానే చేయగలడనే సందేహం మీద జెయిల్లో ఉంచవచ్చును. మన దేశంలో జెయిళ్ళలో ఉండే ప్రతీ అయిదుగురిలోనూ ఒకరు ఈ కోవకు చెందిన 'నేరస్తులు' ఉంటారు. మరి ఇంతకీ చేతి గడియారం సంగతి ఏమయినట్టు? అతని దగ్గరి నుండి దానిని పోలీసులు తీసుకున్నారు. అదినిజంగా దొంగిలించినదే అయితే, దాని యజమాని గట్టిగా అడగ్గలవాడయితే, అతనికి ఫిబ్రవరి 5 నాటి విషయాలు చెవిన బడితే, అతను కట్నం చదివించుకోగల వాడయితే, అతని వాచి అతనికి దక్కుతుంది. కాకపోతే ఇంతే సంగతులు. లేక, ఇవి ఎన్నికల రోజులు కాబట్టి, గడియారాల దొంగతనాలు పరిష్కారం కావడం లేదనీ, పోలీసులు నిద్ర పోతున్నారనీ, దొంగలతో లాలూచీ సద్దారనీ, స్థానిక కౌన్సిలర్లు కాబోయే ఎమ్మెల్యేలూ గొడవచేస్తే, అప్పుడు ఇట్లాగే మరికొందరిని పట్టుకొచ్చి కొట్లో సత్కారం జరిపి, దొరికిన గడియారాలలో సగం (సగం మాత్రమే) 'రికవర్' అయినట్టు కోర్టులో పెట్టి కేసు నడిపిస్తారు.

ఈ విధంగా సాగుతుంది 'నేర పరిశోధన'. రోజు రోజుకూ ఈ పరిశోధన తాలూకు పై మెరుగులు మహా ఆర్భాటంగా పెరుగుతున్నాయి. కాని లోపలి సరుకులో మార్పులేదు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలూ, వేరే ఎన్ని ఇబ్బందులున్నా పోలీసు యంత్రాంగం మీద మాత్రం అడిగినంత ఖర్చు పెడుతున్నాయి. ఇవ్వాళ సగటు ఎస్.ఐ జీపు దిగడు. జీపులోనే వైర్‌లెస్ సెట్లుంటాయి. కావలసినన్ని స్పెషల్ స్క్వాడ్లుంటాయి. వాళ్ళు ఎంత ఖర్చు పెడతారో దేనికి ఖర్చు పెడతారో అడిగేవాళ్ళుండరు. ఐ.జి.పి నుండి డి.ఎస్.పి దాక పదవులు నూరు పూవులుగా వికసిస్తున్నాయి. కానిస్టేబిళ్ళను మినహాయిస్తే మిగిలిన వాళ్ళందరికీ నేరే ఏ గవర్నమెంట్ డిపార్ట్‌మెంటులోనూ రానంత వేగంగా ప్రమోషన్లు వస్తాయి. అడగిన చోటనల్లా పోలీస్ స్టేషన్లు వెలుస్తాయి. నిర్మాణపరమయిన ఈ ఆర్భాటమంతా పైకి కనిపించేదే. దాని కడుపులో దాచుకున్నది అతి అనాగరికమయిన పరిశోధనా పద్ధతి. బహుశా పై నిర్మాణపు ఆర్భాటం పెరిగే కొద్దీ ఈ అనాగరికత గూడ పెరుగుతుందేమో. 20 ఏళ్ళ క్రితం, ఎస్.ఐలు సైకిల్ మీద పెట్రోలింగ్ చేసిన రోజులలో, పోలీసు లాకప్పులలో చిత్రహింసలు ఇంత విరివిగా జరిగేవా? ఆనాడు చూసినవాళ్ళు చెప్పాలి.

గత సంవత్సరం పోలీసు కస్టడీలో చనిపోయిన 24 మందిలో చాలామంది ఈ 'పరిశోధన' ఫలితంగా చనిపోయిన వారే. బోడపాటి గోపాల్ అనే విద్యార్థి, చిత్తూరు జిల్లా రంగరాజపురం నివాసి. ఉద్యోగాన్వేషణలో కాబోలు మూడు వేల రూపాయలు తీసుకొని విజయవాడ వచ్చాడు. ఒక లాడ్జిలో దిగాడు. అది కనిపెట్టిన పోలీసులు ఆ డబ్బు దొంగసొమ్మనే అనుమానం మీద కాబోలు అతన్ని (ఏప్రిల్ 5నాటి సాయంత్రం) క్రైం స్టేషన్‌కు తీసుకుపోయి 'పరిశోధన' ప్రారంభించారు. రాత్రి అయేసరికి అతడు చనిపోయాడు.

'విషం తాగి చనిపోయాడ'ని పేపర్ ప్రకటన ఇచ్చి వదిలించుకున్నారు. అనంతపురం జిల్లా కూటాగుళ్ళ గ్రామానికి చెందిన వడ్డే రాములు అవే వ్యక్తిని ఇదేవిధంగా దొంగతనం చేసాడనే అనుమానం మీద కదిరి పోలీస్ స్టేషన్లో 'విచారం' జరపగా అతను (మే 7వ తేదీన) చనిపోయాడు. అతను తాగుబోతులకు సహజంగా వచ్చే రోగాలవల్ల చనిపోయాడనీ పోలీసులు ప్రకటించారు. అదే జిల్లాకు చెందిన గుంతకల్లు పట్టణంలో జూన్ 12న కిష్టప్ప, వెంకటప్ప, రామన్న అవే ముగ్గురిని అరెస్టు చేసి చిత్రహింసలకు గురిచేసిన ఫలితంగా 17వ తేదీన కిష్టప్ప చనిపోయాడు. పోలీసులు అతన్ని రాష్ట్రం సరిహద్దులు దాటి కర్ణాటకలోని బళ్ళారిలో ఆస్పత్రిలో చేర్పించి 'మేడమీది నుండి కిందపడి దెబ్బలు తగిలాయి' అని బుకాయించారు. అక్కడి డాక్టర్లు ఈ కథ నమ్మకపోయేసరికి అసలు విషయం బయటకు వచ్చింది. ఇటువంటివే మరికొన్ని ఉదాహరణలు ఉన్నాయి. దాదాపు వీళ్ళలో ఎవ్వరూగూడా పెద్ద పెద్ద కేసులలో నిందితులు కారు. నిజంగానే నేరస్తులయినా కోర్టు వేయగల శిక్ష రెండు మూడు ఏళ్ళను మించేది కాదు. అయినా నేరపరిశోధన క్రమంలో ప్రాణాలనే కోల్పోయారు.

అయితే పాశవికమయిన పరిశోధనా పద్ధతులను అవలంబించడం మాత్రమే కాదు. పోలీసు యంత్రాంగం తన 'విధి'ని అర్థం చేసుకునే తీరులోనే చట్టానికీ వాళ్ల ఆలోచనలకూ వైరుధ్యం ఉంది. మీరు నేర పరిశోధన చేస్తున్నారా లేక నేరానికి శిక్ష వేస్తున్నారా అని మీరు పోలీసులను గాని అడిగితే ఆ రెండింటికీ తేడా తెలియక తికమక పడతారు. వాళ్ళు రెండు పనులూ చేస్తారు. రెండు పనులూ ఒకేసారి చేస్తారు. మొదటిదానికంటే రెండవదే ఎక్కువ చేస్తారు. ఎందుకంటే పోలీసులకు కోర్టులమీద, జెయిళ్ళమీద నమ్మకంలేదు. కోర్టులు శిక్ష వేయవు. వేసినా జెయిల్లో సుఖంగా తిని బయటికి వచ్చి మళ్ళీ దొంగ పనులు చేస్తారు. కాబట్టి 'దొంగవెధవ మళ్ళీ ఆ జోలికి పోకుండ' లాకప్‌లోనే ఒళ్ళు విరగ్గొట్టి బుద్ధి చెప్పి పంపించాలని వాళ్ళ అభిప్రాయం. అంతేకాదు, ఇదే తమ అసలు ధర్మమని పోలీసులు గాఢంగా నమ్ముతారు. మరి నేరస్తుడు అవునో కాదో తెలియకుండ ఇట్లా 'బుద్ధిచెప్పే' కార్యక్రమం పెట్టుకుంటే అమాయకులు చాలా మందికి అన్యాయం జరుగుతుంది కదా అంటే అది తప్పని సరి అనీ దానికేం చేయగలిగింది లేదనీ పెదవి విరుస్తారు. ఈ రకంగా 'బుద్ధి చెప్పే' కార్యక్రమంలో భాగంగా చనిపోయినవాళ్ళు చాలామంది. విజయవాడలో ఏప్రిల్ 18 నాడు సమరం రమణ అనే స్త్రీని 5వ టౌన్ పోలీసులు 'వ్యభిచార' నేరం మీద అరెస్టు చేశారు. ఇటువంటి కేసులలో పెద్దగా విచారణ జరపడానికి గూడ ఏమీ ఉండదు. అయితే ఆమెకు మళ్ళీ వ్యభిచారం చేయకుండ బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నారేమో, బాగా కొట్టారు. ఆ దెబ్బల ఫలితంగా ఆమె 20వ తేదీనాడు రక్తం కక్కుకొని చనిపోయింది. హైదరాబాద్ పొలిమేరలలోని రోడా మిస్త్రీ నగర్‌కు చెందిన మహమ్మద్ సాబిర్ అనే వ్యక్తి ఒక బేకరీ యజమానితో తగువు పెట్టుకోగా అతని ఫిర్యాదు మీద పోలీసులు సాబిర్‌ను (జూన్ 9న) అరెస్టు చేశారు. ఇందులో గూడ నేరపరిశోధన గాని విచారణగాని చేయడానికి ఏమీ లేదు. అయితే అతనికి మళ్ళీ ఎన్నడూ తగువులు పెట్టుకోకుండా బుద్ధిచెప్పే ఉద్దేశ్యంతో అతన్ని పోలీసులు కొట్టుకుంటూ తీసుకుపోగా అతను దారిలో తిరగబడ్డాడు.

అప్పుడు పోలీసులు కోపంతో అతని గొంతు నులిమి పాడుబడ్డ బావిలో పడేసి 'అతనే బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నా'డని ప్రకటన ఇచ్చారు.

ఈ రకమయిన చిత్రహింసలు ఒక ఎత్తయితే డబ్బుల కోసమో లేక రాజకీయ కారణాల వల్లనో పెట్టే చిత్రహింసలు వేరొక ఎత్తు. నిజానికి పోలీసు యంత్రాంగం వ్యవహారాలలో లంచాలు ఎంతగా అలుక్కుపోయి ఉంటాయంటే వాళ్లు తమ కర్తవ్యంగా భావించి చేసే పనులనూ లంచాలకోసం చేసే పనులనూ వేరుచేయడం కష్టం. నెల్లూరు జిల్లా కావలిలో సెప్టెంబర్ 13 నాడు మేక మస్తానయ్య అనే వ్యక్తి పోలీస్ లాకప్‌లో హత్య చేయబడ్డాడు. ఈ మస్తానయ్య తన గ్రామం సర్పంచ్‌కు వ్యతిరేకి. ఒక హత్య కేసులో అనుమానించబడి తానే స్వయంగా పోలీసులకు సరండర్ అయి నేరం ఒప్పుకున్నాడు గూడ. అయినాసరే అతన్ని 10 రోజులు లాకప్‌లో ఉంచి కొట్టి చంపారు పోలీసులు. అతన్ని లాకప్‌లో హింసించేందుకే వాళ్ళ గ్రామం సర్పంచ్ దగ్గర పోలీసులు లంచం తీసుకున్నారని అనుమానించక తప్పదు.

అయితే క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోనూ పోలీసు మాన్యువల్‌లోనూ ఎక్కడా రాయని కర్తవ్యం ఒకటి పోలీసు యంత్రాంగానికి ఉంది. అది ఈ వ్యవస్థను కాపాడడానికి ఒక సాయుధ సైన్యంగా పనిచేసే కర్తవ్యం. అది పోలీసు యంత్రాంగం రాజకీయ పాత్ర. అంతా ప్రశాంతంగా వున్నప్పుడు ఈ పాత్ర ప్రముఖంగా కనిపించదుగాని రాజకీయ సామాజిక కల్లోలం ప్రబలంగా వున్నప్పుడు ఈ పాత్రే ముఖ్యమయిన దవుతుంది. అప్పుడే పోలీసు యంత్రాంగం అమానుషత్వమంతా ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఎందుకంటే ఈ స్థాయిలో జరిగే అత్యాచారాలు ఒక పోలీసు అధికారి తనస్వంత పూచీ మీద అత్యుత్సాహంతో చేసేవో లేక ఒక జవాను తాగిన మైకంలో చేసేవో కావు. ఇవి రాజ్యాంగ యంత్రం ఆదేశంతో, అనుమతితో, ప్రోత్సాహంతో చేసేవి. వీటి మీద ఫిర్యాదుగాని విచారణగాని వుండవు. ఇంకా మాట్లాడితే ప్రమోషన్లు ఉంటాయి. గత సంవత్సరం జరిగిన 24 హత్యలలో మూడు ఈ కోవకు చెందినవి. కరీంనగర్ జిల్లాలో ఫకీర్ కొండాపూర్ గ్రామం నుండి జూన్ 17 అర్ధరాత్రి 70 మందిని తోలుకుపోయి విపరీతంగా కొట్టారు. మెట్టుపల్లి పోలీసుస్టేషన్‌లో విపరీతంగా కొట్టిన ఫలితంగా తోకల చినవెంకటి 18నాడు చనిపోయాడు. ఈ గ్రామస్తుల మీద ఆరోపణ 'నక్సలైట్లకు అన్నం పెట్టారు' అని. అదే విధంగా అదిలాబాద్ జిల్లా సిర్పూర్ తాలూకాలోని బ్రాహ్మణచిట్యాల గ్రామస్తులను 30 మందిని సెప్టెంబర్ చివరివారంలో అరెస్టు చేసి కొట్టుకుంటూ తీసుకుపోయి కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్లో పెట్టి కొట్టి విడిచిపెట్టారు. వాళ్లలో ఒకడయిన సామెర్లనాని అక్టోబర్ 4న ఆ దెబ్బల ఫలితంగా చనిపోయాడు. ఈ గ్రామస్తుల మీద ఆరోపణ గూడ నక్సలైట్లకు అన్నం పెట్టారనే. వరంగల్ జిల్లా కడిపికొండ వాస్తవ్యుడయిన కొడవటి సుదర్శన్‌ను ఎన్నికల బహిష్కరణ కార్యక్రమంలో ఉండగా డిసెంబర్ 17 నాడు అరెస్టుచేసి కాజీపేట లాకప్‌లో కొట్టి చంపారు.

ఇన్ని పేర్ల మీద ఇంతమందిని చంపుతూవుంటే మరి ప్రజలు నోరు మూసుకొని ఊరుకోవటమేనా? గత్యంతరంలేదా? ప్రజలు నోరుమూసుకొని ఊరుకోవడం లేదు. ఏదో

ఒక రూపంలో అలజడి చేస్తూనే వున్నారు. నిజానికి ప్రజలు అలజడి చేయబట్టే ఈ హత్యలు పత్రికల దృష్టికి వచ్చాయి. కదిరిలో వడ్డే రాములును (మే 7న) చంపినప్పుడు, నిజామాబాద్ జిల్లా గిద్ద గ్రామంలో స్పెషల్ పోలీసులు పోతయ్యను (12 ఏప్రిల్) చంపినప్పుడు, అదే జిల్లా కామారెడ్డి పట్టణంలో మల్లారం పోచయ్య అనే హమాలీని (15 డిసెంబర్) చంపినప్పుడు, ప్రజలలో చెలరేగిన అలజడి మీద సెక్షన్ 144 సహితం ప్రయోగించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని పోలీస్ స్టేషన్లో కె. వెంకయ్య అనే వ్యక్తిని (10జులై) చంపినందుకు విశ్వవిద్యాలయం విద్యార్థులు అలజడిచేయగా వాళ్లను అరెస్టుచేసి నెలరోజులు బెయిలు సహితం రానీయకుండ జెయిల్లో పడేశారు.

ఈ అలజడికి వేరే ఫలితమేమయినా ఉంటోందా అంటే లేదు. హత్య చేస్తే చట్టంలో పోలీసులకు ఒక సెక్షనూ పౌరులకు వేరే సెక్షనూ లేదు. చంపినది ఎవరయినా హత్యానేరం కింద విచారించవలసిందే. అయినా ఈ 24 కేసులలో ఒక్కదానిలో మాత్రమే చంపిన పోలీసులను హత్యానేరం కింద అరెస్టుచేశారు. అది బోర్లగూడెం గ్రామంలో అమ్రును చంపిన సి.ఆర్.పి జవాన్లను. దీనికి కారణం గూడ స్పష్టమే. ఈ హత్యకు బాధ్యులు లా అండ్ ఆర్డర్ పోలీసులు గాని ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీసులు గాని కాదు. సి.ఆర్.పి వాళ్ళను కాపాడాలనే 'తాపత్రయం' మన రాష్ట్ర పోలీసు యంత్రాంగానికి లేదు. అందుకే ఆ ఒక్క కేసులో తీసుకోవలసిన చర్య తీసుకున్నారు. మిగిలిన కొన్ని కేసులలో బాధ్యులయిన పోలీస్ అధికార్లను సస్పెండ్ చేసినట్లు పేపర్లో ప్రకటనలిచ్చారు. కాని ఇది కన్నీటి తుడుపు చర్య మాత్రమే. రెండు రోజులు గడిచి అందరూ విషయాన్ని మరిచి పోయాక తిరిగి మళ్లీ ఉద్యోగంలోకి తీసుకుంటారు.

ఇదంతా ఒక రకంగా అర్థం చేసుకోగల విషయమే. ఎందుకంటే పోలీసు యంత్రాంగం 'తన వాళ్ళను' కాపాడుకోవాలనుకోవడంలో వింతలేదు. అయితే చట్టం మాటేమిటి, కోర్టుల మాటేమిటి? పోలీసు అత్యాచారాలకు సంబంధించిన ఆరోపణ వచ్చినా దాని మీద దర్యాప్తు జరిపించాలని జిల్లా కలెక్టరును చట్టం ఆదేశిస్తుంది. మామూలుగా మొక్కుబడిగా దర్యాప్తు జరిపించి రిపోర్టు ఫైలులో దాచుకుంటూ ఉంటారు కలెక్టర్లు. కాని రాజకీయ కారణాలవల్ల పోలీసులు చేసే అత్యాచారాల మీద కనీసం ఆపాటి కన్నీటి తుడుపు దర్యాప్తులు గూడ ఉండవు. తోకల చినవెంకటి, సామెర్ల నాని, కొడవటి సుదర్శన్‌ల హత్యల విషయంలో ఆయా జిల్లాల కలెక్టర్లు (కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్) ఇంతవరకు విచారణ గూడ జరపలేదు.

మరి కోర్టుల మాటేమిటి? ఎవ్వరి ప్రాణాన్ని అయినా చట్టబద్ధమయిన పద్ధతిలో తప్ప ఇతరత్రా హరించడానికి వీలులేదనేది భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులలో ఒకటి. ప్రాథమిక హక్కులను కాపాడడం కోర్టుల విధులలో ఒకటి. మరి అటువంటప్పుడు ఇంతమందిని ఏ విచారణ లేకుండా కొట్టి చంపేస్తుంటే కోర్టులు ఏం చేస్తున్నాయి? ఏం చేస్తున్నాయో ఒక ఉదాహరణ చెప్తాను. అలకుంట పెదవెంకటి అనే ఒక 'బందిపోటు'ను వరంగల్‌లోని హనుమకొండ లాకప్‌లో కొట్టి చంపారు. అతన్ని చంపుతుండగా కళ్ళారా

చూసి అతని మరణం తరువాత జైలుకు రిమాండు చేయబడ్డ అతని తమ్ముడు కొమురయ్య హైకోర్టుకు పిటిషన్ పెట్టుకున్నాడు. మేమసలు అరెస్టే చేయలేదని పోలీసులు సమాధానం ఇచ్చారు. ఇది అబద్ధమనీ, పెదవెంకటిని కొట్టి చంపి పోలీసులే శవాన్ని మాయం చేసారనీ, దీని మీద విచారణ జరిపించమనీ కోర్టును అడిగితే 'కింది కోర్టులో కేసు పెట్టుకొమ్మ'ని తిరస్కరించింది. కింది కోర్టులో కేసు ఎవరు పెట్టుకోవాలి? చనిపోయిన 'బందిపోటు' తమ్ముడయిన (జైలులో వున్న) మరొక 'బందిపోటు' కేసు పెట్టుకుంటే అతన్ని గాని అతని కుటుంబాన్ని గాని పోలీసులు బ్రతకనిస్తారా? ఈ శంక హైకోర్టువారికి నిజంగా రానేలేదా?

చట్టంలో ఏదో రాసుంది కాబట్టి న్యాయం జరుగుతుందనుకుంటే పొరబాటే. చట్టంలో ఎన్నో రాసుంటాయి. అలవాట్లు వేరే రకంగా ఉంటాయి. ఈ అలవాట్లు చట్టాన్ని అతిక్రమించినప్పుడు శిక్షించే ధైర్యం న్యాయస్థానాలకు ఉండాలి. ఆ ధైర్యం ఉండడం లేకపోనడం అనేది వ్యక్తులమీద ఆధారపడ్డ విషయం కాదు. ఇవ్వాళ శాంతి భద్రతలు అనేమాట వినగానే హైకోర్టు జడ్జీల నుండి కలెక్టర్ల దాకా అందరూ గజగజ వణుకుతున్నారంటే అది వ్యవస్థ ఎంతగా చితికిపోయిందో సూచిస్తుంది. ఈ వ్యవస్థ తన విలువలను తాను గౌరవించే స్థితిని దాటిపోయింది. తన చట్టాన్ని తాను ఆదరించగల స్థైర్యాన్ని కోల్పోయింది. తన విలువలనూ తన చట్టాన్నీ తానే అతిక్రమిస్తే తప్ప మనలేని స్థితికి చేరుకుంది. ఇక ఇప్పుడు న్యాయస్థానాలు సమకూర్చగల న్యాయం ఏమీ లేదు. ప్రజలు తమ న్యాయాన్ని తామే వెతుక్కోవాలి.

*సృజన - ఫిబ్రవరి 1985*

# 8. ఎదురు కాల్పులు

కొత్తగా అధికారం చేతి కొచ్చిన వర్గాలకు - అందులోనూ కష్టపడకుండ అధికారం చేతి కొచ్చిన వర్గాలకు - అహంకారం విపరీతంగా వుంటుంది. తమతో విభేదించే వాళ్ళ పట్ల అసహనం ఫాసిజం పాళ్ళలో వుంటుంది. ఒక్క ఉద్యమం నడవకుండ ఒక్క పోరాటం చేయకుండ అధికారానికి వచ్చిన వాళ్ళకు ఉద్యమాలూ, పోరాటాలూ అనవసరమయిన విషయాలుగానూ విద్రోహ చర్యలుగానూ కనబడతాయి. పాలకవర్గ ప్రతిపక్ష పాత్రను సహితం కొంతకాలమయినా మోయని వాళ్ళకు అభిప్రాయ స్వేచ్ఛ, వాక్ స్వాతంత్ర్యం చులకనగా అనిపిస్తాయి. తమకు ఎన్నడూ అవసరం కానివి, కేవలం ఇప్పుడు తమ పాలనా వ్యాపారానికి ఆటంకంగా అనిపించేవి లేకుంటేనేం?

అందుకే హోం మంత్రి వసంత నాగేశ్వరరావును పత్రికా విలేఖరులు ఎదురు కాల్పుల గురించి తరచి తరచి అడగగా ఆయన చాలా విసుక్కున్నాడు పాపం.... 'మమ్మల్నీ, మావాళ్ళనీ ఇబ్బంది పెడుతున్న వెధవల్ని చంపేసాం - ఇంక రొటీన్ విషయాన్ని గురించి ఇంతగా చర్చ ఎందుకు? తెలుగుజాతి మహోన్నతి కోసం మేము ఆవిర్భవించాం. ఆ ఉన్నతికి ఎవరు అడ్డు వచ్చినా మేము సహించం. నాదెండ్ల భాస్కరరావు ఎక్కడ మీటింగులు పెట్టినా మా గూండాలను పెట్టి కొట్టించలేదా, మా పోలీసులను పెట్టి మీటింగులను నిషేధించలేదా? మాకు వ్యతిరేకంగా పోటీ చేసిన వెధవలను వికారాబాద్‌లోనూ, నల్లగొండలోనూ కొట్టించి కేసులు పెట్టించలేదా? మాకు వోట్లు వేయని హరిజనుల ఇళ్ళ మీద దాడిచేసి - చిత్తూరు నుండి గుంటూరుదాకా - ఇళ్లు తగల బెట్టలేదా? దొంగతనాలూ దొమ్మీలూ చేస్తూ తెలుగు తల్లికి కళంకం తెస్తూన్న చీడపురుగులను లాకప్పులలో కొట్టి చంపించడం లేదా? అందుకు కావలసిన రక్షణ పోలీసులకు ఇవ్వడం లేదా? తెలుగు జాతి ఉన్నతి కోసం పాటుపడుతున్న మమ్మల్ని నిష్కారణంగా చీడర పెడుతూ జాతిపురోగమనాన్ని ఒక్క క్షణమయినా సరే ఆటంకపరిచే వాళ్ళను క్షమించడం జాతి ద్రోహం కాదా?...'

- ఇవన్నీ పాపం హోం మంత్రిగారు మనసులో అనుకొని వుంటారు. పైకి అనడానికి ఇంకా కొన్ని ఈ వెధవ ప్రజాస్వామ్యపు హక్కులూ విలువలూ అడ్డున్నాయి గదా. ఈ పేపర్ల వాళ్లు చెప్పిన విషయాన్ని సహృదయంగా అర్థం చేసుకోక పెద్ద పెద్ద అక్షరాలతో రాస్తారు. వాళ్ళను ఏమీ అనడానికి లేదు. ఏమయినా అంటే దేశమంతా గోలపెడుతుంది. ప్రెస్ కౌన్సిల్ సంజాయిషీ అడుగుతుంది. కోర్టులు స్టే ఆర్డర్లు జారీ చేస్తాయి. ఏదో గాడిదగూడ మనలాంటి జంతువేగదా అని వీళ్ళను గాడిదకొడుకులంటే ఆ మధ్య ఎంత గొడవ జరిగింది. తెలుగు జాతి ఉన్నతిని సాధించడానికి ఇన్ని అవరోధాలా-!

మీరు ఇవ్వాళ మనరాష్ట్రాల్ని పరిపాలిస్తున్న వాళ్ళ మనసుల్లోకి చూస్తే ఈ ఆలోచనలే కనిపిస్తాయి. పరిపాలిస్తున్న వాళ్ళు అంటే ఎన్టీఆర్, వసంతనాగేశ్వరరావులు మాత్రమే కాదు - ఆ స్థాయినుండి క్రింది స్థాయి పోలీసు తదితర అధికార్ల దాకా అందరిలోనూ ఇవే

ఆలోచనలు. మనదేశ పాలకులు ప్రజాస్వామ్యాన్ని సహించగల దశను దాటి పోతున్నారు. తమ చేతులలో నియంతృత్వ అధికారం ఎంత తొందరగా కేంద్రీకరించుకుందామా అని ఆతృత పడుతున్నారు. వాళ్ళలో వాళ్ళు ఆ అధికారాన్ని ఏ విధంగా పంచుకోవాలా అన్న విషయమయి అంగీకారానికి రాలేక పోతున్నారు గాని, లేకుంటే ఈపాటికి మనకున్న ఈ పాటి స్వేచ్ఛ గూడ లేకపోవును. కొత్త కొత్త వ్యాపారాలతో కొత్త పెట్టుబడులతో కొత్త వర్గాలు పుట్టుకొచ్చే కొద్దీ ఈ ఆతృత మరింత అధికమవుతోంది. ఆ కొత్త వర్గాలకు అధికారం వచ్చిన చోట అమలవుతోంది గూడ.

ఇప్పటికే వాళ్ళలో ఎన్ని మార్పులు వచ్చాయో చూడండి. పంక్షేమ రాజ్యాన్ని గురించి, సంస్కరణల గురించి మాట్లాడడం మానేసారు. ఎ.ఐ.సి.సి (ఐ)లో పాతవాసనలు మిగిలిపోయిన ముసలి కాంగ్రెస్ నాయకులు గొడవ చేయబట్టి రాజీవ్ గాంధీ కొంచెం తడబాటుతో సర్దుకున్నాడు గాని లేకపోతే సోషలిజం అవపరంలేదని ప్రకటించేవాడే. భూపంస్కరణలు, కనీసవేతనాలు మొదలయిన సంక్షేమ రాజ్యపు ఆచ్ఛాదనలు కాలంచెల్లి పోయాయి. 'అభివృద్ధి' పేరిట ఆస్తిపరులకు మరింత ఆస్తి సంపాదించుకునే రాయితీలను ఇచ్చే ఆర్థిక విధానం ఇప్పుడు నగ్నంగా రాజ్యం చేస్తోంది.

ఆచ్ఛాదనలు లేని వర్గ పరిపాలనకు పోలీసుల అండ చాలా అవసరం. అహంకార పాలనకు గూడ పోలీసుల ప్రయోగం అవసరం. అన్ని రకాలుగా ఇవ్వాళ పోలీసు పాలన మన పాలకులకు అవివార్యమయింది. పోలీసులకు 'ఫ్రీహాండ్' ఇచ్చి అత్యాచారాలు చేసిన వాళ్ళకు పారితోషికాలూ ప్రమోషన్లు ఇవ్వడం ప్రధాన పాలనా మార్గం అవుతోంది. మన రాష్ట్రంలో 'ఎన్‌కౌంటర్లు' చేసిన పోలీసు ఆఫీసర్లకు శవానికి 30 వేల రూపాయల చొప్పున ఇస్తున్నారని వినికిడి. అటువంటి బేరమేదో లేకపోతే నక్సలైట్ పార్టీల ముఖ్యులవేకాక దొరికిన వాళ్ళందరినీ పోలీసులు చంపుతారా?

'కొండాపూర్ కాల్పులు'గా ప్రఖ్యాతి గాంచిన వెంకట్రావు పేట కాల్పులనే తీసుకోండి. చనిపోయిన అయిదుగురిలో ప్రభుత్వం దృష్టిలోనయినా 'చంపదగ్గవారు' ఎందరు? ముగ్గురిమీద మాత్రమే చెప్పుకోదగ్గ కేసులున్నాయని పోలీసులంటున్నారు. అవయినా ఎంతవరకు నిజమయిన కేసులో ఎంతవరకు బనాయించిన కేసులో తెలీదు. మిగిలిన ఇద్దరిమీద ఎటువంటి కేసులూ ఉండే అనకాశం లేదు. వాళ్లు వెంకట్రావు పేట గ్రామ వాస్తవ్యులయిన తాడు రాజయ్య, వుప్పల లక్ష్మిరాజం. ఈ యువకులిద్దరూ గత మూడేళ్ళుగా గ్రామంలోనే లేరు. 'మస్కట్' పోయే కోరికతో అప్పుచేసి బొంబాయిలో బ్రోకర్ల చుట్టూ తిరుగుతున్నారు. 100 కు 50 రూపాయల వడ్డీకి రాజయ్య 25 వేల రూపాయలు, లక్ష్మిరాజం 12 వేల రూపాయలు అప్పుచేసి బొంబాయి వెళ్ళారు. రాజయ్యది రెండున్నర ఎకరాల భూమి గల కుటుంబము. లక్ష్మిరాజంది ఎకరన్నర పాలికిచేసే కుటుంబం. ఇటువంటి పేద వాళ్లు ఆ పేదరికాన్ని తప్పించుకోవడానికి వేలకువేలు చట్టవ్యతిరేకమయిన వడ్డీకి అప్పుతెచ్చి బొంబాయిలో బ్రోకర్ల ఒడిలో ధారపోస్తుంటే తెలుగు జాతి ఉన్నతికి చీమకుట్టినట్టులేదు. తెలుగుజాతి రోడ్డు రవాణాసంస్థ వారు జగిత్యాల నుండి బొంబాయికి

డెయిలీ సెమీలగ్జరీ బస్సు సర్వీసు వేసి ఈ దౌర్భాగ్యుల ఆశలను సొమ్ము చేసుకుంటున్నారు. కాని ఈ గ్రామాలవాళ్లు సిపిఐ (ఎం.ఎల్) అభ్యర్థికి వోటువేస్తే మాత్రం అది ద్రోహం అయింది. ఎన్నికల ముందూ ఎన్నికల తరువాతా ఈ గ్రామాలమీద దాడులు జరిపి ఇళ్ళూ ఒళ్ళూ గుల్లచేశారు. సముద్ర లింగాపురంలో సత్యమ్మ అనే స్త్రీ మీద అత్యాచారం చేశారు.

ఇప్పుడు రాజయ్యనూ లక్ష్మీరాజంనూ మరొక ముగ్గురు కార్యకర్తలనూ చంపారు. మూడేళ్ళ తరువాత మొట్టమొదటిసారిగా ఈ యిద్దరూ గ్రామానికి వచ్చారు. మస్కట్ సంగతి దేవుడెరుగుగాని పంట కోతలకు సహాయం చేయడానికి రమ్మని తల్లి దండ్రులు రాస్తే వచ్చారు. రాజయ్య తన మరణానికి నెలరోజుల క్రితం వచ్చాడు. లక్ష్మీరాజ్యం కేవలం నాలుగు రోజుల క్రితం వచ్చాడు. ఏప్రిల్ 10 రాత్రి ఇద్దరూ పొలం కాపలాకని వెళ్లారు. అక్కడ పార్టీ కార్యకర్తలు కనబడడంతో వాళ్ళతో మాట్లాడి, కొండాపూర్ శివార్లను అనుకొని వున్న బయలు ప్రాంతంలో పడుకున్నారు. ఆరాత్రి జరిగిన హత్యాకాండనుండి తెలివిగా తప్పించుకున్న ఒక వ్యక్తి ఆ తరువాత పత్రికా విలేఖరులకు చెప్పిన కథనం ప్రకారం - వాళ్ళు నిద్రపోతుండగా పోలీసులు వచ్చి తుపాకులతో ఛాతిమీద కొట్టి లేపి, చేతులు వెనక్కి కట్టి, ఏంచేయాలా అని కొంత సేపు తర్జన భర్జనలు జరిపి, తరువాత కాల్చి చంపారు. లక్ష్మీరాజం తుపాకీ దెబ్బలు తిని పారిపోయే ప్రయత్నం చేయగా వెంబడించి చంపారంట. ఈ కథనాన్ని ప్రచురించిన దిన పత్రికల సంపాదకులకు కరీంనగర్ పోలీసులు సమ్మన్స్ ఇచ్చేదాకా వెళ్ళ గలిగారంటే తమ అకృత్యాలు బయట పడితే వాళ్ళకు ఎంత ఉక్రోశమో అర్థమవుతుంది.

నిజానికి ఈ కథనం బయటకు రాబట్టి ప్రజలలో ఈ బూటకపు ఎదురుకాల్పుల పట్ల చాలా ఏవగింపు కలిగింది. అన్నీ ఇంత 'డ్రెమటిక్'గా బయటకు రాలేదుగాని, దాదాపు అన్ని ఎన్‌కౌంటర్ల కథలూ ఇంతే. మార్చి 28న ఖమ్మం జిల్లా వీరభద్రారంలో అర్సపల్లి వెంకటేశ్వరరావు (చంద్రన్న)ను చంపారు. ఈ గ్రామం భద్రాచలంనుండి ఉత్తరానికి 20 కిలో మీటర్ల దూరంలో - వెంకటాపురం వెళ్లే రోడ్డుకు తూర్పున - వుంది. గిరిజనేతరులు భూములు కలిగి వుండడానికి వీలులేని ఈ 'నోటిఫైడ్' ప్రాంతంలో మంచి మంచి పొగాకు తోటలూ భద్రాచలంలోని మిద్దెలూ (దేవుడి గుడి గూడ) గిరిజనేతరులవే. ఈ భూ ఆక్రమణను కొద్ది కొద్దిగా చట్టబద్ధం చేసే ప్రయత్నం చెన్నారెడ్డి కాలం నుండి ఎన్.టి.ఆర్. కాలందాకా (పార్టీ, ప్రాంతం, కులం, తేడాలు లేకుండా) సాగుతోంది. ఆ భూ ఆక్రమణగాని ఈ ప్రయత్నంగాని జాతికి ద్రోహంగా ఎవరికీ తోచినట్టు లేదుగాని, గిరిజనులను సంఘటిత పరచి సారాధర తగ్గించి సారా కాంట్రాక్టర్ల కడుపుకొట్టిన చంద్రన్న మాత్రం తెలుగుజాతి ఉన్నతికి అవరోధంగా కనబడ్డాడు.

ఆ ప్రాంతపు సారాకాంట్రాక్టర్ అయిన పాండేతో మాట్లాడడానికి చంద్రన్న అతన్ని మార్చి 28 నాడు వీరభద్రారంలోని మట్టా లక్ష్మయ్య ఇంటికి రమ్మని కబురు చేశాడు. తాను మధ్యాహ్నం అయేసరికి అక్కడికి చేరుకున్నాడు. కాంట్రాక్టరు వచ్చేదీ లేనిదీ తెలుసుకొని రమ్మని ఆతని గుమాస్తా యింటికి లక్ష్మయ్యను పంపగా 'వస్తాడు ఉండమని' చెప్పి పంపించారు. కాని వచ్చింది కాంట్రాక్టరుకాదు, భద్రాచలం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ నాయకత్వంలోని

పోలీసులు. లక్ష్మయ్య 'ఇల్లు' అని. పిలవబడేది రెండు తలుపులు గోడలు లేని పాకల సముదాయం. పోలీసులు వచ్చేసరికి చంద్రన్న చిన్న పాకలో విశ్రమిస్తున్నాడు. అతనికి మూడు నాలుగు రోజులుగా ఒంట్లో బాగోలేదని, అవాల్జిన్ బిళ్లలు వేసుకుంటూండగా చూసామని పరిసరగ్రామాల ప్రజలు అంటారు. పోలీసులను చూసి చంద్రన్న లేచి పరుగెత్తాడు. వాళ్లు వెంటబడి కాల్చారు. ఆ దెబ్బలు తగలలేదుగాని, ఎదురుగా వచ్చిన మరికొందరు పోలీసులు సూటిగా కాల్చి చంపారు. ఛాతీలో ఒకటి, నుదుటి మీద ఒకటి, రెండు దెబ్బలు మాత్రమే ఉన్నాయి.

కాలక్రమంలో ముందుకుపోతే ఈ సంవత్సరపు (1985) మొట్టమొదటి ఎన్‌కౌంటర్ జనవరి 21నాడు జగిత్యాల తాలూకా పెంబట్ల గ్రామ పంచాయితీలోని పోచంపల్లిలో జరిగింది. హతుడు కైరి గంగారాం. జగిత్యాల తాలూకాలో పోలీసులతోబాటు స్థానిక భూస్వాముల ప్రైవేట్ గూండాలయిన అఖిలభారతీయ విద్యార్థి పరిషత్ కార్యకర్తల స్వైర విహారంవల్ల పౌరహక్కుల సంస్థలేకాదు, పత్రికా విలేఖరులు సహితం విషయసేకరణ కోసం పోవడానికి సాహసించరు. కాబట్టి గంగారాం ఎన్‌కౌంటర్ విషయంలో నిజంగా ఏం జరిగిందో సంపూర్ణంగా ఎవరికీ తెలియదు. ఏది కాకున్నా ఇదొక్కటి మాత్రం నిజమయిన ఎన్‌కౌంటర్ అనీ, కావాలంటే వూళ్లో ఎవరినయినా అడగండనీ కరీంనగర్ జిల్లా పోలీసు అధికార్లు ఛాలెంజి చేస్తున్నారు. అయితే వాస్తవాలు తెలిసినంత మేరకు అనుమానాస్పదంగానే వున్నాయి. ఆ రోజు ఉదయం గంగారాం మరిముగ్గురు వ్యక్తులతో ఆ గ్రామానికి వచ్చి ఒక ఇంట్లో ఉన్నాడట. ఈ విషయం తెలిసి పోలీసులు (జగిత్యాల ఎస్.ఐ. నాయకత్వంలో) వస్తున్నారని విని ఆ ముగ్గురూ వెళ్ళిపోయారట. వెళ్ళిపోయే అవకాశంలేక గంగారాం తలుపులు బిగించుకొని ఇంట్లోనే వున్నాడట. పోలీసులు వచ్చి అతన్ని తలుపులు తీయమనీ, ఎటువంటి హానీ జరగదనీ పిల్చారట. అతను వాళ్లమాటలు నమ్మక తలుపులు తీయలేదు. అప్పుడు ఒక పోలీసు అధికారి ఇంటికప్పు మీదికి ఎక్కి, కప్పుకొంత తొలగించి, లోపలికి రివాల్వర్ గురి పెట్టి కాల్చి చంపాడట. గంగారాం కప్పుమీదికి 'ఎదురుకాల్పులు' జరిపాడో లేదో తెలీదు.

మే నెలలో ఒక్క వరసలో మరి మూడు ఎన్‌కౌంటర్‌లు జరిగాయి. పత్రికలలో వచ్చిన రిపోర్టులను బట్టి చూస్తే ఎంత సునాయాసంగా యథేచ్ఛగా చంపుతున్నారో అర్థమవుతోంది. నిజామాబాద్ జిల్లా బస్వాపూర్ గ్రామంలో మే 1 నాడు బావి దగ్గర స్నానం చేస్తున్న వాళ్ళ మీదికి పోలీసులు రావడం రావడమే కాల్పులు జరిపారు. ఇద్దరు చనిపోగా మిగిలిన వాళ్ళు ఆత్మరక్షణ కోసం పోలీసుల వైపు కాల్పులు జరిపి పారిపోయారు. లేకపోతే వాళ్ళు గూడా చనిపోయేవారే. ఒక కానిస్టేబుల్‌కు గాయం అయింది. కరీంనగర్‌జిల్లా బొమ్మిరెడ్డి పల్లిలో మే 6 నాడు అంతకంటే దారుణమయిన హత్య జరిగింది. ఒక ఇంట్లో మాట్లాడుతున్న కార్యకర్తను పట్టుకోవడం కోసం వచ్చి అతనితోపాటు ఆ యింటి యజమానిని గూడా పట్టుకొని ఇద్దరినీ ఇంటి నుండి తీసుకుపోయి కాల్చిచంపారు. మే 14 నాడు ఆదిలాబాద్ జిల్లా లోడ్‌పల్లిలో ఇంకొక ఎన్‌కౌంటర్ జరిగింది. చనిపోయింది ఇద్దరని మొదట ప్రకటించి,

తరువాత ముగ్గురని కాదు ఇద్దరేననీ అన్నారు. వాస్తవంగా ఒకేచోట ఒకే రోజు రెండు 'ఎన్‌కౌంటర్లు' జరిపారని, మొదటిసారి ఇద్దరినీ ఆ తరువాత ఒక్కరినీ చంపారని తెలుస్తోంది.

ఇప్పటి దాకా (అంటే ఈ రిపోర్టు రాసేదాకా) 14 మంది ఈ సంవత్సరం ఎన్‌కౌంటర్లలో చనిపోయారు. పోలీసుల వైపున ఎవ్వరికీ ప్రాణం పోలేదు. బస్వాపూర్‌లో గాయపడ్డ కానిస్టేబుల్ ఒక్కడికే నిజంగా గాయం అయింది. మిగిలినవి అన్నీ బూటకపు ప్రకటనలే. అన్ని సంఘటనలలోనూ సాక్షులను బెదిరించడం, అరెస్టు చేసి దాచి పెట్టడం చేస్తున్నారు. వీరభద్రారంలో చంద్రన్నను చంపిన తరువాత భద్రాచలం డి.ఎస్.పి. ఆ ప్రాంతపు గ్రామాలపై స్వయంగా దాడిచేసి కొన్ని రోజుల పాటు జనాన్ని కొట్టడం, బెదిరించడం సాగించాడు. వెంకట్రావుపేట సంఘటనకు ప్రత్యక్ష సాక్షి అయిన నాలిక రాములును ఆ రాత్రి నుండి మెజిస్ట్రీరియల్ విచారణ జరిగేనాటిదాకా దాచి వుంచారు.

ఈ 14 ఎన్‌కౌంటర్ హత్యలుకాక విప్లవోద్యమానికి సంబంధించిన మరొక 5 మందిని, నిజామాబాద్ (భూక్యాకిషన్, అమరనాథరెడ్డి), వరంగల్ (సుదర్శన్, సారంగపాణి), ఆదిలాబాద్ (సామెర్ల నాని) జిల్లాలలో 1984-85 సంవత్సరాలలో పోలీసుకస్టడీలో చంపారు. 1983 లో ముగ్గురిని ఎదురు కాల్పులలో చంపారు.

ఈ లెక్కలను బట్టి చూస్తే మరొక వెంగళరావుగా చరిత్రలో నిలిచిపోవాలన్న కోరిక మన ముఖ్యమంత్రికో హోంమంత్రికో కలిగినట్టు తోస్తోంది. కాని ఒక్క విషయం మాత్రం వాళ్ళిద్దరూ గుర్తుంచుకుంటే మంచిది. 400 మందిని చంపిన వెంగళరావు నక్సలైట్ ఉద్యమాన్ని ఆపలేకపోయాడు. అది మరింత బలం పుంజుకుంది. ప్రజలకు సమస్యలున్నంతకాలం, ఆ సమస్యలవల్ల లాభపడేవారు దేశపాలక వర్గంగా ఉన్నంత కాలం ఆ వర్గానికి ప్రాతినిధ్యం వహించే వెంగళరావులూ, రామారావులు, నాగేశ్వరరావులూ తుపాకులతో సామాజిక శాంతిని స్థాపించాలనుకోవడం కల్ల.

*సృజన - జూన్ 1985*

# 9. ఊళ్ళోకొచ్చిన 'ఎన్‌కౌంటర్'లు

కళ్లముందు కనబడ్డ దృశ్యాన్ని కాగితం మీదికి ఎక్కించే వాళ్ళం. ఇప్పుడు పత్రికలలో చదివిన వార్తను కళ్లతో ఊహించుకుంటున్నం. నర్సంపేట మెయిన్ రోడ్డులో మేనెల మండుటెండలో కుర్రవాళ్లను చొక్కాలు విప్పి కరుగుతున్న తారుమీద పొర్లించారని చదివాం. నిస్సహాయంగా ఆ దృశ్యాన్ని ఊహించుకున్నాం. మెయిన్ రోడ్డంటే బస్‌స్టాండు నుండి తాసీల్దారు ఆఫీసు మీదుగా గూడురుకో మహబూబాబాద్‌కో పోయే రోడ్డే కాబోలు. మామిడాల హరిభూషణ్ 'ఎన్‌కౌంటర్' హత్య మీద వరంగల్ అర్బన్ తాసీల్దారు - నల్లటి చింత మొద్దులాంటి మనిషి - నర్సంపేట తాసీల్దార్ ఆఫీసులో 1983 ఆగష్టునెల చివరిరోజున కాబోలు మెజిస్ట్రీరియల్ విచారణ జరిపాడు. చంపింది వర్ధన్నపేట తాలూకాలో నయితే విచారణ వరంగల్ అర్బన్ తాసీల్దారు నర్సంపేటలో జరపాల్సిన అగత్యం ఏ నిగూఢమయిన కారణాల వల్ల వచ్చిందో ఇప్పుడు జ్ఞాపకంలేదు. బహుశా ఇతరత్రా విచారణ జరపడానికి 'శాంతి భద్రతల' సమస్య ఏదో అడ్డు వచ్చే వుంటుంది. నర్సంపేటలో రాలేదని కాదు, ఎంతగా వచ్చిందంటే తాసీల్దారు ఆఫీసు మీదుగా గూడూరులో మహబూబాబాదుకో పోయే ఈ తారురోడ్డు నల్లరంగా ఖాకీ రంగా అనేంతగా వచ్చింది. బస్‌స్టాండ్ ఆవరణచుట్టూ పొర్లుదండాలు పెడుతూ ఆరోజంతా జీపు తిరిగింది. బస్సులు దిగిన వాళ్లను నఖశిఖ పర్యంతం పరీక్షించింది. రక్తబంధువులనూ పౌరహక్కుల వాళ్లనూ మాత్రమే తారురోడ్డు ఎక్కనిచ్చింది. ఇదంతా ఎందుకని విచారణ జరుపుతున్న తాసీల్దారుగారిని అడిగితే తనకు గూడ అదే సందేహం వచ్చి డి.ఎస్.పి. దొరను అడగ్గా తమరి ప్రాణరక్షణ కొరకేనని చివాట్లు పెట్టారని కించిత్ సిగ్గు చెందుతూ అంటాడు. ఎవరినుండి రక్షణ అంటే స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థుల నుండి అని తల ఇంకొంచెం దించుకొని అంటాడు. నువ్వు విచారణ జరుపుతున్న గది కిటికీలలో నుండి పోలీసులు తొంగి చూస్తున్నారు.... అదేమిటంటే, ఏదీ నాకు కనబడలేదే అంటాడు.

ఆ తారురోడ్డేనా? అదే అయివుండాలి. ఆ వూళ్లో వేరే తారురోడ్డు ఒకటి ఉన్నట్టు జ్ఞాపకం. అది బస్‌స్టాండు నుండి ఉత్తరానికి పోతుంది. పోగా పోగా జూనియర్ కళాశాల వస్తుంది. కమ్యూనిస్టు మార్క్సిస్టు (అటు పిమ్మట మార్క్సిస్టు కమ్యూనిస్టు) నాయకుడు, అటు పిమ్మటా ఇటుపిమ్మటా గూడ రాష్ట్ర శాసన సభను అలంకరించిన (లేక రాష్ట్ర శాసనసభచేత అలంకరించబడిన) ప్రజా ప్రతినిధి అయిన శ్రీ (లేక కామ్రేడ్) ఓంకార్‌గారు ఆ కాలేజీ ఆవరణలో ఒక సంవత్సరం (బహుశా అనేక సంవత్సరాలు) విద్యా సంఘ అవతరణోత్సవం (లేక అవతారం చాలించిన ఉత్సవమేమో) సందర్భంలో ఒక ఎర్రటి సాయంసంధ్య వేళ ప్రభుత్వాన్ని కాదు, నర్సంపేటలో అమలులో వున్న కల్లోలిత ప్రాంతాల చట్టాల్ని కాదు, నక్సలైట్ పార్టీలనూ - వారి రాజకీయాలనూ భీకరంగా తిట్టాడు. వాళ్లను తరిమికొట్టడానికి లేవండి లేవండని ప్రజలకు పిలుపిచ్చాడు. ప్రజలు కూర్చునే కరతాళ ధ్వనులు చేశారు.

(చేయలేదంటే అబద్ధమవుతుంది). ఇది ఆ తారురోడ్డు కావడానికి వీలులేదు. తాసీల్దారు ఆఫీసు మీదుగా గూడూరుకో మహబూబాబాదుకో పోయేదే అయివుండాలి.

ఆ తారురోడ్డు మీద కుర్రవాళ్లను చొక్కాలు విప్పి మే వెల మండుటెండలో పొర్లించారని వార్త. ఎందుకోసం పొర్లించారు? ఆరోజో ఆ తరువాతి రోజో ఆ వూళ్లో బంద్ పాటించమని రాడికల్స్ పిలుపు ఇచ్చారని. తమ కార్యకర్త గంగన్న అనబడే ఇమాంను పోలీసులు అరెస్టుచేసి చిత్రహింసలు పెట్టి చంపేసి, ఉరిపెట్టుకున్నాడనో, గుండె పగిలి చచ్చాడనో, సొరంగం తవ్వుకొని పారిపోయాడనో, ఆకస్మాత్తుగా అదృశ్యం అయిపోయాడనో అనక, ఏకంగా సికిండరాబాద్ - నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ కింద పడేసి - ఆక్సిడెంటయిపోయింది అయ్యో పాపం- అన్నారంట. అందుకు నిరసనగా రాడికల్స్ బంద్ పిలువు ఇచ్చారు. అందుకు నిరసనగా పోలీసులు వాళ్లను చొక్కాలు విప్పి ఎండలో తారురోడ్డు మీద పొర్లించారు. నిరసన తెలిపే హక్కు ఒకరికి మాత్రమే ఎందుకుండాలి? అందరికీ ఉండాలి. అంతవరకూ వరంగల్ నయమే. నిజామాబాద్ జిల్లాలో బంద్ పిలుపిస్తే పోలీసుల నిరసన 'ఎన్‌కౌంటర్ల' రూపం తీసుకుంటోంది. ఆ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ గారి వాచాలత్వం ఎంతటిదో, వారి సిబ్బంది హస్తలాఘవం అంతటిది. చేదోడు వాదోడు అంటారు, దీనినే కాబోలు.

గంగన్న అనబడే ఇమాం మీద పోలీసుల కసి ఇవాళ్టిది కాదు. రెండేళ్ల క్రితం అతనికోసం వెతుకుతూ మహబూబాబాద్‌లోని సోషల్ వెల్ఫేర్ హాస్టళ్ల మీద పడి నానా భీభత్సం చేశారు. హరిజన గిరిజన తదితర అలగా జనాన్ని పైకి తీసుకురావడానికి సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లు పెట్టామన్నారు. వాళ్లకు ఉండడానికి చదువుకోడానికీ ఇంత తినడానికి వసతి కల్పించడం మన సోషలిస్టు తరహా సమాజం కర్తవ్యం అన్నారు. ఈ తరహా ఔదార్యంతో వచ్చిన చిక్కేమిటంటే ఆశించేది ఒకటయితే ఒరిగేది ఇంకొకటి. అలగా జనానికి చెందిన యువకులంతా హాస్టళ్ళలో చేరతారు. విడివిడిగా వుంటే రాని ఆలోచనలు కలిసి వుంటే వస్తాయి. అక్షరాస్యత అబ్బిన తరువాత చదువుకోమన్న పుస్తకాలు మాత్రమే చదువుకోరు. ఏవేవో చదువుతారు. బూతుసినిమా పాటలు పాడుకోండని సినిమా పాటల పుస్తకాలు పేవ్‌మెంట్ల మీద పావలాకూ అర్ధకూ బహిరంగంగా అమ్ముతుంటే అవి కొనుక్కోక ఎక్కడినుండో రహస్యంగా వేరే పాటల పుస్తకాలు కొనుక్కొచ్చి అవి పాడుకుంటారు. సోషలిస్టు తరహా ఆదర్శాలకు పోతే చాప కిందికి నీరొచ్చేటట్టుందని ఈ సోషల్ వెల్ఫేర్ హాస్టళ్ల మీద ఒక కన్ను వేసి ఉంచమని ప్రభుత్వం తన పోలీసు శాఖకు ఆదేశం యిచ్చింది. గత రెండు మూడేళ్లలో తెలంగాణ జిల్లాలలో లెక్కలేనన్ని సోషల్ వెల్ఫేర్ హాస్టళ్ల మీద దాడులు చేసి పెట్టెలూ బట్టలూ బయటకు లాగి కుర్రవాళ్ళను కొట్టి అరెస్టు చేసారు. మాంత్రికుడి గుహలాగ రహస్య మందిరాలతో సొరంగాలతో బయటకు కనిపించే దానికన్న పదిరెట్లుండే పోలీసు శాఖలో ఎక్కడో ఒకమూల సోషల్ వెల్ఫేర్ హాస్టళ్ల కోసం ఒక ఆఫీసర్ ఆన్‌స్పెషల్ డ్యూటీ (ఎంత చక్కటి అనిశ్చితమయిన నామధేయం) ఉన్నాడని గట్టి అనుమానం.

ఆనాడు గంగన్నకు అన్నం పెడుతున్నారని మహబూబాబాద్‌లోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్లమీద పోలీసులు దాడిచేసి కుర్రవాళ్ళనందరినీ కొట్టి తరిమేసారనీ వాళ్లంతా అక్కడా యిక్కడా తలదాచుకున్నారనీ తెలిపి, మహబూబాబాద్ పోయి తీరాలని డాక్టర్ రామనాథం గారు పట్టు బట్టారు. అక్కడికి పోయి మాట్లాడిన తరువాత మహబూబాబాద్‌లోనే కాదు, బలపాల గ్రామంలో గూడ హాస్టల్ ఖాళీ చేయించారనీ - కుర్రవాళ్ల వేకాదు, వార్డెన్‌నూ వంట వాడినీ సహితం అరెస్టు చేసారనీ తెలిసింది. చీకటయినా సరే, వూళ్లో పోలీసు క్యాంపు ఉన్నాసరే బలపాలకు పోయి తీరాలని డాక్టరు రామనాధంగారు ఆరాటపడ్డారు.

బలపాల అంటే మేళ్లచెరువు నాగేశ్వరరావు ఊరు. మేళ్ళచెరువు నాగేశ్వరరావు ఇప్పుడు లేడు. 1986 నవంబర్‌కు అతను చనిపోయి అయిదు సంవత్సరాలు అవుతుంది. అతను ఎవరో తెలుసుకోవాలంటే మీరు మహబూబాబాదులో బహిరంగంగా అడిగితే చెప్పరు. కోళ్ళూ గొర్రెలూ దొంగిలించి మానుకోట మున్సిఫ్ కోర్టునుండి వరంగల్‌కు రిమాండుకు వచ్చిన లంబాడాలను జైలులో అడిగితే చెప్తారు. మనదేశంలో అన్ని విషయాలూ స్వేచ్ఛగా మాట్లాడుకోగలిగేది జైళ్లలోనే. బయట కొన్ని విషయాలు మాత్రమే మాట్లాడుకోగలం. మేళ్ల చెరువు నాగేశ్వరరావు ఎవరంటే వాళ్ళు ఒక్కమాటే చెబుతారు. ఆప్రాంతాన్ని ఇప్పటికీ ఏకచ్ఛత్రంగా ఏలుతున్న డోర్నకల్ దేశముఖ్‌లకు ఇద్దరే ఇద్దరంటే గుండెబెదురు. వాళ్లలో ఒకరు మేళ్ళచెరువు నాగేశ్వరరావు. (రెండవ వ్యక్తి ఇప్పటికింకా బతికే వున్నాడు కాబట్టి అతని పేరు చెప్పడం - జైలు బయట - శ్రేయస్కరం కాదు) 1981 నవంబర్‌లో మహబూబాబాద్ సి.ఐ. అతన్ని అరెస్టుచేసి పంచాయితీ సమితి వైస్ - ప్రెసిడెంట్ అమృత రెడ్డికి అప్పగించి వంపించాడు. అమృతరెడ్డి ఈ హత్య 'ఆత్మరక్షణార్థం' చేసాడని వరంగల్ ఎస్.పి. తానే కోర్టయి తీర్పు ప్రకటించాడు. ఆ మహానుభావుడు తదుపరి తిరుపతికి పోయి వెంకన్నకు తలవెంట్రుకలు మొత్తం, నగదుకొంచెం అర్పించుకున్నాడు. సి.ఐ.కి గూడా 30 వేలు నగదు ముట్టిందని అంటారు. ఇంటిలిజెన్స్‌లో వున్న కారణంగా ఇటువంటి ఆదాయానికి నోచుకొని ఒక ఎస్.ఐ. మాత్రం అటూ యిటూ చూసి ఇంకా చాలా ఎక్కువే ముట్టింది సార్ అని కసిగా రహస్యం చెప్తాడు, ఎంత కచ్చ అనుకొన్నా ఇంటిలిజెన్స్ వారు కాబట్టి నిజమే అయివుండాలి.

ఈ పాత విషయాలు ఇప్పుడెందుకంటే అదే అమృతరెడ్డి గత సంవత్సరం ఇంకొకసారి పుణ్యం కట్టుకున్నాడని అంటారు. భూపతిరెడ్డి, సారయ్య అనే యిద్దరు యువకులను గత సంవత్సరం మేనెల 26 రాత్రి వరంగల్ పట్టణంలోని వాళ్ళ వకీలు యింట్లో నుండి తీసుకుపోయి 54 కిలోమీటర్ల దూరంలోవున్న నర్సాపూర్ గ్రామం శివార్లలోని బంజర్లలో ఒక వొర్రెకు అవతల నిలబెట్టి పోలీసులు ఇవతల నిలబడి కాల్చి పారేసారు. ఇది గూడ అమృతరెడ్డి చలవేనని వినికిడి. నర్సాపూర్ దాకా ఎందుకు తీసుకుపోయారు. వాళ్ల వకీలు యింటికి పర్లాంగు దూరంలో వున్న హంటర్ రోడ్డు మీద కాల్చి పారేయలేక పోయారా అని ఆరోజు ఎవ్వరికీ తోచలేదు. ఇవ్వాళ ఆ సందేహం వస్తోంది. ఎలాగూ చంపేదానికి 54 కిలోమీటర్లు పెట్రోల్ దండగ ఎందుకు? అనాటికింకా, 'ఎన్‌కౌంటర్లు' చేయడం

తప్పుకాదుగాని అడవిలోనో అడవి అనిపించుకోగల చోటనో చేయాలని పోలీసులలో ఒక అపోహ ఉండేది. వరంగల్ పట్టణం వదిలి ఉత్తర దిక్కుగా గోదావరి వైపు పోతే ములుగు తాలూకా కేంద్రం చేరేపరికి గోదావరి లోయ అడవి కొద్దికొద్దిగా ప్రారంభం అవుతుంది. రహదారి వదిలి 8 కిలో మీటర్లు పడమటికి పోతే నర్సాపూర్ గ్రామం తగులుతుంది. ఆ గ్రామం బంజర్లను మసక చీకట్లో అడవి అనుకోవచ్చును. అందుకే కాబోలు కాల్చడానికి అక్కడిదాకా తీసుకపోయారు. ఈ 'ఎన్‌కౌంటర్' విషయంలో ప్రభుత్వం వ్యవహరించినతీరు వరంగల్ పోలీసులకు కనువిప్పు కలిగించినట్టుంది. ఇది ఎన్‌కౌంటర్ కాదని, హత్య అనీ, ఎన్నో సాక్ష్యాలున్నా అవన్నీ మెజిస్టీరియల్ విచారణలో రికార్డయినా, కలెక్టర్ తన నివేదికలో ఆ విషయమే చెప్పినా, కలెక్టరు ఇంట్లో ప్రతిరోజూ ఎ.పి.సియల్.సి. బాధ్యులు భోజనం చేస్తారని ఆరోపించి ఆయనను హైదరాబాద్‌కు, విచారణ జరిపిన పర్కాల సబ్‌కలెక్టర్ 'తీవ్రవాదుల' సానుభూతిపరుడని ఆరోపించి ఆయనను గుంటూరుకు బదిలీచేసి, విచారణ అక్రమంగా జరిగిందని సుప్రీం కోర్టుకు తెలిపి నివేదికను ఉపసంహరించుకొని కొత్త విచారణ జరిపించింది ప్రభుత్వం.

పై నుండి ఇంతటి చేయూత వచ్చేసరికి వరంగల్ పోలీసుల అపోహలు పటాపంచలయినట్టున్నాయి. తమకు ప్రభువులు ఇచ్చిన లైసెన్సుకు స్థల వివక్ష లేదని వాళ్ళకు అర్థమయింది. బహుశా, పట్టణం నడిబొడ్డున కాల్చేస్తే హోం మంత్రిగారు పరాక్రమ ప్రదర్శనకు యిచ్చే నగదు బహుమతి ఇంకింత ఎక్కువ ఇస్తున్నారేమో - ఎవరికి తెలుసు. అందుకే ఈ సంవత్సరం వరంగల్ పోలీసులు తాము చంపదల్చుకున్న వాళ్ళను పట్టణంలోని హంటర్ రోడ్డు మీదనే కాల్చేస్తున్నారు. రేపు చౌరస్తాలోనే కాల్చేస్తారేమో - అది మాత్రం ఎవరికి తెలుసు.

హంటర్ రోడ్డు మీద 1986 మే 20 రాత్రి ఇద్దరినీ సెప్టెంబర్ 6 రాత్రి ఇద్దరినీ మొత్తం నలుగురిని కాల్చిపారేసారు - హంటర్ రోడ్డు మీద కాల్చేసారు అనేకంటే హంటర్ రోడ్డు మీద కాల్చామన్నారు అనాలేమో బహుశా. వాళ్ళను నిజంగా ఎక్కడ కాల్చిందీ తెలీదు. మొదటి ఇద్దరినీ రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీ ఆవరణలో కాల్చేసారని ఊళ్ళో పుకారు. బయటి వాళ్ళకు ఇదివింతగా అనిపిస్తుందేమో - మద్రాసు ఐ.ఐ.టి ఆవరణలో 'ఎన్‌కౌంటర్' ఊహించుకోగలమా? - కాని వరంగల్‌తో పరిచయం ఉన్న వాళ్ళకు అర్థవంతంగా వుంటుంది. ఆర్.ఇ.సి మీద పోలీసుల కోపం ఇవాల్టిదికాదు. ఎమర్జెన్సీకి పూర్వం నుండి కూడ 'తీవ్రవాదులస్థావరం' అనిపించుకున్న ఆర్.ఇ.సి అంటే వాళ్ళకు కన్నెర్ర. అప్పటి కాజీపేట ఎస్.ఐ రాక్షస విగ్రహం ఆర్.ఇ.సి విద్యార్థులందరికీ చిరపరిచితం. ఎమర్జెన్సీ ప్రకటన అర్థం ఏమిటో ప్రకటించిన వారం రోజులకే ప్రపంచానికి తెలియ జేసిన గిరాయిపల్లి 'ఎన్‌కౌంటర్' మృతులలో ముఖ్యుడు సూరపనేని జనార్ధన్ ఆర్.ఇ.సి విద్యార్థి. కాలేజీ జరుగుతున్నంతసేపూ హాస్టల్ ఆవరణలో తాటి చెట్లకింద కూర్చుని వచ్చేపోయే మెస్ వర్కర్లతో పిచ్చాపాటితో మొదలు పెట్టి రాజకీయాలదాకా మాట్లాడే జనార్ధన్ విగ్రహం అక్కడ చదువుకున్న వాళ్ళందరికీ పరిచయమే. ఆ వారసత్వమేమో, పోను పోను పోలీసులకు ఆర్.ఇ.సి

విద్యార్థులతో సమంగా మెస్ కార్మికులమీద దృష్టి పడింది. వాళ్ళు విప్లవపార్టీల పక్షపత్రికలూ పాటల పుస్తకాలూ కూడ బలుక్కొని చదువుతూ ఓనమాలు దిద్దుకున్నారు. వాళ్ళకు అక్షరజ్ఞానం రాజకీయాలతో వచ్చింది. ఎన్నడూ ఆఆలు నేర్చుకోవాలని తపన చెందని వాళ్ళు, అవి రాకపోతే పాటల పుస్తకాలు చదవలేం అన్న ఆరాటంతో అక్షరాస్యులయ్యారు.

మొదటినుండీ ఈ కారణాల వల్ల పోలీసులకు ఆర్.ఇ.సి అంటే పీకలదాకా కోపం. తమకు విచ్చలవిడిగా ప్రవేశించడానికి అనుమతి ఇవ్వలేదని ఆర్.ఇ.సి ప్రిన్సిపాల్ మీద గూడ కోపం. ఆయనను లొంగదీసుకోవడం కోపం పోలీసులు ఆయనకు 'నక్సలైట్' అని పేరుపెట్టగా రాష్ట్రీయ స్వయం సేవక సంఘం వారు దాన్ని దేశమంతటా దండోరా వేసి తమవంతు కర్తవ్యం నిర్వహించారు. ఇరువైపుల మండీ జరుగుతున్న ఈ దాడిని తట్టుకోవడం ఆయనకు వశంకాక, గత సంవత్సరం నుండి ఆర్.ఇ.సి ఆవరణలోకి పోలీసులు యధేచ్ఛగా ప్రవేశించడం మొదలయింది. కొంత కాలం పోలీసులు క్యాంపు పెట్టారు. సమ్మెచేస్తున్న విద్యార్థులను తరిమి కొట్టారు. సెప్టెంబర్ తరువాత ఈ భీభత్సం తీవ్రస్థాయిని అందుకుంది. క్లాసురూంలలోని అత్యాధునిక సాంకేతిక విద్యాబోధనకు బయట వరండాలో పచార్లు చేస్తున్న తుపాకుల పదఘట్టన బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్ అయింది. అటువంటి కళాశాల ఆవరణలో 'ఎన్‌కౌంటర్' ఒకవేళ నిజంగానే జరిగినా ఆశ్చర్యం ఏముంది?

చనిపోయిన యువకుల పేర్లు నాగేశ్వరరావు, రామకృష్ణ. నాగేశ్వరరావును కాజీపేటలో 20 మే 1986 సాయంత్రం 7 గంటలకు, రామకృష్ణను వరంగల్‌లో అదే రాత్రి 11 గంటలకు అరెస్టుచేసి అర్ధరాత్రి కాల్చేసారు. నిలబెట్టి గురి చూసి కాల్చేసారనడానికి చిహ్నంగా, వాళ్ళశరీరంలో ఒకదాని పక్కన ఒకటి ఎనిమిది బుల్లెట్లు తుంటి భాగం నుండి ఎద దాకా వున్నాయని శవ పరీక్ష అనంతరం మృతదేహాలను దహనం కోసం తీసుకు పోయిన బంధువులు అంటున్నారు.

ఇద్దరి వయస్సూ 25 లోపే. ఇద్దరూ చదువులలో తెలివయిన వాళ్ళే, చురుకయినవాళ్ళే. జీవితంలో పైకి పోవడమేధ్యేయం అయివుంటే సునాయాసంగా సాధించ గలిగే వాళ్ళే. కళ్ళముందు లేని మనిషిని గుర్తుచేసుకుంటే ముఖం ఫోటో లాగ గుర్తుకు రాదు. ఏదో ఒక ప్రముఖ లక్షణం మాత్రం జ్ఞాపకం వస్తుంది. నాగేశ్వరరావును తలచుకుంటే కళ్ళలోని చురుకుదనమే గుర్తుకొస్తుంది. కళ్ళలోనూ మాటలలోనూ చాలా పదును ఉండేది. తమను తాము పెద్దలుగా భావించే వాళ్ళకు అది తిరస్కారంగా కూడ అనిపించేది. రామకృష్ణ పూర్తిగా సౌమ్యుడు. 'ఇతను రాడికల్ ఎట్లాగయ్యాడు' అనిపించే వ్యక్తి. ఇతనే రాడికల్ అయితే రాడికల్స్ 'మంచి వాళ్ళే' అయివుండాలి అని అతనికి వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో పాఠాలు చెప్పిన ఒక అమాయకపు పంతులు ఒకసారి అన్నాడు. పోలీసుల కళ్ళకు ఆ మంచితనం కనిపించినట్టు లేదు.

వీళ్లను చంపిన మూడున్నర నెలలకు, సెప్టెంబరు 6 నాడు, అదే హంటర్ రోడ్డు మీద ఇంకొక యిద్దరిని చంపినట్టు పోలీసులు గర్వంగా ప్రకటించుకున్నారు. శ్యాంప్రసాద్ ఆర్.ఇ.సి విద్యార్థి. ఒక సారి చూస్తే మళ్లీ చూడాలనిపించే స్ఫురద్రూపం. తెలివయినవాడు,

నెమ్మదస్తుడు. శ్రీనివాస్ చదువు ముగించుకొని స్వగ్రామంలో ఉంటున్న యువకుడు. శ్యాంప్రసాద్‌తోబాటు దొరికాడని శ్రీనివాస్‌ను చంపారేగాని లేకుంటే అతన్ని చంపాల్సిన 'అవసరం' పోలీసులకు ఎంత మాత్రం లేదు. వీళ్లను చంపింది పద్మాక్షమ్మ గుట్ట కింద శాయం పేట చౌరస్తా దగ్గరున్న పాడుబడ్డ శివాలయం వద్దవంట. ఈ గుట్టకు చాలా చరిత్ర వుంది. పద్మాక్షమ్మ పేరిటే ఆవూరికి 'అమ్మకొండ' అని పేరు వచ్చింది. అది ముస్లింల నోట్లో హన్మకొండ అయి తిరిగి హైందవీకరణ చెందినప్పుడు హనుమ కొండ అయింది. ఇది పాత చరిత్ర కాగా, 1983లో వరంగల్ పోలీసులు ఆ అమ్మ మీద పేలుడు పదార్థాల చట్టం కింద కేసు పెట్టినంత పనిచేసి చరిత్రను తిరగ రాశారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ సాయంకళాశాలలో పరీక్షలు జరుగుతున్నప్పుడు దాడి చేసి ఆవరణలోనూ వరండాలోనూ ఉన్న విద్యార్థులను రూముల లోనికి తరిమి తరిమి కొట్టారు. అడిగేవాడెవడులే అనుకున్నారు. అయితే ఆకాలేజీ అధ్యాపకులు నిరసన తెలపడమేకాక యూనివర్శిటీ అధ్యాపకులు 197 మంది నిరసన పత్రం మీద సంతకం పెట్టే సరికి సర్దుకొని, ఆ కాలేజీ విద్యార్థులు ఆరుగురు పద్మాక్షమ్మ గుట్ట దగ్గర బాంబుల ప్యాక్టరీ నడుపుతున్నారనీ అంత ప్రమాదకరమయిన విద్యార్థులను వెనకేసుకు రావడం తమకు శ్రేయస్కరం కాదనీ కలెక్టరు మరియు జిల్లా మేజిస్ట్రేటయిన జవహరి స్వయంగా పంతుళ్లను బెదిరించాడు. పద్మాక్షమ్మకు ఈ సంగతి తెలిసి గూడ పోలీసులకు ఫిర్యాదు ఇవ్వనందుకు ఆమెను గూడ అవెట్‌మెంట్ ఛార్జి కింద ఇరికిస్తారేమోనని ప్రజలు ఉత్సుకతతో ఎదురు చూశారు. కాని పేలుడు పదార్థాల చట్టం కింద కేసు పెట్టడానికి అనుమతి ఇయ్యవలసిన కలెక్టరు తన పహజ ఛాందపత్యం వల్ల భయపడ్డట్టున్నాడు. ఇప్పుడు ఆ అమ్మను తప్పుడు ఎన్‌కౌంటర్‌కు గుడ్డి సాక్షిని చేశారు. ఆ వూరికి గ్రామదేవత అయిన పాపావికి ఆ దౌర్భాగ్యురాలు ఇంకా ఏమేం చూడాల్సి వుందో!

తమ విద్యార్థులను కొట్టినపుడు కాలేజీ లెక్చరర్లు నిరపన తెలుపడం పోలీసులకు నచ్చలేదు. అదే పంవత్సరం మరొక సారి - ఈసారి కాలేజీలో - అటువంటి లాఠీ ఛార్జియే జరిగినప్పుడు మళ్లీ మొత్తం యూనివర్శిటీ సిబ్బంది అలజడి చేశారు. నాలుగు రోజులు సమ్మె చేశారు. కెమిస్ట్రీ ప్రయోగశాల 'ఆకస్మాత్తుగా' తగలబడిన తరువాత విరమించుకున్నారు. అప్పటికోపం పోలీసులకు పోనేలేదు. ఒక కాకతీయ విశ్వవిద్యాలయం అధ్యాపకులే కాదు, అసలు బుద్ధి జీవులంటేనే వాళ్లకు కోపం. హక్కుల గురించీ పోరాటాల గురించీ సమస్యలగురించీ మాట్లాడతారని వ్యతిరేకత. వివేచన మొదలయిన ఉత్తర క్షణం తమ తుపాకులకు ఆదరణ పోతుందని వాళ్ళకు తెలుసు. ప్రజలకు సమస్యలుంటాయనీ సమస్యల నుండి అలజడి పుడుతుందనీ ఎప్పుడయినా ఒక పోలీస్ అధికారితో మాట్లాడి చూడండి.... అసహనంతో అతని కళ్ళు ఎంత వేగంగా తుపాకీ గుళ్ల లాగ అసహ్యంగా తయారవుతాయో గమనిస్తే ఆశ్చర్యపోతారు.

డాక్టర్ రామనాథం గారిని చంపిన తరువాత ఈ కోపం పలురూపాలలో తీర్చుకున్నారు. ప్రజా ఉద్యమాలకు మద్దతు ఇచ్చిన వాళ్లనూ, పౌర హక్కుల ఉద్యమంలో పనిచేసిన వాళ్లనూ ఒక్కరిని గూడ మినహాయించకుండ దాడికి గురిచేశారు. కొందరిని పోలీస్ స్టేషన్‌కు

పిలిచి బెదిరించి వదిలి పెట్టారు. కొందరిని కొట్టి పంపించారు. కొందరికి బంధువులద్వారా బెదిరింపు సందేశాలు పంపించారు. కొందరిని అరెస్టుచేసి జైలుకు పంపారు. కాకతీయ యూనివర్సిటీ లెక్చరర్ సీతారామరావునయితే ఇంటి మీద దాడిచేసి కాళ్లు చేతులూ విరగ్గొట్టారు.

గతంలో నోరు మెదిపినందుకు కక్ష మాత్రమే కాదు, ఇక ఎవ్వరూ నోరు మెదపకూడదని గూడ వాళ్ళ ఉద్దేశ్యం. ప్రజాస్వామిక హక్కుల పట్ల పోలీసుల అసహనం ఎక్కడి దాకా వచ్చిందంటే ఉద్యమాలూ ఊరేగింపులూ అటుంచి, జనం తమ దైనందిన జీవితాన్ని కూడ ఎంత మాత్రం సద్దు వినబడకుండ గడుపుకోవాలి. ఎక్కడా కొంచెంగూడ 'అశాంతి' కనబడకూడదు. పేవ్‌మెంట్ దిగి నడవకూడదు; రాత్రిపూట జనసంచారం కనబడకూడదు; ముక్కుకు సూటిగా తప్ప పక్కకు చూద్దామన్న కుతూహలం కలగకూడదు; ఏం జరిగినా 'ఎందుకు' అని అడగకూడదు; తమకు దొరికిన దాని కంటే వీసమెత్తుకూడ ఎక్కువ కావాలని కోరుకోకూడదు. ఎమర్జెన్సీ మార్షల్‌లా ప్రకటనలు లేకుండ పోలీసు ఠాణాల నుండి ఫాసిజం నీళ్లూరినట్టు ఊరుతోంది. ఎక్కడి నుండో వరద వచ్చి ముంచేస్తుందని ఎన్నికల రాజకీయ పరిశీలకులు మీనమేషాలు లెక్కగడుతున్నారుగాని ఇప్పటికే ఈ ఊటతో నేలంతా తడిసి బురదయి ప్రజాస్వామ్యానికి కాళ్ళు దిగబడ్డాయి. ఊట మోకాలిలోతయ్యే దాకా మన ప్రజాస్వామ్యానికి సంరక్షకులకు తడి తెలియదు కాబోలు - అప్పుడు తెలిసి మాత్రం ఏం ప్రయోజనం గనక.

మార్చినెల 21 తేదీన పసర గ్రామంలో ఒక అమానుషమయిన ఉదంతం జరిగింది. గోదావరిలోయ అడవిని ఆనుకొని ఉండే పసర మీద పోలీసు పహరా భూతపు భయం ఒక దశాబ్ద కాలంగా ఉంటూ వస్తోంది. ఆ వూరికి చెందిన రాజు అనే యువకుడు కుర్రచేష్టగా తన క్లాస్‌మేట్‌కు 'ప్రేమలేఖ' రాసాడంట. ఆ అమ్మాయి తండ్రి ఆ విషయం ఎస్.ఐ దృష్టికి తేగా, ఈ మాత్రం చిలిపితనం గూడ ఆయనకు సహించ రానిదనిపించి రాజును పట్టుకొని లాకప్పులో వేసి విపరీతంగా కొట్టాడు. తప్పుడు కేసులో ఇరికిస్తానని బెదిరించి వదిలి పెట్టాడు. రాజు అవమానభారంతో ఆ సాయంకాలం ఊరిబయట చింత చెట్టుకు ఉరిపెట్టుకొని చనిపోయాడు. ఊరి జనమంతా కోపంగా పోలీస్ స్టేషన్ దగ్గర గుమిగూడగా తమప్రాణానికి అపాయం అనిపించి పోలీసులు కాల్పులు జరిపి ఖ్వాజా అవే ప్రేక్షకుడిని చంపేశారు. ములుగులో ఉండే ఒక స్కూలు టీచరు ఈ వాస్తవాలను ఎ.పి.సి.ఎల్.సి దృష్టికి తీసుకొచ్చినందుకు ఆయనను పోలీసులు అరెస్టుచేసి 'వార్త ఎందుకు పంపావు' అని తిట్టి, కొట్టి, నాలుగయిదురోజుల అక్రమ నిర్భంధం తరువాత సెక్యూరిటీ ప్రొసీడింగ్స్ కింద జైలుకు పంపారు. అతన్ని ఉద్యోగం నుండి గూడ సస్పెండ్ చేయించారు.

ఎవ్వరూ ఎంత చిన్న 'అశాంతి'కి సహితం పాల్పడకూడదు. చిత్రహింసలు పెట్టి తప్పుడు కేసులలో ఇరికిస్తారు. దానిని ఎవ్వరూ ప్రశ్నించకూడదు. కాల్చిపారేస్తారు. దానిని ఎవ్వరూ పత్రికలకు చేరవేయకూడదు. స్కూలు టీచరయినా ప్రొఫెసరే అయినా అరెస్టు చేసి కొట్టి జైలుకుపంపుతారు.

అధ్యాపకుల గతీ మేధావుల గతీ ఇట్లా గుంటే ఇక జనం సంగతి చెప్పనక్కర లేదు. దేశమంతటా అంతేనంటారేమో కాని ఒక తేడా ఏమిటంటే ఏ విజయవాడలోను విశాఖ పట్నంలోనో జరిగితే అందరూ 'అత్యాచారం'గా గుర్తించేది, జవగామలోను ఏటూరు నాగారంలోను జరిగితే 'తీవ్రవాదుల సమస్య' అవుతుంది. ఈ సంవత్సరం ఫిబ్రవరి 3వ తేదీన విజయవాడలో నలుగురు అమ్మాయిలకు పోలీసులు శిరోముండనం చేసిన ఉదంతం రాష్ట్ర వ్యాపితంగా అలజడికి దారితీస్తుంది. అయితే వరంగల్ జిల్లా గోదావరి అడవిలోని నాగారం గ్రామంలో 40 మందికి పోలీసులు గుండు చేయిస్తే అది వార్త సహితం కాలేదు - నిరసన సంగతీ అలజడి సంగతీ అడగకండి. లాకప్పు మరణాల గురించి - అవి విజయవాడలోనూ హైదరాబాద్‌లోనూ జరిగితే - భారతీయ జనతా పార్టీ సహితం ధర్నాలు నిరాహారదీక్షలు జరుపుతుందిగాని ఏటూర్ నాగారం అడవిని అనుకుని కరీంనగర్ జిల్లాలో వున్న మహదేవ్‌పూర్ అడవిలో పోలీసుదాడులలో కొట్టిన దెబ్బలకు నిమ్మగూడెంకు చెందిన ఒక పురుషుడు, ఒక స్త్రీ, వేమన పల్లెకు చెందిన ఒక పురుషుడు చనిపోయారని వార్తవస్తే ధర్నాలు అటుంచి బహుశా 'అంతేనా?' అని అడుగుతారేమో! ఏటూర్ నాగారం అడవి నుండి దక్షిణాన మెట్టతాలూకాల దాకా అసంఖ్యాకంగా పోలీసు క్యాంపులు పెట్టి జవాన్ని మూకుమ్మడిగా తన్ని కొట్టి 'రోకలిబండలూ' 'విమానాలూ' ఎక్కించి రాక్షసంగా హింసిస్తూంటే అది గూడ వార్త కాలేదు. రాడికల్స్ బంద్ పిలుపు ఇచ్చినప్పుడల్లా వాళ్లనూ, వాళ్ళతో సంబంధాలున్న వాళ్ళనూ, సంబంధాలు ఒకప్పుడుండి వదులుకున్న వాళ్ళనూ - అందరినీ గుంపులుగా తోలుకొచ్చి చొక్కాలు విప్పి వీపుకు పోస్టర్లు అంటించి అసభ్యకరమయిన నినాదాలు ఇప్పిస్తూ పట్టణం నడిబజార్లో ఊరేగించినా, లేక బజార్లో సదుకోబెట్టి లాఠీలతో బాదుతూ పోర్లించినా, బజారులోని రంగు రంగుల దుకాణాలు అద్దాలకళ్ళతో గుడ్లప్పగించి చూస్తాయే తప్ప వాటి వ్యాపారం వ్యవహారం ఒక కనురెప్పపాటు గూడ విలపవు.

ఇంత మౌనంగా అన్యాయాన్ని సహించే ప్రపంచం అంటే పోలీసులకు ఏవగింపు కాకపోతే గౌరవం ఏర్పడుతుందా? తమకు లొంగి పడివుండే వాళ్ళను అసహ్యించు కున్నంతగా పోలీసులు తమను ఎదిరించే వాళ్ళను అసహ్యించుకోరు. పిరికి తనం పోలీసు యంత్రాంగం సహజ లక్షణం. పిరికివాడు తనకు అణిగి మణిగి పడివుండే వాడిని పురుగుతో సమంగా ఏవగించుకుంటాడు. బలహీనుడిని గౌరవించడానికి కొంత ఉదాత్తత కావాలి. ఈ విషయం పోలీసు ఇన్‌ఫార్మర్లకూ కిరాయిసాక్షులనూ వృత్తి పంచ్‌లనూ అడిగితే చెబుతారు. వాళ్ళను పోలీసులు ఎంతగా వాడుకుంటారో అంతగా ఏహ్యాభావంతో చూస్తారు. ఇప్పుడు - ముఖ్యంగా వరంగల్ కరీంనగర్ జిల్లాలలో - నిరసన తెలుపవలసి వుండి భయంతో అవకాశవాదంతో నోరుమూసుకున్న తెల్లబట్టల ప్రపంచం అంతా పోలీసులకు ఇన్‌ఫార్మర్లంత చులకనగా కనబడుతున్నారు. వకీళ్ళనూ మేజిస్ట్రేట్లనూ ప్రొఫెసర్లనూ వాళ్ళు డాఫర్లను చూసినట్టు చూస్తున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో సెమినార్ జరిగితే ఆహ్వానితుల ఫొటోలు తమకు ఇవ్వాలనీ, ఆర్.ఇ.సి.లో అధ్యాపకుల ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు జరిగితే అభ్యర్థుల జాబితా తమకు చూపాలనీ డిమాండు చేసి సాధించుకున్నారు. వకీళ్లు

ఏ కేసులు చేయవచ్చునో ఏవి చేయకూడదో నిర్ణయిస్తున్నారు. చేయకూడని కేసులు చేసేవాళ్లను ఊరి నుండి తరిమి వేస్తున్నారు. కోర్టులు బెయిలు మీద ఎవరిని విడుదల చేయవచ్చునో ఎవరిని చేయకూడదో నిర్ణయిస్తున్నారు. విడుదల చేయకూడని వాళ్లను చేస్తే జైలు బయటేఅరెస్టు చేసి మళ్ళీ లోపల పడేస్తున్నారు. విలేఖరులు ఏ వార్తలు పంపవచ్చునో, ఇళ్లు గల వాళ్ళు ఎవరికి అద్దెకు ఈయవచ్చునో, ప్రెస్‌లు ఏ కరపత్రాలు వేయవచ్చునో, ఏ పుస్తకాలు ప్రచురించవచ్చునో ఇంకా అసంఖ్యాకమయిన విషయాలు పోలీసులు నిర్ణయిస్తున్నారు.

ఈ నూతన కర్తవ్యాన్ని నిర్వహించే పోలీసులు పాత పోలీసులు కారు. ఖాకీ బట్టలు, 303 రైఫిళ్ళు, బెల్టు ఆపలేని పొట్టలు, ఎన్నటికీ రాబోని ప్రమోషన్ గురించి ఆలోచనలు - ఇవన్నీ పోయాయి. ఈ సరంజామా జేబు దొంగలనూ వ్యభిచారులనూ పట్టుకోవడానికి సరిపోతుంది గాని రాజ్యం ఏలడానికి సరిపోదు. అందుకు వేరేరకం పోలీసులు కావాలి. వీళ్ళను చూడాలంటే ఏదయినా ఒక సాయంకాలం వేళ జిల్లా లేక తాలూకా కేంద్రం నుండి షికారుకు బయలు దేరుతుండగా చూడాలి. వీళ్లకు వేరపరిశోధనలో నైపుణ్యం కంటె కండబలం ముఖ్యం. తెల్ల బట్టలు, నంబర్ ప్లేటు లేని జీపులు, ఆటోమాటిక్ తుపాకులు, హత్యలు చేస్తే పారితోషికాలూ వీళ్ళకు ప్రభుత్వం కల్పించే ప్రత్యేక సదుపాయాలు. ఏ ప్రత్యేక సదుపాయాలూ లేకుండావే విరివిగా హత్యలు చేసే మన పోలీసు యంత్రాంగానికి ఇన్ని సదుపాయాలు కల్పిస్తే ఆగుతారా? కేవలం 'నక్సలైట్ల'నే కాదు, ఎవరి మీద ఏ కొంచెం అనుమానం వచ్చినా చంపుతారు. 1986 జనవరి 3న తేదీన కాబోలు గూడూరు అడవిలోని ఊట్ల మట్వాడ అవుట్ పోస్టు పక్క నుండి పోతున్న ఇద్దరు యువకులను చూసి ఆగమని పోలీసులు హెచ్చరిస్తే, వాళ్ళు ఆగకుండ ఇంకింత వేగంగా నడిచారట. ఇకవేం నక్సలైట్లే అయివుండాలని తరిమి వెనక నుండి కాల్పులు జరిపి ఆ యిద్దరిలో నర్సయ్య అనే ఒక వ్యక్తిని చంపేశారు. అతన్ని 'గుర్తు తెలియని నక్సలైట్'గా చలామణి చేయడం సాధ్యంకాక, 'తప్పయిపోయింద'ని జిల్లా ఎస్.పి. ఒప్పుకున్నాడు. చంపడం కాదు తప్పు, నక్సలైట్ కాని వాణ్ని చంపడం తప్పు అయివుంటే చంపిన జవానుకు బహుమానం పదివేలో ఇరవయివేలో వసంతనాగేశ్వరరావు స్వయంగా ఇచ్చి వుండేవాడు. కాకపోవడం వల్ల అతను సస్పెండ్ అయి, నర్సయ్య కుటుంబానికి రెండువేలు నష్టపరిహారం ఇచ్చారు.

ఇవ్వాళ వరంగల్‌ను చూస్తే దక్షిణ అమెరికాలో సైనిక పాలన కింద వున్న దేశాలు గుర్తుకొస్తాయి. ప్రపంచంలోకల్లా అతి పెద్ద ప్రజాస్వామ్యంలో ఇది ఒక చెప్పుకోదగ్గ పట్టణం అనీ, వెయ్యి సంవత్సరాల నాగరికతను చూసిన వూరనీ అంటే ఎవ్వరూ నమ్మరు.

*సృజన - నవంబర్ 1986*

# 10. సత్యం సహించరానిదయ్యే వేళ

'ఎందుకొచ్చారు మీరు?'

ఈ ప్రశ్న వాళ్ళను చాలామంది అడిగారు. 60 మంది 'కొండజనం' బస్సు నిండా బిలబిల మంటూ 'వైజాగ్ వెళుతున్నాం' అని ఘాటీ దిగుతూంటే ఎన్నడూ ప్రయాణీకులను టిక్కెట్లుగా తప్ప మనుషులుగా చూడని కండక్టరుకే వింత అనిపించి అడిగాడు.

'సింహాచలం వెళ్తున్నారా?' అని

కొందరు భయంగా అడిగారు.

ఆ రోజు వాళ్ళ జ్ఞాపకాలలో శాశ్వతంగా నిలిచిపోతుంది. పొద్దుటి మంచు పూర్తిగా కరగకముందే ఆ పౌరహక్కుల వాళ్ళు మోటార్ సైకిల్ మీద వచ్చారు. ఒకప్పుడు అట్లా ఎవరయినా వస్తే అంతా పారిపోయే వారుగాని ఇప్పుడు కొంతనయం. పిల్లలు చెట్ల వెనక దాక్కున్నారుగాని పెద్దవాళ్లు నిలబడ్డారు. వాళ్ళు వచ్చి మాటా మంతీ లేకుండ క్రిందటి వేసవిలో పోలీసులు తగలబెట్టిన ఇళ్ళమొండి గోడల ఫోటోలు తీసుకున్నారు. అంతా వాళ్ళనే రెప్పార్పకుండ చూస్తూ నిలబడ్డారు. కెమెరా కూడా తుపాకిలాగ యంత్రమే. జీపులు సహితం వాహనాలుగా కాక ఆయుధాలుగా కనబడే ఆ అడవిలో వాళ్ళు ఇప్పటిదాకా మనిషితో స్నేహంచేసే యంత్రాన్ని చూడలేదు.

వచ్చినవాళ్ళు ఫోటోలు తీసుకొని మునసబు ఇంటి బయట వేసిన మంచం మీద కూర్చున్నారు. 'మీ యిళ్ళను ఎవరు తగలబెట్టారు' అని అడిగారు. అందరూ ఒక్క గొంతులో 'మాకు తెల్దు' అని క్లుప్తంగా సమాధానం ఇచ్చారు. ఒకరిద్దరు వివరణ ఇచ్చే ఉద్దేశ్యంతో 'మేము లేములే' అన్నారు. అనేసి తదేకంగా వాళ్ళనే చూస్తూ నిలబడ్డారు. అయినా వాళ్లు పోలేదు. నెమ్మదిగా తాము ఎవరయిందీ ఎందుకొచ్చిందీ వివరించారు. మీ యిళ్ళు పోలీసులు తగలబెట్టారు కదా, దాని మీద వైజాగ్‌లో విచారణ జరుగుతుంది అన్నారు. మీరందరూ వచ్చి మీ యిళ్లు ఎవరు తగలబెట్టారో, ఎందుకు తగలబెట్టారో, ఎంత నష్టం అయిందో చెప్పాలి అన్నారు. ఇప్పుడు మేము ఒక్కొక్కరి దగ్గరా స్టేట్‌మెంట్లు రాసుకొని వేలిముద్రలు తీసుకుంటాం, కూర్చోండి అన్నారు. ఒక్కొక్కరూ మీ యింట్లో ఎన్ని బస్తాల వడ్లు కాలిపోయాయి, ఎన్ని బస్తాల జొన్నలు కాలిపోయాయి, ఎన్ని చీరలూ, పంచెలూ కాలిపోయాయి చెప్పండి అన్నారు.

వాళ్ళు మౌనంగా విన్నారు. ఈ 'ఆఫీసర్లు' ఎట్లాంటి వాళ్ళు అని కళ్ళతో అంచనా వేస్తున్నట్టు చూశారు. మునపబు - సమాధానం చెప్పే బాధ్యత తనమీద వుందన్న ఎరుకతో - అవునో కాదో తెలియకుండ తలఊపాడు. చివరికి, కొంచెం చదువుకున్న కారణంగా, లోకజ్ఞానం కంటే సాహసం ఎక్కువ ఉన్న యువకులు ధైర్యం చేసి తమ స్టేట్‌మెంట్లు రాయించారు. వచ్చీరాని వంకర గీతలతో మిడిసి పడుతూ సంతకం కూడ చేశారు. వెంట వెంటవే తక్కినవాళ్ళు తమ స్టేట్‌మెంట్స్ రాయించి వేలిముద్రలు వేశారు. పోగా పోగా

తామెక్కడ మిగిలి పోతామో నన్న గాభరాతో నేను వేనంటూ ఒక్కొక్కరూ ముందుకొచ్చి రాయించారు. 'మాకు తెల్దు' అని అవిశ్వాసం ప్రకటించిన మౌనం మాటలలో కరిగి ప్రవాహమై ఉప్పెన అయింది. నిజమే, పోలీసులే తగలబెట్టారని చెప్పారు. వేరే ఎవరోకాదు, చింతపల్లి ఎస్.ఐ. అమ్మినాయుడు స్వయంగా నిప్పు పెట్టాడన్నారు. ఏమన్నాడా, మీరు అన్నలకు అన్నాలు పెడుతున్నారురా అని తిట్టాడు. మిమ్మల్ని చింతపల్లి ఎవరు రమ్మన్నారు. మీ దేశం పొండి, ఒరిస్సాకు పొండి అన్నాడు. మీకు మర్యాదగా చెబితే మాట వినరు, మీ యిళ్ళు తగలబెడతాం ఖాళీ చేయండి అన్నాడు. ఖాళీ చేసే లోపటే ఇళ్ళు తగలబెట్టాడు. ఏం కాలిపోయిందా - అబద్ధం ఎందుకు ఉన్నమాటే చెబుతాం - 10 బస్తాల ధాన్యం, 5 బస్తాల చోళ్ళు, 4 బస్తాల కొండ కందులు ... అని చెప్పుకుంటూ పోయారు. అందరి నేలిముద్రలూ తీసుకున్నాక, వైజాగ్ తప్పకుండ వస్తాం, మీరు రానుపోను బస్సు ఏర్పాటు వేసి రెండు పూటలా అన్నం పెడతాం అంటున్నారు కదా, ఎందుకురాం వస్తాం అన్నారు.

తరువాతిరోజు పొద్దున్న తలలు పండిన ముసలివాళ్ళు కుర్రవాళ్ళ తెలివి తక్కువ తనానికి భయపడుతూ అడిగారు.

"ఎందుకు పోతున్నారు మీరు?" అవి.

ముందునాటి ఉత్సాహం కొద్ది కొద్దిగా తగ్గుతుండగా ఎవరికి వారు ఈ ప్రశ్నే వేసుకున్నారు. కాలిపోయిన గింజలూ బట్టలూ ఇళ్ళూ తిరిగి వస్తాయవా? అది నిజంకాదు. వాళ్ళకు ప్రపంచ జ్ఞానం ఎక్కువ లేదుగానీ ఈ మాత్రం ఉంది. ఉన్నది పోకుంటే పదివేలు, పోయింది ఎన్నటికీ ఈ దేశంలో తిరిగి రాదని వాళ్ళకు తెలుసు. మరెందుకు పోతున్నారు? చింతపల్లి ఎస్.ఐ.కి శిక్ష పడుతుందనా? ఉహు, కాదు. ఆ సంగతీ వాళ్లకు తెలుసు. తమ యిళ్లు తగలబెట్టినందుకు ప్రతి ఫలంగా చింతపల్లి ఎస్.ఐ.ని హైదరాబాద్‌కు బదిలీ చేసారవి వాళ్లు విన్నారు. హైదరాబాద్ అంటే ఎలా వుంటుందో వాళ్ళకు తెలీదుగానీ వైజాగ్ కంటే పెద్దది అనీ, అక్కడ పగలనక రాత్రనక సంత రోజున చింతపల్లి కంటే ఎక్కువ సందడిగా ఉంటుందనీ అక్కడ ఉద్యోగం చేస్తే సరదాయే సరదా అనీ వాళ్ళకు తెలుసు.

మరయితే ఎందుకు పోతున్నట్టు?

ఆలోచనలతో వాళ్ళ మనస్సులు మెత్తబడ్డాయి. వాళ్ల తల్లిదండ్రులు కొరాపుట్‌లోనో జైపూర్‌లోనో ఉన్నప్పుడు ఎట్లా బతికారో వీళ్ళకు తెలీదు. వీళ్ళ కాలానికి ఇటు వలసే వచ్చారు. మొదట అరకు, అనంతగిరి వచ్చారు. ఆ తరువాత అక్కడి నుండి పాడేరు మీదుగా చింతపల్లి చేరారు. కొందరు ఇంకా కిందికిపోయి కొండదిగి కొండెక్కి కొయ్యూరు చేరుకున్నారు కూడ. ఈ వలసలో పుట్టి పెరిగారు వీళ్ళు. పుట్టిన నాటినుండి పరాయి వాళ్ళనోట తిట్లే తప్ప ఎన్నడూ మంచి మాటలు వినలేదు. చేలలో పనిచేస్తూంటే, విత్తనాలు నాటుతుంటే, గింజలు కోస్తూంటే, ఈ భూమి మీదికాదు ఇది నేరం అన్నారు. ఆ భూమి వాళ్ళది కాదు కాబట్టి అందులో పోసిన శ్రమను నేరం అన్నారు. ఏరుకున్న గింజలతో ఇంట్లో పిల్లా పాపలతో కూర్చొని వండుకుంటూంటే తింటూంటే ఈ నేల నీది కాదు ఇక్కడ ఇల్లెందుకు వేసావన్నారు. శీతాకాలం సాయంత్రం పది యిళ్ళవాళ్ళు ఊరి మధ్య చేరి చలిమంట

వేసుకుంటే ఈ కట్టెలు మీవికావు ఇక్కడ మంటెందుకు వేసారన్నారు. వాళ్ళ శ్రమ నేరం, వాళ్ళ ఆహారం నేరం, వాళ్ళ ఉనికే నేరం అన్నారు.

వాళ్ళంతా ఇట్లా పెరిగారు. నువ్వు నేరస్తుడివి అని నాగరికులు తిట్టిన తిట్లు వాళ్ళ వ్యక్తిత్వాలమీద బూటుకాలి ముద్రలు వేసాయి. వాళ్ళ వ్యక్తిత్వాలను వికృతం చేశాయి. వాళ్ళల్లో వాళ్ళు మనుషులే. ప్రేమ ద్వేషం మంచి చెడు తెలిసిన వాళ్ళే. పరాయివాళ్ళ దగ్గర వాళ్ళు మనుషులు కారు. పరాయి వాళ్ళు కనబడితే పారిపోవాలి. పారిపోయే వ్యవధి లేకపోతే వంగి వంగి దండాలు పెట్టాలి. మనసులో తమ భాషలో తిట్టుకుంటూ పైకి "కొండజాతి" నవ్వు నవ్వాలి. అంతా అర్థం అవుతూనే వున్నా "నాకు తెల్దు" అనే వెర్రి పలుకుతో నిర్దోషిత్వం రుజువు చేసుకోవాలి. ఏ నేరం చేయకున్నా తమ ఉనికే నేరం కాబట్టి అభిమానం చంపుకొని ఆకలి ఏడువులు ఏడవాలి. గౌరవం దొరకదని కనికరం కోరుకోవాలి.

ఇది వాళ్ళ బతుకు, ఈ బతుకులో వుట్టి పెరిగిన వాళ్ళతో నాలుగు మంచి మాటలు మాట్లాడితే మనసు చలించి పోతుంది. వైజాగ్ రండి, న్యాయం జరుగుతుంది అన్నారు. అడవి నరకడం తప్పు కాదన్నారు. తప్పు చేసినా ఇళ్ళు తగల బెట్టే అధికారం ప్రభుత్వానికి లేదన్నారు. మన శ్రమ దాని ఫలం తప్ప ఈ ప్రపంచంలో వేరే ఏదీ లేదన్నారు. మిగిలినదంతా ఈ నిజాన్ని కప్పిపుచ్చే బూటకం అన్నారు. వాళ్ళ జీవితంలో మొట్ట మొదటిసారి ఆత్మ గౌరవానికి ఆలంబన దొరికింది. "అందుకే వైజాగ్ వెళ్తున్నాం" అని కుర్రవాళ్ళు తమకు తాము చెప్పుకున్నారు. పెద్దవాళ్ళతోనూ చెప్పారు.

మరి కొందరు అదే ప్రశ్న బెదిరింపుగా అడిగారు.

పౌరహక్కుల వాళ్ళు వచ్చి వెళ్ళిన రెండవ రోజు సాయంత్రం చీకట్లు ముసురుతుండగా వాళ్ళ ఊళ్ళకు పోలీసులు వచ్చారు. అడవినుండి దొంగిలించుకొని తెచ్చిన కట్టెతో మంటవేసుకొని అందరూ చుట్టూ కూర్చొని కబుర్లు చెప్పుకుంటూండగా ఆకులు చప్పుడు చేశాయి. తలెత్తి చూస్తే పదిమంది జవాన్లు విప్ప వెలుగులో నల్లగా కనబడ్డారు. వాళ్ళ నల్లటి తుపాకులు చేతులకు మొలిచిన చేతులలాగ ఉన్నాయి.

'ఎందుకు పోతున్నార్రా వైజాగ్‌కు?' అని కర్కశంగా అడిగారు. అది సమాధానం కోరే ప్రశ్న కాదు. అది ఆరోపణ, అది బెదిరింపు, అది తిట్టు, సమాధానం కోసం ఎదురుచూడకుండ కోళ్ళు కోయమన్నారు, అన్నం వండమన్నారు. ఆడవాళ్ళు కోళ్ళు కోశారు, కూరవండారు, అన్నం వండారు. పోలీసులు కడుపునిండా తిని, పోతూ తమ ప్రశ్నకు తామే సమాధానం చెప్పారు. 'వైజాగ్‌కు పోతే మీ కాళ్ళూ, చేతులూ విరగ్గొడతాం, ఇళ్ళు మళ్ళీ తగల బెడతాం' అన్నారు. 'ఈ పౌరహక్కుల వాళ్ళు ఇవ్వాళ వచ్చిపోతారు. మీరూ, మేమూ ఎప్పుడూ ఇక్కడే ఉండవలసిన వాళ్ళం' అన్నారు.

అయినా ఊరికిద్దరు తక్కువ కాకుండ వెళ్ళ వలసిన రోజువ చింతపల్లి సంత చేరుకున్నారు. బస్సు సమయానికి వచ్చి ఉంటే అందరూ ఎక్కేవాళ్ళే. కాని రావలసిన బస్సును పోలీసులు వెనక్కి తిప్పి నర్సీపట్నం పంపించేసారు. డ్రైవర్‌నూ, క్లీనర్‌నూ అరెస్టు చేశారు. ఈ లోపల సంతలో పోలీసులు ఒక్కొక్కరినీ పట్టుకొని బెదిరించి భయపెట్టి ఇళ్ళకు

పొమ్మన్నారు. సగంమంది పోయారు. మిగిలిన వాళ్ళు తమను రమ్మని చెప్పిన పౌరహక్కుల వాళ్ళ చుట్టూ చేరారు. ఏం చేద్దాం అన్నారు. అందరూ భయపడుతున్నారు. ఇళ్ళకు పోతాం అన్నారు. అన్నారు గానీ వాళ్ళకీ తిరిగి పోవాలని లేదు. వైజాగ్‌కు పోవాలనే ఉంది. చివరికి 58 మంది ఆర్టీసీ బస్సులలో పాడేరువెళ్ళి అక్కడి నుండి అనకాపల్లి వెళ్ళి అక్కడి నుండి రాత్రి 10 దాటిన తరువాత విశాఖపట్నం చేరారు.

మనిషికి మనిషి కనిపించని నియాన్‌లైట్ల వెలుగులో వైజాగ్ రోడ్ల మీద వాళ్ళకు చాలా భద్రత అనిపించింది. ఇక్కడ తమను ఎవరూ గుర్తించరు అవి ధైర్యం చెప్పుకున్నారు. సాహసం అయితేనేం మంచిపని చేశాం అమకున్నారు. భద్రత నుండి కోరికలూ పుట్టాయి. ఇక్కడ పెద్ద చెరువు ఉందంట మాకు చూపిస్తారా అని పౌరహక్కుల వాళ్ళను అడిగారు. చెరువు కాదు - సముద్రం, తప్పక చూపిస్తాం అన్నారు. మా చిన్నతనం తరువాత అడవిలో కనబడడం మానేసిన జంతువులన్నీ ఉండే కోట ఉందంట చూపిస్తారా అన్నారు. కోట కాదు దాన్ని 'జూ' అంటారు. తప్పక చూపిస్తాం అన్నారు. హోటల్‌లో కడుపు నిండా భోజనం తిన్నారు. పత్రం చేరుకుని రాత్రి కంటి నిండా నిద్రపోయారు.

"ఎందు కొచ్చార్రా వైజాగ్‌కు?"

పొద్దున్నే మళ్ళీ మొదలయింది ప్రశ్న. బీడీలు కొనుక్కుందామని సత్రంనుండి బయటికి వెళ్ళిన ఇద్దరిని పోలీసులు చొక్కాలు పట్టుకొని అడిగారు ఈ ప్రశ్న. నర్శీపట్నం ఇంటిలిజెన్స్ సి.ఐ.గారు రమ్మంటున్నారు రండి అని జీపులో ఎక్కించుకొని కంట్రోల్ రూంకు తీసుకుపోయారు. అక్కడ ఎవరెవరో పెద్ద పెద్ద పోలీస్ ఆఫీసర్లున్నారు. వాళ్ళ ఎదుట నిలబెట్టారు.

"ఎందుకొచ్చార్రా వైజాగ్‌కు?" అని కసిరాడు అందరికంటే పెద్ద ఆఫీసరు. ఆ పౌరహక్కుల వాళ్ళు రమ్మంటే మీరు వెంటపడి రావడమేనా అన్నాడు. కాసేపు వాళ్ళను తిట్టాడు. రాయడానికి చేతులు రాని బూతులు తిట్టాడు. తిట్టి, వస్తే వచ్చారుగాని మేము బస్సు ఏర్పాటు చేస్తాం వెళ్ళిపొండి అన్నాడు. అందరినీ తీసుకు వెళ్ళే బాధ్యత మీయిద్దరిదీ అన్నాడు. అని చెప్పి వదిలిపెట్టాడు.

వాళ్ళిద్దరూ సత్రానికి తిరిగి వచ్చారు. పౌరహక్కుల వాళ్ళు తక్కిన సాక్షులతో కూర్చొని సాక్ష్యం ఎట్లా చెప్పాలో చర్చిస్తున్నారు. ఏమేం ప్రశ్నలు అడుగుతారో వాటి భావం ఏమిటో వివరిస్తున్నారు. ఈ యిద్దరూ వెళ్ళి విషయం చెప్పారు.దయచేసి మమ్మల్ని పోనీయండి చింతపల్లికి పోతాం అని అడిగారు. పౌరహక్కుల వాళ్ళకంటే ముందు వాళ్ళ జనమే తిరగబడ్డారు. సత్రం నుండి బయటికి పోవద్దని ఈ బాబులు చెబితే వినకుండ బీడీలకోసం ఎందుకు పోయారు అన్నారు. పోలీసులకు లొంగిపోయారు మీరు అన్నారు. వాళ్ళ కాళ్ళ దగ్గరేపడి ఉండండి అన్నారు. ఊళ్ళో పెద్ద సాహసగాళ్ళమని ప్రగల్భాలు పలుకుతారు. ఇదేనా మీ సాహసం అన్నారు. సారాంశంలో, మేము రాము మీరు పోతే పొండి అన్నారు.

ఆ రోజంతా మంతనాలు జరిగాయి. ఆ యిద్దరు దౌర్భాగ్యులూ ఆ రోజంతా వచ్చి పోతూనే ఉన్నారు. కళ్ళలో నీళ్ళు ఒకటే తక్కువగా, రండి అందరం పోదాం, పోలీసులు

బస్సు ఏర్పాటు చేస్తారంట అన్నారు. లేకపోతే మన కీళ్ళు విరుగుతాయి. మన ఇళ్ళు మళ్ళీ తగలబడతాయి అన్నారు. ఒక్కొక్కరే మరొక పదిమంది జారుకున్నారు. తక్కిన 46 మంది మాత్రం గట్టిగా నిలబడ్డారు. తమ సాహసానికి తామే సంబరపడుతూ మరింత పట్టుదలగా తయారయ్యారు.

విచారణ దినం - 1987 డిసెంబర్ 11 - తెల్లవారింది. రాత్రంతా తమ ప్రయత్నాలలో విఫలం అయిన పోలీసుల పట్టుదల పెరిగింది. సాక్షులుంటున్న సత్రం మీద ఒత్తిడి పెరిగింది. ఇక లాభం లేదని తెలతెలవారుతుండగానే సాక్షులు విచారణ స్థలానికి తరలి వెళ్ళారు.

ఆంధ్ర విశ్వ విద్యాలయం నిర్మానుష్యంగా ఉంది. చదువుకోడానికో కాలక్షేపానికో వచ్చే విద్యార్థుల రాకకు ఇంకా రెండు మూడు గంటల వ్యవధి ఉంది. విచారాణ జరగవలసిన టి.ఎల్.ఎన్. సభ హాలు బయట సాక్షులంతా కూర్చున్నారు. దూరాన "చెరువు" కనిపిస్తూ వుంది. దానినే తదేకంగా చూస్తూ కూర్చున్నారు. ఇవ్వాళ సాయంత్రం అయినా చెరువు దగ్గరికిపోయే వ్యవధి దొరుకుతుందా?

నెమ్మదిగా విచారణ హాలు మేలుకుంది. కటకటాల తలుపు తెరుచుకుంది. తెల్లటి గుడ్డ మీద "భారత ప్రజల మావవ హక్కుల ట్రైబ్యునల్" అని నీలం రంగు అక్షరాలలో ఇంగ్లీష్‌లో రాసిన బ్యానర్ తలుపును అలంకరించింది. హాలు లోపల మెత్తటి సోఫాలు బారులు తీరి ఉన్నాయి. 46 మంది సాక్షులూ వెళ్ళి సోఫాలలో కూర్చున్నారు. హాలు నలువైపులా అద్దాల కిటికీలున్నాయి. వాళ్ళు కూర్చున్న సోఫాలే కాక చాలా కుర్చీలున్నాయి. చూస్తూండగానే చాలామంది వచ్చారు. మైకులు వచ్చాయి. పుస్తకాలూ కాగితాలూ వచ్చాయి. చివరగా జడ్జీలిద్దరూ వచ్చారు. ఒక మగాయన, ఒక ఆడామె. వాళ్ళ ముఖాలకూ తాము కూర్చున్న సోఫాలకూ పోలిక ఉన్నట్టు అనిపించింది. మెత్తగా, నల్లగా, ముసలిగా ఉన్నాయి. మళ్ళీ ఒకసారి సాక్షులందరికీ భద్రత అనిపించింది. ఈ జడ్జీలు ఇతర ఆఫీసర్ల లాగ తమను తిట్టరు. వీళ్లు తమతో మాట్లాడతారు, మొరగరు. నాగరికుల భాషలన్నీ తిట్టడం కోసమే తయారు చేశారని వాళ్ళు ఇంతకాలం అనుకున్నారు. అది నిజం కాదన్న అనుమానం తొలిసారి ఈ రెండు గంటలలో కలిగింది. ఈ రెండు గంటలూ వాళ్ళవెవ్వరూ "ఎందుకు వచ్చార్రా వైజాగ్‌కు" అని అడగలేదు. వాళ్ళకు జరిగిన అన్యాయం ఏమిటో చెప్పుకోమన్నారు. అంత భద్రతలోనూ వాళ్ళు కొంత భయపడ్డారు. కొత్తదనం వల్ల భయపడ్డారు. మైకును చూసి భయపడ్డారు. అంత మంచితనం చూసి భయపడ్డారు.

చెప్పుకున్నకొద్దీ ధైర్యం పెరిగింది. తడబడుతూ మొదలు పెట్టిన గొంతులు అనర్గళంగా మాట్లాడసాగాయి. వచ్చీరాని భాషలోనే విసుర్లూ వ్యంగ్యం పలకసాగాయి. రెండు గంటలసేపు అందరూ ఒక అసత్యపు ప్రపంచంలో జీవించారు. వినదల్చుకున్న వాళ్ళతో అన్యాయాన్ని గురించి చెప్పుకునే హక్కు ప్రజలకుందన్న భ్రమను తమకు తాము కల్పించుకొని అందులో బ్రతికారు. అదృష్టవశాత్తు రెండు గంటలలోనే ఆ భ్రమ పటాపంచలయింది.

తొమ్మిదిమంది తమ సాక్ష్యం ఇచ్చారు. పదవ సాక్షి మైకు ముందర నిలబడి తన పేరూ ఊరూ తనకు జరిగిన నష్టం చెపుతున్నాడు. అంతలో బయటి నుండి పెద్దగాకేకలు పెట్టుకుంటూ ఒక మూక వచ్చింది. ముందర ఆడవాళ్లున్నారు. పిల్లల్ని ఎత్తుకున్న ఆడవాళ్ళున్నారు. వెనక మగవాళ్ళున్నారు. వాళ్ళు పోలీసులని ముఖం చూస్తూనే తెలుస్తుంది. ఆడవాళ్ళు నినాదాలు ఇస్తూ గొడవ చేస్తున్నారు. వెనకున్న మగవాళ్ళు కుర్చీలు పైకెత్తి తిన్నగా సాక్షుల మీదికి పోయారు.

"ఎవడు రమ్మన్నాండ్రా మిమ్మల్ని వైజాగ్‌కి?"

అంటూ కుర్చీలతో వాళ్ళను దారుణంగా కొట్టారు.ఇంకింత భయం గొలిపించడానికి కుర్చీలు ఎత్తి బలంగా నేలకేసి కొట్టారు. సాక్షులంతా భయపడి బయటకు పరుగెత్తారు. సాక్షులకు భద్రత లేకుండ విచారణ ఎట్లా కొనసాగించడం అని జడ్జీలు విచారణను తాత్కాలికంగా వాయిదా వేశారు.

ఆ రాత్రి పోలీసుల పర్యవేక్షణలో యమలోకం ముందు వాకిట్లో గడిచినట్టు గడిచింది సాక్షులకు. తెల్ల వారడానికి ఇంకా మూడు గంటలు ఉండగానే లేచి పోలీసుల కళ్ళబడకుండ బస్సెక్కి మధ్యాహ్నానికి చింతపల్లి చేరుకున్నారు.

దారి పొడవునా అందరూ మౌనం. అందరి మనస్సులలోనూ రాబోయే పరిణామాల గురించి భయం. అందరి మనస్సులలోనూ ఒకే అవ్యక్తమైన ప్రశ్న.

**"అసలు మనల్ని వైజాగ్‌కు ఎవడు వెళ్ళమన్నాడు?"** అన్న ప్రశ్న.

అవ్యక్తంగా ఉండిపోయిన ఈ ప్రశ్నకు వాళ్ళలో ఒకడు బస్సు దిగుతూ తనకు తాను చెప్పుకుంటూన్నట్టు సమాధానం చెప్పాడు.

**"ఈ బాబులు మనల్ని తిట్టలేదు. మనం ఏమీ తప్పుచేయలేదని ఈ బాబులొక్కరే అన్నారు. అందుకని వెళ్ళాం వైజాగ్‌కు. అందుకనే వెళ్తాం వైజాగ్‌కు."**

*అరుణతార - నవంబర్ 1987 - జనవరి 88*

# II. భారత దేశంలో పోలీసు పాలన

హింసా ప్రవృత్తి భారత రాజ్యాంగ యంత్రానికి ఎప్పుడూ వున్నదేగానీ, హింస ప్రయోగించే అలవాటు, సామర్థ్యం ఈ మధ్య అత్యంత వేగంగా పెరుగుతున్నాయి. కొన్ని సంవత్సరాలలో భారత రాజ్యాంగ యంత్రం స్వభావంలోని హింసాత్మక అంశం గుణాత్మకంగా మార్పు చెందింది. ఒకానొక కాలంలో పోలీసుయంత్రాంగానికి ప్రతీకగా పొట్ట పెంచుకొని తెలివితక్కువగా ప్రవర్తించే బడుద్దాయిలను చిత్రీకరించడం సాధ్యపడేది. మన సినిమాలు హాస్య సన్నివేశాల కోసం 'పోలీసు వెంకటస్వాముల'ను తరచుగా ఉపయోగించుకునేవి. ఇప్పుడిక ఆ అవకాశం ఎంత మాత్రం లేదు. ఇప్పుడు మిగిలింది హింసాత్మక అంశం మాత్రమే. అది కూడ మామూలు హింసకాదు, అత్యంత పాశవికమైన హింస. తుపాకి కంటే బడితగా బాగా ఉపయోగపడే 303 రైఫిల్ ఇంకెంత మాత్రం పోలీసు యంత్రాంగం బలానికి సంకేతం కాదు. దాని స్థానాన్ని రోజురోజుకూ మరింత ఆధునికీకరణ మవుతున్న ఆటోమాటిక్ తుపాకులు ఆక్రమించుకున్నాయి.

ఈ సాంకేతిక ఆధునీకరణతో బాటు పోలీసులకూ, సమాజానికీ మధ్యనున్న సంబంధాలలో కూడ మార్పు వేగంగా వస్తోంది. ఒకటి, పోలీసుల జోక్యం పరిధి పెరుగుతోంది. గతంలో మనం పోలీసు యంత్రాంగం జోక్యానికి వదిలిపెట్టడానికి ఎంత మాత్రం ఇష్టపడవి సామాజిక అంశాలు ఒక్కొక్కటే ఇవ్వాళ పోలీసుల చేతిలోకి పోతున్నాయి. పెద్ద నగరాలలో నివసించే విద్యావంతులకూ మధ్య తరగతి బుద్ధిజీవులకూ ఈ మార్పు ఎంత దూరం పోయిందో తెలియకపోవచ్చును. కాని మార్పు మట్టుకూ చాలా దూరం పోయింది. మత సంబంధమైన పండగలూ పబ్బాలూ, ఆటపాటలూ, సాంస్కృతిక కార్యకలాపాలూ, రాజకీయ సభలూ, ఊరేగింపులూ ప్రదర్శనలూ, వీధినాటకం వంటి బహిరంగ కళారూపాలు మొదలయినవన్నీ కూడ 'మన సంస్కృతి' లేక 'మన హక్కులు' అనే జాబితా నుండి ప్రభుత్వం దయాదాక్షిణ్యాల మీద మనం అనుభవించే రాయితీల జాబితాలోకి పోయాయి. 'ప్రభుత్వం' అంటే చాలా సందర్భాలలో స్థానిక పోలీసు ఇన్‌స్పెక్టరేనన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఈ హక్కులూ ఆచారాలే కాకుండ సున్నితమయిన సామాజిక న్యాయానికి సంబంధించిన సమస్యలు కూడ పోలీసుల చేతిలోకి పోయాయి. ఈ మార్పు ఎటువంటి ఆర్భాటమూ లేకుండ సజావుగా జరిగిపోయింది. దీని కోసం ఏ చట్టాలూ చేయలేదు. చట్టం ప్రసక్తి అంటూ వస్తే నేర విచారణ స్మృతి (సి.ఆర్.పి.సి) లోనూ వివిధ పోలీసు చట్టాలలోనూ వున్న నిర్బంధ నిషేధ అధికారాలు సరిపోతాయి. కాని చట్టం ప్రసక్తి సాధారణంగా రాదు - ఎవరయినా సమస్యను కోర్టుకు నివేదిస్తే తప్ప. అయినా కోర్టులు మట్టుకు మార్పుకు అతీతం అయితే కదా! మన సామాజిక జీవితాన్ని ఒక రకమయిన 'పోలీసు సంస్కృతి' ఆవరిస్తోంది. అది మన సామాజిక చైతన్యంలోకి మనకు తెలియకుండావే ప్రవేశిస్తోంది.

పమ్మె చేస్తున్న విద్యార్థులను పోలీసులు ఒక వైపు లాఠీలతో చితక బాదుతూ మరొకవైపు అధికారులతో బలవంతంగా ఒప్పందం కుదిరిస్తారు. సమ్మెకు కారణమయిన సమస్యలను చాలా మొరటుగా పరిష్కరిస్తారు. విద్యార్థుల 'హక్కుల'కు వేళాకోళంగా భాష్యాలు చెప్తారు. వాళ్ల ఆత్మగౌరవాన్ని తీవ్రంగా పరీక్షించే పద్ధతిలో పోలీసు యంత్రాంగానికి వుండే మూర్ఖమయిన రాజకీయ అవగాహనతోనూ సామాజిక సిద్ధాంతాలతోనూ విద్యార్థులకు లెక్చర్లు ఇస్తారు. ఒక్క విద్యార్థులే కాదు. కార్మికులయినా నేరే ఏ యితర బడుగు వర్గమయినా, అందరి గతీ ఇవ్వాళ ఇంతే.

సంఘటిత ఉద్యమాలనే కాదు. పొలంగట్ల తగాదాలనూ సేద్యపు కాలవల వివాదాలనూ పొలాల గురించి ఇంటి స్థలాల గురించి పశువుల గురించి వచ్చే వివాదాలనూ, దళితులు స్త్రీలు, గిరిజనులు తదితర బడుగు ప్రజానీకం అతికష్టం మీద సాధించుకున్న సామాజిక న్యాయానికి సంబంధించిన సమస్యలనూ అన్నింటినీ ఇవ్వాళే ఇదే మొరటు పద్ధతిలో పరిష్కరించడం జరుగుతోంది. అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడే దళితులు న్యాయం పొందేది కోర్టులలో కాదు. సామాజిక న్యాయం అంటే ఏమిటో అర్థం చేసుకోలేని మొరటు సాయుధ శక్తి ముందు వాళ్లు న్యాయం కోపం మొరపెట్టుకోవాలి. ఒక్క దళితులే కాదు. కార్మికులయినా గిరిజనులయినా స్త్రీలయినా పోలీసు యంత్రాంగం తన సిబ్బందికి ఇచ్చే సామాజిక అవగాహనకు ఛాయామాత్రంగా కూడ అందని న్యాయం ఏ ప్రజానీకం మనుగడకు అత్యవసరమో, వారందరి పరిస్థితి ఇదే. పై స్థాయిలోని ఉన్నత న్యాయస్థానాల ఆలోచనలు 'న్యాయం' అనే దానికి మరింత విస్తృతమయిన వ్యాఖ్యానం ఇవ్వడం ఒక వైపు జరుగుతుండగా, ఆ సున్నితమయిన ఆలోచనలకు అవగింజంతయినా తావులేని పోలీసు ఠాణాలే ఆచరణలో ప్రజల పాలిట న్యాయస్థానాలవుతూ వున్నాయి.

ఈ విధంగా పోలీసుల జోక్యం పరిధి పెరగడంతో బాటు పోలీసు యంత్రాంగానికి ఇతర పరిపాలనా విభాగాలతో వున్న సంబంధం కూడ మారుతోంది. పరిపాలనలో పోలీసుల పాత్రను ఈ మార్పు ప్రతిఫలిస్తుంది. సంక్షేమ రాజ్యం అనే భావన, భారత రాజ్యాంగంలోని రెండవ, మూడవ అధ్యాయాలు, మనముందు ఒక ఆదర్శాన్ని ఉంచుతాయి. రాజ్యాంగ యంత్రంలోని సంక్షేమం, ప్రగతి అనే అంశాలకు ఆ రాజ్యాంగ యంత్రం యొక్క హింసాప్రవృత్తి లోబడి వుండడం అనేది ఈ ఆదర్శం. ఈ ఆదర్శం ఏనాడయినా ఏ మాత్రం అమలయిందో చెప్పలేముగానీ ఇప్పుడు మట్టుకు పూర్తిగా తలక్రిందులయింది. సంక్షేమ రాజ్యం అనే భావనకు కొత్త అర్థం ఇవ్వలేదు. రాజ్యాంగం స్వభావాన్ని సవరించలేదు. కాని ఈ మార్పు మట్టుకు సంపూర్ణం అయింది. పోలీసు యంత్రాంగం ఇవ్వాళ పరిపాలనా యంత్రాంగంలోని పౌరవిభాగం పట్ల ప్రదర్శించే తిరస్కార వైఖరి ఈ మార్పుకు సంకేతం. పోలీసు విభాగం పౌర విభాగానికి లోబడి వుండాలని బ్రిటీష్ కాలం నుండి వస్తున్న సూత్రాన్నే కాక, అదే పౌర విభాగంచేతిలో పెట్టిన ప్రగతి, సంక్షేమం అనే బాధ్యతలకు పోలీసులు విధి నిర్వహణ లోబడి వుండాలన్న స్వతంత్ర భారత రాజ్యాంగ సూత్రాన్ని కూడ తిరస్కారభావం తలక్రిందులు చేస్తుంది.

ఈ పరిణామానికి చక్కటి ఉదాహరణ మన రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లా. సంక్షేమ చర్యలకూ గిరిజనుల హక్కులకూ అనుకూలంగా వున్న ఆ జిల్లా కలెక్టరును కొన్ని నెలల క్రితం పోలీసుల ఒత్తిడి మీద బదిలీ చేయడం జరిగింది. గిరిజనులు ఉమ్మడిగా నిరసన తెలిపినా ప్రయోజనం లేకపోయింది. ఆదిలాబాద్ జిల్లాలో ఇవ్వాళ మూడు లక్షల గిరిజనులున్నారు. జిల్లా జనాభాలో వాళ్లు 17 శాతమే గానీ అయిదారు దశాబ్దాల క్రితం వాళ్లవే మెజారిటీగా వుండింది. అప్పటి నుండీ గిరిజనుల భూములను గిరిజనేతరులు ఆక్రమించుకోవడం ఒక పద్ధతి ప్రకారం మొదలయింది. ఈ రకమయిన భూమి బదలాయింపు జరగకుండ చూడడం అనేది భారత ప్రభుత్వ విధానాలలో ఒక అంశం. దానిని అమలు చేసే బాధ్యత జిల్లా కలెక్టర్‌ది. అయితే ఆ బాధ్యతను సీరియస్‌గా తీసుకునే కలెక్టర్ రాగానే అది గిరిజనేతరులకు కంటగింపయింది. అన్ని పార్లమెంటరీ రాజకీయ పార్టీలూ వారికి మద్దతుగా నిలబడ్డాయి. ఈ లోపల, తమ భూమి పమస్య అపరిష్కృతంగా వుండిపోయిన కారణంగా గిరిజనులు నక్సలైట్ల వైపు మొగ్గు చూపడం, పోలీసులు రంగప్రవేశం చేయడం జరిగింది. సామాజిక ఆర్థిక సమప్యలను శాంతిభద్రతల సమస్యగా చూడకూడదని పెద్దలు అంటుంటారు గానీ పోలీసులకు ఇచ్చే అవగాహన దానికి పూర్తిగా విరుద్ధమయినది. ఫలితంగా, జిల్లా కలెక్టరు గిరిజనులకు ఇస్తున్నదన్ను (అంటే మరేమో కాదు. రెగ్యులేషన్ 1 ఆఫ్ 1970 ని అమలు చేయడం మట్టుకే!) వల్లవాళ్ళు మరింత నిర్భయంగా నక్సలైట్లకు మద్ధతు నిస్తున్నారని పోలీసులు ఆయన మీద ఆరోపణ చేయగలుగుతారు. అంతేగాక, నక్సలైట్ సమస్యను పరిష్కరించడం కోసం పోలీసులు గిరిజన యువకులను గ్రామాల నుండి తీసుకుపోయి కాల్చిపారేసి 'ఎన్‌కౌంటర్' అని ప్రకటించడం పట్ల ఆయన అపంతృప్తి వ్యక్తం చేయడం కూడా వాళ్లకు నచ్చలేదు. ఈ కారణాల వల్ల గిరిజనేతరుల ఒత్తిడికి పోలీసుల ఒత్తిడి జోడయి ఆయనను అదిలాబాద్ నుండి బదిలి చేయదం జరిగింది. దీనితో 'తలక్రిందు కావదం' అనేది సంపూర్ణం అయింది. సమస్యను అందరూ గుర్తిస్తారు. అయితే దాని రాజ్యాంగబద్ధమయిన పరిష్కారం 'రెచ్చగొట్టేచర్య' అయిపోగా దాని రాజ్యాంగ విరుద్ధమయిన పరిష్కారం ఆమోదనీయం అవుతుంది. ఈ క్రమంలో అన్ని విభాగాలలోకి తగ్గస్థాయిలో ఉడవలసిందని చెప్పుకునే పోలీసు యంత్రాంగం నిజానికి ప్రభుత్వ పాలనా వ్యవహారాలలో నిర్ణాయక స్థానాన్ని పొందుతుంది.

అయితే ఈ క్రమం సంపూర్ణంగా సాగింది ఈశాన్య భారతదేశంలో. అక్కడి ప్రజానీకం అత్యధికంగా గిరిజనులు.వారిని బయటి వారి దోపిడీ నుండి కాపాడడం ప్రభుత్వం బాధ్యత. అటువంటి ప్రాంతంలోనే పౌర అధికార నిర్వహణ బాధ్యత పూర్తిగా త్యజించడం, ఆ బాధ్యతను మొత్తం సైన్యానికి అప్పజెప్పడం జరిగింది. అటు పిమ్మట సైన్యం అక్కడి పౌర అధికార యంత్రాంగాన్నీ న్యాయ వ్యవస్థనూ కూడ ఎంతటి తృణీకారభావంతో చూస్తుందనేది చాలా కొద్ది మందికి తెలిసిన చారిత్రక వాస్తవం. ఈ మధ్య జరిగిన ఒక ఉదాహరణ - ఒయినం (Oinam) ఉదంతం. మణిపూర్‌లోని సేనాపతి జిల్లాలో వున్న ఒయినం పరిసరగ్రామాల మీద 1987 జూలై 17 వ తేదీన అస్సాంరైఫిల్స్ బలగాలు దాడిచేసి 30 మంది

స్త్రీ పురుషులను చంపారు. 10 మంది స్త్రీలను బలాత్కరించారు. చాలా మందిని చిత్రహింసలకు గురిచేసి 100కు పైగా ఇళ్లనూ చర్చీలనూ ధ్వంసం చేశారు. సేనాపతి జిల్లా కలెక్టర్‌నూ పోలీసు సూపరింటెండెంట్‌నూ కూడ అస్సాం రైఫిల్స్ ఆ ప్రాంతంలోకి ప్రవేశించనీయలేదు! గౌహతి హైకోర్టులో ఈ అత్యాచారాన్ని గురించి రిట్‌పిటిషన్ వేయగా, సాక్ష్యాలు రికార్డు చేయమని ఇంఫాల్ సెషన్స్ కోర్టును హైకోర్టు ఆదేశించింది. సెషన్స్‌కోర్టు ఆపనికి ఉపక్రమించడంతోనే అస్సాంరైఫిల్స్ కూడ తన పనికి తానూ ఉపక్రమించింది. సాక్షులను బెదిరించడం, కొట్టడం, అపహరించడం, కేసు నిర్వహిస్తున్న నందితా హక్సర్ తదితర న్యాయవాదుల నివాసాల మీద దాడులు చేయడం, నిరాఘాటంగా కొనసాగిస్తోంది. ప్రభుత్వం అస్సాం రైఫిల్స్ బలగాలను కంట్రోల్ చేయగలదనిగానీ, చేస్తుందని గాని, పవిత్రమయిన న్యాయ నిర్ణయం క్రమానికి అడ్డు రాకుండ అవుతుందనిగానీ ఎవ్వరూ కనీసం ఆశించే స్థితిలో కూడ లేరు.

ఈ పరిణామాల వెనుక పోలీసు యంత్రాంగం పట్ల ప్రభుత్వానికి ఒక వైఖరి వుంది. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే పోలీసుల మీద చర్య తీసుకోవాలన్న డిమాండుతో ఉద్యమించే క్రమంలో పౌరహక్కుల ఉద్యమకారులు గమనించే విషయం ఏమిటంటే ఈ దేశంలోని ప్రభుత్వాలకు పోలీసుల మీద చర్య తీసుకునే ఉద్దేశ్యములేదు. తీసుకోనూ లేవు. వామపక్ష ప్రభుత్వ పాలనలో వున్న పశ్చిమబెంగాల్‌లో పహితం అర్చనా గుహ అనే స్కూల్ టీచరు, తనకు పక్షవాతం వచ్చేలాగ చిత్రహింసలకు గురిచేసిన రూణుగుహ నియోగి అనే పోలీస్ ఆఫీసర్ మీద కోర్టులలో 11 సంవత్సరాలు చేసిన పోరాటం చివరికి ఓటమితో ముగిసింది.కేసు ఇంత కాలం కొనసాగడానికి 'అనవసర జాప్యం' అని కలకత్తా హైకోర్టు వక్రభాష్యం చెప్పి కేసును కొట్టేసింది. ఈ 11 సంవత్సరాల కాలంలో పశ్చిమబెంగాల్ ప్రభుత్వం అధికారి మీద కనీసం పస్పెన్షన్ వంటి చర్యకూడ తీసుకోలేక పోయింది.

నిజానికి, చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే పోలీసు అధికార్లకు ప్రభుత్వం నగదు పారితోషికాలు, ప్రమోషన్లు తదితర రూపాలలో ప్రోత్సాహం ఇస్తుంది. మన రాష్ట్రంలో నక్సలైట్లను వేటాడే స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌కు అధిపతి అయిన డి.ఐ.జి కె.ఎస్. వ్యాస్ అనే పోలీసు అధికారి వున్నాడు. ఈయనకు ఉన్నంత పరపతి వేరే ఏ పోలీసు అధికారికి లేదు. ఇతని ఘనత ఏమిటంటే ఎమర్జెన్సీ ఎత్తి వేసిన తరువాత దాదాపు మూడు పంవత్సరాల కాలం ఆగిపోయిన 'ఎన్‌కౌంటర్' హత్యలను 1980లో నల్గొండ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్‌గా వున్నప్పుడు తిరిగి తన ఆధ్వర్యంలో ప్రారంభించాడు. స్కూల్ ఫైనల్ క్లాసులోనూ ఇంటర్‌మీడియేట్ క్లాసులోనూ వున్న యువకులను ఏరి కాల్చేసి 'ఎన్‌కౌంటర్' జరిగిందని ప్రకటించాడు. ఆ తరువాత ఆయన చాలా వేగంగా పైకి వెళ్లి, ప్రస్తుతం తననూ తన అనుయాయులను ప్రశ్నించేవారు లేరనే స్థితికి చేరుకోగలిగాడు. అయితే అంత పై స్థాయి పోలీస్ అధికారి దాకా పోనక్కరలేదు. ఎస్.ఐ స్థాయిలో కూడ డిపార్ట్‌మెంట్‌లో వేగంగా పైకి పోవడానికి కావలసిన సర్టిఫికేట్ ఏమిటంటే ప్రజల మీద హింస ప్రయోగించడానికి ఎంత మాత్రం వెకాడరు అనేది.

ప్రభుత్వానికి పోలీసు యంత్రాంగం పట్ల ఈ వైఖరి ఉండడం వల్ల, పోలీసు యంత్రాంగం మీద పర్యవేక్షణ అధికారం వున్న ఇతర అధికార్లలో ఒక రకమయిన నిస్సహాయత పేరుకొని పోయింది. లాకప్పు నుండి కోర్టుకు తీసుకొచ్చిన ముద్దాయి నివేదించే చిత్రహింసల కథలు వినే మేజిస్ట్రేట్ ముఖంలోను, తమ రిపోర్టు చెత్తబుట్టలోకి పోతుందని తెలిసి పోలీసు అత్యాచారాల మీద విచారణలు నిర్వహించే విచారణాధికారుల నివేదికలలోనూ, నిష్ప్రయోజనమయిన వాగాడంబరంతో పోలీసు యంత్రాంగాన్ని 'లైసెన్సు గూండాలు' తదితర దూషణలతో వర్ణించే ఉన్నత న్యాయస్థానాల తీర్పు భాషలోనూ ఈ నిస్సహాయతను స్పష్టంగా చూడవచ్చు.

రాజ్యాంగ యంత్రం హింసా ప్రవృత్తిలో వస్తున్న ఈ మార్పులు, మన స్వాతంత్ర్యానంతర చరిత్రలో సంభవించిన ఒక్కొక్క సంక్షోభానికి సంకేతాలు. ఒక్కొక్క సంక్షోభం ప్రజా ఉద్యమాలకూ తిరుగుబాట్లకూ దారితీస్తుంది. వాటిని అణచడానికి రాజ్యాంగ యంత్రం అనేక అణచివేత చర్యలను చేపడుతుంది. త్వరలో 'శాంతి' నెలకొంటుంది. సమస్య పైకి పరిష్కారం అయినట్టే కనబడుతుంది. అయితే అంతా అయిపోయి అలలు వెనక్కి మళ్లిన తరువాత ఉప్పెనకు గుర్తుగా రెండు విషయాలు మిగిలిపోతాయి. ఒకటి, సమస్యకు 'మూలకారణం' అయిన సంక్షోభం. ఈ సంక్షోభం సాధారణంగా అపరిష్కృతంగా ఉండిపోతుంది. రెండవది, పెరిగిన అణచివేత యంత్రాంగం. సమస్య వివరాలన్నీ అందరూ మరచిపోయిన తరువాత చాలాకాలం దాకా కూడ ఈ సమస్యను పరిష్కరించే పేరుతో ప్రజలను రాజ్యాంగ యంత్రం అలవర్చుకున్న దురలవాట్లూ, దుష్ట శాసనాలూ మిగిలిపోతాయి. ఎమర్జెన్సీ ఇందుకు చక్కటి ఉదాహరణ. ఆ సంవత్సరన్నర కాలంలో పోలీసులూ మనమూ నేర్చుకున్న కొత్త అణచివేత పద్ధతులూ అణచివేత సంస్కృతీ ఎమర్జెన్సీని ఎత్తివేసి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించిన తరువాత ఇన్నేళ్ళయినా కొనసాగుతూనే వున్నాయి. సామాజిక జీవితంలో పోలీసు యంత్రాంగం పెద్ద ఎత్తున జోక్యం చేసుకోవడం ఆకాలంలోనే మొదలయింది.

స్వాతంత్ర్యానంతరం రాజకీయ ఉద్యమాలను అణచి వేయడానికి సైనికబలగాలను మొట్టమొదట ప్రయోగించింది తెలంగాణలో. ఆ నేపథ్యంలోనే కల్లోలిత ప్రాంతాల చట్టాన్ని కూడ తయారుచేసి, అసిస్టెంట్ ఎస్.ఐ. ర్యాంకు అధికారికి ఎవ్వరినైనా కేవలం అనుమానం మీద కాల్చేసే అధికారం ఇవ్వడం జరిగింది. దేశం కొత్తగా సాధించుకున్న స్వాతంత్ర్యానికి ద్రోహం చేసే ఉద్దేశ్యంతో కమ్యూనిస్టులు సాయుధ పోరాటం చేస్తున్నారనీ స్వాతంత్ర్యాన్ని సంరక్షించడానికి కఠిన చర్యలు అవసరమనీ అప్పట్లో అన్నారు. కమ్యూనిస్టులే తమ పోరాటాన్ని 1951 లో విరమించుకున్నారు. అయితే కల్లోలిత ప్రాంతాల చట్టమూ దాని వినియోగము కూడ కొనసాగుతూనే వున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు ఒకడజను తాలూకాలు కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించబడి వుండడమే కాక 1983లో అదే చట్టాన్ని పంజాబుకోసం కూడ తయారు చేసి జారీ చేశారు. తెలంగాణ తరువాత సైన్యాన్ని పంపింది ఈశాన్య భారత దేశంలో. 1956 నుండి మొదలయిన తిరుగుబాట్లను అణచడానికి దానితో బాటు సైన్యానికి వర్తించే కల్లోలిత ప్రాంతాల చట్టం అయినటువంటి సాయుధ బలగాల

ప్రత్యేక అధికారాల చట్టం జారీ అయింది. విదేశీ శక్తులు దేశం ఉనికినే దెబ్బ తీయడానికి అక్కడి గిరిజన ప్రజానీకాన్ని రెచ్చగొడుతున్నారని అప్పట్లోఅన్నారు. తిరుగుబాట్లు చాలా వరకు వివిధ పరిపాలనా వ్యూహాల వల్లనూ, ఒడంబడికలూ ఒప్పందాల వల్లనూ చల్లబడ్డాయి. కానీ సైన్యమూ ఆసైనిక చట్టము ఇంకా అక్కడే వున్నాయి. పైగా ఆ సైనిక చట్టాన్ని పంజాబు కోసం తిరిగి జారీ చేశారు. ఇటువంటి చట్టాలు భారత రాజ్యాంగంలోవి అధికరణం 21కి వ్యతిరేకం అని జస్టిస్. వి.ఆర్. కృష్ణ అయ్యర్ వంటి వ్యక్తులు బహిరంగంగా తమ అభిప్రాయం వ్యక్తం చేసినప్పటికీ ఆ చట్టాలూ వాటి వినియోగమూ కొనసాగుతూనే వున్నాయి.

ఈ లోపల, రాజకీయ సమస్యలను సామాజిక సంఘర్షణలనూ అదుపు చేయడానికి సైన్యాన్ని ఉపయోగించడం అనేది ఎంతగా అలవాటు అయిపోయిందంటే ఇప్పుడు దానికి సంజాయిషీ అడిగే వారు లేరు. చెప్పేవారు లేరు. ఈ మధ్యనే అస్సాంలో బోడో విద్యార్థుల ఉద్యమం మీద సైన్యాన్ని ప్రయోగించడం జరిగింది. మనం ఎంతగా అలవాటు పడ్డామంటే చాలా అల్పసంఖ్యాకులూ బలహీనులూ అయిన బోడోల వల్ల ఈ దేశ భద్రతకు గానీ సమగ్రతకు గానీ ఏమంత ముప్పు వాటిల్లిందని అడిగేవారు లేరు.

రాజకీయ ఉద్యమాలనూ సామాజిక సంఘర్షణనూ అదుపు చేయడానికి సైన్యాన్ని ప్రయోగించడం అనేది 'సామాజిక సమస్యలను శాంతి భద్రతల సమస్యగా చూడడం' అనే దురలవాటుకు పరాకాష్ఠ మాత్రమే కాదు. అది దేశంలోని కొంత జనాభాను విదేశీయులుగా, శత్రువులుగా చూడడం అవుతుంది. పోలీసులు ఎంతో తీవ్రమయిన 'శాంతి భద్రతల' సమస్యను ఎదుర్కొనేటప్పుడయినా సంబంధిత ప్రజల హక్కులను గౌరవించాలి. తమ విధినిర్వహణకు ఏ మాత్రం బలప్రయోగం అవసరమో అంత మాత్రమే చేయాలి. ఈ విషయాన్ని అర్థం చేసుకోవడానికి రాజ్యాంగాన్నీ అందులోని అధికరణం 21నీ పెద్దగా వ్యాఖ్యానించ నవసరం లేదు. మన వలస పాలకులు ఒక శతాబ్దం క్రింద, దేశంలో ప్రజలకు ఏ పౌర హక్కులూ లేనిదినాలలో - రూపొందించిన నేర విచారణ స్మృతి (సి.ఆర్.పి.సి) శాసనమే యిది. సెక్షన్లు 46-130 ఈ పరిమితిని స్పష్టం చేస్తాయి.

సైన్యం విధులూ సంస్కారమూ ఇందుకు భిన్నమయినవి. ఎదుటి వారి హక్కులను గుర్తించవలసిన అగత్యం దానికి లేదు. దాని ప్రమాణం కనీస హింసా ప్రయోగం కాదు. సమర్ధవంతమయిన హింసా ప్రయోగం. ఎంత కొద్దిమందిని చంపుతాననేది కాదు. ఎంత తక్కువ ప్రయాసతో పనిపూర్తి చేసుకుంటాననేది దాని దృక్పథం. సైన్యం సంస్కారము, శిక్షణ, ఆయుధాలు ఈ దృక్పథంతోనే సమకూర్చబడతాయి.

ఈకారణంగా అన్ని నాగరిక దేశాలలోనూ ఒక వైపు సైన్యానికి మరింత ప్రాణాంతకమయిన ఆయుధాలను సరఫరా చేస్తుండగా పోలీసు యంత్రాంగానికి మట్టుకు కనీస బలప్రయోగానికి అనుగుణ్య మయిన ప్లాస్టిక్ బుల్లెట్ల వంటి ఆయుధాలు ఇవ్వడం జరుగుతోంది. ఒక్క భారతదేశంలో మట్టుకే పోలీసు యంత్రాంగానికి సైన్యం నుండి అరువు తెచ్చుకున్న శక్తివంతమయిన ఆయుధాలు ఇస్తున్నారు. మొదట్లో అన్నట్లు, దినదినం మరింత ఆధునికం

అవుతున్న ఆటోమాటిక్ తుపాకులు ఇవ్వాళ పోలీసుల చేతిలో సర్వసాధారణ ఆయుధ సామాగ్రి అయిపోయాయి. ఇది పంజాబులో మొదలయింది. అక్కడి టెర్రరిస్టుల దగ్గర శక్తివంతమయిన ఆయుధాలు ఉన్నాయనీ వారిని ఎదుర్కోవడానికి ఇవి అవసరం అనీ అన్నారు. అయితే త్వరలోనే ఆయుధాలు దేశం అంతటికీ విస్తరించాయి. పోలీసులు అదుపు చేయవలసిన అలజడి కేవలం సాంప్రదాయికమయిన ఆయుధాలనే కలిగివున్నా, అసలు పూర్తిగా నిరాయుధమయిన ఉద్యమమే అయినా, పోలీసుల చేతిలో ఈ కొత్త ఆయుధాలే కనబడతాయి.

ఈ రకమయిన ఆయుధ సామాగ్రికి సాకుగా చూపిస్తున్న టెర్రరిజం ఏదో ఒక దినం సమిసి పోతుంది. అయితే ఇప్పటికే ఈ 'మూల కారాణాన్ని' దాటి చాలా దూరం విస్తరించిన ఈ ఆధునిక ఆయుధ సామాగ్రి మట్టుకు ఇక శాశ్వతంగా నిలిచిపోతుంది. దీనికి స్పందించి రాజకీయ కార్యకర్తలు కూడ అంతే ఆధునికమైన ఆయుధాలను సమకూర్చుకోవడం మొదలు పెడితే, దానివి దురలవాటును పమర్థించడానికి వాడుకుంటారు. మరొక వైపు సామాజిక హింస స్థాయి మరింత పెరుగుతుంది.

ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌ను తీసుకుంటే, నక్సలైట్ వ్యతిరేక కార్యక్రమాలలో పాల్గొనే పోలీసులకు ప్రభుత్వం ఆధునిక ఆయుధాలు సరఫరా చేసిన ఫలితంగా నక్సలైట్లు కూడా ఆధునిక ఆయుధాలు సమకూర్చుకొనడం మొదలు పెట్టారు. ఇప్పుడు హైదరాబాద్‌లోని పాతబస్తీలో గస్తీ తిరిగే పోలీసుల చేతిలోనూ మనకు ఆటోమాటిక్ తుపాకులు కనబడతాయి. పాతబస్తీలో అడపాదడపా జరిగే మత కల్లోలాలలో ఆధునికమయిన ఆయుధాలు గతంలో ఎన్నడూ ప్రయోగించలేదు. ఇప్పుడిక గస్తీ తిరుగుతున్న పోలీసుల చేతిలోని ఆటోమాటిక్ తుపాకులను చూసి పాత బస్తీ గూండాలు కూడ ఆధునిక ఆయుధాలు పమకూర్చుకోవడం మొదలుపెడితే ఆ పరిణామం ఫలితాన్ని ఊహించుకోవలసిందే!

నిజానికి పెరుగుతున్న అధికార హింసాప్రవృత్తికి నేపథ్యంగా నిలిచే ఈ సంక్షోభాలు ఒక్కొక్కటి ఒక్కొక్క వైఫల్యాన్ని సూచిస్తాయి. అది ప్రజల న్యాయమయిన ఆకాంక్షలను తీర్చడంలో వైఫల్యం. లేదా, భారత రాజ్యాంగం లక్ష్య ప్రకటన, రెండు మూడు అధ్యాయాలు, ప్రజలు కోరుకోగల సకల ఆకాంక్షలకూ హామీ యిస్తాయి కాబట్టి, అది రాజ్యాంగబద్ధంగా పరిపాలించడంలో వైఫల్యం. ఇటువంటి ఒక్కొక్క వైఫల్యమూ అధికారహింసా ప్రవృత్తిని ఒక్కొక్క మెట్టు పెంచుతుంది. ఈశాన్య భారత గిరిజన ప్రజానీకం కోరుకున్న స్వయం నిర్ణయాధికార హక్కును తిరస్కరించడం అక్కడ సైనిక పాలనకూ, గృహ దహనాలకు, తగాదాలకు, హత్యలకూ, అత్యాచారాలకూ, గ్రామాల బలవంతపు పునరావాసాలకూ దారితీసింది. ఆర్థిక విధానాలు పేదరికాన్నీ దోపిడీ దౌర్జన్యాలనూ నిర్మూలించడంలో ఘోరంగా విఫలంకావడం నక్సలైట్ ఉద్యమానికీ, దానిని అణచడంలో భారత రాజ్యాంగం రూపొందించిన 'ఎన్‌కౌంటర్' అనే విలక్షణమయిన భారతీయ హింసా రూపానికి దారి తీసింది.

ఆర్థిక సంక్షోభానికి సమాధానంగా ఆర్థిక రంగాన్ని సడలించడం అనే పరిష్కారాన్ని దాదాపు 10 సంవత్సరాలుగా మనపాలకులు అనుసరిస్తున్నారు. ఇది అనివార్యంగా కార్మిక వర్గంమీద, రాజకీయ ప్రత్యర్థులమీద, అణచివేతకు దారితీస్తుంది. ఈ సడలింపు ప్రారంభమయినప్పుడే జాతీయ భద్రతా చట్టాన్ని, అత్యవసర సర్వీసుల నిర్వహణ చట్టాన్ని రూపొందించారు. సడలింపు పెరిగే క్రమంలో కార్మికవర్గంమీద మరింత అణచివేత పెంచడానికి కార్మిక చట్టాలు, పారిశ్రామిక వివాదాల (సవరణ) బిల్లు, ఆస్పత్రులు ఇతర సంస్థల (ఫిర్యాదుల పరిష్కారం) బిల్లు అవసరం అయ్యాయి. ఆర్థిక రంగం ప్రాంతీయ సమతౌల్యాన్ని సాధించడంలో ఎంతగా విఫలం అయిందంటే దేశంలోని ఏ ప్రాంతానికి చెందిన వారయినా ఏ కొంచెమయినా తమ జాతి ప్రయోజనాన్ని గురించి అలజడి చేయడాన్ని రాజ్యాంగ యంత్రం సహించలేని స్థితికి వచ్చింది. కేవలం జాతి స్వయం ప్రతిపత్తిని పమర్థించినా ఒక ఆశ వ్యక్తం చేసినా అది జీవితఖైదు వేయగల 'విచ్ఛిన్న కార్యకలాపాల' క్రిందికి వస్తుందని కొత్తగా రూపొందించిన టెర్రరిస్టు మరియు విచ్ఛిన్నకర కార్యకలాపాల (నిరోధక) చట్టం - లేక 'టాడా' అంటుంది.

అధికార యంత్రాంగం పట్ల ప్రజలలో నిరసన ఎంతగా వుందంటే జాతీయ చట్టం వంటి పెద్ద చట్టాలు సరిపోవు. చిన్న చిన్న నిరసనలకు కూడ కఠినమయిన శిక్షలు వేయాలి. బస్సుల మీద రాళ్లు వేస్తే శిక్షించడానికి ఒక చట్టం (ప్రభుత్వ ఆస్తులు విధ్వంసన నిరోధక చట్టం, 1984), జాతీయ పతాకాన్నీ రాజ్యాంగాన్నీ అవమానపరిస్తే శిక్షించడానికి ఒక చట్టం (జాతిగౌరవ భంగ నిరోధక చట్టం). ఇటువంటి శాసనాలు చేసారు. అధికార యంత్రాంగం పట్ల ప్రజలలో వున్న అసంతృప్తి మిలిటెంట్ రూపం తీసుకుంటే మట్టుకు, వలస పాలకులు తయారుచేసిన నేరవిచారణ పృత్తిలోవున్న కొద్దిపాటి హక్కులను సహితం సహించడానికి వీలులేదు. 'టాడా' చట్టంతో ఈ హక్కులన్నింటినీ తొలగించారు. నియంతలు కలలు గనే అధికారాన్నీ - రహస్యవిచారణ, బలవంతపు వాంగ్మూలం, నిర్దోషిత్వం రుజువు చేసుకువే బాధ్యత ముద్దాయి మీదనే పెట్టడం, అప్పీలుకు తిరస్కృతి, సరయిన ఛార్జి షీటు లేకుండా విచారణ జరపడం - అన్నీ కూడ 'టాడా'లో లిఖించారు. ఈ భయంకరమైన చట్టం క్రింద ఇప్పటికే దాదాపు 10,000 మంది ఆంధ్రప్రదేశ్‌లో, పంజాబ్‌లో, కాశ్మీర్‌లో, హర్యానాలో, గుజరాత్‌లో, ఢిల్లీలో, మహారాష్ట్రలో విచారణకు ఎదురు చూస్తున్నారు.

ఒకవైపు ఈ రాక్షస శాసనాలకు, మరొక వైపు పోలీసు రాక్షసత్వం కలిస్తే ప్రస్తుత భారత రాజ్యాంగ యంత్రం అవుతుంది. పేరు ఏదయినా గతంలో హామీ యిచ్చి వుండవచ్చును గానీ ఇప్పుడు మట్టుకు ఇదే భారత రాజ్యాంగ యంత్రం. అయితే అదే సమయంలో ప్రజలలో చైతన్యమూ ప్రతిఘటన కూడ గతంలో ఎన్నడూ లేనంతగా ఇవ్వాళ ఉన్నాయి. ఈ ప్రతిఘటన చాలా అసంఘటితంగా వుండడం విచారించదగ్గ విషయమయినప్పటికి, అది రాశిలోను, గుణంలోను చెప్పుకోదగ్గ పరిణామం చేరుకుందనేది నిర్వివాద అంశం. ప్రజలు భూమికోసం వేతనాలకోసం, గౌరవ ప్రదమైన జీవితం కోసం, గిట్టుబాటు ధరలకోసం పోరాటాలు చేస్తున్నారు. సమానత్వం కోసం ఉద్యమిస్తున్నారు. తమ భూములను ముంచేసే

ప్రాజెక్టులకు వ్యతిరేకంగానూ, తమ ప్రాణానికీ, ఆరోగ్యానికి ప్రమాద కరమయిన అణు విద్యుత్ కేంద్రాలకు వ్యతిరేకంగానూ ఆందోళన చేస్తున్నారు. ఈ పోరాటాలు, ఆందోళనలు రకరకాల రూపాలలో సాగుతున్నాయి.

రాజకీయ పోరాటాలు, రాజకీయాలు లేవని చెప్పుకునే పోరాటాలు, హింసాత్మకమైన పోరాటాలు, అహింసాత్మకమైన పోరాటాలు, ఎన్నికల పరిధిలో వున్న పోరాటాలు... అన్ని రూపాలలోనూ పోరాటాలు సాగుతున్నాయి. అత్యంత పాశవికమైన నిర్బంధాలు కూడ ప్రజలను పూర్తిగా నాశనం చేయ లేకున్నాయి. అందుకు విరుద్ధంగా తాను ఎంతగా హత్యలకూ, దహనాలకూ, అరెస్టులకూ, అత్యాచారాలకూ పాల్పడితే ప్రజలో అపంతృప్తి అంతగా బలపడుతుందని ప్రభుత్వం అనుభవ పూర్వకంగా గ్రహిస్తోంది. ఈశాన్య భారతమే దీనికి చక్కని ఉదాహరణ. ఒక పిడికెడు మంది తిరుగుబాటుదార్లు భారత సైన్యాన్ని 35 సంవత్సరాలుగా ముప్పుతిప్పలు పెడుతున్నారు. అయితే వాస్తవాన్ని అనేక ప్రాంతాలలో చూడవచ్చును - అది బీహార్‌గాని 'ఆంధ్రప్రదేశ్ గానీ' ఆ మాటకొస్తే పంజాబు రాష్ట్రమే గానీ ఈ ప్రతిఘటన తన అసంఘటిత స్వభావాన్ని వదులుకొని ఒక బలమైన ఐక్యప్రజా ఉద్యమం కాగలగిన నాడు రాజ్యాంగ యంత్రం పెంచి పోషిస్తున్న అణచివేత శక్తి తప్పనిసరిగా ఓటమిని చవి చూస్తుంది.

*నలుపు - పక్షపత్రిక, 1-8-1989*

# 12. తిరిగి తిరిగొచ్చింది

మళ్ళీ మొదలయిన నిర్బంధంమీద ఇది రిపోర్టుకాదు. ఎందరిని చంపారో ఎట్లా చంపారో వివరించే పట్టిక కాదు. రిపోర్టులు రాసుకున్న తరువాత, పట్టికలు తయారుచేసుకున్న తరువాత, ప్రజాస్వామిక వాదులంతా అన్ని విషయాలూ విడమరచి చెప్పినా చివరికి చెన్నారెడ్డి ఇట్లా చేసాడే అని కొంత మనస్తాపం చెందిన తరువాత, గడచిన సంవత్సర కాలం చరిత్రను నెమరు వేసుకొని ఆలోచించడం అవసరం.

పాలకవర్గాలకు నీతిలేక పోయినా కనీసం ఇంగితం ఉంటుందని ఆశిస్తాం. ప్రజల క్షేమాన్ని కాకపోయినా కనీసం తమ క్షేమాన్నయినా కాంక్షిస్తారని భావిస్తాం. వాళ్ళు స్వల్పకాల ప్రయోజనాలే తప్ప దీర్ఘకాల శ్రేయస్సును గురించి ఆలోచించే స్థితిలో సహితం లేరని అర్థం చేసుకోవడానికి కొంత కాలం పడుతుంది. పాలకవర్గాలలోని వివిధ ముఠాలను సమానంగా సంతృప్తిపరచడం వాళ్ళ ఐక్యతకే అవసరం అని ఏ అణాకాణీ పత్రికా సంపాదకుడయినా చెప్పగలడు. అయితే అధికారానికి వచ్చిన తొమ్మిది నెలల తరువాత కూడ చెన్నారెడ్డి తన ప్రభుత్వంలోని అన్ని లాభదాయకమయిన శాఖలనూ తన దగ్గరే ఉంచుకున్నాడు. ఎక్సైజ్, అడవులు, రెవెన్యూ, హోం - అన్నీ తనవే. జనార్ధనరెడ్డినీ శ్రీనివాసులురెడ్డినీ విడతలు విడతలుగా అవమానసరుస్తాడు. 'కల్లోలం' ఉందనయినా కరీంనగర్‌ను గుర్తించడు. రాజశేఖరరెడ్డి ఉన్నాడని కసికొద్దీ కడపను గుర్తించడు.

ఇది దోపిడీ రాజ్యం మాత్రమేకాదు. దీర్ఘకాలప్రాతిపదికగానీ దానికి అవసరమయిన సంయమనంగానీ లేకుండ ఎక్కడికక్కడ ఎంతదొరికితే అంత కబళించే రాజ్యం. తన అంతర్గత క్షేమాన్ని గురించి సహితం ముందుచూపులేని పాలన. ఇంక ప్రజా ఉద్యమాల విషయంలో దీనికి ముందుచూపు రమ్మంటే ఎక్కడినుండి వస్తుంది? అయినా 'కర్మణ్యేవాధికారస్తే' అని నమ్మిన జాతి కాబట్టి చెప్తూనే ఉంటాం. నీ మంచి కోసమే, నీ శాంతిభద్రతల కోసమే, నీ పరిపాలన యోగక్షేమాలను దృష్టిలో పెట్టుకునే చెప్తున్నామని చెప్తాం. (వినకపోతే నువ్వే చెడిపోతావని చెప్తాం) మనసులో మట్టుకు వినకపోతే వాడు చెడినా చెడకున్నా ప్రజలు మరొక పర్యాయం హింసకు గురవుతారన్న భయం ఉంటుంది. నిజానికి అందుకోసమే చెప్తాం. నీ మంచి కోసమేనని నచ్చజెప్పి ప్రజలకు మేలు చేద్దామని ఆశిస్తాం. మనం తెలివయిన వాళ్ళమనుకుంటే వాడికి మట్టుకు తెలివిలేదా?

'స్వేచ్ఛను దుర్వినియోగం చేశారు' అంటాడు. ఎందుకని అడిగితే పిల్లవాడు సైకిల్ పాడుచేస్తే తీసేసుకున్నట్టు దాన్ని తీసేసుకున్నాడట. 'మరి నువ్వు సద్వినియోగం చేస్తున్నావా' అని అడగకూడదు. వాడు తన స్వేచ్ఛను పుట్టుకతో పొందాడు. ప్రజలు వాడి నుండి భిక్షగా పొందారు. 'నేను మీటింగ్‌లు పెట్టుకోనిస్తే నన్నే తిడతారా?' అంటాడు. 'మేము వోట్లు వేస్తే మమ్మల్నే చంపుతావా' అనకూడదు. చంపడం రాజధర్మం. 'నా దగ్గర లైసెన్స్ తీసుకోకుండ తుపాకులు కొంటారా?' అంటాడు. 'మరి నువ్వు మమ్మల్ని చంపేవాళ్ళకు

లైసెన్స్‌లు ఇస్తావు గానీ మాకు ఇయ్యవుకదా' అని అడగకూడదు. ఆస్తులు ఉండేవాళ్ళకు ఆత్మరక్షణ గానీ దిక్కుమాలిన వాళ్ళకు కూడానా? 'మీ అవసరాలకోసం మా వాళ్ళనుండి డబ్బులు వసూలు చేసుకుంటారా?' అంటాడు. 'మరి మావాళ్ళ దగ్గర లేవుకదా' అనకూడదు, 'మీ దగ్గరుండేదంతా మాదేకదా' అనకూడదు. అది అడనపు ప్రసంగం అవుతుంది. 'పోనీకదా అని ఎన్‌కౌంటర్లు ఆపేస్తే మావాళ్ళ భూములు ఆక్రమించి మీ వాళ్ళకు పంచుతారా' అంటాడు. 'మరి మా వాళ్ళ భూములు కబ్జా చేసుకొని మీలో మీరు పంచుకోవడంలేదా' అని ఎదురుప్రశ్న వేసే అవకాశం మీకుండదు. ఈ లోపల మిమ్మల్ని 'టాడా' క్రింద జైల్లో పెడతాడు. 'మీరే కోర్టులు పెట్టి న్యాయ నిర్ణేతలూ ధర్మ నిర్దేశకులూ అవుతారా' అంటాడు. 'సమాంతర ప్రభుత్వాలు నడుపుతారా' అంటాడు. మీలో ఈ పని చేయని వాళ్ళెవరయినా ఉన్నారా అని అడగకూడదు. చిత్తూరులో చెంగారెడ్డి, తాడిపత్రిలో దివాకరరెడ్డి, పులివెందులలో రాజశేఖరరెడ్డి, నరసరావుపేటలో కృష్ణారెడ్డి - వీళ్ళు నడుపుతున్నవి సమాంతర ప్రభుత్వాలు కావా అని అడగకూడదు.

తాము ధనవంతుల ప్రయోజనాలకోసం చేసే పనులే పేదవాళ్ళ ప్రయోజవాలకోసం చేపడితే అది 'స్వేచ్ఛను దుర్వినియోగం చేయదం' అవుతుంది. అప్పుడు 'స్వేచ్ఛ' అనే మాటకు అర్థం ఏమిటో కూడ మనకు అర్థం అవుతుంది.

వాడికి ఏవో కారణాలు దొరకవని కాదు. ప్రజా ఉద్యమాలు సరళరేఖలో నడవవు. ప్రజా చైతన్యం ఎగుడుదిగుళ్ళు లేకుండ సాఫీగా ఎదగదు. బలవంతులూ, ధనవంతులూ చలాయించే అధికారాన్ని పేదలు చేజిక్కించుకోవడంతో సరిపోదు. దృక్పథంలో విలువలలో సమగ్రమయిన మార్పు రావడానికి కొంత కాలం పడుతుంది. వర్గ దృక్పథం అనేది ఒక్క భూమి సంబంధాలకే కాదు, పమాజంలోని అన్ని విషయాలకూ వర్తిస్తుంది. అన్ని సామాజిక విలువలకూ వర్తిస్తుంది. భూమి విషయంలో వర్గ దృక్పథం ఏర్పడినంత సులభంగా ఇతర విషయాలలో ఏర్పడదు. నేరము, శిక్ష, కుటుంబ పంబంధాలు, లైంగిక నీతి, ప్రజల మధ్య వైరుధ్యాలు - అన్ని విషయాలలోనూ సరయిన ప్రజాస్వామిక దృక్పథం ఏర్పడడం అనేది కొంత ప్రయాసమీద జరుగుతుందిగానీ తనంతట తాను జరగదు. ఈ సమాజంలో పుట్టి పెరిగిన వారిలో ఈ సమాజం నిర్దేశించిన విలువలే ప్రబలంగా ఉంటాయి. జీవిత అనుభవంతో కొన్ని విలువలను తిరస్కరించినా మిగిలినవి పోవడానికి చాలా పోరాట అనుభవం, రాజకీయ పరిణతి అవసరం అవుతాయి. అట్టడుగు వర్గాలలో పుట్టిన వారిలో వర్గకసి పెల్లుబికినంత వేగంగా విశాల ప్రజాస్వామిక దృక్పథం ఏర్పడదు. అది ఒక క్రమంలోనే జరగగలదు.

అంతేకాదు. శతాబ్దాలుగా అణచివేతకు గురయి 'అధికారం'నుండి వెలివేయబడ్డవాళ్ళు అధికారపీఠం మీద తిరుగుబాటు చేసి దాన్ని బద్దలు గొట్టి అధికారాన్ని తాము కొంతమేరకు చేజిక్కించుకున్నప్పుడు దానితోబాటు అధికార సంస్కృతిని కూడ స్వంతం చేసుకునే ప్రమాదం ఉంది. దీనిని నివారించే ప్రయత్నం ప్రజా ఉద్యమాలలో ఒక ముఖ్యమయిన అంతర్గత పోరాటం.

అధికారానికి కొన్ని సంకేతాలుంటాయి. ఆ సంకేతాలే అధికారాన్ని సూచిస్తాయి. సంకేతమే అధికారం అనుకునేంతగా అవి ప్రామాణికతను పొందుతాయి. ఏ అధికారమయినా ఒక చారిత్రక క్రమంలో ఏర్పడుతుంది. కాబట్టి ఆ చారిత్రక క్రమంలో పుట్టిన ఉన్నత విలువలూ లక్షణాలూ ఆ అధికార సంస్కృతిలో చోటు చేసుకుంటాయి. వాటితో బాటు అధికారం అనే దానికి సర్వత్రా ఉండే అణచివేత లక్షణం, ఒక్కొక్క అధికార రూపానికే ప్రత్యేకంగా ఉండే నీచమయిన లక్షణాలు ఆ సంస్కృతిలో ఉంటాయి. సాధారణంగా అధికార సంస్కృతిలోని ఉన్నత విలువలు కాక నీచమయిన విలువలే దానికి సంకేతాలవుతాయి. ఆధిపత్యం అనేది మౌలికంగా అప్రజాస్వామికం కావడం దీనికి కారణం కావచ్చు. రాజ్యాధికారం అనే దానిలో ప్రజా సంక్షేమానికి సంబంధించిన ఎన్ని విలువలున్నా బలప్రయోగమే దానికి పంకేతం అవుతుంది, మిలిటరీ యూనిఫారమే దానికి సూచిక అవుతుంది. మగపెత్తనపు విలువ అయిన 'మగతనం' అవేదానికి ధైర్య సాహసాలకంటే మొరటుదనమూ తిరుగుబోతు తనమూ ఎక్కువగా ప్రమాణాలవుతాయి. బ్రాహ్మణీకం ప్రథమ పురుషార్థాన్ని గురించి ఎంత మాట్లాడినా ఎదుటివారిని నీచంగా చూసే అహంభావమూ శుష్కపాండిత్యమూ దావి ప్రధాన లక్షణాలవుతాయి. ఫ్యూడల్ దొరతనం ఎంత కళాపోషణ చేసినా, నా మాటకు ఎదురులేదనే నియంతృత్వ వైఖరే దానికి సంకేతం అవుతుంది.

అణచివేతకు వ్యతిరేకంగా తిరగబడేవాళ్ళు ఆధిపత్యాన్ని బద్దలుకొడుతూ అదేపమయంలో ఆధిపత్యానికి ఉండే ఈ సంకేతాలను తరచుగా స్వంతం చేసుకుంటారు. వాళ్ళ మనసులలో అవే విజయానికి చిహ్నం అవుతుంది, ప్రమాణం అవుతుంది. ఒక అందమయిన కట్టడంగా తప్ప ఇతరత్రా విలువలేని ఎర్రకోట చారిత్రక కారణాలవల్ల భారతదేశంలో రాజ్యాధికారానికి సంకేతం అయింది. ఆ ఎర్ర కోటను స్వంతం చేసుకొని దానిమీద తమ ప్వంత జెండాను ఎగరవేయడం భారత రాజ్యాధికారంమీద విజయానికి చిహ్నంగా కమ్యూనిస్టుల నుండి ఎన్టీ రామారావుదాకా తమ ప్రచార సాహిత్యంలో రాస్తూ ఉన్నారు. ఇది నిరపాయకరమయిన ఉదాహరణే గానీ, ఆ సంకేతం ఒక దుర్మార్గపు ఆచారమో విలువో అయినప్పుడు అది ప్రమాదకరంగా పరిణమించగలదు. ఈ ప్రమాదాన్ని గుర్తించడం, నివారించడం అవసరం. ప్రజాకోర్టులలో నేర విచారణ పద్ధతులు, వేసే శిక్షలు, భూస్వాముల పంచాయితీల నమూనాలో ఉన్నాయని కొన్ని ప్రాంతాలనుండి వస్తూన్న విమర్శను ఈ దృష్టితో సీరియస్‌గా పరిగణించి సవరించుకోవడం తప్పనిసరి కర్తవ్యం. ఇది ప్రజా ఉద్యమాల అంతర్గత సమస్య. ఇవి ఉద్యమ క్రమంలో పరిష్కారం కావలసిన పొరబాట్లు. చెన్నారెడ్డికి మట్టుకు ఇదంతా 'దుర్వినియోగం' అనే ప్రచారానికి మందుగుండుగా ఉపయోగపడుతుంది. ఉపయోగిస్తాడు.

ఏ ప్రచారమయినా చేసేవాడికంటే మోసేవాళ్ళ మీద, వినేవాళ్ళమీద ఎక్కువగా ఆధారపడి ఉంటుంది.మోయడానికి తగినంత మంది సిద్ధంగా ఉంటేనే చేసే ప్రచారం అనాయాసంగా విజయవంతం అవుతుంది. ఎంత మంది సిద్ధంగా ఉన్నారో గత మూడు నాలుగు నెలల సంఘటనలు రుజువు చేస్తాయి. పాలక వర్గాల ప్రయోజనాలను సిద్ధాంతీకరించే

ప్రచారాన్ని తమ స్వంత పనిగా భావించి మోసుకువెళ్లేవాళ్ళు సమాజంలో చాలామంది ఉంటారు. ప్రొఫెసర్లు, పత్రికా విలేకర్లు, సంపాదకులు, కథకులు, సినిమా స్క్రిప్ట్ రచయితలు, రాజకీయపార్టీల ప్రచారకులు - ఇటువంటి మేధావులు సమాజంలో అసంఖ్యాకంగా ఉంటారు. ఇక వినే వాళ్ళంటారా, ఈ మేధావులు చెప్పేదంతా నిజమేనని తరతరాలుగా నమ్ముతున్న వాళ్ళు కొందరు, తమ స్వంత ప్రయోజనాల దృష్ట్యా నమ్మేవాళ్ళు కొందరు, ప్రజా ఉద్యమాల ఫలితంగా సాంప్రదాయిక సామాజిక విలువలు తలక్రిందులు కావడాన్ని సహించలేని వాళ్ళు కొందరు, తమలోని నిరాశా దౌర్బల్యంవల్ల దుష్ప్రచారాన్నే త్వరగా నమ్మేవాళ్ళు కొందరు - మొత్తానికి ప్రజా ఉద్యమాలకు వ్యతిరేకంగా జరిగే ప్రచారాన్ని నమ్మడానికి సిద్ధపడేవాళ్లూ చాలా మందే ఉంటారు. అది శరవేగంగా సమాజంలో పాకిపోతుంది. మౌలికమయిన సమస్యలను లేవదీసే సామాజిక ఉద్యమ మేదయినా మన జీవితాన్ని అనేక విధాల కుదిపేసి మనల్ని రకరకాల మానసిక సామాజిక ఇబ్బందులకు గురిచేస్తుంది. అందుకే పాలకులలో ఎంతటి అవినీతినయినా అక్రమప్రవర్తన నయినా క్షమించే వాళ్ళం ఉద్యమాలలో దొర్లే చిన్నపొరబాట్లను సహితం క్షమించం. వ్యవస్థ సుస్థిరతకూ మన మానసిక శాంతికీ లంకెవుంది. వ్యవస్థను కాపాడే శక్తులలో ఇది ఒకటి. భూస్వాముల పంచాయితీలలోనూ పోలీసుల నేర విచారణలోనూ ఎన్నో అన్యాయాలు నిత్యం చూస్తూ ఉంటాము. అవి అన్యాయాలేనని ఒప్పుకున్నా అవి వ్యవస్థలో భాగం కాబట్టి మనకు పెద్దగా ఆందోళన కలిగించవు. దళిత వర్గాల వాళ్ళు, అందులోనూ ఇప్పుడిప్పుడే యుక్తవయస్కులవుతున్న వాళ్ళు పంచాయితీలు నిర్వహించదం మన సాంస్కృతిక విలువలనే తలక్రిందులు చేసే విషయంకాబట్టి ఆ పంచాయితీలు పూర్తిగా సవ్యంగా ఉంటే తప్ప సహించం. విప్లవకారుల మీద చాలా సత్ప్రవర్తనాభారం పెదతాం. విప్లవం అంటే మనకు ఉండే మానసిక అసహనానికి ఇది తార్కాణం. రాజకీయ సంసిద్ధత ఉండేవాళ్ళలోనూ ఈ మానసిక అసహనం చాలా ఉంటుంది. ప్రజాకోర్టులవల్ల పెత్తనాన్నీ ప్రాబల్యాన్నీ ఆదాయాన్నీ కోల్పోతున్న భూస్వాములూ రాజకీయనాయకులూ పోలీసులూ దీనిని ఉపయోగించుకొని తమ దుష్ప్రచారాన్ని ముందుకు తీసుకుపోతారు.

నిజామాబాద్ జిల్లా మదనపల్లెలో ఎస్.పి. రఘువీర ప్రసాద్ మీనా ఆధ్వర్యంలో 1990 జూన్ 11 తెల్లవారుజామున ప్రసాద్, నరసమ్మ, స్వామి అనే ముగ్గురు హతమార్చబడతారు. అయ్యోపాపం అని ఎవరూ అవే లోపలే ప్రసాద్ ప్రజాకోర్టులు నిర్వహించిన తీరును మీనా ప్రచారంలో పెడతాడు. అతను ప్రయోగించిన హింసా పద్ధతులను అభివర్ణిస్తాడు. పత్రికలు దీనినంతా రాస్తాయి. ప్రసాద్‌ను చంపేయగా పల్లెలన్నీ హాయిగా ఊపిరి పీల్చుకుంటున్నాయని రాస్తాయి. అందరూ చదివి 'స్వేచ్ఛను ఇంతగా దుర్వినియోగం చేస్తే 'ఎన్‌కౌంటర్లు' జరగక ఏమవుతుందని పెదవి చప్పరిస్తారు. కానీ నరసమ్మనూ స్వామినీ ఎందుకు చంపావని ఎవ్వరూ మీనాను అడగరు. అసలు ఒక పోలీస్ అధికారి ఒక వ్యక్తిని చంపేసి, 'ఇప్పుడు ప్రజలంతా హాయిగా గాలి పీల్చుకుంటున్నారు' అని ప్రకటిస్తే దానిని ప్రచురించడమే ఘోరమయితే మరొక ఇద్దరిని ఎందుకు చంపావని ఎవ్వరూ అడగలేకపోవడం దానికి

పదిరెట్లు ఘోరం. నరసమ్మ గురించి ఎవరూ చెడుగా ఏమీ చెప్పడంలేదు. స్వామి గురించి ఇంకా నాలుగు మంచి మాటలే చెప్తారు. అంతేకాదు, అదే ప్రసాదు అదే వూళ్ళో భూస్వామి భూమిలోని కలప కొట్టించి ఊరందరికీ పంచాడంట. భూస్వామి గోదాములోని ధాన్యాన్ని కూడ ఊరందరికీ పంచాడంట. ఇది విప్లవకార్యక్రమం కాదని విమర్శించే వాళ్ళు ఉంటారుగానీ 'స్వేచ్ఛను దుర్వినియోగం చేయడం' అని మీనా కూడ అనడు. అయినా ఇదేదీ ప్రచారం కాదు.

ఒకసారి ఆ ప్రచారం చేసిన తరువాత మరొక రెండు ఎన్‌కౌంటర్లు దాకా అదే సరిపోతుంది. తిప్పాపూర్‌లో జూలై 23వ తేదీన రఘువీర్ ప్రసాద్ మీనా స్వయంగా పక్కనుండి యాదగిరి, నర్సాగౌడ్, బాలిరెడ్డి, గాలిరెడ్డి అనే నలుగురిని పట్టపగలు ఇళ్ళనుండి బయటికి లాగి కాల్చేస్తాడు. అందులో నర్సాగౌడ్ 16 సంవత్సరాల పసివాడు. పొద్దున్నే పోలీసులు గ్రామాన్ని చుట్టుముట్టి ఇళ్ళన్నిటికీ గొళ్ళెం పెట్టి రోడ్లోకి వచ్చినవాళ్ళను ఊరిమధ్య కూర్చోబెట్టి జీపుకు మైకు కట్టి 8 మంది పేర్లు ప్రకటిస్తూ వాళ్ళందరినీ లొంగిపొమ్మంటూ ప్రకటన చేసారు. పశువుల కొట్టంలో దాక్కున్న బాలిరెడ్డినీ, తమ్ముడిని అరెస్టు చేస్తే ఎందుకు చేశారని అడగడానికి రోడ్లోకి వచ్చిన గాలిరెడ్డినీ, రోడ్లోనే దొరికిన నర్సాగౌడ్‌నూ పశువుల కొట్టంలోనే ఊరందరూ వింటూండగానే కాల్చేసారు. మిగిలిన వాళ్ళకోసం ఇల్లిల్లూ వెతికారు. దొరికితే చంపేస్తారని భయపడి పక్కగదిలో గడ్డివాములో దాక్కున్న యాదగిరిని పట్టుకొని గడ్డిలోనే కాల్చేశారు. మళ్ళీ ఆగస్ట్ 10వ తేదీన మెదక్ జిల్లా నాగాపురానికి చెందిన గద్దె సిద్ధయ్యనూ మన్నె యాదగిరినీ నిజామాబాద్ జిల్లా వెల్లుట్లలోని పోలీసు క్యాంపు దగ్గర కాల్చేశారు. పోలీసుక్యాంపుమీద వాళ్ళు దాడిచేయడానికి సిద్ధమవుతుండగా ఎన్‌కౌంటర్ జరిగిందని అన్నారుగానీ వాళ్ళు చూపిస్తూన్న స్థలం నుండి బాంబు విసిరితే చెట్లకో తీగలకో తప్ప క్యాంపుకు తగలదు.

వీళ్ళందరినీ ఎందుకు చంపవలసి వచ్చిందో మీనా చెప్పలేదు. వాళ్ళు చేసిన 'దుర్వినియోగం' ఏమీలేదు. ఉండనక్కరలేదుకూడ. అప్పటికే పత్రికలు ప్రజాకోర్టులలో జరిగిన తప్పులను తమ బాధ్యతగా ప్రచారంలో పెట్టడం మొదలు పెట్టాయి. ఆ తప్పులు జరిగిన వూళ్ళకూ ఎన్‌కౌంటర్లు జరిగిన వూళ్ళకూ ఏమీ సంబంధం ఉండనక్కరలేదు. అదే వూళ్ళలో ప్రజాకోర్టులలో ప్రజలకు న్యాయమూ జరిగి ఉండవచ్చును. అదంతా అనవసరం. ఇప్పుడిక నిజామాబాద్‌లో 'ఎన్‌కౌంటర్ల' కు అనుకూలమయిన భావ వాతావరణం ఏర్పడిపోయింది.

అనుకూలమయిన భావ వాతావరణం ఏర్పడకపోతే 'ఎన్‌కౌంటర్లు' చేయలేరని కాదు. ధర్మవరం దగ్గర కేశనాయక్‌నూ గోదావరిఖనిలో పిట్టల సత్తయ్యనూ ప్రత్యేకమయిన 'కారణం' ఏమీ లేకుండానే కాల్చేశారు. కేశనాయక్‌ను మే 8వ తేదీన ధర్మవరం ఎస్.ఐ, ఓబులనాయనిపల్లి సమీపంలోని గుట్టమీదికి తరిమి కాల్పులు జరిపాడు. పిట్టల సత్తయ్యను గోదావరిఖనిలో తెల్లబట్టల పోలీసులు సాయంకాలం నమాజు సమయంలో రోడ్డు వెంబడి తరిమి కాల్చారు. ఈ రెండు హత్యలకూ 'ఆత్మరక్షణ' కథ మినహా వేరే నైతిక సమర్థన

ఇవ్వాలని పోలీసులు ప్రయత్నం కూడ చేయలేదు. అక్కడ రాడికల్ కేశనాయక్‌కూ ఇక్కడ జన రక్షణ సమితి పిట్టల సత్తయ్యకు మంచి పనులు చేసారన్న పేరే తప్ప చెడు చేసారన్న అభియోగం లేదు.

'ఆత్మ రక్షణ' కథ కూడ అనవసరం అనుకున్న చోట విప్లవ గ్రూపుల మధ్య ఉన్న అవాంఛనీయమయిన కలహాలను వాడుకోవడానికి సహితం వెనకాడలేదు. ఈ పరస్పర దాడులవలన ప్రజలకు నష్టమేగానీ చెన్నారెడ్డి కొచ్చిన కష్టమేమిటో తెలీదు. ఏమీ లేకపోయినా వాడుకుంటూ ఉన్నాడు. మేము చంపడం మానేస్తే వాళ్ళే చంపుకుంటున్నారు చూడండి అని హేళన చేసాడు. అంతటితో ఊరుకోక రెండు హత్యలను ఆ పేరుతో కప్పి పెట్టాలని చూసారు. అంతిరెడ్డి వరంగల్ జిల్లా ములుగు అడవి ప్రాంతంలో గిరిజనులకు రెండు దశాబ్దాలకు పైగా పరిచయం ఉన్న కమ్యూనిస్టు నాయకుడు. అటువంటి వ్యక్తిని హైదరాబాదులో జూన్ 6వ తేదీ రాత్రి అపహరించి 7వ తేదీన చంపేసి 9 ఉదయం కరీంనగర్‌లో పి.వి. నరసింహరావు స్వగ్రామమయిన వంగర గ్రామ శివారులో పారేసి, కొద్దిసేపు 'గుర్తుతెలియని శవం' అనీ, కొద్ది సేపు 'గ్రూపు తగాదాల్లో వేరే గ్రూపు వాళ్ళు చంపి ఉంటారు' అనీ ప్రచారం చేశారు. అదే ములుగు దగ్గరున్న లక్ష్మీదేవిపేటలో అగస్ట్ 6 రాత్రి రవీందర్ రెడ్డి అనే పి.డి.యస్.యు. విద్యార్థి సంఘం బాధ్యుడిని ఇంట్లో నుండి నిద్రలేపి ఊరిబయటకు తీసుకుపోయి కాల్చేశారు. ములుగు సి.ఐ. ప్రభాకరబాబు ఈ హంతక బృందానికి నాయకత్వం వహించాడని నమ్మడానికి ఆధారాలున్నాయి. పొద్దున్న జిల్లా ఎస్.పి. నాగరాజు వచ్చి 'ఫణిబాగ్చి గ్రూపువాళ్ళు చంపివుంటారు' అని చెప్పి వెళ్ళి పోయాడు.

'దుర్వినియోగం' అనే వాదనకు ప్రజాకోర్టులలో జరిగే బలప్రయోగం ఒక్కటేకాక భూస్వాముల మిగులు భూముల ఆక్రమణను గూడ తార్కాణంగా వాడుకుంటూ వుంది ప్రభుత్వం. 'టాడా'ను విస్తృతంగా ప్రయోగిస్తూ వుంది. ప్రభుత్వమే ఎన్నో ఏళ్ళ క్రితం పంచుతానని చెప్పి చట్టాలు చేపి అమలు చేయక వదిలివేయగా ఆ పని ఇప్పుడు ప్రజలే చేసుకుంటే దానిని టెర్రరిస్టు చర్యగా వర్ణించి వేలసంఖ్యలో గ్రామీణ పేదలనూ గిరిజనులనూ 'టాడా' క్రింద జైలుకు పంపటమే కాక, దీనిని కూడ 'దుర్వినియోగం' అనే పేరుమీద విజయవంతంగా సమర్థించుకో కలుగుతున్నారంటే వ్యవస్థకుండే ప్రచారబలం ఎంతటిదో అర్థం అవుతుంది. ప్రభుత్వం చేపట్టే చర్యలకు అనుకూలంగానయినా వ్యతిరేకంగానయినా ఒక భావ వాతావరణాన్ని కల్పించే కర్తవ్యాన్నీ నిర్వర్తించే పట్టణ ప్రాంత మేధావి వర్గానికి గ్రామీణ భూస్వామ్య ధనిక రైతు వర్గంతో ఎంత సన్నిహిత సంబంధం ఉందంటే భూముల ఆక్రమణ న్యాయయిన పోరాటమనీ దాని మీద 'టాడా' ప్రయోగించడం దుర్మార్గమనీ చెప్పేవారు ఒక్కరూ మిగలలేదు. అక్కడక్కడ అత్యుత్సాహంతో భూస్వాములనేకాక మధ్య తరగతి రైతుల భూములను కూడ ఆక్రమించుకోవడం వల్ల కొంత, భూములేకాక ఉద్యోగాలూ, వ్యాపారాలూ కూడ ఉన్నవాళ్లు తమ భూములను మాత్రమే చూపించి తమను తాము మధ్యతరగతి రైతులుగా చలామణీ చేసుకునే అవకాశం ఉండడంవల్ల కొంత 'దుర్వినియోగం' అనే వాదనకు తార్కాణాలు కొన్ని దొరికాయి. అయినా ఈ వాదనను

సహితం దిగమింగి నిర్బంధాన్ని ఆమోదించడానికి సమాజం సిద్ధంగా ఉందంటే భూసమస్యను శాంతియుతంగా పరిష్కరించటం ఎంత అసాధ్యమో అర్థం అవుతుంది.

ప్రజా ఉద్యమాలు ప్రభుత్వాలకు సమస్యలు. ఆ విధంగా 'నక్సలైట్ పమస్య' అనే మాట పుట్టింది. సమస్యగా గుర్తించిన తరువాత ఇక దానిని పరిష్కరించాలి. అణచివేతే ఏకైక పరిష్కారంగా మారి ఇరవై ఏళ్ళు వెంగళరావునుండి ఎన్టీ రామారావు దాకా ప్రయత్నించారు. ఆ వ్యూహం ఉచ్చుగా మారి వాళ్ళ మెడకే బిగుసుకునేసరికి ప్రత్యామ్నాయం కోసం అన్వేషణ ప్రారంభించారు. తమ మంచి కోసమే ప్రారంభించిన ఈ ప్రయత్నాన్నయినా నిజాయితీగా కొనసాగిస్తారేమోనని ఆశించిన వాళ్ళకు నిరాశే ఎదురయింది. 'చట్ట సమ్మతమయిన కార్యక్రమాలను అనుమతించడం, చట్ట వ్యతిరేకమయివ వాటిని న్యాయపమ్మతంగా నిరోధించడం, గ్రామీణ పేదల జీవితాలను బాగు పరిచే పథకాలు చేపట్టడం' అనే త్రిసూత్ర పథకాన్ని తన విధానంగా చెన్నారెడ్డి ప్రకటించాడు. ఆ త్రిసూత్రాలలో ఒక్కదానినీ అమలు చేయడం లేదు. చట్టసమ్మతమయిన బహిరంగ సభలు, ఊరేగింపులు అటుంచి కోర్టు విచారణలను సహితం జరగనివ్వడంలేదు. సి.ఐ. మొగిలయ్య చేతినుండి 'మాయం' అయినా వపంత సుజాతల అదృశ్యం మీద హైకోర్టు ఆదేశించిన విచారణను తుపాకుల ప్రదర్శనతో భగ్నం చేయాలని ప్రయత్నించి, మళ్ళీ హైకోర్టు జోక్యంతో విచారణను కరీంనగర్ నుండి హైదరాబాద్‌కు తరలించగా, ఇక లాభం లేదని సాక్ష్యాల సేకరణకోసం తిరుగుతున్న సుభాష్‌ను ఆగస్ట 23 (1990) సాయంత్రం కొలిమికుంటలో అరెస్టు చేసి ఆగస్ట్ 24 ఉదయం కాల్చేశారు.

ఈ అతి తెలివి విధానం ఎక్కడికి దారితీస్తుందని చెన్నారెడ్డి భావిస్తున్నాడో తెలీదు. మళ్ళీ పోలీసులూ మంత్రులూ పాతపాటే వినిపిస్తున్నారు. డి.జి.పి. రొడ్డం ప్రభాకరరావుగారు ఈ మధ్య ఎక్కడో మాట్లాడుతూ 'ఆరువెలల కాలంలో నక్సలైట్లను అణచి వేస్తాం' అన్నాడట. గతంలో ఇదే ప్రగల్భం సలికిన హోం మంత్రులు కొందరు అయ్యప్ప దీక్ష పుచ్చుకుంటే మరికొందరు రిటైర్‌మెంట్ పుచ్చుకున్నారు. ఆ వైఖరి ఫలితంగా రాష్ట్రంలో పేద ప్రజానీకాన్ని మట్టుకు గత ఇరవై ఏళ్ళలో భయంకరమైన హింసకు గురి చేశారు. ఇప్పుడు మరొక రౌండు ఆ పనే చేయాలని చూస్తున్నారు. అయితే గతంలో నడిచినంత సులభంగా ఈ సారి ఆ పని జరుగుతుందనుకోవడం మూర్ఖత్వం అవుతుంది. ఏలినవారిలో 'ఇంటెలిజెన్స్' లోపించిందను కోవాలా, లేకపోతే ఎంతమంది చస్తే ఏంలే అనుకుంటున్నారా?

*సృజన - సెప్టెంబర్ 1990*

# 13. తుపాకీ రాజ్యం

1991 జనవరి 1. కొత్త సంవత్సరం తొలిదినం. చలికాలం మధ్యాహ్నం వెచ్చటి ఎండలో నిజామాబాద్ జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలోని 'లాన్స్'లో శ్రీ రఘువీర్ ప్రసాద్ మీనాగారు వాలుకుర్చీలో ఆసీమలయి ఉన్నారు. వారి ఎదుట మరి కొన్ని కుర్చీలున్నాయి. నిజామాబాద్ మునిసిపల్ చైర్మన్, ఇద్దరు ముగ్గురు కాంట్రాక్టర్లు కూర్చొని ఉన్నారు. మరోకొంత దూరంలో జిల్లాకు చెందిన అమీన్‌సాబ్‌లూ పర్కిల్ సాబ్‌లూ డి.ఎ.స్‌పి దొరలూ అటూ ఇటూ పచార్లు చేస్తున్నారు. గుంపులు గుంపులుగా నిలబడి కబుర్లు చెప్పుకుంటున్నారు. తమను ఆశ్రయించిన వాళ్ళ కోరికలు తీర్చడానికి కావలసిన అధికార సమృద్ధి చేతిలోవున్న అదృష్టవంతుల దర్పం వాళ్ళ నవ్వులో ఉంది. అందరి చేతులలోనూ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపే రంగురంగుల కేక్‌లు ఉన్నాయి. ఒక్కొక్కరూ మీనాగారికి వాటిని అందిస్తున్నారు. మీనాగారు ఒక చిన్నముక్క నైవేద్యం చేసి మిగిలింది అందరికీ ప్రసాదం పంచుతున్నారు. కేక్ రుచి చూస్తూ ఎడతెరిపి లేకుండ మాట్లాడుతున్నారు. వారి ఆలోచనలకు వారధిలేదు. అభిప్రాయాలకు పరిధిలేదు. ఆత్మ విశ్వాసానికి అవధులు లేవు. శాంతి భద్రతలేకాదు, రాజకీయాలు, పరిపాలనా వ్యవస్థ, మతం, కులం, పత్రికా రంగం - అన్నిటి గురించీ వారు ముచ్చటిస్తున్నారు. ధారావాహికంగా అభిప్రాయాలు చెప్తున్నారు. ప్రస్తుత వ్యవస్థలో ఈ రంగాలను నిర్వహిస్తున్న వారంతా అసమర్థులు అవినీతిపరులు. వాటినన్నింటినీ పోలీసులకు అప్పజెప్పేస్తే ప్రపంచం హాయిగా, ప్రశాంతంగా ఉంటుంది - ఇదీ వారి ప్రసంగం సారాంశం. అమీన్‌సాబ్‌లూ సర్కిల్ సాబ్‌లూ డి.ఎస్.పి దొరలూ ఆరాధన పూర్వకంగా ఊకొడుతున్నారు.

అదే వూళ్ళో జిల్లా కలెక్టరు ఒకరున్నారు. వారికీ ఒక కార్యాలయం, కార్యాలయానికి ఆవరణ, ఆవరణలో 'లాన్స్' ఉన్నాయి. కానీ వారెందుకో వెచ్చటి ఎండలోకాక చలికి ముడుచుకుపోయిన గదిలో ట్యూబ్‌లైట్ వెలుగులో కూర్చున్నారు. వారూ, వారి సి.పి. తప్ప కార్యాలయంలో వేరెవ్వరూ లేరు. (వారికి భార్యా పిల్లలు అసలే లేనట్టున్నారు) వారి మాటలకు అడుగడుగునా బ్రేకులే. వారికి మాటలు రావనికాదు. నిజానికి వారు మీనాకంటే 'ప్రతిభావంతులే'. ఐ.ఎ.ఎస్ గట్టెక్కారు కదా! మీనాలాగ క్రింది మెట్టుదగ్గర ఆగిపోలేదు. వారూ పలు విషయాల గురించి అనర్గళంగానే మాట్లాడగలరు. కానీ పాపం మొదలు పెట్టిన ఉత్తరక్షణం ఆత్మ సంశయం వహిస్తుంది. వాక్యమధ్యంలో మాటలాగిపోతాయి. కళ్ళల్లో మీనా తళుక్కుమంటాడు. తనకు వుందని ఎదుటివారు భావించే అధికారం నిజంగా లేదని తెలిసిన అసమర్థుని సంకటస్థితి ఇది.

ఈ దృశ్యాలలో ఆ యిద్దరు వ్యక్తుల ప్రత్యేక వ్యక్తిత్వాల ప్రతిబింబం కొంత లేకపోలేదు. కానీ ఇది ప్రధానంగా ఈనాటి దౌర్భాగ్య స్థితికి అద్దంపట్టే చిత్రం. రాజకీయ నాయకులు హత్యలు చేసి అధికారంలోకి వచ్చి, మరికొన్ని హత్యలు చేసి అధికారం నిలుపుకుంటున్నారు.

వాళ్ళ అధికారానికి భరోసాలేదు. కాబట్టి ఉన్నంత కాలం తామూ తమ వారూ వేగంగా సంపాదించుకొని రాజీవ్‌గాంధీ తలచిననాడు దిగి పోవాలి. సంపాదనకు తప్ప వేరే దేనికీ వాళ్ళకు టైంలేదు. వాళ్ళ ముఠా ప్రయోజనాలే తప్ప వేరే రాజకీయం లేదు. పాలకవర్గాల దీర్ఘకాల ప్రయోజనాలను గురించి కూడ వాళ్ళు ఆలోచించడం లేదు. దానిని మార్కెట్‌లో పెట్టుబడికి బయట గుండాలకూ పోలీసులకూ వదిలేసారు. ఈ పరిపాలనా వ్యూహంలో ప్రపంచ బ్యాంకుకూ, సుధీర్ కుమార్‌కూ, రఘువీర్ ప్రసాద్ మీనాకూ చోటుందిగానీ అభివృద్ధి సంక్షేమం చట్టబద్ధపాలన మొదలయిన చాదస్తాలకు చోటెక్కడిది?

'పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చేసాం' అని సిగ్గొదిలిపెట్టి గర్వంగా ప్రకటించాడు నేదురుమిల్లి జనార్ధన రెడ్డి. (ఆయన జీవిత చరిత్ర తెలిసినవాళ్ళు ఆయనకు ఇంకా సిగ్గు మిగిలివుందని భావించరనుకోండి) పోలీసులు ఒళ్ళు విరుచుకొని లేచారు. చెన్నారెడ్డి 'త్రిసూత్రపథకం' ఎత్తుగడవల్ల తొమ్మిది నెలలు కొంత విరామం తీసుకొని వాళ్ళు బలం పుంజుకొనివున్నారు. మీటింగ్‌లకూ ఊరేగింపులకూ తిరిగిన వాళ్ళ లిస్టులు తయారుచేసుకొని వున్నారు. భూములు దున్నుకున్న ఊళ్ళలో మొదట నాగలికట్టిన వాళ్ళపేర్లు రాసుకొని వున్నారు. ప్రజాకోర్టులలో ఉత్సాహంగా పాల్గొన్నావారి జాబితా సేకరించి వున్నారు. వాళ్ళకు తోడుగా ఢిల్లీ అనుమతితో ఇండోటిబెటన్ బోర్డర్ ఫోర్స్ బెటాలియన్ ఒకటి దిగుమతి అయింది. ఇండియాకు టిబెట్‌కూ సరిహద్దు మహబూబ్‌నగర్‌లో, ఆదిలాబాద్‌లో, కరీంనగర్‌లో ఉందని వాళ్లు కనుక్కొని అక్కడ స్థిరపడ్డారు. స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అనే స్టెన్‌గన్ రాక్షసముఠాకు తోడుగా స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ అనే సుశిక్షిత సాయుధ ముఠా ఒకటి తయారయింది. తెలుగుజాతినేత ఎన్టీఆర్ గ్రేహౌండ్స్ అనే పేరుతో తర్ఫీదు మొదలు పెట్టిన ఈ సైన్యానికి చెన్నారెడ్డి ఏలికలో ఈ కొత్తపేరు పెట్టి తర్ఫీదు పూర్తి చేశారు. ఇప్పుడు వీళ్ళందరినీ జనం మీదికి వదిలారు. వీళ్ళు విడివిడిగానూ ఉమ్మడిగానూ జనాన్ని చంపుతున్నారు.

నర్మెట్ట, అచ్చంపేట, గజ్వేల్ సంఘటనలను విడివిడిగా చర్చిస్తూ రాడికల్స్ ఏవో తొందరపాటు చర్యలకు పాల్పడ్డారని అందరం విమర్శించాముగానీ అన్నిటినీ కలిపి చూస్తే వాటిలో ప్రభుత్వ సంకల్పమే ప్రధానంగా కనిపిస్తుంది. ఒకప్పుడు 'వ్యక్తిగత హింసను వదిలిపెట్టి ప్రజలను సమీకరించి ప్రజా ఉద్యమాలు నిర్వహించవచ్చును కదా' అని సవాలు చేశారు. ప్రజాబలం లేక తుపాకులు పట్టు కున్నారని ఎద్దేవా చేశారు. అవకాశం ఇస్తాం, చేతనయితే ప్రజలను సమీకరించి పోరాడండి అన్నారు. నాయకులు ఉపన్యాసాలు ఇచ్చారు. పత్రికలు సంపాదకీయాలు రాశాయి. తొమ్మిది నెలలు గడిచాయో లేదో ఇకచాలని అందరికీ అనిపించింది. ఒకప్పటి సవాలును వాళ్ళే మరచిపోయారు. త్రిసూత్ర పథకాన్ని అమలు చేయకుండానే అది విఫలం అయిపోయిందని అందరూ అంగీకరించారు. ఇక అణచివేయండి. అణచివేయండి అని ప్రభుత్వాన్ని రెచ్చగొట్టారు. ప్రభుత్వం సై అనింది. 'ప్రజా పోరాటాలు నిర్వహించరాదా' అని హేళన చేసినవారు ఒక్కొక్క ప్రజా పోరాట రూపంమీదా తుపాకులు ఎక్కుపెట్టి అణచివేతను ప్రకటించారు. నర్మెట్టలో ధర్నా, అచ్చం

పేటలో బహిరంగ సభ, చిట్యాలలో రాస్తారోకో, గజ్వేల్‌లో ఊరేగింపు - అన్నీ ప్రజాపోరాట రూపాలే. అన్నిటి మీదా తుపాకులు ఎక్కు పెట్టారు. 'ఇకచాలు, ఉద్యమాలు నిర్వహించడం మానుకోండి' అనేది ఈ దాడుల సందేశం. కిడ్నాప్‌లు చేస్తున్నారనేది, బలవంతంగా లారీలను తరలిస్తున్నారనేది, బెదిరించి చందాలు వసూలు చేస్తున్నారనేది సాకులు మాత్రమే. అవే కారణాలయితే దేశవ్యాప్తంగా మతకల్లోలాలను రెచ్చగొట్టి గత సంవత్సరం చివరి మూడు నెలలలో 690 కి పైగా హత్యలకు కారణమయిన భారతీయ జనతా పార్టీకి, రాష్ట్రంలో ప్రతిరోజూ పరస్పర హత్యాకాండకు పాల్పడుతున్న కాంగ్రెస్ - తెలుగుదేశం పార్టీలకూ, చెన్నారెడ్డిని గద్దెదించడం కోసం దాదాపు 300 మందిని చంపించిన జనార్ధన రెడ్డి - సుధీర్‌కుమార్ ముఠాకు ఏ ప్రజాస్వామిక హక్కులూ ఉండవు.

ఆ తరువాత వరసగా ఎన్‌కౌంటర్లు ప్రారంభమయ్యాయి. అడ్డతీగల దగ్గర జడేరులో జరిగిన కాల్పులు తప్ప తక్కినవన్నీ బూటకపు ఎదురుకాల్పులే. అచ్చం పేట మీటింగ్‌కు పోస్టర్లు అంటిస్తూ వున్న కృష్ణారెడ్డిని మహబూబ్‌నగర్ జిల్లా గౌరి దేవిపల్లిలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ పోలీసులు గోడకు నిలబెట్టి కాల్చేసి 'ఎన్‌కౌంటర్' జరిగిందన్నారు. పార్టీచేత బహిష్కరించబడ్డ బాలన్ననూ ఎన్నడూ ఏ రాజకీయాలూ ఎరగని యాదగిరినీ పండుకున్న మంచెమీది నుండి లేపి తీసుకుపోయి కాల్చేశారు. నిజామాబాద్ జిల్లా మోస్రా గ్రామంలో మీనా పోలీసులు, రవీంద్రఖనిలో పనిచేసుకుంటూ వుండి పోలీసుల దాడులకు భయపడి చాందా పారిపోయి అక్కడ వృత్తి చేసుకుంటూ ఉండిన మంతెన సారయ్యను వెంటాడి అరెస్టుచేసి, అందుగులపల్లికి తీసుకొచ్చి కాల్చేసి 'ఎన్‌కౌంటర్' జరిగిపోయిందన్నాడు రామగుండం ఎస్.ఐ. బ్రహ్మానందం. మంచిర్యాలలో ఒక సాయంత్రం దొరికిన జనరక్షణ కార్యకర్తలు డేవిడ్ ఆనంద్‌లను తెల్లవారుజామున మందమర్రి దారిలో రోడ్డు పక్కన కాల్చేసి కందిచేనులో ఎదురుకాల్పు లయ్యాయన్నారు బెల్లంపల్లి అడిషనల్ ఎస్.పి. మహేందర్ రెడ్డి పోలీసులు. భువనగిరి సిపో విజయకుమార్‌ను ఊరి నుండి నాలుగు కిలోమీటర్లు దూరం కాంగ్రెస్ మునిసిపల్ కౌన్సిలర్ మనుషులు తరమగా అక్కడ చుట్టుముట్టి వరిచేనులో కాల్చేసి ఆ బురదలోనే పండుకొని తపంచాతో తమ మీద హత్యా ప్రయత్నం చేశాడని ప్రకటించారు నల్గొండ జిల్లాలో జె.వి. రాముడు బంట్లు. ఇది రాస్తూండగా ఇంకా 'ఎన్‌కౌంటర్లు' అవుతూనే ఉన్నాయి. సిర్పూర్‌లో, మంథనిలో, దేవాపూర్‌లో, మంచిర్యాలలో ఈ వారం రోజులలో 'ఎన్‌కౌంటర్లు' జరిగాయి.

తుపాకీ రాజ్యానికి 'శిలాన్యాసం' చేసి ప్రజలమీద నిత్యం దాడులకు పాల్పడుతూ, తామే నక్సలైట్లమీద 'తుపాకీరాజ్యం' అనే డ్రామా తయారుచేసి ప్రజల డబ్బుతోనే ఆడిస్తున్నారు రాష్ట్ర పోలీసులు. శభాష్ అనక ఏమంటాం. పోలీసులకు రాజకీయ నాటకాలు వేయించే అధికారం ఎవరిచ్చారని అడగడం అనవసరం. అసలు రాజకీయమంతా పోలీసులద్వారానే నడుస్తున్నప్పుడు నాటకాలు మాత్రం ఎందుకు వేయించకూడదు? ఎవరికి ఇష్టమున్నా లేకపోయినా రాష్ట్రంలో ఇవ్వాళ విప్లవోద్యమం ఒక ప్రధాన రాజకీయ శక్తి. దానిని పోలీసులకు అప్పజెప్పేశాం అని ముఖ్యమంత్రి ప్రకటించగలిగినప్పుడు, అందులో

తప్పేమీలేదని మేధావులూ పత్రికా సంపాదకులూ అనుకోగలిగినప్పుడు, నాటకాల దగ్గర బెట్టెందుకు? సురభి కళాకారులకు ఇన్నాళ్ళకు ఒక రాజకీయ పాత్ర దొరికిందని సంతోషిద్దాం. ఏ రాజకీయాలూ లేనట్టు నటించే కంటే ప్రజా వ్యతిరేక రాజకీయాలలో బహిరంగంగా పాల్గొనడం ఉత్తమమే.

ఒక్క సురభి కళాకారులకే కాదు, ఎవ్వరికీ తమ రాజకీయ పాత్రను ఎంచుకోకుండ వుండే అవకాశం లేకుండ చేసింది ఈ తుపాకీ రాజ్యం. ఒక్కొక్కరి అసలు రంగూ బయటపడుతూ వుంది. బుద్ధి జీవులనే తీసుకోండి. అందరికీ నీతి బోధించడంలోనూ తమ బోధలకు తామే మురిసిపోవడంలోనూ వాళ్ళకు వాళ్ళేసాటి. అయినా, భూసంస్కరణలను నలభై ఏళ్ళలో అమలు చేయలేని ప్రభుత్వం, వాటిని తామే అమలు చేసుకుంటూన్న రైతు కూలీలను వేల సంఖ్యలో అరెస్టు చేసి జైలుపాలు చేస్తూంటే ఒక్కరూ నోరు మెదపడం లేదు. ఈ అన్యాయాన్ని గురించి ఎవ్వరూ మాట్లాడకుండ ఉంటే జరగవలసింది చల్లగా జరిగిపోతుందని కళ్ళు గట్టిగా మూసుకొని కూర్చున్నారు. నక్సలైట్ల హింసను తిడుతూ రెండు రోజులకొక బరువయిన సంపాదకీయం క్రమం తప్పకుండ రాసేవాళ్ళు, హత్యలు చేయించి అధికారానికొచ్చిన నేదురుమిల్లి ముఠాకు రాష్ట్రాన్ని ఏలే అర్హతలేదని గొంతు విప్పి అనలేకుండ ఉన్నారు. వాళ్ళను గౌరవనీయులయిన ప్రజా ప్రతినిధులుగా సంబోధిస్తూ ఆత్మ వంచన చేసుకుంటున్నారు. వాళ్ళలో ఒకడిని పరిపాలనాదక్షుడనీ, ఒకడిని రాజకీయ చతురుడనీ, ఒకడిని అనుభవజ్ఞుడనీ పొగుడుతున్నారు కూడ. వాళ్ళ హత్యాకాండ 'ప్రస్తుత రాజకీయాలలో సర్వత్రా పెరిగిపోతున్న అవాంఛనీయ పోకడ' మట్టుకే, వేరంకాదు. అయోధ్య ఉద్యమానికి అడ్డం వచ్చిన వాళ్ళ కాళ్ళూ చేతులూ నరుకుతాం అని ప్రకటించిన వెంకయ్య నాయుడుగారి నిత్య పత్రికా గోష్ఠులతో సగం పేజీ నింపుతూ, హింసచేసే వాళ్ళకు ప్రచారం ఇవ్వొద్దని తెలంగాణా జిల్లాల గ్రామీణ విలేకర్లకు ఆదేశాలు పంపుతున్నారు. 'హింస' అనేది ప్రజా రాజకీయాలపట్ల తమకున్న వ్యతిరేకతకు ఒక సాకు మాత్రమేనన్న వాస్తవాన్ని ఇన్నాళ్ళు దాచుకోగలిగారు. ఇవ్వాళ ఆ అవకాశం లేకుండ పాలకవర్గ పార్టీలన్నీ పరోక్షంగానే కాక ప్రత్యక్షంగానూ హింసకు దిగేసరికి పత్రికాధిపతులకూ ఇతర పెద్ద మనుషులకూ ముఖం ఎక్కడ దాచుకోవాలో తెలియడం లేదు. ఇది ఈ మూడు నెలల చరిత్రలోని అత్యుత్తమ పరిణామం.

*సృజన - జనవరి, ఫిబ్రవరి 1991*
*రచనాకాలం - 12-2-1991*

# 14. పీపుల్స్ ఎన్‌కౌంటర్

'నక్సలైట్ బెడద' పాలకవర్గాలు ప్రచారం చేస్తున్న అవగాహనకే ఒక బెడదయి కూర్చుంది. నిజానికి అసలు బెడద కంటె ఈ బెడదే ఎక్కువయింది. పత్రికలలోనూ, ఇతర వేదికల నుండి వ్యక్తమవుతున్న ఆందోళనకు మూలం యిదే. నక్సలైట్ల గురించి ప్రజలకు తాము కలిగించదలచుకున్న అవగాహనను చక్కగా తయారు చేసుకున్నామని వాళ్ళు అనుకున్నప్పుడల్లా చరిత్ర రెండడుగులు ముందుకుపోయి తిరిగి కొత్త అవగాహనను రూపొందించవలసిన అగత్యం ఏర్పడుతోంది. ప్రజల దృష్టికి నక్సలైట్లు కేవలం ఒక మిలిటెంట్ పోరాట శక్తిగా కాక ప్రత్యామ్నాయ రాజకీయశక్తిగా కనబడటం ఎక్కువయ్యేకొద్దీ ఈ బెడద మరింత ఎక్కువ అవుతుంది. నక్సలైట్ల గురించి చెడు అభిప్రాయం ప్రచారం చెయ్యాలి, కాని అది విశ్వసనీయంగా వుండాలి. వారిని ప్రత్నామ్నాయ రాజకీయశక్తిగా చూడడానికి సిద్ధమవుతున్న ప్రజలు నమ్మేటట్టు వుండాలి.

పాలకవర్గాలు నక్సలైట్ల గురించి ప్రచారం చేస్తున్న అభిప్రాయం కాలక్రమంలో పంకీర్ణ మయిన మార్పులకు లోనవుతూ వుంది. ఇదంతా ప్రయత్న పూర్వకంగా ఒక కమిటీ వేసుకుని చేస్తున్నారని అనుకోకూడదు. అలాగే పాలకవర్గాలకూ విప్లవకారులకూ మధ్యనున్న సంఘర్షణ ఒక మలుపు తిరిగినప్పుడల్లా పూర్తిగా కొత్తచిత్రాన్ని తయారు చేసుకున్నారనీ అనుకోకూడదు. అటువంటిదేం జరగలేదు. అయితే ఒక్కొక్క దశలో కొన్ని కొత్త అభిప్రాయాలను, వాదనలను రూపొందిస్తున్నారు, ప్రచారం చేస్తున్నారు, మళ్ళీ తిరస్కరిస్తున్నారు. ప్రతి దశలోను పాలక వర్గాలు ప్రచారం చేస్తున్న చిత్రంలో ఎంతో కొంత అసంబద్ధత వుంటూనే వుంది. పాలకవర్గ భావజాలాన్ని ఎవరూ తీరికూర్చుని ప్రయత్న పూర్వకంగా తయారుచేయక పోవడం ఈ అసంబద్ధతకు మూలం కాదు. ఏ భావజాలాన్నీ ఎవరూ అట్లా తయారు చెయ్యరు. అంతమాత్రం చేత అసంబద్ధత భావజాలాల సహజలక్షణం కాదు. మరి నక్సలైట్ల గురించి పాలకవర్గాలు ప్రచారం చేస్తున్న భావజాలంలో ఎంతో కొంత అసంబద్ధత సందిగ్ధం వున్నాయంటే దానికి రెండు కారణాలున్నాయి. ఒకటి - పాలక వర్గ రాజకీయాలే యివ్వాళ అనూహ్యంగా భ్రష్టుపట్టాయి. బీహార్ రాజకీయాల గురించి మామూలుగా ప్రచారంలో వుండే కథలన్నీ యివ్వాళ ఆంధ్రలో జరుగుతున్నాయి. అందువల్ల నక్సలైట్ల హింసాకాండ గురించి వాపోవడం వాళ్ళకు ఇప్పుడు పెద్దగా ప్రయోజనకరంగా లేదు. అయినా దానిని మానుకోలేకుండ వున్నారు. ఇదొక సందిగ్ధం. రెండు - నక్సలైట్ల రాజకీయాలు యివ్వాళ విశాల ప్రజానీకాన్ని ఆకర్షించే స్థితి ఏర్పడుతోంది. ఈ రెండవ మార్పు విప్లవపార్టీలకే పూర్తిగా అర్థమైనట్టు లేదు. అర్థమైతే వాళ్ల నిర్మాణ పద్ధతులలో, పని పద్ధతులలో చాలా మార్పులు రావల్సి వుంటుంది. అయితే అది యిప్పటికి అప్రస్తుతం. కాని ఈ మార్పువల్ల పాలకవర్గాలకూ ప్రజలకూ మధ్యనున్న సంబంధంలోనూ, పాలక వర్గాల అంతర్గత సంబంధాలలోనూ వచ్చిన సంక్షోభం పాలకవర్గ భావజాలంమీడ చాలా ఒత్తిడి పెడుతూవుంది. ప్రయత్న పూర్వకంగానో,

కాకుండానో పాలక వర్గ భావజాలాన్ని రూపొందించే మేధావులు, రచయితలు, కళాకారులు, సిద్ధాంత వేత్తల మీద చాలా భారం పెడుతూ వుంది.

ఈ సంక్షోభాల, ఒత్తిడుల ఫలితాల్ని విశ్లేషించడానికి రామోజీరావు 'పీపుల్స్ ఎన్‌కౌంటర్' సినిమా చక్కగా ఉపయోగపడుతుంది. ఆంధ్రరాష్ట్ర ప్రాంతీయ పాలకవర్గాల ప్రతినిధిగా రామోజీరావు తన రాజకీయ సైద్ధాంతిక కర్తవ్యాన్ని గురించి ఖచ్చితమైన అవగాహన వున్న వ్యక్తి. ఈ వర్గం సున్నితమైన ఏ కర్తవ్యాన్నయినా సులభంగా భ్రష్టు పట్టిస్తుంది. కాని రామోజీరావు మటుకు తన కర్తవ్య నిర్వహణలో నేర్పుగల మనిషి. ఈ వర్గం నక్సలైట్ల గురించి ఏమనుకుంటుందో, ప్రజలు ఏమనుకోవాలని ఆశిస్తుందో సంక్లిష్టంగా కలగలిపి తీసిన సినిమా 'పీపుల్స్ ఎన్‌కౌంటర్'. ఇందులో రెండవ విషయమే ప్రత్యక్షంగా కనిపిస్తుంది. వర్గచైతన్యంగల పెత్తందార్లు చేసే రచనల్లోగాని, తీసే సినిమాల్లోగాని తాము ఏమనుకుంటున్నారో చెప్పరు, మనం ఏమనుకోవాలో చెపుతారు. పీడితవర్గాల కళ మట్టుకే ఎప్పుడూ తన స్వంత అభిప్రాయాన్ని (అది పత్యంగాని, భ్రమగాని) వ్యక్తీకరిస్తుంది. మరొక రకంగా చెప్పాలంటే పెత్తందారీ వర్గాల కళలో నిజాయితీ ఎప్పుడూ వుండదు. పీడితవర్గాల కళ భ్రమాజనితమైనా నిజాయితీగా వుంటుంది.

కళారూపంలో ఒక ఉద్యమాన్ని గురించి దురభిప్రాయాన్ని కలిగించడానికి రెండు మార్గాలుంటాయి. ఒకటి - తప్పుడు పోకడలను, పొరపాట్లను ఏరి వాటినే అసలు సరుకుగా చలామణీ చెయ్యటం. రెండు - పొరపాట్లను పక్కకు పెట్టి అసలు విషయాన్నే తీసుకుని దాని గురించి వ్యతిరేకత కలిగే విధంగా వ్యాఖ్యానించడం. తెలుగు దినపత్రికలలో నక్సలిజాన్ని గురించి జరిగే ప్రచారం మొదటికోవకు చెందింది. ఇందులో రామోజీరావుగారి 'ఈనాడు'ప్రధానపాత్ర వహిస్తూ వుంది. తప్పుడు అవగాహనతో జరిగిన చర్యలను, అనవసరమైన హింసాకాండకు పాల్పడిన సంఘటనలను ఏరి యిదే విప్లవం అంటున్నారు. అయితే ఈ సినిమాలో రామోజీరావు రెండవ పద్ధతిని అనుసరించారు. దినపత్రికలలా కాక ఈ సినిమా ప్రత్యక్షంగా ప్రచారం కోసం ఉద్దేశించింది. అందువల్లే ఈ మార్గాన్ని ఎంచుకున్నారని భావించాల్సి వస్తోంది. అయితే యిదే పోలీసులకు కోపం తెప్పించింది. విప్లవ రాజకీయ ఆచరణలోని చెడును మాత్రమే చూపిస్తే వాళ్ళు సంతోషించేవాళ్ళు. ఆ పని చేయకుండా విప్లవాన్ని సీరియస్‌గాతీసుకొని రాజకీయ విశ్లేషణ యివ్వడం ద్వారా నక్సలైట్లకు అనవసరమైన ప్రతిష్ట కల్పించారని వాళ్ళకు కోపం. అయితే వాళ్ళకు అర్థంకానిదేమిటంటే ఈ ప్రతిష్ట యిప్పటికే ప్రజల దృష్టిలోకి వచ్చి వుంది. ఆ వాస్తవాన్ని గుర్తించడం మాత్రమే రామోజీరావు చేసిన పని. నిజానికి ఆ వాస్తవాన్ని గుర్తించారు కాబట్టే ఆయన ఈ సినిమా తీశారు.

హింసకు, అహింసకు మధ్యనున్న సంఘర్షణ ఈ సినిమాలోని ప్రధాన అంశం. ఒకప్పుడసలు 'నక్సలైటు సమస్య' గురించి పాలక వర్గాలు చేసే చర్చ మొత్తం ఈ ప్రాతిపదికమీదే నడిచేది. ఆ చర్చలో సహజంగాచే అహింస గెలిచేది. మన భారతీయ సంస్కృతికి, మానవత్వ విలువలకు, పార్లమెంటరీ ప్రజాస్వామ్య రాజకీయ సూత్రాలకు అనుగుణమైన మార్గం అహింసేనని వాదించేవారు. ఈ వాదనలో వాస్తవమున్నా లేకపోయినా

వాదించడంలో ఒకప్పుడు ఎంతో కొంత నిజాయితీ వుండేది. ప్రజల అపంతృప్తినీ, తమ అంతర్గత కలహాలనూ ఎదుర్కోవడానికి పెద్ద ఎత్తున ప్రత్యక్ష హింసాకాండకు పాల్పడవలసిన అవసరం రాదని మనదేశ పాలక వర్గాలవారు ఒకనాడు భావించారు. ఆ రోజులు పోయాయి.

అయినప్పటికీ పాలకవర్గాల ప్రచారకులు హింస, అహింసల చర్చను కొనసాగిస్తూనే వున్నారు. వాళ్ళ రాజకీయ భ్రష్టత్వంవల్ల ప్రాప్తించిన దివాళాకోరుతనం దీనికి మూలం. అయితే రామోజీరావు ఈ చర్చను ఎట్లాగయినా కాపాడదామని దానికి రెండు అదనపు వాదనలు చేర్చారు. ఈ సినిమాలో అహింసకూ, నిర్మాత చెప్పదలచుకున్న అన్ని విషయాలకూ ప్రతినిధి జ్యోతి అనే డాక్టర్. నక్సలైట్లకు, పోలీసులకు భిన్నంగా ఈమెలో చాలా మానవీయత వుంది. ఆకర్షణ వుంది. ప్రేక్షకులను సులభంగా ఆకట్టుకునే వ్యక్తిత్వం వుంది. జ్యోతి అహింసను నిర్ద్వంద్వంగా సమర్థిస్తుంది. విధి నిర్వహణ పేరిట ప్రాణాలు తీయడాన్ని సహించలేక పోలీసు అధికారి అయిన భర్తను వదిలిపెడుతుంది. ఆదర్శాల పేరిట ప్రాణాలు తీయడాన్ని సహించలేక నక్సలైటు అయిన తమ్ముడితో విభేదిస్తుంది. నిర్మాత హింసాహింసల గురించి తాను చెప్పదలచుకున్న అన్ని వాదనలను జ్యోతిద్వారా చెప్పిస్తాడు. హింస నైతికంగా తప్పవే సంప్రదాయక వాదనకు మరి రెండు వాదనలు జోడించాడు. ఒకటి - న్యాయాన్ని సాధించడానికి హింస అనవపరమనేది, రెండు - హింసవల్ల ప్రజల మీద అనవసరంగా నిర్బంధం వస్తుందనేది. ఇందులో మొదటి వాదన జ్యోతి చేసినప్పుడల్లా ప్రేక్షకులు నవ్వడం ఈ సినిమా చూసినవాళ్ళందరికీ ఎదురైన అనుభవం. జ్యోతి తరచుగా ప్రజాస్వామ్యాన్ని గురించి, హింసను గురించి నక్సలైట్లకు ఉపన్యాసాలిస్తుంది. హింసామార్గాన్ని వదిలిపెట్టి, ప్రజలను సమీకరించి, ఎన్నికల్లో నిలబడి అధికారాన్ని సాధించుకొమ్మని సవాలు చేస్తుంది. ఎన్నికల్లో గెలుస్తున్నది ప్రజాసమీకరణ కంటే సారాయి, డబ్బు, గూండా బలగాల సమీకరణ ద్వారా అనేది అందరికీ తెలిసిన వాస్తవం. కాబట్టి ప్రేక్షకులకు నవ్వు రావడంలో ఆశ్చర్యం లేదు. నిజానికి ప్రేక్షకులలో అమాయకులెవరయినా వుండవచ్చును గాని నిర్మాతకు ఈ విషయం అందరి కంటే బాగా తెలుసును. అయినా నమ్మించగలమేమో చూద్దామని తన ప్రయత్నం తాను చేశాడు.మనకు ఓపిక వుండాలే గాని ప్రజల సమస్యలను ప్రజాస్వామికంగా చట్టబద్ధంగా పరిష్కరించడం సాధ్యమేననీ, ఆ సహనం ప్రజాస్వామ్యానికి మనం చెల్లించే మూల్యమనీ, సహనం లేనివాళ్ళే తొందరగా పరిష్కారం దొరకాలని హింసకు పాల్పడతారని వాదిస్తాడు. ఈ వాదనకు నిదర్శనంగా ఒక వుదంతాన్ని సినిమాలో ప్రవేశ పెడతాడు. గిరిజన ప్రాంతంలో నివసించే ఒక భూస్వామి గిరిజనుల భూములను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. వాళ్ళు ప్రతిఘటించేసరికి ఒక ఎత్తుగడ వేస్తాడు. పులుల అభయారణ్యం కోపం ఆ భూమి కావాలని ప్రభుత్వం నుండి ఒక ఆర్డరు తీసుకొచ్చి గిరిజనులను తొలగించే ప్రయత్నం చేస్తాడు. జ్యోతి నాయకత్వంలో గిరిజనులు శాంతియుతంగా ధర్నా చేస్తారు. పోలీసులు వాళ్ళ మీద పడి విపరీతంగా కొడతారు. ఈ దశలో నక్సలైట్లు రంగ ప్రవేశం చేసి భయంకరమైన మారణాయుధాలతో పోలీసుల మీద దాడిచేసి తరిమేస్తారు. హింసాత్మకమైన ఈ జోక్యాన్ని జ్యోతి నిరపిస్తుంది. దానివల్ల గిరిజనుల మీద నిర్బంధం వస్తుందని

వాదిస్తుంది. తాను చట్టబద్ధంగానే గిరిజనుల భూములను కాపాడతానని సవాలు చేస్తుంది. నక్సలైట్లు నవ్వుతారు. (ప్రేక్షకులు కూడా నవ్వుతారు) ఆమె మొదటి ప్రయత్నాలకు అవినీతి అవరోధం ఎదురవుతుంది. లంచాలు మేపిన మినిష్టర్లు, అధికారులు అడ్డుపడతారు. ఈ విధంగా ఒక వాస్తవికమైన సమస్యను నిర్మాత ప్రవేశ పెట్టాడు. దాని పరిష్కారాన్ని వాస్తవికంగా అన్వేషించి వుంటే 'నక్సలైటు సమస్య' కొంత మేరకయినా అర్థమై వుండేది. అయితే నిర్మాత సమస్యను చాలా అవాస్తవికంగా పరిష్కరిస్తాడు. జ్యోతి హైకోర్టులో రిట్ పిటిషన్ వేయగా హైకోర్టు దానికి స్పందించి ఆ ప్రాంతంలో పులులు సంచరించిన దాఖలాలేవీ లేవు కాబట్టి అభయారణ్యం కోసం ఆ గిరిజనుల భూములు స్వాధీనం చేసుకోవడానికి వీలులేదని, అధికారులను ఆటంక పరిచినందుకు గిరిజనుల మీద పెట్టిన కేసులను కూడా కొట్టి వేయాలని ఆర్డరు జారీ చేస్తుంది. ఇది చాలా అవాస్తవికమైన ముగింపు. పేదలకు, పీడితులకు కోర్టుల ద్వారా న్యాయం సాధించటం అంత సులభమైతే రాజకీయ హింసా అహింసల చర్చ కేవలం సైద్ధాంతిక చర్చ అయివుండేది. ఒక రాజకీయ సమస్య అయివుండేది కాదు. శ్రామిక ప్రజలకు రాజ్యాధికారం శాంతియుతంగా రాదని కమ్యూనిస్టు విప్లవకారులు నమ్మవచ్చునేమో గాని శ్రామిక ప్రజానీకం విప్లవ హింసను అందుకోసం ఆమోదించరు. ప్రజలకు న్యాయం చేయవలసిన సంస్థలు ఏవీ సమర్థవంతంగా పనిచేయని పరిస్థితిలో సమస్యల పరిష్కారానికి ఒక ప్రత్యామ్నాయమార్గంగా ఆమోదిస్తారు. రామోజీరావు పాలనా యంత్రాంగానికి చాలా సన్నిహితుడు. గిరిజనుల భూమి సమస్యను గురించి ప్రభుత్వం దగ్గర, కోర్టుల దగ్గర వందల పిటిషన్లు మగ్గుతున్నాయని వారికి తెలియంది కాదు. అందులో చాలా కొద్ది పిటిషన్లు మాత్రమే గిరిజనులకు అనుకూలంగా పరిష్కార మయ్యాయనేది ఆయనకి తెలియంది కాదు. నక్సలైట్లు జోక్యం చేసుకున్న చోటే గిరిజనులను వారి భూములనుండి తొలగించే ప్రయత్నాలు ఆగాయవి, ఈ రకంగా గిరిజనులు రాష్ట్రంలో 'చట్ట వ్యతిరేకంగా' అనుభవిస్తున్న అటవీభూమి ఐదులక్షల ఎకరాల దాకా ఉందవేదీ వారికి తెలియంది కాదు. పేదలను, పీడితులను శాంతియుతంగా చట్టబద్ధంగా సమీకరించే ప్రయత్నం చేసినవారు ఎన్ని అవాంతరాల్ని ఎదుర్కొంటారో, ఎంతగా నిస్పృహ చెందుతారో అందరికీ తెలుసును. కోర్టులో పిటిషన్ వేస్తే సరిపోయేదానికి అనవసరంగా హింసకు పాల్పడుతున్నారని నిందించడం ప్రజల వివేచనను కించపరచడం తప్ప వేరే కాదు.

అదట్లాగుంచి ఇది ఎవరూ విశ్వసించగల వాదన కాదు. కాబట్టి నిర్మాత పైన చెప్పిన రెండవ వాదనను ప్రధాన వాదనగా ఉపయోగిస్తాడు. ఈ వాదనలో పై వాదనకంటే ఎక్కువ నిజాయితీ వుందని కాదు గాని యిది పూర్తిగా విశ్వసనీయతను యింకా కోల్పోలేదు. కాబట్టి నిర్మాత లక్ష్యానికి పనికొస్తుంది. ఇది ఒకరకంగా చాలా తెలివైన వాదన. అహింస అనే వాదనను వ్యవస్థకు అనుకూలంగా, విప్లవకారులకు వ్యతిరేకంగా ఉయోగించే బదులు యిటు వ్యవస్థకూ అటు విప్లవకారులకూ వ్యతిరేకంగా 'ప్రజల' పక్షాన ఉపయోగిస్తాడు. "మీ హింసకూ, వారి హింసకూ మధ్యన మేము నలిగిపోతున్నాం" అని ప్రజలచేతే

చెప్పిస్తాడు. ఈ వాదవను నిజానికి తెలుగు పత్రికారంగంలో రామోజీరావుగారి 'ఈనాడు' ఆవిష్కరించింది. మితిమీరిపోతున్న పోలీసు అత్యాచారాల గురించి ఇక మౌనంగా వుండడం సాధ్యం కాని దశలో నక్సలైటు రాజకీయాలకు ప్రోత్సాహం యివ్వకుండా పోలీసు అత్యాచారాలను ఎట్లా ఎండగట్టాలా అన్న సందిగ్ధానికి ఈ వాదన ఒక సులువైన పరిష్కారాన్ని చూపించింది. తెలుగు దినపత్రికల్లో ఇది తరచుగా దర్శనమిస్తూ వుంటుంది. నైతికంగా పతనమై రాక్షసంగా తయారైన పాలకవర్గంతోనూ, దయాదాక్షిణ్యాలు లేని కరడు గట్టిన నక్సలైట్లతోనూ ప్రజలు జరిపే ఎన్‌కౌంటర్ 'పీపుల్స్ ఎన్‌కౌంటర్'. ఈ రూపంలో మటుకే అహింప అనే వాదనకు ఇంకా ఏ మాత్రమైనా విశ్వపనీయత మిగిలి వుంది.

అయితే నక్సలైట్లు హింపను ఎందుకు ఉపయోగిస్తారు? పోలీసులు ప్రజలను ఎందుకు హింసాత్మకంగా అణచివేస్తారు? పాలకవర్గం 'నక్సలైటు సమస్య' గురించి చేసే ప్రచారంలో ఈ ప్రశ్నలకు సమాధానం వెప్పాలి. విప్లవకారులు దీనికో సమాధానం చెపుతారు - పెత్తందార్ల సాయుధ రాజ్యాన్ని కూలదోసి శ్రామిక ప్రజల రాజకీయ ఆధిపత్యాన్ని నెలకొల్పడానికి హింస అనివార్యమనేది వారి సమాధానం. అయితే పాలక వర్గాల ప్రచారం దీనిని ఎప్పుడూ చర్చించదు. ఒకప్పుడు కమ్యూనిస్టు పార్టీలో తిరిగిన రామోజీరావుకు ఈ సమాధానం తెలియకపోలేదు. కాని ఆయన కూడా చర్చించడు. మరొక వైపు విప్లవహింప గురించి పోలీసుల అభిప్రాయం వుంది. ఇందులో రెండు అంశాలున్నాయి. కొంతమందికి అధికారాన్ని, డబ్బును పమకూర్చిపెట్టే గూండాయిజానికి విప్లవం ఒక ముసుగనేది ఒక అభిప్రాయం. ఎన్నికలలో గెలవడం చేతకానివాళ్ళు గత్యంతరం లేక ఎంచుకున్న మార్గం అనేది రెండో అభిప్రాయం. నిర్మాతకు ఈ వాడనలు ఎంత నచ్చినా ప్రేక్షకుల విశ్వసనీయతను పొందవలసిన సినిమాకు అవి పనికి రావు. ఎందుకంటే ప్రజలకు విప్లవ హింసను గురించి తమ స్వంత అభిప్రాయం వుంది. ప్రజలలో ఎక్కువగా ప్రచారంలో వున్న అభిప్రాయమేమిటంటే ప్రజాస్వామ్యంలోని అన్ని సంస్థలూ ధనవంతులకు, బలవంతులకు వూడిగం చేస్తున్న స్థితిలో ప్రజలకు న్యాయం చేకూర్చేది విప్లవహింస ఒక్కటేనని. ఈ అభిప్రాయం యివ్వాళ మన సమాజంలో విస్తృతంగా ప్రచారంలో వుంది. పత్రికా పంపాదకులకు, యజమానులకు ఎంత నచ్చకపోయినా వారి గ్రామీణ విలేఖరులే దీనిని ప్రచారం చెయ్యడంలో ముఖ్యపాత్ర వహించారు. రామోజీరావు ఈ సినిమాలో ఈ అభిప్రాయానికే ప్రాధాన్యత యిస్తాడు. అయితే 'ప్రభుత్వ హింసకూ విప్లవకారుల హింసకూ మధ్యన నలిగిపోతున్న ప్రజలు' అనే మౌలికమైన అవగాహనలో అంతర్భాగంగానే ఈ వాదవను ప్రవేశపెడతాడు. అవినీతి పరులైన రాజకీయ నాయకులు, స్వార్థపరులైన అధికారులు మన ప్రజాస్వామ్యాన్ని దిగజార్చారు. నక్సలైట్లు ఈ అవకాశం చూసుకుని పమప్యలను వేగంగా నిర్దయగా పరిష్కరించే మార్గం చూపించి ప్రజలను ఆకట్టుకుంటున్నారు. అయితే ఆ క్రమంలో వాళ్ళు దిగజార్చిన ప్రజాస్వామ్యాన్ని వీళ్లు పూర్తిగా ధ్వంపం చేసి అమాయకుల నెత్తుటితో తమ అధివత్యానికి బాట వేసుకుంటున్నారు. ఇది ఈ సినిమా ప్రచారం చేసే అవగాహన. ఈ అవగాహనలో పోలీసు హింస నక్సలైట్ల వ్యూహానికి ఒక అనివార్యమైన ప్రతి వ్యూహం అవుతుంది. ఏ వ్యవస్థయినా

తన దౌర్బల్యాన్ని ఆసరా చేసుకుని తనను ధ్వంసం చేసే వారిని సహించలేదు కదా! అయితే పోలీసు హింప పట్ల ప్రజలకుండే తీవ్రమైన ద్వేషాన్ని రామోజీరావు విస్మరించలేడు, విస్మరిస్తే సినిమాకు విశ్వసనీయత వుండదు. అందువల్ల ఈ సినిమాలో పోలీసుల చిత్రీకరణ చాలా నీచంగా వుంది. ఎంత నీచంగా వుందంటే రాష్ట్ర పోలీసు అధికారులకు సెన్సార్‌ల మీద చాలా కోపం వచ్చిందట కూడా. అయితే రాజకీయ హింస మీద ఇటు ప్రజలనూ, అటు పోలీసులనూ కూడా ఆకట్టుకునేటట్టు సినిమా తీయడం యివ్వాళ సాధ్యం కాదు. అయినా పోలీసు యంత్రాంగంలోని పతనాన్ని ఈ రకంగా ఎంతగా చూపించినా మొత్తం రాజకీయ వ్యవస్థలో ఆ యంత్రాంగం నిర్వహిస్తున్న పాత్రను గురించి ప్రేక్షకులలో కలిగించే అభిప్రాయానికి ఏమీ తేడా రాదు.

విప్లవ హింసను కేవలం ప్రజల తక్షణ సమస్యల పరిష్కారానికి ఒక సమర్దవంతమైన సాధనంగా మాత్రమే అర్థం చేసుకున్నా చర్చ యిక్కడితో ఆగిపోవడానికి వీలులేదు. ఇటు విప్లవహింస, అటు పోలీసుహింస అంటే సరిపోదు. వ్యవస్థాగతమైన మూడో హింస ఒకటుంది. దీనిని గురించి మాట్లాడడం రామోజీరావు వాదనకు చాలా ప్రమాదకరం. అందుకే దానినొక అంశంగా ఆయన ఒప్పుకోడు. ప్రజలకు అనేక సమస్యలు వున్నాయని, అవినీతికి అక్రమ మార్గాలకు అలవాటు పడిన అధికార యంత్రాంగం, రాజకీయనాయకులు, వీటిని పరిష్కరించలేక పోతున్నారని - యింతమాత్రమే ఒప్పుకుంటాడు. ఆకలి, పేదరికం, అసమానత, అణచివేత యిదంతా కూడా హింసేనని, ఈ హింస సామాజిక వ్యవస్థలో అంతర్గతమైందని ఆయన ఒప్పుకోడు. ఒప్పుకుంటే విప్లవహింస గురించి జరిగే చర్చ స్వరూపం మారిపోతుంది. ఈ వ్యవస్థ స్వర్గతుల్యం కాకపోవచ్చు గాని మౌలికంగా మంచిదేనని, జీవనయోగ్యమేనని, అయితే ఈ మధ్య కాలంలో అవినీతి, అణచివేత దురదృష్టవశాత్తూ పెరిగిపోతున్నాయని మాత్రమే ఒప్పుకుంటాడు. బుట్టలో కొన్ని పళ్ళు మాత్రమే కుళ్ళిపోయాయని ఒప్పుకుంటాడు. ఈ సినిమాలో వ్యవస్థకు ప్రతినిధులుగా ఒక క్రూరుడైన భూస్వామిని, అతనికి గులాములైన అటవీశాఖ అధికారులను చూపిస్తాడు. ఆ భూస్వామి ఒక స్త్రీని లోబర్చుకుని తనకు గులాములైన ప్రభుత్వాధికారులను సంతృప్తి పరచమని బలవంతం చేస్తాడు. (ఆమె చివరికి ఒక ప్రజాకోర్టులో అతనిమీద ఫిర్యాదుచేసి నక్సలైట్ల చేత అతనిని చంపిస్తుంది) ఈ కుళ్ళును దాచిపెట్టడానికి నిర్మాత ఎంతమాత్రం ప్రయత్నం చేయడు. అయితే ఈ నిర్మోహమాటం వెనక అంతకంటే బలమైన పంకల్పం వుంది. ఇటువంటి దిగజారిన వ్యక్తులు ఎందరో ఉన్నారని ఒప్పుకుంటూనే, వ్యవస్థ నిర్మాణంలోనే హింసవుందని మట్టుకు ఎట్టి పరిస్థితిలోనూ ఒప్పుకో కూడదనే సంకల్పం అది. ఈ రకమైన బూటకపు నిర్మోహమాటం ఈ మధ్యకాలంలో పాలక వర్గం తరచూ ప్రదర్శిస్తూ వుంది. ఇంతకు మించి కొంచెం కూడా ఒప్పుకోవడానికి సిద్ధపడరు. వ్యవస్థే అన్యాయంగా, అసమంగా వుందని మనం వాదించే ప్రయత్నం చేస్తే - పోలెండ్ గురించి, రుమేనియా గురించి, తియాన్‌న్మెన్ స్క్వేర్ గురించి ఆవేశంగా వాదనకు దిగుతారు.

వ్యవస్థలో కొంతమాత్రమే కుళ్ళు వుందని, దానిని పరిష్కరించడానికి ఈ వ్యవస్థ ఆమోదించిన సాధనాలే సరిపోతాయని వాదిస్తే విప్లవ హింసకు పునాది పోతుంది. చారిత్రక అవశ్యకత పోతుంది. కొంత మంది వ్యక్తులు కేవలం స్వయం సంకల్పంతో ఎంచుకున్న రాజకీయ మార్గమవుతుంది. ఆ ఎంపికకు వాళ్ళ సంకల్పమే తప్ప వేరే భూమిక వుండదు. విప్లవానికి ఈ విధంగా భౌతిక ఆవశ్యకతను తొలగిస్తే విప్లవకారులమీద, వారి వెనకవున్న ప్రజల మీద వ్యవస్థ ప్రయోగించే అణచివేత న్యాయమైన ప్రతిహింస అవుతుంది. సమర్థనీయమైన ఆత్మరక్షణ అవుతుంది. దానివల్ల ప్రజలకు హాని జరుగుతుందంటారా అది గర్హనీయమే. కాని దానికి బాధ్యులెవరో ఈ వాదనలో స్పష్టమే. హింసను మొదలుపెట్టింది విప్లవకారులే అని చెప్పడం కోసమే వ్యవస్థీకృత హింసను గురించి మాట్లాడినప్పుడల్లా తూర్పుయూరప్ గురించి ఆవేశంగా వాదనకు దిగుతారు.

విప్లవాన్ని కేవలం సంకల్పమాత్రమైన చర్యగా మార్చేస్తే, చారిత్రక ఆవశ్యకతకు అతీతమైన నిర్ణయంగా మార్చేస్తే అది క్రూరంగాను రొమాంటిక్‌గాను కనిపిస్తుంది. ఈ సినిమాలో విప్లవాన్ని చూపించిన పద్ధతిలో రొమాంటిసిజం, క్రూరత్వం ప్రధాన అంశాలు. నక్సలైట్లలో అత్యధిక శాతం గ్రామాలలో, గనులలో, బస్తీలలో, ఫ్యాక్టరీలలో, కాలేజీలలో ప్రజలమధ్య రహస్యంగానో, బహిరంగంగానో పనిచేసే సాధారణ మానవులు. కాని ఈ సినిమాలో నక్సలైట్లు అటువంటి సాధారణ మానవులు కారు. వీళ్ళు శాశ్వతంగా ప్రజలకు దూరంగా కొండకు అవతలివైపున నివసిస్తుంటారు. గిరిజనులకు వాళ్ళ అవసరం ఏర్పడినప్పుడు వాళ్ళకు ఏదో మహత్తు ద్వారా తెలిసిపోతుంది. ఆకుపచ్చ యూనిఫారాలు వేసుకుని ఆటోమాటిక్ తుపాకులు పట్టుకుని కొండమీద నుండి నాట్యం చేసుకుంటూ దిగివస్తారు. గురికూడా చూడకుండా తుపాకులు పేలుస్తారు. కావలసినంత మందిని చంపిన తర్వాత కొండ ఆవలివైపుకు వెళ్ళిపోతారు. అప్పుడప్పుడు డాక్టర్ జ్యోతియిచ్చే సుదీర్ఘమైన ఉపన్యాసాలకు సమాధానంగా క్లుప్తంగా, తిరస్కారంగా రెండుమాటలు మాట్లాడతారు. జ్యోతిలోని మానవీయతకు, పోలీసుల నైతిక పతనానికి భిన్నంగా నక్సలైట్లది అమానవీయమైన కరుడుగట్టిన ఆత్మవిశ్వాసం. ఉదాహరణగా ఒక ఉదంతాన్ని చెప్పుకోవచ్చు. పోలీసులు ఒక నక్సలైటును బూటకపు ఎన్‌కౌంటర్‌లో చంపుతారు. శవాన్ని దహనం లేదా ఖననం చేసే బదులు అక్కడే ఉంచాలనీ, శవం కోసం ఇతర నక్సలైట్లు వస్తే పట్టుకోవాలని అనుకుంటారు. శవాన్ని ఒక చెట్టు మీద పెట్టి, దాని చుట్టూ పోలీసులు కాపలా కాస్తారు. నిజ జీవితంలో ఇటువంటి పరిస్థితిలో ఏ విప్లవకారులైన శవాన్ని చేజిక్కించుకునే ఆశ వదులుకునే వెళ్ళిపోతారు. కాని ఈ సినిమా నక్సలైట్లు అట్లా కాదు. చెట్టు కొమ్మ నుంచి చెట్టుకొమ్మకు రోప్‌వే కట్టి నడుముకు తాడుకట్టుకుని మీదినుండి దిగి శవాన్ని పోలీసుల తలలమీద నుంచి తన్నుకుపోతారు. రామోజీరావు యిదంతా సాధ్యమని నమ్మేంత అమాయకుడా అనేది ప్రశ్నకాదు. పాలకవర్గ చైతన్యం సమృద్ధిగా వున్న వ్యక్తి తీసిన సినిమాలో నక్సలైట్లను ఈ రకంగా చూపించడంలో అంతర్యం ఏమిటన్నది ప్రశ్న. అమానవీయమైన సామర్థ్యం, కరుడుగట్టిన క్రూరత్వం

మొదలైన లక్షణాల కలయికగా నక్సలిజాన్ని చిత్రీకరించడం ద్వారా యిచ్చే సందేశం ఏమిటన్నది ప్రశ్న.

భౌతిక పునాది, చారిత్రక అవశ్యకత లేని విప్లవంలో ఒక చర్యకూ ఒక చర్యకూ సంబంధం వుండదు. మొత్తానికి అర్థం వుండదు. తెలుగు దివపత్రికలు విప్లవ రాజకీయాలను ఈ రకంగానే చిత్రీకరిస్తున్నాయి. పరస్పర సంబంధంలేని, అర్థరహితమైన రొమాంటిక్ చర్యలుగా, నిష్కారణమైన హింసాకాండగా వర్ణిస్తున్నాయి. ఈ చిత్రం వాస్తవాలను వక్రీకరిస్తోందని విప్లవకారులు ఆరోపించినపుడు తాము చూపించిందంతా వాస్తవమని గత రెండేళ్లుగా పత్రికలు చదువుతున్నవారందరికీ తెలుసునని రామోజీరావు సమాధానం చెప్పాడు. అది నిజమే. 'ఈనాడు'తో మొదలుపెట్టి తెలుగు దినపత్రికలన్నీ అలవాటు చేసుకున్న చిత్రీకరణను ఈ సినిమాలో ఆయన కొనసాగించాడు. గమ్యంలేని విడివిడి చర్యల కలయికగా విప్లవాన్ని చిత్రీకరించాడు. ఒక్కొక్కచోట యిది ఎంత దూరం పోతుందంటే కథనం వదిలిపెట్టి బస్సులు తగలబెట్టిన దృశ్యాలు, ఇళ్ళు పేల్చివేసిన దృశ్యాలు, ఇన్ఫార్మర్లను కాల్చివేసిన దృశ్యాలు కేవలం ఫొటోలుగా ఒకదాని తర్వాత ఒకటి చూపిస్తాడు. నక్సలిజం అంటే అర్థంలేని హింసాకాండ అవే సందేశాన్ని ఈ రకమైన చిత్రీకరణ బలంగా అందిస్తుంది. దీనిని ఎదుర్కోవడానికి పోలీసులు రంగప్రవేశం చేయకతప్పదని ప్రేక్షకులకు ఒకరు చెప్పకుండానే అనిపిస్తుంది. పోలీసులలో కొందరు (బహుశా అత్యధికులు) అవినీతిపరులు, క్రూరులు కావొచ్చు. అయినప్పటికీ మన సమాజాన్ని డైనమైట్లతో పేల్చివేస్తున్న ఈ గమ్యంలేని హింసాకాండకు లొంగడానికి వీల్లేదు. (ప్రేక్షకుల సంకల్పం లేకుండానే ఈ సమాజం 'మన' సమాజంగా కనబడటం మొదలవుతుంది) పోలీసు వ్యవస్థను రామోజీరావు చాలా లజ్జాకరంగా చిత్రీకరించాడని పోలీసులకు కోపం వచ్చింది కాని, పోలీసు వ్యవస్థను ఆయన చూపించింది అన్యాయమైన సమాజాన్ని నిలబెట్టే సాయుధ యంత్రాంగంగా కాదు, 'మన' సమాజాన్ని దండగుల నుండి కాపాడలేని అసమర్థ యంత్రాంగంగా. రాజకీయ నాయకుల విషయం కూడా అంతే. ఈ రకమైన రాజకీయ నాయకుల చేతుల్లో మన భవిష్యత్తును పెట్టగలమా అన్న ఆందోళన కలుగుతుందే తప్ప వీళ్ళు సామాజిక అన్యాయానికీ, అణచివేతకూ రాజకీయ ప్రతినిధులన్న ఆగ్రహం కలగదు.

ఈ రకమైన చిత్రీకరణ సాధ్యం కావాలంటే కొన్ని వాస్తవాలు చెప్పకుండా వుండడం అవసరం. చాలా ఆవేదనతో 'నక్సలైటు సమస్య'ని చిత్రీకరించానని చెప్పుకుంటూ వున్న రామోజీరావు తెలిసీ కొన్ని వాస్తవాలను చెప్పలేదు. ఒక ముఖ్యమైన ఉదాహరణ చెప్పాలంటే విప్లవోద్యమాన్ని ఎదుర్కోవడానికి రాజ్యాంగ యంత్రాంగం చాలా పకడ్బందీగా, పటిష్టంగా అన్ని రంగాలలోను హింసాకాండను ప్రయోగించిందన్న వాస్తవాన్ని ఈ సినిమాలో ఎక్కడా చెప్పడు. ఇంద్రవెల్లి సీను దీనికొక నిదర్శనం. ఆదిలాబాద్ గిరిజనులలో విస్తరిస్తూవున్న విప్లవోద్యమ నిర్మాణాన్ని మొగ్గలోనే తుంచివేయడం కోసం ఉద్దేశపూర్వకంగా ప్రయోగించిన ఆ హింసాకాండను కాకతాళీయమైన కాల్పుల సంఘటనగా చూపిస్తాడు. తనపై అత్యాచారం చేసిన పోలీసు అధికారిని ఒక గిరిజన స్త్రీ చంపివేయగా తదుపరి చెలరేగిన కల్లోలాన్ని

అణచడంకోసం పోలీసులు జరిపిన కాల్పులుగా చూపిస్తాడు. పోలీసు యంత్రాంగంలో అవినీతిపరులు, అసమర్థులు, పిరికివాళ్ళు చాలామంది వున్నారు గాని అది ఈ సినిమాలో చూపించినంత పనికిమాలిన యంత్రాంగం ఏమీ కాదు. సాధారణ పోలీసు యంత్రాంగంలోనూ, వూరూపేరూ లేని తెల్లబట్టల గుండాలైన స్పెషల్ పోలీసులలోనూ సమర్థవంతంగా దమనకాండను అమలుచేసే నైపుణ్యం పుష్కలంగా వుంది. ఇంటలిజెన్స్ డిపార్ట్‌మెంట్‌కి ఇంటలిజెన్స్ తక్కువేమీ లేదు. అయినా పోలీసులు 'నక్సలైటు సమస్య'ను పరిష్కరించ లేకపోయారంటే అది వాళ్ళ చేతకానితనం కాదు. ప్రపంచంలోని ఏ రాజకీయ సమస్యనూ ఎక్కడా పోలీసులు పరిష్కరించలేదు. ఎంతో కొంత క్రూరంగా, ఎంతోకొంత సమర్థంగా, ఎంతో కొంత తాత్కాలికంగా అణచడం మట్టుకే వాళ్ళకు సాధ్యమవుతుంది. అందులో ఆంధ్ర రాష్ట్ర పోలీసులు వేరే ఎవరికీ తీసిపోలేదు. రాజకీయనాయకులైన అంతే. వాళ్ళు ఈ సమస్యను యిప్పటిదాకా పరిష్కరించ లేకపోయారంటే సామర్థ్యంలేక కాదు, సంకల్పంలేక కాదు, అది అసాధ్యం కావడం దానికి కారణం.

అయితే ఇదంతా చేస్తే రాజ్యాంగయంత్ర మనేది ఒక అణచివేత యంత్రాంగమని చెప్పాల్సి వుంటుంది. సామాజిక వ్యవస్థ అణచివేత మీద, హింసమీద ఆధారపడిందని, రాజ్యాంగయంత్రం దాన్ని కాపాడే కవచమని ఒప్పుకోవాల్సి వుంటుంది. అప్పుడు నక్సలైట్ల నిరసన చర్యలను ఒక లక్ష్యం, కారణంలేని హింసాకాండగా చిత్రించడం సాధ్యపడదు. నక్సలైటు ఉద్యమం ప్రారంభమైన తర్వాత రెండు దశాబ్దాలపాటు పోలీసుల అణచివేత ఎదురులేకుండా సాగిందని, దాని గురించి పత్రికలు ఏనాడూ రాయలేదని, 'ప్రజాభిప్రాయం' పట్టించుకోలేదని, కోర్టులు, వాటి హెబియస్ కార్పస్ అధికారమూ అడ్డురాలేదని, ప్రజాస్వామికంగా ఎంత నిరపన తెలిపినా ప్రభుత్వం పట్టించుకోలేదని అప్పుడు చెప్పాల్సి వుంటుంది. కిడ్నాప్‌లు, దహనం, పేల్చివేత మొదలైన చర్యలు ఎంత అభ్యంతరకరంగా అనిపించినా వాటిద్వారా పాలకవర్గాల ప్రశాంతిని తాత్కాలికంగా నయినా భగ్నం చేయకపోతే రామోజీరావు వంటివారు రెండు దశాబ్దాల మౌనాన్ని విడనాడి 'నక్సలైట్ సమస్య' గురించి తమ పత్రికలలో సినిమాలలో చర్చించేవారే కాదని ఒప్పుకోవాల్సి వుంటుంది. మరొక అడుగు ముందుకుపోయి రామోజీరావు సినిమాగాని, పాలవర్గం ప్రచారంగాని ఎంత మాత్రం ఒప్పుకోని మరికొన్ని విషయాలను అంగీకరించ వలసి వుంటుంది. విప్లవాల చారిత్రక అవశ్యకత వంటి పెద్ద విషయాలను పక్కకు పెట్టినా, రాష్ట్రంలో అనేక ప్రాంతాలలో యివ్వాళ పేదలు, పీడితులు విప్లవోద్యమం ఫలితంగావే గౌరవంగా తలెత్తుకుతిరుగుతున్నారనీ, శ్రీకాకుళంలో మొదలయిన 'నక్సలైట్ సమస్య' రెండు దశాబ్దాల పాశవిక అణచివేత తర్వాత హైదరాబాద్ నగరంతో సహా 23 జిల్లాలకు పాకిపోయిందనీ, నక్సలైట్లే లేకపోతే పమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థలుగావి, గిరిజన సహకార సంఘాలు గాని, మారుమూల ప్రాంత అభివృద్ధి పథకాలుగాని వుండేవి కాదనీ, విప్లవోద్యమం యిచ్చివ చైతన్యం వల్లవే ఎక్కడ అన్యాయం జరిగినా ఆందోళన చేసే సంస్కృతి పుట్టిందనీ, ప్రభుత్వ అధికారుల, రాజకీయనాయకుల అవినీతిని పక్షపాతాన్ని అసమర్థతనూ నిర్భయంగా నిరసించే పంస్కృతి

పుట్టిందనీ, దేశాన్ని ఏలుతున్న దొరలంతా తాము ప్రజలకు జవాబుదారులమని ఒప్పుకునే అగత్యం ఏర్పడిందనీ - ఇదంతా చెప్పవల్సి వుంటుంది.

సమస్యలో యింత ప్రధానమైన అంశాన్ని దాచిపెట్టే చిత్రీకరణ దానికి విశ్వసనీయమైన పరిష్కారాన్ని చూపించలేదు. నక్సలైట్లు తమ హింసాత్మక నిరసన మార్గాన్ని వదిలి పెట్టాలనీ, ప్రభుత్వం తన హింసాత్మక అణచివేత మార్గాన్ని వదిలిపెట్టాలనీ యిద్దరి మీదా డిమాండ్ పెడుతూ 'ప్రజల' తరపున నిరసన దీక్షకు కూర్చుంటుంది జ్యోతి. ఈ 'పీపుల్స్ ఎన్‌కౌంటర్' ఇరుపక్షాలలో ఎవరి సమస్యకూ న్యాయం చేయదు కాబట్టి ఆమె దీక్ష ఫలించడం సాధ్యం కాదు. అది అసాధ్యమని గుర్తించి కృత్రిమ పరిష్కారం చూపించ నందుకు రామోజీరావును అభినందిచ వచ్చును. చనిపోతూ జ్యోతి చూపిన చేతిని ఇరుపక్షాలలో ఎవ్వరూ అందుకోరు. పోలీసు అధికారి గిరిజన స్త్రీలపై అత్యాచారం చేయగా జన్మించిన పాప మాత్రమే ఆమె చేతివి అందుకుంటుంది. ఇందులో ఏదో సందేశం వుండే వుండాలి. అయితే ఆ సందేశం ఎంత వాస్తవికమైందో భవిష్యత్తులోనే తేలగలదు కాబట్టి అక్కడితో వదిలేద్దాం.

*(ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ నుండి)*
*అరుణతార (మాసపత్రిక) అక్టోబర్ - నవంబర్ 1991*

# 15. మిస్సింగ్

ఇది జరిగిపోయిన కథ కాదు. జరుగుతున్న కథ. దక్షిణ అమెరికాలోనే కాదు, కరీంనగర్‌లోనూ జరుగుతున్న కథ.

మధ్యతరగతి బుద్ధి జీవులకు ఒక లక్షణం ఉంది. న్యాయాన్యాయాల సంఘర్షణ మన నిత్యజీవితానికి ఎంత దూరాన జరిగితే మనం అంత సులభంగా న్యాయం పక్షం వహిస్తాం. ఆ సంఘర్షణ మన జీవిత అనుభవానికి చేరువ అయ్యే కొద్దీ న్యాయం పక్షం వహించడం కష్టమవుతుంది. ఎందుకంటే అన్యాయం వ్యవస్థీకృతమయిన చోట మన దైనందిన జీవిత సుఖశాంతులు అన్యాయంతో ముడిపడి ఉంటాయి. అప్పుడు న్యాయాన్ని వ్యతిరేకించడానికి - లేదా సంఘర్షణ పట్ల ఉదాసీనంగా ఉండడానికి - మనకు ఎన్నో కారణాలు కనిపిస్తాయి. దూరంగా ఉన్నప్పుడు 'అంత ఘోరం జరుగుతూ వుంటే ఎవరూ ఎందుకు మాట్లాడలేదో' అని ఆశ్చర్యపోతాం. దగ్గరగా ఉంటే మాట్లాడకుండ ఊరుకోవడానికి మనకే ఎన్నో కారణాలు కనిపిస్తాయి. అవి న్యాయమయిన కారణాలు కూడ కావచ్చును. ఎందుకు కాకూడదు? దక్షిణ అమెరికాలోనూ కావచ్చును, కరీంనగర్‌లోనూ కావచ్చును. అయినా ఇవి కరీంనగర్‌లో కనిపించినంత న్యాయంగా దక్షిణ అమెరికాలో కనిపించవు.

ఒక మంచి కథ చదివిన అనుభూతిని చెడగొడుతూ ఈ ఆక్షేపణ ఏమిటా అనుకోవద్దు. ఆ అనుభూతికి సాఫల్యం కలగాలంటే మన 'మూడ్' కొంత చెడగొట్టుకోక తప్పదు మరి. ఈ కథలోని స్త్రీల లాంటి వాళ్ళు కరీంనగర్‌లో, వరంగల్‌లో, నిజామాబాద్‌లో, ఆదిలాబాద్‌లో కూడ వున్నారంటే అది బహుశా కొత్త విషయం కాకపోవచ్చు. వాళ్ల కోసం కూడ రెండు బొట్లు కన్నీళ్లు కార్చమని మిమ్మల్ని అడగడంలేదు. కార్చవలసిన కన్నీళ్ళు వాళ్ళే కారుస్తున్నారు. వాళ్ళు వెతుకుతున్న శవాలకోసం మీరుకూడా కొంచెం వెతకండని కోరడం లేదు. వాళ్ళే ఎంత వెతకాలో అంతా వెతికారు. ఇంకా వెతికితే ఏదో ప్రయోజనం ఉంటుందని నమ్మేంత మూర్ఖులు కారు వాళ్ళు. న్యాయం కోసం ఆ స్త్రీలు చేస్తున్న ఆందోళనకు మద్దతు ఇమ్మని మట్టుకు కోరుతున్నాం. అన్యాయాన్ని పర్యావరించిన దట్టమయిన ఈ నిశ్శబ్దాన్ని ఛేదించమని కోరుతున్నాం. హింసాహింసల మీమాంసతో అనంతంగా కాలక్షేపం చేయకుండ పోలీసుల ఇనుపబూట్ల క్రింద నలిగిపోతున్న జీవితాల్ని గురించి ఆలోచించమని అడుగుతున్నాం.

ఆ స్త్రీల సాహసం తేలికయినది కాదు. 'నా ప్రాణాలను నేను లెక్కచేయన'నే సాహసం కంటే ఇది ఒకరకంగా కష్టతరమైనది. తమ్ముడి ఆచూకీ చెప్పమని ఆందోళన చేస్తే భర్త కేమవుతుందోనని భయం. పెద్దకొడుకు ఏమయినాడని కోర్టు కెక్కితే చిన్నవాడిగతి ఏమవుతుందోనని ఆందోళన. ఇది చాలనట్టు, తన భర్తో కొడుకో 'లేనిపోని గొడవల్లో' చిక్కుకొని పోలీసుల చేతిలో మాయం అయినాడంటే అందులో తన తప్పు, తన నిర్లక్ష్యం, అతను అందరిలాగ బ్రతకకపోవడంలో తనదే ఏదో వైఫల్యం ఉందనే వ్యక్తావ్యక్తమయిన ఎత్తిపొడువు కలిగించే వ్యథ. భర్తతో, భర్త ఇంటితో ముడిపడిన తన వ్యక్తిత్వానికీ తన పిల్లల

భవిష్యత్తుకూ ఆ భర్త ఉన్నాడో లేదో తెలియని సందిగ్ధస్థితిలో కలిగే అనిర్వచనీయమయిన సంకటం.

ఇన్ని భావాలూ ఇన్ని భయాలూ వాళ్ళ ఆందోళనలో వ్యక్తమవుతున్నాయి. న్యాయవిచారణ జరపడానికి కచ్చితమయిన 'టర్మ్స్ ఆఫ్ రెఫెరెన్స్' ముందుంచుకొని కూర్చున్న వృద్ధ న్యాయమూర్తి దగ్గరికి 'మాయం' అయిన ఒకవ్యక్తి భార్య సాక్ష్యం చెప్పడానికని వచ్చి 'నా బతుకేందో నాకు చెప్పు సార్, నా పిల్లల బతుకేందో చెప్పుసార్' అని రోదిస్తే ఆయనకు అది అప్రస్తుతంగానూ అసందర్భంగానూ అనిపించవచ్చును. నా విచారణ నీ భర్త ఆచూకీ గురించేకానీ నీ బతుకు గురించి కాదు అనవచ్చును. పెద్దకొడుకు అదృశ్యాన్ని గురించి సాక్ష్యం చెప్తాగానీ 'చిన్నవాడుకూడ దాన్లనే తిరుగుతుండుగదా, వానికేంగాదా' అని ఒక తల్లి హామీ అడిగితే న్యాయమూర్తిగారికి విసుగు కూడా రావచ్చును. నా విచారణ మాయం అయిన వారి గురించేకానీ కాబోయేవారి గురించి కాదనవచ్చును. 'మా వానికి రాడికల్స్‌తో సంబంధాలు లేవు సార్. ఆ మాదిగోళ్ల పోరడు రమ్మంటే స్నేహితానికి పోయిండు' అని ఒక తల్లి సంజాయిషీ ఇచ్చుకుంటే అది నిజానికి ఆ తల్లి తన గురించి ఇచ్చుకుంటున్న సంజాయిషీ అని అర్థం కాని న్యాయమూర్తి 'ఇవన్నీ నిన్నెవరడిగారు' అని చిరాకు పడవచ్చును. కానీ ఆ భార్యలకూ ఆ తల్లులకూ మాయమయిన వ్యక్తి ఆచూకి ఒక్కటే సమస్యకాదు, ఇవన్నీ సమస్యలే. ఆ సమస్య ఈ సమస్యలలోకి తర్జుమా అయిన తరువాతే అది వారి సమస్య అయింది. (తామూ రాజకీయంగా చైతన్యవంతులయిన వారిది వేరే సంగతి). న్యాయమూర్తిగారి 'టర్మ్స్ ఆఫ్ రెఫెరెన్స్'లో లేనివి వాళ్ల జీవితాల 'టర్మ్స్ ఆఫ్ ఎగ్జిస్టెన్స్'లో ఉన్నాయి. వాళ్ల జీవితాలను శాసించే అలిఖిత నియమాలలో ఉన్నాయి. న్యాయమూర్తిగారి విచారణా చట్రం ఊహించుకునే శుద్ధ పౌరులు కారు వాళ్లు.

అయినా చట్టానికి అసందర్భంగా అప్రస్తుతంగా కనిపించే బంధాలూ బాంధవ్యాలూ నిర్బంధానికి అప్రస్తుతం కాదు, నిరసనకూ పనికి రాకపోలేదు. మనుష్యుల మధ్య మానసిక బంధాలూ వ్యవస్థీకృత బాంధవ్యాలూ ఉండడం వ్యవస్థను కాపాడే దండనాయంత్రాంగానికి ఒక సౌకర్యాన్ని కల్పించింది. ఒకరిని కొడితే ఆ దెబ్బ పదిమందికి తగులుతుంది. వాళ్ళను ప్రేమించిన వాళ్ళకు తగులుతుంది. వాళ్ళ జీవితాలతో ముడిపడిన జీవితాలకు తగులుతుంది. లొంగిపొమ్మని ఎన్నిసార్లు హెచ్చరించినా లొంగిపోని కొడుకు, తల్లినీ తండ్రినీ తీసుకుపోయి లాకప్పులో పడేసి కొడుకు లొంగిపోయేదాకా వదిలిపెట్టం అంటే తానేవచ్చి లొంగిపోయిన సంఘటనలు ఉన్నాయి. ఈ అనుబంధాలను దండనా యంత్రాగం నిస్సిగ్గుగా వాడుకుంటుంది. ఇంట్లో ఒక మిలిటెంట్ ఉన్నాడని చెప్పి ఆయింటిని కూల్చేసి అతని తల్లితండ్రులనూ, తోబుట్టువులనూ వీధులపాలు జేసిన సంఘటనలు తెలంగాణాలో ఊరూరా ఉన్నాయి. భర్త ఆచూకీ చెప్పమని భార్యను రేప్ చేసిన సంఘటనలూ, భార్యను రేప్ చేస్తామని బెదిరించి భర్తను లొంగదీసుకున్న సంఘటనలూ ఉన్నాయి. 'మధ్యన వాళ్ళేంపాపం చేసారు' అని ఆ బంధువుల గురించి బాధ కలుగుతుంది. నక్సలైట్లతో రాజకీయ సాంగత్యం ఉండడం పాపమే ననుకునే వాళ్ళకు కూడ కేవలం బంధుత్వమో అనుబంధమో ఉండటం వల్ల తమ రాజకీయ అభిప్రాయాలతో నిమిత్తం లేకుండ నిర్బంధాన్ని చవి చూసే వారిని చూస్తే జాలి కలుగుతుంది.

నిర్బంధానికి పనికొచ్చే ఈ బంధాలు నిరసనకూ పనికొస్తాయి. ఏ బాంధవ్య నియమాలను అడ్డం పెట్టుకొని రాజ్యాంగ యంత్రం నిర్బంధాన్ని ప్రయోగిస్తుందో అవే నియమాలు నిరసనకు ఆలంబనమయినప్పుడు ఎంతగా చికాకు పెట్టగలవో ఈ నవలే (మిస్సింగ్) చక్కగా చూపుతుంది. క్రైస్తవాన్ని ఆదరించే ప్రభుత్వం శవాన్ని శాస్త్రోక్తంగా పూడ్చి పెట్టుకునే హక్కును నిరాకరించలేదు. అయితే ఆ నియమాన్ని అడ్డంపెట్టుకొని ప్రభుత్వాన్ని 'మాయం' అయిన వారి గురించి చికాకుపెడితే సహించనూ లేదు. ఈ రూపంలో కాకపోయినా తమకు చేతనయిన పద్ధతిలో మన రాష్ట్రంలోనూ 'మాయం' అయిన వారి తల్లులూ భార్యలూ అక్కలూ తమ సట్టుదలతో ప్రభుత్వ యంత్రాగాన్ని ఇంతగానూ చీకాకు పెట్టారు. ఒక్కొక్కరి కథ రాస్తే ఒక మహత్తర సాహసగాథ అవుతుంది. కొందరు రాజకీయ సంకల్పంతో పోరాడారు. కొందరు ప్రేమ వల్ల పట్టుబడ్డారు. కొందరికి పోయినవారి ఆచూకీ తెలుసుకోవడం తమ జీవిత సమస్య. ఏవరెందుకు పోరాటం చేస్తేనేం, అందరూ అసామాన్యమయిన ధైర్యంతో పోరాడారు, పోరాడుతున్నారు.

హనుమకొండ పోలీసులు సెంట్రల్‌జైలు గేటు దగ్గర పట్టుకొని మాయం చేసిన వేల్పుల వెంకటేశ్వర్లు తల్లి సోమనర్సమ్మ, హుస్నాబాద్ పోలీసులు కొత్తగూడెం దాకా పోయి వెతికి పట్టుకొని మాయం చేసిన బెజ్జంకి రవీందర్ తల్లి బూదమ్మ, కరీంనగర్ పోలీసులు కాటారం అడవులలో మోటార్ సైకిల్‌తో పహా మాయం చేసిన ముగ్గురు స్నేహితులలో ఒకడయిన బొమ్మా జనార్దనరెడ్డి భార్య ప్రేమలత, ఆదిలాబాద్ దొగ్గురావుల పోలీసులు గోలేటి టౌన్‌షిప్‌లో అరెస్టు చేసి మాయం చేసిన రామగుండం ఓదేలు అక్క వజ్జా సరోజ, ఎ.ఎన్.ఎస్. పోలీసులు విజయవాడ కనకదుర్గ లాడ్జి నుండి తీసుకుపోయి మాయం చేసిన రాజమండ్రి డాక్టరు మల్లికార్జునప్రసాద్ తల్లి సూర్యదేవర లక్ష్మీతులసమ్మ, నిజామాబాద్ పోలీసులు ఇంటిల్లిపాదీ చూస్తుండగా ఇంటినుండి తీసుకుపోయి మాయం చేసిన దుంపల గంగాధర్ భార్య కళావతి, వరంగల్ పోలీసులు బహిరంగంగా రోడ్డుమీదనే పట్టుకొని సైకిల్‌పైన కూర్చో పెట్టి తీసుకుపోయి మాయం చేసిన యెలకంటి యాదగిరి భార్య వెంకటలక్ష్మి - ఈ స్త్రీలు తమ వాళ్ల ఆచూకీ ఈ వ్యవస్థచేత కక్కించడం కోసం చేసిన పోరాటం అసామాన్యమయింది.

మన ప్రజాస్వామ్యంలోని ఒక్కొక్క ప్రతిష్టాత్మకమైన సంస్థ ఎంత నిరర్థకంగా తయారయిందో వాళ్ళ పోరాటం బయటపెట్టింది. అధికార యంత్రాంగం, కోర్టులు, ప్రజాప్రతినిధులు, పత్రికలు, మెజిస్ట్రీరియల్ విచారణలు - ఏవీ ఎవ్వరూ ఒక్క ప్రాణాన్ని సహితం పోలీసులు నుండి కాపాడలేవనీ, ఒక్క కేసులో కూడ దోషులయిన పోలీసులకు ఈగవాలినంత ఇబ్బంది సహితం కలిగించలేవనీ, తమ అనుభవంలో వీళ్ళు తెలుసుకున్నారు. మనకు తెలియజెప్పారు. తన కొడుకును వరంగల్ సెంట్రల్ జైలుగేటు డగ్గర పోలీసులు అపహరించి తీసుకుపోయిన సంగతి కళ్ళారా చూసిన సోమనర్సమ్మ తన చూపును హైకోర్టుకు అందించలేక పోయింది. 'మాకేమీ తెలీద'ని పోలీసులు బుకాయించగా ఆమె వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. 'గుర్తుతెలియని తీవ్రవాది' ఎన్‌కౌంటర్ మరణాన్ని గురించి మెజిస్ట్రీరియల్ విచారణ జరుపుతున్న ఆసిఫాబాద్ సబ్ కలెక్టర్ గారికి ఆ అనామకుడు తన తమ్ముడేనన్న

ఒక మాట ఎట్లాగయినా చెప్పాలని పట్టుబట్టి తన తల్లిని తీసుకొని బయలుదేరిన నజ్మా సరోజకు చాలా విచిత్రమయిన జ్ఞానోదయం అయింది. ఇంటి నుండి కాలు బయటపెట్టిన క్షణం నుండి పోలీసులు వెంటాడి విసిగించి చివరికి జీపులోకి తీసి తీసుకుపోయి విచారణ అయిపోయేంతదాకా లాకప్పులో పడేసారు. ఆ తరువాత విచారణకు టైం అయిపోయిందన్నారు. హోంమంత్రి తనకు తెలిసినవాడే కాబట్టి ఆయన్ను నిలదీస్తే తన కొడుకు ఎక్కడున్నాడో తెలుస్తుందని భ్రమపడిన లక్ష్మీతులసమ్మ వసంత నాగేశ్వరరావును వెంటాడి నిలదీసి ప్రశ్నించి తెలుసుకున్నది తన కొడుకు ఆచూకీకాదు. మన పాలకులు రుద్రాక్షమాలమీద ఒట్టుపెట్టి అబద్ధం చెప్పగల యోగ్యులని తెలుసుకుంది. 'అవును మేము అరెస్టు చేసాం' అని స్వయానా హోంమంత్రితో ఒక పోలీస్ అధికారి నిర్భయంగా ఒప్పుకోగలడనీ, ఒప్పుకున్న ఆ అధికారిని హోంమంత్రి ఏమీ చేయడనీ తెలుసుకుంది. ఆమె లాగే మినిస్టర్‌ను పట్టుకుంటే పోలీసులు దారికొస్తారని భ్రమించి యతిరాజారావును సహాయం అడిగిన వెంకటలక్ష్మి, గిరిజన సంక్షేమ శాఖా మాత్యుడు అజ్మీరా చందూలాల్‌ను ఎస్.పి. దగ్గరకి తోలిన సోమనర్సమ్మ, ఆమె నేర్చుకున్న పాఠమే నేర్చుకున్నారు. భర్త, పెద్దకొడుకు చనిపోగా మిగిలిన ఒకే ఒక్క కొడుకును పోలీసులు అన్యాయంగా మాయం చేశారని దినపత్రికలలో ఎన్నోసార్లు తన ఆవేదనను రాయించి, ఈ ప్రజాస్వామ్య వ్యవస్థ పత్రికల ఘోషను చెవిన పెట్టదని బెజ్జంకి బూదమ్మ అడిగి అడిగి గొంతు తడారిపోయిన తరువాత తెలుసుకుంది. కనబడిన అధికార్లందరినీ నిలబెట్టి దబాయించిన కళావతి తన అమాయకత్వంతో ఎవ్వరినీ ముగ్ధులను చేయలేనని తెలుసుకుంది. ఆమె ఆవేదనకు ఆమె ప్రశ్నల గలగలే సమాధానమయింది.

స్త్రీలు జరిపిన ఆందోళన గురించే కావాలని చెప్తున్నాననుకోవద్దు. మనవ్యవస్థలో రాజకీయ అభినివేశం ఈ నాటికి నూటికి తొంభైశాతం మగవాళ్ళ సొత్తే అయినా 'మాయం' అయిన వాళ్ళ గురించి ఆందోళన చొరవగా జరిపింది మట్టుకు నూటికి తొంభైశాతం స్త్రీలే. స్త్రీలకు సాహసం ఎక్కువనుకోవాలో, లేక అది సాహసం అని తెలియని అమాయకత్వం ఎక్కువనుకోవాలో; స్త్రీలకే బంధాలు బలంగా ఉంటాయనుకోవాలో; తమవాడు అమాయకుడనీ వాడికి అన్యాయమే జరిగి వుంటుందని స్త్రీలే ఎక్కువ గుడ్డిగా విశ్వసిస్తారనుకోవాలో; లేకపోతే ఇతరుల బాగోగులూ జీవన్మరణాలూ మగవాళ్ళకంటే స్త్రీలకే ఎక్కువగా తమ జీవిత సమస్య అవుతుందనుకోవాలో - ఏ కారణం చెప్పుకున్నా ఈ ఆందోళనలో చొరవ మట్టుకు అధికంగా స్త్రీలదే.

ఈ పోరాటం మద్దతు కోసం ఎదురుచూస్తున్నట్టే ఈ చరిత్ర కథకుల కోసం నిరీక్షిస్తూవుంది. మనలో కథకులకు కొదవలేదు. న్యాయన్యాయాల సంఘర్షణే కథా వస్తువు కావాలని నమ్మేవాళ్ళకూ కొదవలేదు. అయితే జీవితాన్నయినా జీవిత సంఘర్షణలనయినా బహుముఖంగా అర్థంచేసుకునే సాహిత్య సంస్కృతి లోపించడం వల్లనేమో, ఈ కథలు అలిఖితంగానే ఉండిపోయినాయి. ఇంక ఎక్కువ కాలం అట్లాగే ఉండిపోవని ఆశిద్దాం.

*(మిస్సింగ్ నవలకి ముందు మాట. చిలీ నవల 'విడోస్' కి తెలుగు అనువాదం ఈ మిస్సింగ్ నవల. రచయిత ఏరియల్ డార్ఫ్‌మన్. ప్రచురణ - మానవి - ఏప్రిల్ 1994)*

# చివరి మాట

"పిల్లలు తల్లిదండ్రులను ప్రేమిస్తూ పెరుగుతారు. ఎదిగే క్రమంలో వాళ్ళ తప్పొప్పుల్ని ఎంచుతారు. చాలా అరుదుగా మాత్రమే క్షమిస్తారు" అని ఆస్కార్ వైల్డ్ అంటాడు.

మనిషికి బాల్యం ఉన్నట్టే మనిషి ఆలోచనలకు కూడ బాల్యం ఉంటుంది. ఆ బాల్యంలో నమ్మే సత్యాలుంటాయి. ఎదిగే క్రమంలో ఆ నమ్మకాలలో ఎంత సత్యం ఉందో అర్థం చేసుకుంటాం. వాటిని క్షమించగలిగితే అదృష్టవంతులమే.

ఈ సంకలనంలోని వ్యాసాలు నేను ఒకప్పుడు రాసినవి. రాజ్యహింస గురించి, అణచివేత గురించి, వాటికి సంబంధించిన సంస్కృతి గురించి, వాటిని ప్రతిఘటించే ప్రజా చైతన్యాన్ని గురించి, మానవతా విలువల గురించి రాసినవి. వాటిని ఈ రోజు ఒక సంకలనంగా అచ్చు వేయడం వల్ల ప్రయోజనం ఉంటుందని ప్రచురణ కర్తల అభిప్రాయం. అదేమో గానీ వాటి వెనుక నున్న తాత్విక వైఖరి గురించి నేను ఈ రోజు ఏమనుకుంటున్నానో రెండు ముక్కలలో చెప్పక పోతే నష్టం జరుగుతుందని మాత్రం అనుకుంటున్నాను. ఈ వ్యాసాలలోవి ఆదర్శాలతోనూ విలువలతోను నాకు ఈ రోజు కూడ పేచీ లేదు (బహుశా ఎప్పటికీ ఉండదు). అందువల్ల నేను వాటిని 'డిసోన్' చేసుకోవడం లేదు. కానీ వాటిలోని తాత్విక దృక్పథంతో నేనీ రోజు సంతృప్తి చెందడం లేదు.

ఈ తాత్విక వైఖరి మార్క్సిస్టు సంప్రదాయానికి చెందినది. దానిని 'మార్క్సిజం' అనే బదులు 'మార్క్సిస్టు సంప్రదాయానికి చెందినది' అనడానికి ఒక కారణం ఉంది. మార్క్సిజం అనేది మార్క్స్ ఆలోచనలతో ప్రేరణ చెందిన వివిధ వామపక్ష తత్వవేత్తలు చేసిన ఆలోచనల సంగ్రహం. వారిలో కౌట్స్కీ, లెనిన్, గ్రామ్‌సీ, లక్సంబర్గ్‌ల వంటి కమ్యూనిస్టు నాయకులున్నారు; లూకాచ్, అల్తూజర్‌ల వలె కమ్యూనిస్టు పార్టీలో ఉంటూ ప్రధానంగా సాంస్కృతిక తాత్విక రంగాలలో కృషి చేసిన వారున్నారు; ఏ కమ్యూనిస్టు పార్టీలోను ఎన్నడూ సభ్యులు కాకుండా (లేదా కమ్యూనిస్టు పార్టీలో ఇమడలేక బయటకు పోయి) సిద్ధాంత రంగంలో కృషి చేసిన వాళ్లున్నారు. ఈ సంప్రదాయంలో ఒక స్రవంతి మార్క్సిజం-లెనినిజం. మన దగ్గర మార్క్సిజం పేరు మీద చాలా మంది నమ్ముతున్న అభిప్రాయాలు ఈ స్రవంతికి చెందినవే. అందులో కూడ భిన్న వ్యాఖ్యానాలకు కొంత తావు

ఉంది. అయినప్పటికీ మార్క్సిస్టు సంప్రదాయంలో భాగంగానే మార్క్సిజం లెనినిజం అనే దానికి ఒక ఖచ్చితమైన స్వరూపం ఉంది. ఈ పుస్తకంలోని వ్యాసాలు ఆ తాత్విక స్రవంతికి చెందినవి. ఆ సంప్రదాయంలోనే వీటితో విభేదించేవాళ్లు, యివే విషయాలను యింతకంటే భిన్నంగా వ్యాఖ్యానించేవాళ్లు ఉంటారనేది వేరే సంగతి.

మార్క్సిజం-లెనినిజం అనే సిద్ధాంత ధోరణితో సంతృప్తి చెందడం లేదంటే అర్థం మార్క్సిస్టు సంప్రదాయంలోని వేరే ఏదైనా వ్యాఖ్యానాన్ని దీని కంటే సంతృప్తికరమైనదిగా భావించగలమనా? అది కూడ పూర్తిగా వాస్తవం కాదనుకుంటున్నాను.

బోల్షవిక్‌లు సోవియట్ రష్యాలో రాజ్యాధికారాన్ని నెలకొల్పిన తరువాత వారి ఆలోచనలే అసలైన మార్క్సిజం అనే అభిప్రాయం నెలకొనింది. అంతకు ముందు 'ఇదే అసలైన మార్క్సిజం' అని ఒకే ఒక అభిప్రాయాన్ని మార్క్స్ అనుయాయులందరికీ ప్రమాణంగా చలామణీ చేసే సత్తా ఎవరికీ లేదు. నిజానికి ఏది అసలయిన మార్క్సిజం అనే ప్రశ్నను అటుంచి ఒక వామపక్షవాది తన అభిప్రాయాలను మార్క్సిజం అని పిలుచుకోకపోతే అసలు వామపక్షవాదిగా గుర్తింపు పొందకుండా పోయే పరిస్థితి అంతకుముందు లేదు. మార్క్స్ అప్పటికింకా ప్రవక్త కాడు. ఆయనదే ప్రామాణిక సోషలిస్టు సిద్ధాంతం కాదు. మార్క్సిజం అనేదే ఏకైక శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతమనీ, దానితో విభేదించడం (వామపక్ష దృక్పథంలో భాగంగానే విభేదించినా) పెటీ బూర్జువా ఆదర్శవాదమనీ, అంతిమ పరిశీలనలో ప్రజాద్రోహమనీ, మార్క్సిజం అంటే బోల్షవిక్ పార్టీ సిద్ధాంత దృక్పథమేననీ (దీనికే కాలక్రమంలో మార్క్సిజం-లెనినిజం అనే పేరు వచ్చింది) భావించడం, దీనితో విభేదించే వాళ్లను కార్మిక ద్రోహులని అనడం బోల్షవిక్‌ల విజయం తర్వాతే మొదలయింది. ఒక సమాజంలో అధికారం ఎవరి చేతిలో ఉంటుందో వాళ్ల అభిప్రాయాలే అక్కడ సత్యంగా చలామణీ అవుతాయని వేరొక సందర్భంలో (వర్గ సమాజాలలో భావజాలాన్ని గురించి మాట్లాడుతూ) మార్క్స్ చెప్పింది మార్క్సిజం విషయంలోనూ సత్యమయింది.

అయితే ఈ మార్క్సిస్టు లెనినిస్టు సంప్రదాయంతో అసంతృప్తి చెందిన మార్క్సిస్టులు ప్రత్యామ్నాయ వ్యాఖ్యానాలలో తమ ప్రశ్నలకు జవాబులు వెతుక్కోవడం జరుగుతూనే ఉంది. స్థూలంగా చెప్పాలంటే మార్క్సిజంలో రెండు ప్రధాన సంప్రదాయాలు ఉన్నాయి. రెండింటికీ ఆధారం మార్క్స్ రచనల్లోనే ఉంది. ఒకటి - ఉత్పత్తి వ్యవస్థ అనే వస్తుగత (objective) విషయాన్ని మార్క్స్ చారిత్రక సిద్ధాంతానికి ప్రాతిపదికగా భావిస్తుంది.

పునాది-ఉపరితలం, పదార్థం-చైతన్యం, ఆచరణ-సిద్ధాంతం మొదలైన ద్వయాలకు ఈ కోవకు చెందిన సిద్ధాంత వ్యాఖ్యలలో ప్రముఖ స్థానం ఉంది. వాటిలో ఒకటి నిర్ణయించేది మరొకటి నిర్ణయించబడేది, ఒకటి మౌలికమైనది మరొకటి దానికి అనుబంధమైనది, ఒకటి కార్యం మరొకటి కారణం అని ఈ మార్క్సిస్టు సంప్రదాయం వ్యాఖ్యానిస్తుంది. మార్క్సిజం లెనినిజం పేరుతో కమ్యూనిస్టు పార్టీలు నమ్మే మార్క్సిజం ఈ సంప్రదాయంలో భాగమే. దీనిని భౌతికవాద (materialist) మార్క్సిజం అని పిలుస్తున్నారు. ఇది కౌట్స్కీ, ప్లెఖనోవ్‌లతో మొదలై (ఎంగెల్స్ కూడ దీనిలో భాగమని చాలా మంది అభిప్రాయం) బోల్షవిక్‌ల ద్వారా ప్రధాన మార్క్సిస్టు సంప్రదాయమై కూర్చుంది. ఈ భౌతికవాద మార్క్సిజాన్ని సామాజిక పరిశోధనకు, ఆచరణకు అన్వయించేటప్పుడు అనేక తాత్విక సమస్యలు ఎదురవుతాయి. ఆ సమస్యల మూలాలలో ముఖ్యమైనది పైన పేర్కొన్న (పునాది-ఉపరితలం వగైరా) ద్వయాల మధ్య మార్క్సిజం ప్రతిపాదించే కార్యకారణ తదితర సంబంధాలు. సంప్రదాయక మార్క్సిజం లెనినిజంలో ఈ సమస్యలకు సంతృప్తికరమైన పరిష్కారం లేదు. భౌతికవాద మార్క్సిస్టు స్రవంతిలో భాగంగానే ఈ సమస్యలను పరిష్కరించడానికి ఫ్రెంచి మార్క్సిస్టు తత్వవేత్త అల్తూజర్ ప్రయత్నించాడు. వాటిని ఆయన సంతృప్తికరంగా పరిష్కరించాడని అనలేము. కాని భౌతికవాద మార్క్సిస్టు స్రవంతిలోనే ఉంటూ 'ఉపరితల రంగాన్ని', ఆ రంగంలో జరిగే కృషిని సృజనాత్మకంగా అర్థం చేసుకోవడానికి ఆయన ఆలోచనలు కొంతమేరకు ఉపయోగపడతాయి.

రెండవ మార్క్సిస్టు సంప్రదాయం మానవ ఆచరణను మార్క్స్ ఆలోచనలకు కేంద్రంగా భావిస్తుంది. మార్క్స్ చారిత్రక సిద్ధాంతానికి ఉత్పత్తి వ్యవస్థ అనే వస్తుగత విషయం ప్రాతిపదిక కాదనీ, ఏక సమయంలో వస్తుగతం, వ్యక్తిగతం (objective and subjective) అయిన ఉత్పత్తిదాయకమైన మానవ ఆచరణ ప్రాతిపదిక అనీ ఈ రెండవ కోవకు చెందిన వ్యాఖ్యాతలు నమ్ముతారు. వీరు పునాది-ఉపరితలం, ఆచరణ-సిద్ధాంతం, పదార్థం-చైతన్యం అనే ద్వయాలను, వాటి మధ్య నున్న కార్యకారణ సంబంధాలను ప్రతిపాదించడంలో గల తాత్విక సమస్యలను తప్పించుకోగలుగుతారు. వీరిలో చాలా మంది ఆ వర్గీకరణనే తిరస్కరిస్తారు. గ్రామ్‌సీ,ఎరిక్ ఫ్రాం వంటి ఫ్రాంక్‌ఫర్ట్ స్కూల్ మార్క్సిస్టులు, చిన్ననాటి జార్జి లూకాచ్, రేమాండ్ విలియమ్స్ మొదలైనవారు ఈ సంప్రదాయానికి చెందినవారు. దీనిని మానవతావాద (humanist) మార్క్సిజం అని పిలుస్తున్నారు. అయితే భౌతికవాద మార్క్సిజం ఎదుర్కొనే ఇబ్బందికరమైన (కార్యకారణ సంబంధాలకూ, నిర్ణాయకతకూ సంబంధించిన) తాత్విక

సమస్యలను ఈ మానవతావాద మార్క్సిస్టు సంప్రదాయం తప్పించుకో గలుగుతుంది కానీ, భౌతికవాద మార్క్సిజం వస్తుగత వ్యవస్థకు ప్రాముఖ్యం ఇవ్వడం వల్ల ఒక మూలకు నెట్టి వేయగల ఒక ముఖ్యమైన ప్రశ్నను మానవతావాద మార్క్సిజం ముఖాముఖీ ఎదుర్కొనక తప్పదు. మనిషి ఎవరు, మానవత స్వభావం ఏమిటి అనేది ఈ ప్రశ్న. మనిషి ఆచరణకు చారిత్రక సిద్ధాంతంలో కేంద్రస్థానం యిచ్చే దృక్పథం ఈ ప్రశ్నను తప్పించుకో జాలదు. దానికి సంతృప్తికరమైన సమాధానం యిప్పటి వరకు లేదు. అంతవరకు భౌతికవాద మార్క్సిజం గెలుస్తుందని (సిద్ధాంత రంగంలో నయినా, ఆచరణలో నయినా) నమ్మలేం.

అయినప్పటికీ కమ్యూనిస్టు పార్టీలు అసలయిన మార్క్సిజంగా భావించే మార్క్సిజం-లెనినిజంతో అసంతృప్తి చెందిన వాళ్లు అటు భౌతికవాద మార్క్సిస్టు స్రవంతికి చెందిన అల్తూజర్ వంటి సిద్ధాంతకర్తల ఆలోచనల్లోను ఇటు మానవతావాద మార్క్సిజం యిచ్చే వివరణలలోను కొంత తృప్తి పొందగలరు. కొన్ని సంతృప్తికరమైన సమాధానాలు పొందగలరు. అయితే నా దృష్టిలో ఈ సిద్ధాంతాలేవీ పూర్తి సమాధానం ఈయలేవు.

'నా దృష్టిలో' అనడానికి ఒక కారణం ఉంది. ఏ సిద్ధాంతమూ అన్ని ప్రశ్నలకూ సమగ్రమైన సమాధానం యివ్వదు. ప్రతి పిద్ధాంతమూ కొన్ని ప్రశ్నలకు సంతృప్తికరంగా పమాధానం చెపుతుంది. కొన్నిటికి అసంతృప్తికరంగా చెపుతుంది. కొన్నిటికి అసలే చెప్పదు. మనం ఒక సిద్ధాంతాన్ని నమ్ముతున్నామంటే-లేదా ఒక సిద్ధాంతంతో సంతృప్తి చెందుతున్నామంటే-అర్థం అది సంతృప్తికరంగా జవాబు చెప్పలేని ప్రశ్నలు ఏమంత ముఖ్యమైనవి కావని లేదా వాటికి జవాబు చెప్పలేకపోవడం ఏమంత నష్టకరం కాదని నమ్ముతున్నామని. ఈ అర్థంలో ఎవరయినా నిజాయతీగానే మార్క్సిజం-లెనినిజం అని పిలవబడే మార్క్సిస్టు పంప్రదాయాన్ని విశ్వసించవచ్చు. ఆ సంప్రదాయాన్ని కొంతవరకు మెరుగుపరిచి యింకొంత సంతృప్తికరమైన సమాధానాలు చెప్పే అల్తూజర్ వివరణనుగాని, అందుకు భిన్నమైన మానవతావాద మార్క్సిస్టు సంప్రదాయాన్ని గాని విశ్వసించవచ్చు. (అయితే మార్క్సిజం పంతృప్తికరంగా సమాధానం చెప్పలేని విషయాల ఉనికినే గుర్తించడానికి నిరాకరించేవాళ్లు, అది సంతృప్తికరంగా జవాబు చెప్పలేని ప్రశ్నలు ముఖ్యమైనవేనని లోలోపల అనుకొంటూ కూడ పైకి నిబద్ధత ప్రకటించే వాళ్లు - దానిని క్రమశిక్షణగా అర్థంచేసుకోవడం వల్ల కావచ్చు వ్యక్తిగత ప్రయోజనాల కోసం కానచ్చు. - కూడ ఉన్నారు. అటువంటి 'నిబద్ధత'ను గౌరవించడం కష్టం).

గడచిన చరిత్రనూ సమాజాన్నీ అర్థంచేసుకోవడం, వర్తమాన పరిస్థితులను

విమర్శించడం, భవిష్యత్తుకు కావలసిన కార్యాచరణను రూపొందించడం అనే మూడు కర్తవ్యాలు మార్క్సిస్టుల కార్యరంగంలో ఎప్పుడూ ఉన్నాయి. మార్క్సిజాన్ని ఏ విధంగా అర్థం చేసుకున్నా ఈ మూడు కర్తవ్యాలకు అది అందివ్వగల సిద్ధాంత భూమిక అసంతృప్తికరమైనదే.

ఉత్పత్తి వ్యవస్థే సామాజిక జీవితంలోని అన్ని విషయాలకూ పునాది, ప్రాతిపదిక, నిర్ణాయక శక్తి అనే సూత్రాన్ని నిర్దిష్ట చారిత్రక పరిశీలనకు అన్వయించినప్పుడు శేషప్రశ్నలు చాలా ఉండిపోతాయి. ఆ నిర్ణాయకత 'అంతిమ పరిశీలనలోనే' (in the final analysis) అని ఎంగెల్స్ కాలం నుండి మార్క్సిస్టులు అంటూనే ఉన్నారు. దానికి నిర్దిష్టమైన అర్థమేదో ఇవ్వకపోతే అది తప్పించుకోవడానికి ఉపయోగపడే సాధనం మాత్రమే అవుతుంది. దానికి నిర్దిష్టమైన అర్థం ఇవ్వడానికి ప్రయత్నంచేసిన అల్తూజర్ చివరికి ఆ 'అంతిమఘడియ ఎప్పటికీ రాదు' (the final instance never comes) అని ప్రకటించి ఊరుకున్నాడు. అప్పుడేం చేయవచ్చునంటే ఉత్పత్తి వ్యవస్థనూ దానిలో కాలానుగుణంగా వచ్చే మార్పులనూ విశ్లేషించి, దాని ఆర్థికేతర పర్యవసానాలను వీలయిన మేరకు వ్యాఖ్యానించి ఊరుకోవచ్చు. అల్తూజర్ ప్రయత్నాన్ని అనుసరించి విర్ణాయకత ఒకవైపు నుండే ఉండదనీ ఒక మేరకు అన్నివైపులనుండీ ఉండగలదనీ అర్థంచేసుకొని చరిత్రను మరికొంత అర్థంచేసుకోవచ్చు. లేదా మానవతావాద మార్క్సిస్టులలాగ పునాది - ఉపరితలం అనే వర్గీకరణనే విడిచిపెట్టి ఉత్పత్తిదాయకమైవ మానవ ఆచరణనూ అది తీసుకున్న రూపాలనూ ఎదుర్కొన్న సంఘర్షణలనూ చారిత్రకంగా విశ్లేషించి, దావిని ఆశ్రయించి ఇతర జీవిత రంగాలలో వచ్చిన మార్పులను వీలయిన మేరకు వ్యాఖ్యానించుకోవచ్చు. దీనితో ఎంత అర్థమైతే అంతే మార్క్సిజం చెప్పగల చరిత్ర అని సంతృప్తి చెందవచ్చు. దీనితో అర్థం కాని విషయాలు ఏమంత ముఖ్యమైనవి కావని భావించేవాళ్లకు ఇబ్బంది ఉండదు. కానీ సంతృప్తి చెందలేని వాళ్ల అసంతృప్తికి వర్గమూలాలు అంటగట్టడంలో అర్థం లేదు.

సాహిత్యం, సంస్కృతి మొదలైన రంగాలను విశ్లేషించేటపుడు ఈ ఇబ్బంది చాలా బలంగా ఎదురవుతుంది. పునాది - ఉపరితలం అనే సంప్రదాయక మార్క్సిస్టు వర్గీకరణలో పునాది మాత్రమే ఏ సిద్ధాంత సమస్యలూ లేకుండ మానవ ఆచరణకు వేదిక కాగలుగుతుంది. ఉపరితలమనేది పునాది చేత నిర్ణయించబడే (అంతిమ పరిశీలనలోనే కావొచ్చు) విషయాల కలయిక. అందులో క్రియాశీలకమైన ఆచరణకు చోటుకల్పించడం సులభం కాదు.

ఒకవేళ చోటు ఉన్నా అది పునాదిచేత నిర్ణయించబడిన చోటు కావాలి. అయితే సంకల్ప పూర్వకమైన క్రియాశీలక మానవ ఆచరణ మరొక బాహ్య విషయం చేత నిర్ణయించ బడుతుంది అనడంలో తాత్విక సమస్యలున్నాయి. సాహిత్యం, సంస్కృతి మానవ ఆచరణ రూపాలు. కేవలం చైతన్యరూపాలు కావు. సాహిత్య సాంస్కృతిక ఆచరణలోని (active) సృజనశీలాన్నీ, అది పునాది చేత నిర్ణయించబడుతుందనే (passive) భావననూ సమన్వయపరచడం కష్టం. మార్క్సిజం-లెనినిజం సాహిత్యాన్నీ సంస్కృతినీ చైతన్యరూపాలుగా భావిస్తుంది కాబట్టి ఈ ఇబ్బందిని గ్రహించదు. వాటిని ఆచరణరూపాలుగా భావించే మార్క్సిస్టులు దానిని గుర్తించక తప్పదు. దానిని అధిగమించడానికి పునాది-ఉపరితలం అనే వర్గీకరణనే తిరస్కరించి ఉత్పత్తిదాయకమైన మానవ ఆచరణను ప్రాతిపదిక చేసుకొన్న మానవతావాద మార్క్సిస్టు సంప్రదాయాన్ని ఆశ్రయించడం తప్పనిసరి అని రేమాండ్ విలియమ్స్ వంటివారు భావించారు. 'భావజాలం' అనే వస్తుగత విషయం సాహిత్య విశ్లేషణకు పెద్దగా ఉపయోగపడదనీ, సాహిత్యానికి ఉండే క్రియాశీలక సృజనాత్మకతను దృష్టిలో పెట్టుకున్నప్పుడు 'భావజాలం' (ideology) అనే నిశ్చలమైన (దాని అర్థం అందులో మార్పు ఉండనే ఉండదనికాదు) భావన కంటే గ్రామ్‌సీ చెప్పిన నిత్యచలనశీలి అయిన ఆధిపత్య ఆచరణ (hegemonic practice) అనే భావన ఎక్కువగా ఉపయోగపడుతుందనీ విలియమ్స్ భావిస్తాడు. సాహిత్య సృజన కూడా ఒక ఉత్పత్తేనని సూత్రీకరిస్తాడు. ఈ రకంగా సాహిత్యానికి సముచితస్థానం కల్పించే ప్రయత్నం చేస్తాడు. అయితే విలియమ్స్ ఆచరణను ప్రధానంగా వర్గ ఆచరణగా భావించి ఇతర రూపాల ఆచరణను దానికి అనుబంధంగా సాగే కృషిగా అర్థం చేసుకోవడం వల్ల అతని విశ్లేషణ పూర్తి సంతృప్తినివ్వదు. అయినప్పటికీ అది మార్క్సిస్టు-లెనినిస్టు సాహిత్య సిద్ధాంతాల కంటే మెరుగైన అవగాహననే యిస్తుంది.

సాహిత్యం ఒక ఆలోచనాత్మకమైన క్రియ. సాహిత్యం విషయంలో వచ్చే సమస్య అన్నిరకాల ఆలోచనాత్మకమైన మానవక్రియల విషయంలోనూ వస్తుంది. మొత్తంగా మానవ ప్రవర్తనకే ఆ సందిగ్ధం వర్తిస్తుంది. మనుషుల ప్రవర్తన (అంతిమ పరిశీలనలో) వారి వర్గస్థితి చేత నిర్ణయించబడుతుందని మార్క్సిజం భావిస్తుంది. ఆ అంతిమ ఘడియ ఎప్పటికీ రాదన్న అల్తూజర్ ప్రకటనను పైన చూశాం. అదట్లా ఉంచి యిందులో ఉన్న వేరొక సమస్యను పరిశీలిద్దాం. మనుషుల ప్రవర్తనను వారి వర్గస్థితి, లేక ప్రయోజనాలే ఎందుకు నిర్ణయించాలి? దీని వెనకున్న తర్కమేమిటి? మనుషుల ప్రవర్తన

ఆలోచనాత్మకమైనది కాబట్టి, ఆలోచన (చైతన్యం) దాని చోదకశక్తి కాబట్టి, చైతన్యాన్ని భౌతికజీవితం నిర్ణయిస్తుంది కాబట్టి మనుషుల ప్రవర్తన వర్గస్థితిని బట్టి, ప్రయోజనాలను బట్టి ఉంటుందని వివరించవచ్చు. భౌతిక జీవితమంటే వర్గజీవితమేనా అనే ప్రశ్న ఇక్కడ వస్తుంది. దానిని ప్రస్తుతానికి పక్కన పెడదాం. పై వివరణను అంగీకరించినా మనుషుల ప్రవర్తనకు ప్రేరణనిచ్చేది వారి చైతన్యం కాదని, వారి వ్యక్తిత్వమని మనస్తత్వశాస్త్రం చెపుతుంది. నిజానికి చైతన్యం లేక ఆలోచన అనేది భౌతిక జీవిత పరిస్థితుల ప్రభావం నుండి నేరుగా పుట్టేది కాదు. బాహ్య ప్రభావాలకు, ఆలోచనలకు మనిషి వ్యక్తిత్వం మాధ్యమంగా పనివేస్తుందని మనస్తత్వశాస్త్రం చెపుతుంది. కర్తగా (subject) మనిషిని పరిశీలించినపుడు మార్క్సిజం మనిషి చైతన్యానికి యిచ్చే స్థానం నిజానికి మనిషి వ్యక్తిత్వానికి చెందుతుందనేది సైకో ఎనాలసిస్ చేసిన ముఖ్యమైన సవరణ. మనం కేవలం మన మెదడుతో ఆలోచించం. మన వ్యక్తిత్వం ద్వారా ఆలోచిస్తాం. మరయితే మనిషి వ్యక్తిత్వం కూడ వర్గ ప్రయోజనాల చేత లేక వర్గస్థితిచేత నిర్ణయించబడుతుందా? అసలు వ్యక్తిత్వం రూపొందే క్రమం ఎట్లాంటిది? అందులో మనిషి లోపల అంతర్లీనంగా ఉండే 'పొటెన్షియల్'కూ బాహ్య ప్రభావాలకూ మధ్య జరిగే ఘర్షణ ఎట్లాంటిది? ఈ ప్రశ్నలు వేసుకోవడం ద్వారా సైకో ఎనాలసిస్‌ను మార్క్సిజాన్ని సమన్వయ పరచడానికి ఎరిక్ ఫ్రాం, అడార్నో వంటి ఫ్రాంక్‌ఫర్ట్ స్కూల్ మార్క్సిస్టులు చాలా ప్రయత్నం చేశారు. వీరు కూడ పునాది - ఉపరితలం, పదార్థం - చైతన్యం అనే భౌతికవాద మార్క్సిస్టు వర్గీకరణలను తిరస్కరించి మానవతావాద మార్క్సిస్టు సంప్రదాయంలో భాగంగా తమ కృషి చేశారు. ఎరిక్ ఫ్రాం విశ్లేషణ చాలా ఆసక్తికరమైన విషయాలను వెలికి తెచ్చింది. మనుషుల ప్రవర్తన వారి వర్గస్థితిని బట్టి ఉంటుందన్న మార్క్సిస్టు సూత్రాన్ని సైకో ఎనాలసిస్ ప్రాతిపదికన రుజువు చేసే తాపత్రయంలో ఫ్రాం విశ్లేషణ కొన్నిచోట్ల కప్పదాట్లు వేసినట్టు కనిపించినా మార్క్సిస్టు-లెనినిస్టు సంప్రదాయంతో మాత్రమే పరిచయం ఉండి, ఆ సంప్రదాయం ప్రాతిపదికన మనుషుల ప్రవర్తనను ఎట్లా అర్థం వేసుకోవాలో పాలుపోనివారు ఫ్రాం రచనల నుండి చాలా నేర్చుకోగలరు.

అయితే ఉత్పత్తి రంగాన్ని (ఉత్పత్తి వ్యవస్థ రూపంలోనయినా, ఉత్పత్తిదాయకమైన మానవ ఆచరణ రూపంలో నయినా) ప్రాతిపదిక చేసుకొని చేసే విశ్లేషణకు అందకుండ ఉండిపోయే విషయాలు కేవలం సాహిత్య సాంస్కృతిక రంగాలకు సంబంధించినవి కానవసరం లేదు. కొన్ని

ప్రధానమైన అణచివేత రూపాలు కూడ ఈ విశ్లేషణలో సమగ్రంగా చోటుచేసుకోకపోవచ్చు. పురుషాధిక్యత, కులం దీనికి ఉదాహరణలు. నిజానికి పితృస్వామ్యం యొక్క ఆర్థిక పార్శ్వానికి సహితం మార్క్స్ విశ్లేషణలో స్థానం లేకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయం.శ్రమ విభజనకు మార్క్స్ ఆలోచనలలో చాలా ముఖ్యస్థానం ఉంది. ఆర్థిక చారిత్రక విశ్లేషణల్లోనేకాక, పరాయీకరణ గురించి మార్క్స్ చేసిన ఆలోచనలో కూడ శ్రమ విభజనకు ముఖ్యస్థానం ఉంది. అయినప్పటికీ స్త్రీ పురుష శ్రమ విభజన (చరిత్రలో జరిగిన మొదటి శ్రమ విభజన)కు ఆయన రచనలలో ఉన్న స్థానం చాలా స్వల్పమైనది. అయితే పురుషాధిక్యతకు స్త్రీ పురుష శ్రమ విభజనే మూలం అనుకునేటట్టయితే మార్క్స్ రచనలలోని ఈ ఖాళీని పూరించి (ఈ ప్రయత్నం ఎంగెల్స్‌తోనే కొంత మొదలయింది.) చారిత్రక భౌతికవాద సిద్ధాంతం మౌలిక స్వభావంలో మార్పులేకుండానే పురుషాధిక్యతకు కూడ ఆ చారిత్రక సిద్దాంతంలో చోటు కల్పించవచ్చు. కాని పితృస్వామ్యానికి స్త్రీ పురుష శ్రమ విభజనే మూలమా? లేక అది ప్రధానంగా ఒక అధికార రూపమా (Form of power)? స్త్రీ చేసే శ్రమతో మొదలుపెట్టి ఆమెకు సంబంధించిన అన్ని విషయాలపైనా మగవాడు సాగించే పెత్తనాన్ని పితృస్వామ్యంగా నిర్వచించేటట్టయితే, శ్రమపైన చేసే పెత్తనాన్ని ఇతర రూపాల పెత్తనానికి పునాదిగా భావించగలిగితేనే అది చారిత్రక భౌతికవాద సిద్ధాంతంలో ఇముడుతుంది. అట్లాగాక సమాంతరంగా ప్రయోగించే అన్నిరకాల అధికారాల సమాహారమే పితృస్వామ్యం అనుకుంటే మార్క్స్ చారిత్రక సిద్ధాంతం (అది భౌతికవాద రూపంలో ఉన్నా, మానవతావాద రూపంలో ఉన్నా) పితృస్వామ్యాన్ని సమగ్రంగా వివరించజాలదు. అప్పుడు ఉత్పత్తివ్యవస్థ తక్కిన అన్ని సామాజిక సంబంధాలను నిర్ణయిస్తుందన్న భౌతికవాద మార్క్సిస్టు సిద్దాంతం నిజం కాకపోగా, మానవ ఆచరణను ప్రధానంగా వర్గ ఆచరణగా భావించే మానవతావాద మార్క్సిస్టు వివరణ కూడ అసమగ్రమని తేలుతుంది.

కులం సంగతి కూడా అంతే. వర్ణవ్యవస్థ ఆవిర్భావం ఉత్పత్తిరంగంలోని మార్పులతో ముడిపడి ఉందని కోశాంబితో సహా మార్క్సిస్టు చరిత్రకారులు చాలామంది భావిస్తారు. వర్ణం అనేది అంతకుముందే ఉనికిలోకి వచ్చింది కాని అదే ప్రధానమైన సాంఘికవ్యవస్థగా మారినది ఆహార సేకరణ స్థానంలో ఆహార ఉత్పత్తి చేపట్టడం ద్వారా మిగులు సంపద సాధ్యమైన తర్వాతేనంటారు. ఆ తర్వాత వర్ణం కులంగా మారి అసంఖ్యాకమైన కులాలు ఉనికిలోకి వచ్చిన క్రమం కూడా ఉత్పత్తి రంగంతో ముడిపడి ఉంది కాని, ఉత్పత్తి రంగంలో

మొదట మార్పులు వచ్చాయనీ దానిఫలితంగా కులవ్యవస్థలో మార్పులు వచ్చాయనీ భావించడం సరైన వివరణ కాదు. అంతేకాక కులవ్యవస్థలో ఉన్న అసాధారణమైన వివక్షనూ దాని వికృత స్వభావాన్నీ ఆర్థికదోపిడీ ప్రాతిపదికన వివరించడం అసాధ్యం. కులం కేవలం శూద్రుల శ్రమఫలాన్ని బ్రాహ్మణ తదితర అగ్రవర్ణాలు దోచుకునేందుకు ఉపయోగపడిన సాధనం కాదు. అది భౌతిక సంపద నుండి జ్ఞానం దాకా, శ్రమ నుండి వ్యక్తిత్వం దాకా అన్నిటిపైన అన్నిటిలోను వారికి అధికారాన్ని, ఆధికత్యను ఇచ్చిన వ్యవస్థ. అది ప్రధానంగా ఒక అధికార రూపం, లేక ఆధిక్యతా రూపం. అన్ని దోపిడీ వ్యవస్థలూ ఆధిపత్య వర్గాలకు సంపదపైన యాజమాన్యంతోపాటు సకల సామాజిక విషయాలపైన అధికారాన్ని కూడ ఇస్తాయని మార్క్సిజం నమ్ముతుంది. కాబట్టి దోపిడీ వ్యవస్థలలో ఉండే అధికారం మార్క్సిజానికి తెలియందికాదు. కాని ఉత్పత్తిరంగంలో ఉండే యాజమాన్య హక్కు ఈ అధికారానికి ప్రాతిపదిక లేక పునాది అని నమ్ముతుంది. మరయితే కులవ్యవస్థలో శ్రమ, సంపద, హోదా, జ్ఞానం, గుర్తింపు మొదలైన అన్ని విషయాలలోను ఉన్న ఆధిక్యతలకు, అది వ్యక్తమయ్యే సకల రూపాలకు శ్రమపైన, సంపదపైన ఉన్నది పునాది అనీ, మిగిలినది దాని ఫలితమనీ వివరించడం సాధ్య మవుతుందా? 'అంతిమ పరిశీలనలోనే' అనే క్లాజ్ చేర్చినా సాధ్యమవుతుందా? కాదనుకుంటాను.

చరిత్రను, సమాజాన్ని అర్థం చేసుకోవడంలో ఇటువంటి సమస్యలున్నాయి. కేవలం ఉత్పత్తి వ్యవస్థను లేక వర్గ ఆచరణను ప్రాతిపదిక చేసుకుని జరిపే విశ్లేషణ పాక్షిక సత్యాన్ని మాత్రమే తెలుపుతుంది. ఇక వర్తమానాన్ని విమర్శించే కర్తవ్యాన్ని పరిశీలిద్దాం. దీనికి మార్క్సిస్టు ఆలోచనారీతి బాగా ఉపకరిస్తుంది. సమాజంలో అన్యాయం కాకతాళీయంగా ఉండదనీ, వ్యవస్థితమై ఉంటుందనీ, దానిని కాపాడేది కేవలం బలప్రయోగం కాదనీ, సంస్కృతీ నీతి చట్టాలూ మొదలైనవన్నీ అందులో భాగమై ఉంటాయనీ మార్క్సిజం అంటుంది. ఇది విమర్శకు బలమైన సిద్ధాంత పునాదిని కల్పిస్తుంది. అయితే శ్రమదోపిడీ ఇతర రూపాల వ్యవస్థిత అసమావతలకూ అన్యాయాలకూ పునాది అనే అభిప్రాయం ఇక్కడ కూడా పునాది-ఉపరితలాల సమస్యనూ కార్యకారణ సంబంధాల సమస్యనూ తీసుకొస్తుంది. ఈ సమస్య గురించి పైన చెప్పాను కాబట్టి మళ్లీ వివరించవలసిన అవసరం లేదు. అయితే వర్తమాన పరిస్థితులను విమర్శించడంలో వేరొక సమస్య ఉంది. చెడుమ సులభంగానే విమర్శించగలం కాని వర్తమాన పరిస్థితులలోని మంచిని ఏ విధంగా అర్థం చేసుకోవాలి?

ప్రజలలో ఉండే మంచిని కాదు. దావి విషయంలో ఇబ్బందేమీ లేదు. వ్యవస్థలోని మంచిని ఏ విధంగా అర్థం చేసుకోవాలనేది ప్రశ్న. అది చట్టాలు, సంస్కరణలు, అధికారిక సంస్కృతిలోని నైతిక విలువలు తదితర రూపాలలో ఉంటుంది. ఈ మంచి ఎంత ఉంటే అంతమేరకు పీడిత ప్రజలకు వ్యవస్థ లోపల పీడన నుండి రక్షణ లభిస్తుంది. పోరాటాలకు అండ దొరుకుతుంది. కాబట్టి దానిని మార్క్సిస్టులు ఆహ్వానించాలి. కాని వర్తమాన వ్యవస్థలోని మంచికి వ్యవస్థను కాపాడే భావజాలంగా పనిచేసే లక్షణం కూడ ఉందని మార్క్సిజం నమ్ముతుంది. అంటే అర్థం ఆధిపత్య వర్గాలు వ్యవస్థలోని మంచిని ఉన్నదాని కంటే ఎక్కువ చేసి చూపించి వ్యవస్థ పట్ల ప్రజామోదం పొందే ప్రయత్నం చేస్తారని మాత్రమే కాదు. భావజాలంగా మంచికి ఉండే పాత్ర యిదే అయితే దానిని అర్థం చేసుకోవడంలో తాత్విక పమప్యలు ఏమీ ఉండవు. వ్యవస్థలో మంచి ఎంతవరకు ఉంటే అంతవరకు దానిని సమర్థించి, దానిని అంతకంటే ఎక్కువ చేసి చూపించే ప్రయత్నాన్ని వ్యతిరేకించవచ్చు. ఇక్కడ ఆచరణాత్మకమైన సమస్యలు ఎన్నయినా ఉండవచ్చు కాని తాత్విక సమస్య ఏమీ లేదు. కాని వ్యవస్థలోని మంచికి స్వాభావికంగావే పాలక భావజాలంగా పనిచేసే లక్షణం ఉందని (ఈ వ్యవస్థను తిరస్కరించనవసరం లేదని, సంస్కరించి బాగు చేసుకోవచ్చునని ప్రజలను అది నమ్మింప జేస్తుందని) దానిని వస్తుగతంగా (objective) చూసినప్పుడు వ్యవస్థలో దాని స్థానం, సారాంశంలో దాని పాత్ర యిదేనని నమ్మడం మార్క్సిజం భావజాలం గురించి చేసే విశ్లేషణలో ఒక ముఖ్య అంశం. దానిని ఎక్కువ చేపి చూపించడం ద్వారా అది భావజాలంగా మారదు. భావజాలంగా పనిచేయడం సారాంశంలో దాని స్వాభావిక ధర్మమే. (ప్రజలకు మేలు చేసే లక్షణం దానిలో ఉంటే అది సెకండరీ అంశం మాత్రమే.) భావజాలంగా మంచికి ఉండే ఈ పాత్ర వల్లనే పాలకవర్గాలు దానిని సహిస్తారు, ప్రోత్సహిస్తారు. అటువంటప్పుడు వ్యవస్థలోని మంచి వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని (జరిగిన మేరకు) దానిని ఆహ్వానించాలా లేక అది ఎంత మేరకు ఉంటే అంత మేరకు వ్యవస్థను కాపాడే భావజాలంగా పని చేస్తుందని తిరస్కరించాలా? దానిని పెంపొందించి ప్రజలకు మరింత ఊరట కలిగించే కృషిలో మార్క్సిస్టులు భాగం కావాలా లేక అది ఎంత పెరిగితే అంత బలమైన భావజాలంగా మారుతుంది కాబట్టి ఆ కృషిని వ్యవస్థకు ఊడిగం చేసే పని అని ఈసడించుకోవాలా?

మార్క్సిజానికి ఈ సందిగ్ధం స్వాభావికమైనది. వ్యవస్థలోని మంచి

ప్రజలకు కొంత ఊరట, కొంత రక్షణ కలిగించడమే కాక ప్రజల పోరాటాలకు కూడ ఎన్నో రకాలుగా ఉపయోగపడుతుంది కాబట్టి ఈ సందిగ్ధం మరీ తీవ్రంగా ఉంటుంది. అది అవసరం, దానిని వాడుకోవాలి, కాని గౌరవించకూడదు. అవసరమైన దానికంటే ఎక్కువగా గౌరవించకూడదని కాదు. అసలే గౌరవించకూడదు. ఎందుకంటే గౌరవించేకొద్దీ భావజాలంగా దాని ప్రభావం పెరుగుతుంది. ప్రజల అవసరాల కోసమైనా, పోరాటాల అవసరాల కోసమైనా వ్యవస్థలో మంచిని పెంపొందించే కృషిలో మార్క్సిస్టులు ఎంతో కొంత పాల్గొనక తప్పదు. పాల్గొంటూనే ఉంటారు. కాని అది పెరిగేకొద్దీ పాలక భావజాలం బలపడుతుంది కాబట్టి దానిని ఈసడించుకుంటూనే ఉండాలి. సంస్కరణలు, నీతి, ప్రజాస్వామ్యం, పౌరహక్కులు మొదలైన విషయాల పట్ల మార్క్సిస్టులు ప్రదర్శించే ఎడతెగని పందిగ్ధానికి యిదే మూలం. దీనికి సంతృప్తికరమైన పరిష్కారం లేదు. మార్క్సిజాన్ని ఏ విధంగా అర్థం చేసుకున్నా లేదు. గ్రామ్‌సీ అల్తూజర్‌ల ఆలోచనారీతులు వ్యవస్థలోని చెడుకే కాక అందులోని మంచికి కూడ ప్రజల మంచిని ఎదురొడ్డి పోరాడే అవకాశాన్ని రాజకీయ సాంస్కృతిక రంగాలలో కల్పిస్తాయి. అయితే మన ప్రశ్నకు యిది జవాబు కాదు. వ్యవస్థలోని మంచినీ, దానివల్ల ప్రజలకు లభించే ప్రయోజనాన్నీ, దానిపట్ల ప్రజలలో ఉండే ఆకర్షణనూ ఆహ్వానించాలా, దానిని పెంపొందించాలా లేక అది భావజాలమని తిరస్కరించాలా అనేది మన ప్రశ్న. వ్యవస్థలోని మంచికి ద్వంద్వ స్వభావం ఉంటుందనీ, దానిని గతి తార్కికంగా అర్థం చేసుకోవాలనీ పడికట్టు పదాలు ప్రవచించవచ్చును కాని దాని విషయంలో నియమబద్ధమైన ఆచరణ చేపట్టడానికి పనికి వచ్చే సూత్రీకరణ ఏదీ సాధ్యం కాదు. అప్పటి అవసరాలను బట్టి ఎత్తుగడలు వేయడం మాత్రమే సాధ్యమవుతుంది. కమ్యూనిస్టు రాజకీయాలు, సంస్కరణలు, నీతి, ప్రజాస్వామ్యం, పౌరహక్కులు మొదలైన విషయాలలో అనుసరించే అనిశ్చితమైన ఎత్తుగడల తాత్విక భూమిక ఇదే. ఇది మార్క్సిజానికి ప్రత్యేకమైన సందిగ్ధం కాదు. ఏ రాడికల్ తాత్విక దృక్పథంలోనైనా ఈ సందిగ్ధం ఉండకతప్పదు. ఈ పందిగ్ధాన్ని తప్పించుకోవాలంటే అవి తమ రాడికల్ స్వభావానికి దూరమై సంస్కరణవాదానికి దగ్గర కావలసి ఉంటుంది. విప్లవబాటలోనే ఈ సందిగ్ధాన్ని తప్పించుకోవడం మార్క్సిస్టు ఆచరణకు సాధ్యంకాదు గానీ, వ్యవస్థ మీద విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టే విశ్లేషణకు పరిమితమయ్యే మేధావులు ఈ పందిగ్ధం ఉందన్న సందేహం సైతం కలగకుండా వ్యవస్థ మీద పదునైన విమర్శ చేయగలరు. ఈ సంకలనంలోని

వ్యాసాలు దీనికొక ఉదాహరణ.

ఇంక మూడవ విషయానికి వద్దాం. వర్తమానం మీద పూర్తి అవిశ్వాసం మార్క్సిస్టు సంప్రదాయంలో ఎంత ముఖ్యలక్షణమో భవిష్యత్తు మీద (భవిష్యత్తు దిశగా నడిచే వర్తమాన పోరాటాలతో సహా) అచంచల విశ్వాసం కూడ అంతే ముఖ్య లక్షణం. కమ్యూనిజానికి మార్క్స్ 'బ్లూప్రింట్' ఇవ్వలేదని అంటుంటారు. కమ్యూనిజాన్ని ఆయనొక వ్యవస్థగా భావించాడనే కంటే మనిషి సర్వశక్తులూ విముక్తమై స్వేచ్ఛగా అభివృద్ధి చెందే స్థితిగా అర్థం చేసుకున్నాడవడం సబబుగా ఉంటుంది. అటువంటి స్థితికి 'బ్లూప్రింట్' ఇచ్చే ప్రసక్తే ఉండదు. అయితే మనిషిలో అంతర్లీనంగా ఉందే శక్తులన్నీ విముక్తమయితే మనిషికి సాధ్యమయ్యే మంచితో బాటు చెడుకూడ విముక్తమవుతుంది కదా అన్న సందేహం ఆయనకు రాలేదు. దానిని అదుపు చేసే నీతికూడ అదే చారిత్రక క్రమంలో ఎదుగుతుందని ఆయన భావించాడని కూడ అనలేము. కమ్యూనిజంలో ఒక వస్తుగత నీతి ఉంటుందనీ అది అవసరం అవుతుందనీ ఆయన అనుకోలేదు. ఆయన గొప్ప ఆశావాది. అప్పటినుండి భవిష్యత్తుపట్ల అచంచల విశ్వాసం కలిగి ఉండడం మార్క్సిస్టుల సామాన్య లక్షణం అయింది. మార్క్స్ చెప్పిన మానవ శక్తుల విముక్తి ఈనాటి కమ్యూనిస్టుపార్టీల తక్షణ కార్యక్రమానికి బాగా దూరంగా ఉంది కానీ, తాము రాజ్యాధికారాన్ని చేజిక్కించుకొని నూతన సమాజాన్ని నిర్మిస్తామన్న విశ్వాసం (మధ్యమధ్యలో తిరోగామి శక్తులవల్ల ఒడిదుడుకులు ఎదురయినప్పటికీ) ఆ పార్టీల ప్రాపంచిక దృక్పథంలో విడదీయరాని భాగం అయింది. ఇది కేవలం భవిష్యత్తుపట్ల విశ్వాసం కాదు. భవిష్యత్తుకు బాట వేసే ప్రస్తుత ఉద్యమాల పట్ల విశ్వాసం కూడ. ఆ విశ్వాసం ఎంత బలంగా ఉంటే వర్తమాన వ్యవస్థపట్ల అవిశ్వాసం అంత సంపూర్ణంగా ఉండగల్గుతుంది. మార్క్సిస్టు విశ్లేషణలో (ఈ సంకలనంలోని వ్యాసాలలాగ) వర్తమాన పరిస్థితుల పట్ల బలంగా ధ్వనించే విమర్శకు దన్ను భవిష్యత్తుపైన ఉన్న సందేహం లేని విశ్వాసం నుండి లభిస్తుంది. ఆ విమర్శ అందుకే అంత పదునుగా ఉంటుంది.

కానీ నిజానికి మార్క్స్ చారిత్రక సిద్ధాంతం కన్నా, భవిష్యత్తును గురించి ఆయన చేసిన ఊహే ఈ రోజుఎక్కువగా సందేహాస్పదం అయింది. కార్మికవర్గం తనను తాను శ్రమదోపిడీ నుండి విముక్తి చేసుకోవడం కోసం పెట్టుబడి ఆధిపత్యాన్ని కూలదోసి సమాజం భవితవ్యాన్ని తనచేతిలోకి తీసుకొని సమసమాజానికి పునాదిఅయిన సమిష్టి ఉత్పత్తి వ్యవస్థను నిర్మిస్తుందని మార్క్స్ నమ్మాడు. ఆచరణలో కమ్యూనిస్టు పార్టీలు కార్మికవర్గం

స్థానాన్ని ఆక్రమించుకున్నాయి. అధికారాన్ని చేజిక్కించుకొని సమసమాజ నిర్మాణానికి పూనుకున్నాయి. అవి ప్రజలను కొంతమేరకు సమీకరించినప్పటికీ ఆ ప్రయోగంలో కమ్యూనిస్టు పార్టీల రాజ్యాధికార బలానికే కీలకస్థానం ఉండింది. సమసమాజానికి ఆర్థిక ప్రాతిపదిక అని తాము భావించే సమిష్టి, లేక సహకార ఉత్పత్తి వ్యవస్థను నిర్మించే ప్రయత్నం చేసాయి. కానీ ఆ ప్రయోగం ఒక దశవరకే నిలిచింది. స్థూలంగా చెప్పాలంటే ఆర్థికవ్యవస్థ వెనుకబాటుతనం నుండి బయటపడి సాంకేతికంగా ఆధునిక రూపాన్ని అందుకునేంత వరకే నిలిచింది (అయితే ఈ విషయంలో ఒక దేశానికీ మరొక దేశానికీ చాలా తేడా ఉంది). ఈ ప్రయోగాన్ని సమీక్షించుకుంటే, సమసమాజ నిర్మాణం అధికారబలంతో జరిగేది కాదని అర్థం అవుతుంది. కమ్యూనిస్టులు ప్రభుత్వ అధికారం (అది నూతన రాజ్యాధికారం కానవసరంలేదు) చలాయించడం పెట్టుబడిదారీ వ్యవస్థపైన జరిగే పోరాటానికి ఉపయోగపడ గలదు. ఒక దశలో అది అవసరం కూడ కావచ్చు. అదయినా ప్రజాస్వామికంగా నెలకొనకపోతే నిలవదు. అది వేరే సంగతి. నూతన సమాజ నిర్మాణం - అందులో భాగంగా సమష్టి ఉత్పత్తివ్యవస్థను నెలకొల్పే క్రియ - రాజ్యాధికారం ద్వారా జరగగల పని కాదు. అది పూర్తిగా స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా సమాజంలో జరగవలసిన క్రియ. అధికారం ఈ క్రియకు ఎంత దూరం ఉంటే అంత మంచిది. అధికారం ఎక్కడ ఉన్నా అక్కడ స్వేచ్ఛ నిజంగా ఉందా అనేది సందేహాస్పదంగానే ఉంటుంది. పూర్తిగా స్వేచ్ఛగా జరగవలసిన క్రియలకు అధికారం దూరంగా ఉండడం అవసరం. సమసమాజ కాంక్ష సమాజంలో స్వచ్ఛందంగా ఎదిగి నిలదొక్కుకుంటేనే సమసమాజం సాధ్యం అవుతుంది. రాజ్యం అన్ని ప్రసారసాధనాలనూ విద్యావైజ్ఞానిక రంగాలనూ తన గుప్పిట్లో పెట్టుకొని ప్రత్యామ్నాయ రాజకీయాలన్నిటినీ నిషేధించి బలవంతంగా నేర్పించే కాంక్ష కాదది.

మరయితే మనుషులు సమసమాజాన్నీ సహకార ఉత్పత్తి వ్యవస్థనూ ఏ పరిస్థితిలో స్వచ్ఛందంగా కోరుకుంటారు? ఎందుకోసం కోరుకుంటారు? అందరికీ సమానత్వం కల్పించే సమష్టివ్యవస్థ (సోషలిజం లేక కమ్యూనిజం) తప్ప పెట్టుబడిదారీ వ్యవస్థకు వేరే ప్రత్యామ్నాయం ఏదీ లేదనేది సత్యమే కావచ్చు. అది సత్యమైనా ఒక తార్కికసత్యం మాత్రమే. ఆ తార్కిక సత్యం సమాజంలో ఒక బలమైన కాంక్ష రూపం తీసుకుంటుందని నమ్మడానికి ఆధారం ఏముంది? సమసమాజానికి అర్థం సమానత్వాన్నిపొందడం మాత్రమే కాదు. సమానత్వాన్ని ఇవ్వడం కూడ. అంటే నమసమాజం నెలకొనదం వల్ల

అందరూ అంతో యింతో కోల్పోవలసి వస్తుంది కూడ. దొంతరలుగా ఉన్న ఈ సమాజంలో కేవలం భూస్వాములు, పెట్టుబడిదారులేకాక, అందరూ ఎంతో కొంత ఆధిపత్యాన్ని, కొంత ప్రివిలేజ్‌ను కోల్పోవలసి వస్తుంది. ఏదీ లేకపోయినా 'అహం' కొంత కోల్పోవలసి వస్తుంది.అందుకు భిన్నంగా, పోరాటాలు ప్రధానంగా 'పొందడం' కోసం చేస్తాము. (అది మన న్యాయమైన హక్కే కావచ్చు). సమసమాజ నిర్మాణాన్ని కార్మికుల పోరాటాల కొనసాగింపుగా చూస్తే ఈ తేడా కనిపించదు. పొందడం కోసం వేసే పోరాటాలు, పంచుకోవడం కోసం చేసే పువర్నిర్మాణం భిన్న స్వభావం గల క్రియలు. మనిషిలో అవి ఆకర్షించే గుణాలు వేరు, కలిగించే అనుభూతులు వేరు, కోరుకునే స్పందన వేరు, వాటికి ఆలంబననిచ్చే విలువలు వేరు. తమను తాము శ్రమ దోపిడీ నుండి విముక్తి చేసుకోవడం కోసం కార్మికులు చేసే పోరాటాల కొనసాగింపుగానే (కార్మిక రాజ్యం ద్వారా) సమసమాజ నిర్మాణం జరుగుతుందన్న మార్క్స్ నమ్మకం ఈ తేడాను గుర్తించలేక పోయిందనుకుంటాను.

లెనిన్‌కాలం నుండి కమ్యూనిస్టు పార్టీలు ఈ సమస్యను ఒక రూపంలో గుర్తించాయి. తమ మనుగడ కోసం కార్మికులు చేసే పోరాటాలు వారికి కేవలం ట్రేడ్ యూనియన్ (అంటే ఆర్థిక) చైతన్యాన్ని మాత్రమే ఇస్తాయనీ వారిలో రాజకీయ చైతన్యం కమ్యూనిస్టు పార్టీలు ప్రయత్న పూర్వకంగా కల్గించాలనీ సూత్రీకరించారు. అయితే ఇక్కడ రాజకీయ చైతన్యం అంటే ప్రధానంగా ప్రస్తుత వ్యవస్థను తిరస్కరించి కార్మిక రాజ్యాధికారం నెలకొల్పాలవే చైతన్యం. అసలు సమస్య అదికాదు. 'న్యాయమైన వ్యవస్థ' స్థాపన 'న్యాయమైన పోరాటాల' కొనసాగింపుగా ఒక సరళ క్రమంలో జరిగేది కాదు. దానికి ప్రేరణ ప్రధానంగా ఇంకెక్కడి నుండో రావాలి.

సమసమాజ కాంక్ష మనుషుల చైతన్యంలో ఏ విధంగా స్థిరపడాలి? అది ఎక్కడినుండి రావాలి? కలిసిమెలిసి బ్రతికే సంస్కృతి, కష్టసుఖాలు పంచుకునే ఆచారం, నమానత్వ విలువ మనుషులలో లేనే లేనవి కాదు. మానవ జీవిత ఆచరణలో (ముఖ్యంగా లేమినీ అణచివేతనూ అనుభవించే ప్రజలలో) ఆ సంస్కృతి అన్ని సమాజాలలోనూ కనిపిస్తూనే ఉంటుంది. కానీ ఇప్పటిదాకా అది ఏ నాగరిక సమాజంలోనూ ప్రధాన సంస్కృతిగా లేదు. ఒక మినహాయింపుగా మాత్రమే ఉంది. అది ప్రధాన సంస్కృతి కావాలంటే లేమినుండీ అణచినేత నుండీ పుట్టి ఒక మినహాయింపుగా సమాజం దిగువ పొరల్లో ఉన్నది జీవవకాంక్షగా సమాజంలో నెలకొనాలి. లేమిలోనే కాక కలిమిలోనూ, అణచివేతలోనే కాక స్వేచ్ఛలోనూ, పీడనలోనే కాక పాలనలోనూ

మనుషులు సమష్టి జీవనాన్ని కోరుకోవాలి. అణచివేత నుండి పుట్టి ఒక ఆదర్శంగా ఉన్న జీవన విధానం మనుషుల ప్రగాఢ కాంక్ష కావాలి.

ఇది ఏ విధంగా జరగగలదని వివరంగా చర్చించడానికి ఇది సందర్భం కాదు. కానీ ఈ చర్చను చివరిదాకా తీసుకుపోతే, మనిషి ఎవరు, మానవత ఏమిటి, మనిషికి మనిషిగా నిర్వచించే లక్షణాలేవి అనే ప్రశ్నల దగ్గర ఆగుతుంది.

ఈ ప్రశ్నలకు మార్క్సిజంలో జవాబు ఉందా? మార్క్స్ సమకాలికులు, ఆయన పూర్వీకులు అయిన యూరపియన్ తత్వవేత్తలలో ఒక అలవాటుండేది. వారిలో చాలామంది మానవతకు ఒక నిర్వచనం ఇవ్వడంతో తమ పరిశోధనలను మొదలుపెట్టేవారు. 'మనిషి సంఘజీవి', 'మనిషి రాజకీయ ప్రాణి' అంటూ మొదలుపెట్టేవారు. ఈ పద్ధతి పట్ల మార్క్స్‌కు వ్యతిరేకత ఉండేది. మనిషికి, మావవతకు ఒక నిర్వచనం ఇవ్వడంతో మొదలుపెట్టడం భావవాద పద్ధతి అని ఆయన విమర్శించాడు. మనిషి తన శ్రమ ద్వారా తవను తాను నిర్వచించుకునే క్రమమే చరిత్ర అనీ, ఆ శ్రమ పరాయీకరణనుండి (అదే చరిత్ర క్రమంలో) విముక్తి పొందినప్పుడే మనిషి తవ నిర్వచనాన్ని పరిపూర్తి చేసుకుంటాడనీ, ఈ క్రమాన్ని విశదీకరించడమే తత్వవేత్తల పని అనీ భావించాడు. ఇది ఆసక్తికరమైన ప్రతిపాదనే కాని మనిషి స్వీయ నిర్వచనానికి ఏవైనా ప్రాథమికమైన పరిధులు, పరిమితులు, నిర్దిష్ట ప్రాతిపదిక ఉన్నాయా లేక అది అనంతమూ అపరిమితమా అనే ప్రశ్న మిగిలిపోతుంది. నిజానికి మానవతకూ మనిషికీ మార్క్స్ యిచ్చినది కూడ ఒక నిర్వచనమేనని భావించవచ్చు. 'మనిషి స్వార్థగుణం ప్రధానమైన ప్రాణి' అనో, మనిషి సహకార గుణం ప్రధానమైన ప్రాణి అనో అనే బదులు 'ప్రకృతితో సంఘర్షించి సృజనాత్మకంగా శ్రమ చేయడం ద్వారా ప్రకృతిని, తనను మార్చుకునే ప్రాణి' అని మార్క్స్ మనిషిని నిర్వచించాడని భావించవచ్చు. (మనిషికి మార్క్స్ ఇచ్చిన ఈ నిర్వచనమే ఆయన చారిత్రక సిద్ధాంతమనీ దానిని చారిత్రక భౌతికవాదం అనే కంటే ప్రాకృతిక మానవతావాదం అనడం సబబుగా ఉంటుందనీ కోలకోవ్‌స్కీ అంటాడు.) ఆ విధంగా అర్థం చేసుకున్నపుడు మనిషి గురించి మార్క్స్ యిచ్చిన నిర్వచనంలోని అసమగ్రత కూడా స్పష్టమవుతుంది. సృజనాత్మకమైన శ్రమ ద్వారా మనిషి తనను తాను మార్చుకునే క్రియకు ఉండే పరిమితులేమిటి? దాని పరిధి ఏమిటి? ఏవీ లేవా? అది అనంతమైన అపరిమితమైన మార్పా? ప్రకృతి మీద మనిషి చేసే పోరాటం పెట్టుబడిదారీ వ్యవస్థ రూపం తీసుకున్న తర్వాత మనిషి

ఉత్పాదనశక్తి విపరీతంగా పెరిగి మనిషిలోని సర్వశక్తులూ విముక్తం కాగల భౌతిక పరిస్థితి వచ్చిందని మార్క్స్ గుర్తించాడు. అప్పుడిక మనుషులు ఒకరి శ్రమను ఒకరు దోచుకోకుండా తమ ఉమ్మడి ఉత్పాదన శక్తి సృష్టించే సమృద్ధిని ఉమ్మడిగా అనుభవించడం సాధ్యమవుతుంది. అంటే మానవ జీవితంలో చరిత్రానంతర దశ (కమ్యూనిజం) యిక ప్రారంభం కాగలదు. ఏ చారిత్రక క్రమమైతే మనిషి ఉత్పాదనశక్తిని ఆ స్థితికి తీసుకువచ్చిందో అదే చారిత్రక క్రమం యికపైన సాధ్యమయ్యే కమ్యూనిజానికి కావలసిన సమష్టి జీవ ఆకాంక్షను, దానిని సాధించే సంకల్పాన్ని (కార్మికవర్గం రూపంలో) ముందుకు తీసుకువచ్చిందని మార్క్స్ నమ్మాడు. అంటే మనిషిలోని సర్వశక్తులనూ విముక్తి చేయగల భౌతిక ఉత్పాదన శక్తిని మానవజాతి సాధించేనాటికి (అదే క్రమంలో) ఆ ఉత్పాదనశక్తిని సమష్టిగా అనుభవించడానికి అనువైన ఆర్థికవ్యవస్థ పట్ల ఆకాంక్ష, దానిని నెలకొల్పాలనే సంకల్పం సమాజంలో పెరుగుతాయని ఆయన నమ్మాడు. సుందరమైన ఈ చిత్రానికి ఆయన వివరణ ఇవ్వకపోలేదు. కాని అందులో ఆశావాదం ఉన్నంతగా తర్కంలేదు. పెట్టుబడిదారీ వ్యవస్థ ఉత్పాదనశక్తిని విపరీతంగా పెంచినమాట వాస్తవమే కావొచ్చు. ఎవరూ ఎవరినీ దోచుకోకుండ, పీడించకుండ అందరూ సమష్టి సమృద్ధిని అనుభవించడానికి కావల్సిన పరిస్థితులు ఉన్నాయనేది సత్యమే కావొచ్చు. అంతమాత్రం చేత మనుషులలో సమష్టి సహజీవన కాంక్షే బలంగా నెలకొనాలని ఏముంది? సమసమాజం బదులు కార్మికులకు కొంత భద్రత కల్పించే కొత్తదోపిడీ వ్యవస్థ రావొచ్చు కదా? ఉత్పాదనశక్తితో పాటు బలప్రయోగశక్తి కూడా చాలా పెరిగింది కాబట్టి భయంకర నిర్బంధంతో కూడిన కొత్త దోపిడీ వ్యవస్థ ఎందుకు రాకూడదు?

మానవతను సృజనాత్మక శ్రమతో సమానం చేయడం దగ్గర ఆగిపోకుండా మరింత సమగ్రమైన నిర్వచనం ఇవ్వనిదే ఈ ప్రశ్నలకు సమాధానం దొరకదు. చరిత్ర క్రమంలో మనిషి తనను తాను భౌతికంగాను, నైతికంగాను మార్చుకునే మాట వాస్తవమే. కాని దాని పరిధి, పరిమితి, ప్రాతిపదిక ఏమిటనేది మానవత నిర్వచనంలో భాగం కావాలి. అంతవరకు మార్క్స్ ఆలోచన సమగ్ర స్వరూపం తీసుకోదు. కమ్యూనిజం సాధ్యాసాధ్యాలు అంతవరకు అర్థం కావు. సాధ్యమైతే ఏవిధంగా సాధ్యం కాగలదో అర్థం కాదు.

కాని మార్క్స్ ఆలోచనల్లో మనిషికి,మానవతకు ఒక నిర్వచనం యిచ్చే తాత్విక మానవతా భావన (philosophical anthropology) లేనే లేదనేది మార్క్సిస్టు సంప్రదాయంలో బలంగా ఉన్న అభిప్రాయం. అది లేకపోవడం

మార్క్స్‌ను భావవాద తత్వవేత్తల నుండి వేరుచేసే ఒక ప్రత్యేకత అనే ప్రశంస కూడ మార్క్సిస్టు సంప్రదాయంలో భాగమే. చాలా వైవిధ్యమున్న మార్క్సిస్టు సంప్రదాయంలో ఈవిషయంలో అసాధారణమైన ఏకాభిప్రాయం ఉంది.(అతి కొద్ది మినహాయింపులతో) ప్రధాన మార్క్సిస్టు-లెనినిస్టు స్రవంతి నుండి అల్తూజర్ దాకా, అల్తూజర్ నుండి గ్రామ్‌సీ దాకా, చివరికి మానవతావాద మార్క్సిజమే నిజమైన మార్క్సిజమని బలంగా వాదించే లూసియో కోలెటి దాకా చాలామంది అభిప్రాయం ఇదే. కాని హేతుబద్ధమైన తాత్త్విక మానవతా వాదనను చేర్చుకోకపోతే మార్క్స్ ఆలోచన పరిపూర్ణం కాదు.

7 నవంబర్ 1997
హైదరాబాద్

కె. బాలగోపాల్

# చివరిమాట గురించి

పిల్లల గురించి సారవంతమైన మాటలు చాలా చెప్పాడు ఖలీల్ జిబ్రాన్ (1883-1931) అనే లెబనాన్ కవి-

నీ పిల్లలు కానెకారు నీ పిల్లలు

నీ ద్వారనె కాని నీ నుండి రారెపుడును

............

మీ ఆస్తి వంటివారు కారు మీ పిల్లలు

ప్రాణము గల బాణములు వారు

ఈ కవిత మన ఆలోచనలకి కూడా వర్తిస్తుంది. అలాగే బాలగోపాల్ వ్యాసాలకీ వర్తిస్తుంది. ఇతరుల ఆలోచనలు ప్రపంచంలో పుట్టడానికి తాను పురుడు పోసే మంత్రసానినని సోక్రటీస్ స్వయంగా చెప్పుకున్నాడు. ఆలోచనలకి బాల్యం వున్నట్టే చరిత్రకీ, సమాజానికీ కూడా బాల్యం ఉంటుంది. మైథాలజీ అంతా కూడా మొత్తం మానవజాతి సామాజిక బాల్యం అన్నాడు మార్క్స్. అలాగే కార్తీకపున్నమి వెన్నెల విరజిమ్మినట్టు ప్రపంచమంతా కమ్యూనిజం వెల్లివిరియాలని మేధావులెందరో కలలుగన్నారు. అప్పుడు మాత్రమే మానవజాతి అసలు చరిత్ర మొదలవుతుందనీ, గడిచిపోయిందంతా ఆదిమ చరిత్ర అవుతుందనీ మార్క్స్ అన్నాడు.

పారిశ్రామిక విప్లవం (1757), ఫ్రెంచి విప్లవం (1789), డార్విన్ పరిణామవాదం (1850)- ఈ మూడింటి ప్రభావం మార్క్సిజం మీద ఉంది. అలాగే జర్మన్ క్లాసికల్ ఫిలాసఫీ, ఇంగ్లీషు పొలిటికల్ ఎకానమీ, ఫ్రెంచి సోషలిజం మార్క్సిజానికి చాలా దోహదం చేశాయి.

లెనిన్ కన్నా ముందు రష్యాలో మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ప్రచారం చేసింది ప్లెఖనోవ్. ఆయన ఉత్సాహభరితంగా 'మార్క్సిజం సంపూర్ణ సైద్ధాంతిక చట్రం' (Marxism is a complete theoretical system) అన్నాడు. నిజానికి మార్క్సిజం సంపూర్ణమైందీకాదు; అది ఒక చట్రమూ కాదు. ఎందుకంటే అది సజీవమైందీ, వృద్ధి చెందేదీను; పైగా అది ఒక పద్ధతి (method). మార్క్స్ దృష్టిలో సిద్ధాంతం కన్నా ఆచరణ ముఖ్యమైంది.

మార్క్స్-లెనిన్‌లు చెప్పింది మాత్రమే మార్క్సిజం అని ఎవరూ అనుకోరు.

దేశదేశాల్లో ఎందరెందరో మార్క్సిస్ట్ సిద్ధాంతానికి ఎంతగానో Contribute చేశారు. రష్యాది మాత్రమే మార్క్సిజం అనుకనే వారిని కొశాంబి ఎప్పుడో ఎగతాళి చేశాడు OM (Official Marxists) అని. మార్క్సిస్టుకి స్పందన, చిత్తశుద్ధి, సమర్థత అవసరం.

ప్రపంచాన్ని మార్చాలని చెప్పిన మార్క్సిజం ఏమీ మారదనీ ఎవరూ అనుకోరు. చరిత్రనీ, సమాజాన్ని అర్థం చేసుకోవడానికి మార్క్సిజం కన్నా మంచి సిద్ధాంతం ఎవరయినా ఆవిష్కరిస్తే అందరం దానినే అనుసరించవచ్చు. అలాగే కమ్యూనిస్టు సమాజం కన్నా మంచి వ్యవస్థ వస్తే అందరం స్వాగతం చెబుదాం. అందాకా

*"Communism is humanism brought about by the abolition of private property and communism is atheism brought about by the abolition of religion"* అన్న దానినే మనం అనుసరిద్దాం.

విశాఖపట్నం
21-11-1997

చలసాని ప్రసాద్

# 1988 నుంచి 1997
# పర్‌స్పెక్టివ్స్ ప్రచురణలు


| | | | | |
|---|---|---|---|---|
| *1. | Probings in the Political Economy of Agrarian classes and Conflicts | | May 1988 | by K. Balagopal<br>Edi: D. Narasimhareddy |
| *2. | సహచరులు- | | జూలై 1989 | వరవరరావు |
| *3. | పతంజలి భాష్యం- | | జూలై 1989 | కె.ఎన్.వై.పతంజలి |
| *4. | సృజన సంపాదకీయాలు | | జనవరి 1990 | వరవరరావు |
| *5. | అభివృద్ధి వెలుగునీడలు | | మే 1990 | ఆర్.ఎస్.రావు |
| 6. | కఠోర షడ్జమాలు- | తొలి ముద్రణ<br>మలి ముద్రణ | 1990<br>1996 | వసంత కన్నబిరాన్ |
| *7. | మతవర్గ తత్వం- | | ఫిబ్రవరి 1991 | ఎడిటర్స్: హరి<br>జి.హరగోపాల్ |
| 8. | ఇలామిగిలేం- | తొలిముద్రణ<br>మలిముద్రణ | 1991<br>1993 | చలసాని ప్రసాదరావు |
| *9. | పరాధీన భారతం | తొలిముద్రణ<br>మలిముద్రణ | 1992<br>1993 | ఎ.బి.కె. ప్రసాద్ |
| *10. | డంకెల్ దుశ్శాసనం | | జూన్ 1993 | నూర్ భాషా |
| 11. | దినదినగండం- | | సెప్టెంబర్ 1993 | అనువాదం: కోదండ రామిరెడ్డి |
| *12. | మన చలం- | | మే 1994 | ఎడిటర్ : కృష్ణాబాయి |
| 13. | Towards Understanding Semi Feudal Semi Colonial Society | | Jan 1995 | by R.S.Rao<br>Ed. D. Narasimha Reddy |
| 14. | ఏడోసారాకథ | | 1995 | బుర్ర రాములు |
| 15. | శాక్కొ-వాంజెట్టి | | నవంబరు 1995 | బి.చంద్ర శేఖర్ |
| 16. | బంగారమ్మకథ | | జనవరి 1996 | అనువాదం : కృష్ణాబాయి |
| 17. | కార్టూన్ కబుర్లు- | | సెప్టెంబరు 1996 | మోహన్ |
| 18. | నాకో పిస్తోల్ కావాలి- | | అక్టోబరు 1996 | చలసాని ప్రసాదరావు |
| 19. | సాహిత్యంలో వస్తు శిల్పాలు | | మార్చి 1997 | త్రిపురనేని<br>మధుసూదనరావు |
| 20. | కల్లోల కథా చిత్రాలు- | | డిసెంబరు 1997 | కె.బాలగోపాల్.<br>ఎడిటర్ : చలసాని ప్రసాద్ |

---

* ప్రతులులేవు.



రాజ్యాంగ యంత్రం హింసా ప్రవృత్తిలో వస్తున్న ఈ మార్పులు, మన స్వాతంత్ర్యానంతర చరిత్రలో సంభవించిన ఒక్కొక్క సంక్షోభానికి సంకేతాలు. ఒక్కొక్క సంక్షోభం ప్రజా ఉద్యమాలకూ, తిరుగుబాట్లకూ దారితీస్తుంది. వాటిని అణచడానికి రాజ్యాంగ యంత్రం అనేక అణచివేత చర్యలను చేపడుతుంది. త్వరలో 'శాంతి' నెలకొంటుంది. సమస్య పైకి పరిష్కారం అయినట్టే కనబడుతుంది. అయితే అంతా అయిపోయి అలలు వెనక్కి మళ్లిన తరువాత ఉప్పెనకు గుర్తుగా రెండు విషయాలు మిగిలిపోతాయి. ఒకటి, సమస్యకు 'మూలకారణం' అయిన సంక్షోభం. ఈ సంక్షోభం సాధారణంగా అపరిష్కృతంగా ఉండిపోతుంది. రెండవది, పెరిగిన అణచివేత యంత్రాంగం. సమస్య వివరాలన్నీ అందరూ మరచిపోయిన తరువాత చాలాకాలం దాకా కూడ ఈ సమస్యను పరిష్కరించే పేరుతో ప్రజలను రాజ్యాంగ యంత్రం అలవర్చుకున్న దురలవాట్లూ, దుష్ట శాసనాలూ మిగిలిపోతాయి. ఎమర్జెన్సీ ఇందుకు చక్కటి ఉదాహరణ. ఆ సంవత్సరన్నర కాలంలో పోలీసులూ మనమూ నేర్చుకున్న కొత్త అణచివేత పద్ధతులూ అణచివేత సంస్కృతీ ఎమర్జెన్సీని ఎత్తివేసి ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించిన తరువాత ఇన్నేళ్ళయినా కొనసాగుతూనే వున్నాయి. సామాజిక జీవితంలో పోలీసు యంత్రాంగం పెద్దఎత్తున జోక్యం చేసుకోవడం ఆ కాలంలోనే మొదలయింది.



పర్‌స్పెక్టివ్స్
సామాజికశాస్త్రం/సాహిత్యం